# THE BOOK OF COMMON PRAYER

**1945 EDITION**

**Containing Additions and Deviations authorised by the Episcopal Synod of the Church of India, Burma and Ceylon**

# సామాన్య ప్రార్థన పుస్తకము

## 1945–వ సంవత్సరపు కూర్పు

దీనిలో ఇండియా, బర్మా, సింహళము బిషపుల మహాసభ అధికారమునొందిన క్రమములును ప్రార్థనలును చేర్చబడియున్నవి.

**S. P. C. K. IN INDIA**
POST BOX 501
PARK TOWN, MADRAS
1947

## NOTE TO THE PRESENT EDITION

ప్రార్థన పుస్తకము సవరించుటకు ఏర్పర్చబడినవారు 1942, 1944 సం॥ ఎండ కాలములలో కూడి అజర్యా అధ్యక్షులవారి యాజమాన్యముక్రింద ఈ పుస్తకములో కొన్ని మాటలను సవరణ చేసిరి. ఇందులో పాత నిబంధన కీర్తనలు లేకున్నను అథనాసి విశ్వాససూత్రమును ప్రశ్నోత్తరబోధినిని (పూర్వము శిక్షాప్రకటన యనబడిన) హెచ్చరికను యిప్పుడు చేర్చడమైనది. సంపూర్ణమైన పుస్తకము కొలది కాలములో వెలువడునని నమ్ముచున్నాము.

ANTHONY DORNAKAL.

*Dornakal, October 15, 1945.*

# CONTENTS

| | Page |
|---|---|
| Preface to 1932 Edition ... ... ... | iii |
| Note to the Present Edition ... ... ... | v |
| The Order for Morning Prayer ... ... ... | 1 |
| The Order for Evening Prayer ... ... ... | 19 |
| The Athanasian Creed ... ... ... | 31 |
| The Litany ... ... ... ... | 35 |
| Occasional Prayers and Thanksgivings ... | 43 |
| Order of the Ministration of Holy Communion ... | 63 |
| The Collects, Epistles and Gospels ... ... | 91 |
| The Ministration of Public Baptism of Infants ... | 133 |
| The Ministration of Private Baptism of Children ... | 142 |
| The Order of Baptism for those of Riper Years... ... | 146 |
| A Catechism ... ... ... ... | 156 |
| The Order of Confirmation ... ... ... | 163 |
| The Form of Solemnization of Matrimony ... | 168 |
| The Order for the Burial of the Dead ... ... | 181 |
| The Order for the Burial of a Child ... ... | 192 |
| The Thanksgiving of Women after Child-birth ... | 196 |
| A Service of Exhortation (A Commination) ... | 200 |

# విషయసూచిక


| విషయము. | పుట. |
|---|---|
| 1. ఉదయ ప్రార్థనా క్రమము ... ... ... | 1 |
| 2. సాయం ప్రార్థనా క్రమము ... ... ... | 19 |
| 3. అథనాసి విశ్వాససూత్రము ... ... ... | 31 |
| 4. లిటని ... ... ... ... ... | 35 |
| 5. విజ్ఞాపన ప్రార్థనలు, కృతజ్ఞతాస్తుతులు ... ... | 43 |
| 6. పరిశుద్ధ సమభోక్త్వమునకు చెందు సామాన్యవిధులు ... | 63 |
| ప్రభువు భోజనము, అనగా, పరిశుద్ధ సమభోక్త్వము ఆచరించెడి క్రమము ... ... ... ... | 65 |
| అనుబంధములు ... ... ... ... | 86 |
| 7. సంగ్రహ ప్రార్థనలు ఉత్తరములు సువార్తలును ... ... | 91 |
| 8. పిల్లల బాహాటపు బాప్తిస్మమును ఆచరించు క్రమమునకు చెందు సామాన్య విధులు ... ... ... ... | 133 |
| పిల్లల బాహాటపు బాప్తిస్మము ... ... ... | 134 |
| 9. పిల్లల ఇండ్లలో వాడవలసిన బాప్తిస్మము ఆచరించెడు క్రమము... | 142 |
| 10. యుక్తవయస్సు వచ్చినవారి బాప్తిస్మము ... ... | 146 |
| 11. ప్రశ్నోత్తర బోధిని ... ... ... ... | 156 |
| 12. నిర్ధారణ క్రమమునకు చెందు సామాన్య విధులు... ... | 163 |
| నిర్ధారణ క్రమము ... ... ... ... | 164 |
| 13. వివాహమునకుచెందు సామాన్య విధులు ... ... | 168 |
| వివాహమును ఆచరించెడు క్రమము ... ... | 169 |
| 14. మృతుల భూస్థాపన క్రమము ... ... ... | 181 |
| 15. చిన్నబిడ్డ భూస్థాపనకు వాడదగిన క్రమము ... ... | 192 |
| 16. బాలింతల దేవాలయ ప్రవేశము ... ... ... | 196 |
| 17. హెచ్చరిక (శిక్షా ప్రకటన) ... ... ... | 200 |


సామాన్య ప్రార్థన పుస్తకములో ఇండియా బర్మా సింహాళ సంఘ ప్రధానధ్యక్షులు ఈ దిగువ మార్పులు సూచించియున్నారు. అవి హిందూదేశము బ్రిటిష్ ప్రభుత్వమునుండి తన్ను తాను ప్రత్యేకించుకొనెడి దినమునుండి వాడుకలోనికి రావలసియున్నవి.

# పరిశుద్ధ సమభోక్త్వ క్రమము

## సంఘము కొరకైన ప్రార్థన

1662. 'మరియు సమస్త క్రైస్తవ రాజులను ప్రభువులను అధికారులనే కాకుండ ఆయన మమ్మును దైవభక్తితోను నెమ్మదితోను ఏలునట్లు ముఖ్యముగా నీ సేవకుడైన జార్జి అను మా చక్రవర్తిని రక్షించి కాపాడుమని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము' అనుమాటలకు బదులు 'మరియు సమస్త జనాంగములను నీతి సమాధానముల మార్గములో నడిపించి, క్రైస్తవ అధికారులందరు యథార్థముగాను నిష్పక్షపాతముగాను న్యాయము జరిగించి దుష్టులను దుర్మార్గులను దండించి నీ నిజమైన దైవభక్తిని సన్మార్గమును నిలుపుటకు వారికి కృప దయచేయుమని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము' అను మాటలు వాడవలెను.

1928. 'మరియు సమస్త క్రైస్తవ రాజులను...............

బ్రతిమాలుకొనుచున్నాము' అను మాటలకు బదులు పైనున్నట్లు 'మరియు సమస్త జనాంగములను నీతి సమాధానములమార్గములో......బ్రతిమాలుకొనుచున్నాము' అను మాటలు వాడవలెను.

### లిటని

'మహా దయగల మా చక్రవర్తియు' మొదలుకొని నాలుగు విన్నపములకు బదులుగా దిగువ నాలుగు విన్నపములు రావలెను:—

'మా దేశ అధికారులను దీవించి నీ పరమ జ్ఞానముతో వారిని నడిపింప దయచేయుము'.

'నీ సంఘముయొక్క మేలు నిమిత్తమును జనుల క్షేమము నిమిత్తమును మా దేశ ఆలోచనసభలను నడిపించి వారి పని వర్ధిల్లదయచేయుము'.

'న్యాయము జరిగించి సత్యము నిలుపునట్లు న్యాయాధిపతులను తీర్పరులను కృపతో నడిపింప దయచేయుము'.

'ఈ దేశములో అధికారమునందున్న వారందరిని జ్ఞానముతోను తెలివితోను ఏకదృష్టితోను వెలిగింప దయచేయుము'.

1928 సం॥ ప్రార్థనపుస్తకములోని సేనలకొరకైన విజ్ఞాపనలో 'రాజ్యసేనల' అను మాటకు బదులు 'దేశ సేనల' అను మాట వాడవలెను.

## ఉదయ సాయం ప్రార్థన.

విశ్వాస సూత్రము తరువాతి ఉత్తర ప్రత్యుత్తరములలో 'రాజును' అను మాటకు బదులు 'మా అధికారులను' అను మాటను వాడవచ్చును.

రాజ కుటుంబము కొరకైన ప్రార్థనయు, పార్లమెంటు కొరకైన ప్రార్థనయు విడిచిపెట్టబడును.

## దిగువ ప్రార్థనలు తత్క్షణమే వాడుకలోనికి రావలెను.

పరి. సమభాక్త్వములో ఆ దినపు సంగ్రహ ప్రార్థనకు తరువాతగాని ఉదయ, సాయంప్రార్థనలో మూడవ సంగ్రహ ప్రార్థనకు తరువాతగాని వాడదగినది:

ఓ సర్వశక్తిగల దేవా, భూలోక రాజ్యములన్నిటిని నీవే ఏలి నీ చిత్త ప్రకారమే వాటిని నడిపించుచున్నావు గదా. ఈ దేశ పరిపాలకులను నీ దయతో దృష్టించి, నీ చిత్త ప్రకారము వారి యాలోచనలను నడిపించి జనుల యొక్క సమాధానము క్షేమముల నిమిత్తమును నీ సంఘముయొక్క మేలు నిమిత్తమును నీవు వారికి అనుగ్రహించిన అధికారము వారు నాడునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

(లేక)

ఓ దేవా, రాజులును అధికారులును న్యాయము జరిగించుట నీ వలననే గదా. నీ యెడతెగని దీవెనతో ఈ దేశ పరిపాలకులకు సహాయము చేసి వారి కప్పగింపబడిన జనులను సత్యముతోను నీతితోను పరిపాలించునట్లు నీవు వారి కనుగ్రహించిన అధికారమును వారు తగునట్లుగా వినియోగింప దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## ఇండియా ఆలోచన సభకొరకైన ప్రార్థన

మిక్కిలి దయగల దేవా, ఈ దేశముకొరకును ముఖ్యముగా యిప్పుడు కూడుకొనియున్న ఆలోచన సభలకొరకును నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. నీ మహిమార్థమును నీ జనుల క్షేమముకొరకును వారి యాలోచనలను నీవే నడిపించి దీవింపదయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

# THE ORDER FOR MORNING PRAYER

# ఉదయ ప్రార్థనా క్రమము

## పీఠిక

¶ సేవకుడు ఈ దిగువవచ్చెడు లేఖన వాక్యములలో ఒకటి రెండు బిగ్గరగా చదువవలెను.

నేను లేచి, నా తండ్రియొద్దకు వెళ్లి—తండ్రీ, నేను పరలోకమునకు
*పశ్చాత్తాపము* విరోధముగాను, నీ యెదుటను పాపము చేసితిని; ఇక మీదట నీ కుమారుడ ననిపించుకొనుటకు యోగ్యుడను కాను అని ఆయనతో చెప్పుదును. (లూకా 15: 18, 19).

మనము పాపములేనివారమని చెప్పుకొనినయెడల, మనలను మనమే మోసపుచ్చుకొందుము; మరియు, మనలో సత్యముండదు. మన పాపములను మనము ఒప్పుకొనినయెడల, ఆయన నమ్మదగినవాడును, నీతిమంతుడును గనుక, ఆయన మన పాపములను క్షమించి, సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును. (1 యోహాను 1: 8, 9).

మనము మన దేవుడైన ప్రభువునకు విరోధముగా తిరుగుబాటు చేసితిమి; అయితే ఆయన కృపాక్షమాపణలుగల దేవుడైయున్నాడు. ఆయన మనకు ఆజ్ఞ ఇచ్చినవాటిని అనుసరించి నడుచుకొనవలెనని సెలవిచ్చెను గాని, మనము మన దేవుడైన ప్రభువు మాట వినకపోతిమి. (దానియేలు 9: 9, 10).

నీ సేవకునితో వ్యాజ్యెమాడకుము, సజీవులలో ఒకడును నీ సన్నిధిని నీతిమంతుడుగా ఎంచబడడు. (కీర్తన 143: 2).

దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను
*ఆరాధన* ఆరాధింపవలెను. (ప. యోహాను 4: 24).

పరిశుద్ధాలంకారములు ధరించుకొని, ప్రభువునకు నమస్కారము చేయుడి. సర్వభూజనులారా, ఆయన సన్నిధిని వణకుడి. (కీర్తన 96: 9).

పరలోకరాజ్యము సమీపించియున్నది; మారుమనస్సు పొందుడి. (ప. మత్తయి 3: 2).

**రాక దినములు**

రాత్రి చాల గడిచి, పగలు సమీపముగా ఉన్నది గనుక, మనము అంధకారక్రియలను విసర్జించి, తేజస్సంబంధమైన యుద్ధోపకరణములు ధరించుకొందము. (రోమా 13: 12).

**క్రిస్మస్**

ఇదిగో ప్రజలందరికి కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను; దావీదు పట్టణమందు రక్షకుడు మీకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు. (లూకా 2: 10, 11).

మనము ఆయనద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను; దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను. (1 యోహాను 4: 9).

**ఎపిఫని**

తూర్పుదిశ మొదలుకొని పడమటిదిశవరకు, అన్యజనులలో నా నామము ఘనముగా ఎంచబడును, సకల స్థలములలో ధూపమును పవిత్రమైన యర్పణలును అర్పింపబడును, అన్య జనులలో నా నామము ఘనముగా ఎంచబడునని సైన్యములకు అధిపతియగు ప్రభువు సెలవిచ్చుచున్నాడు. (మలాకీ 1: 11).

ప్రభువు తన రక్షణను వెల్లడిచేసియున్నాడు. అన్యజనుల యెదుట తన నీతిని బయలుపరచియున్నాడు. (కీర్తన 98: 2).

**లెంటు**

మీ దేవుడైన ప్రభువు కరుణావాత్సల్యతలుగలవాడును, శాంతమూర్తియు, అత్యంతకృపగలవాడునై యుండి, తాను చేయనుద్దేశించిన కీడుచేయక పశ్చాత్తాపపడును గనుక, మీ వస్త్రములను కాక, మీ హృదయములను చింపుకొని ఆయనతట్టు తిరుగుడి. (యోవేలు 2: 13).

విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు; దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యముచేయవు. (కీర్తన 51: 17).

**శ్రమలవారము**

ప్రయాణస్థులారా, ఈలాగు జరుగుట చూడగా మీకు చింతలేదా? నాకు కలుగజేసిన శ్రమవంటి శ్రమ మరి ఎవరికైనను కలిగినదో లేదో మీరు నిదానించి చూడుడి. (విలాపవాక్యములు 1: 12).



**మంచి శుక్రవారము**

దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింక పాపులమైయుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. (రోమా 5: 8).

**పునరుత్థానమునకు తొలిదినము**

ప్రభువుయెదుట మౌనముగానుండి ఆయనకొరకు కనిపెట్టుకొనుము: ఆయన నీ హృదయవాంఛలను తీర్చును. (కీర్తన 37: 7, 4).

**పునరుత్థాన దినము**

మన ప్రభువగు యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడునుగాక: మృతులలోనుండి యేసుక్రీస్తు తిరిగి లేచుటవలన, జీవముతో కూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు ఆయన తన విశేష కనికరముచొప్పున, మనలను మరల జన్మింపజేసెను. (1 పేతురు 1: 3).

**ఆరోహణ దినము**

ఆకాశమండలముగుండ వెళ్లిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధానయాజకుడు మనకు కలిగియున్నాడు గనుక, మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము. (హెబ్రీ 4: 14, 16).

**పరిశుద్ధాత్మ దినము**

మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది. (రోమా 5: 5).

**త్రిత్వపు ఆదివారము**

దేవుడు ప్రేమాస్వరూపియై యున్నాడు. ప్రేమయందు నిలిచియుండువాడు దేవునియందు నిలిచియున్నాడు. దేవుడు వానియందు నిలిచియున్నాడు. (1 యోహాను 4: 16).

**సమస్త పరిశుద్ధుల దినము**

ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించియున్నందున, మనముకూడ ప్రతి భారమును, సులువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దాని కొనసాగించువాడునైన యేసుక్రీస్తువైపు చూచుచు, మనయెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. (హెబ్రీ 12: 1, 2).

*పరిశుద్ధుల దినములు*

నీతిమంతులు నిత్యము జ్ఞాపకములో నుందురు. నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరమగును. (కీర్తన 112: 6; సామెతలు 10: 7).

*సంవత్సరాది*

ప్రభువుకొరకు ఎదురుచూచువారు నూతనబలము పొందుదురు, వారు పక్షిరాజువలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు, అల యక పరుగెత్తుదురు. సొమ్మసిల్లక నడిచిపోవుదురు. (యెషయా 40: 31).

*కోతకాలము*

భూమియు దాని సంపూర్ణతయు ప్రభువునవే. (కీర్తన 24: 1).

*అపత్కాలము*

దేవుడు మనకు ఆశ్రయమును దుర్గమునైయున్నాడు. ఆపత్కాలములో ఆయన నమ్మకొనదగిన సహాయకుడు. (కీర్తన 46: 1).

*జాతీయ ఉత్సవము*

న్యాయమునుబట్టి నీవు జనములకు తీర్పు తీర్చుదువు, భూమిమీదనున్న జనములను ఏలెదవు. జనములు సంతోషించుచు ఉత్సాహధ్వని చేయునుగాక. (కీర్తన 67: 3, 4).

¶ సేవకుడు జనులవైపు తిరిగి, క్రింది హెచ్చరిక చెప్పవలెను.

మిక్కిలి ప్రియ సహోదరులారా, మన నానాపాపములను దుర్మార్గమును ఒప్పుకొనవలసినదని, పరిశుద్ధలేఖనములు ఆయా భాగములయందు మనలను ప్రేరేపించుచున్నవి. మరియు మన పరలోకపు తండ్రియైన సర్వశక్తిగల దేవుని మితిలేని దయా దాక్షిణ్యములవల్ల పాపక్షమ దొరకునట్లు, ఆయన సమ్ముఖమందు మన పాపములు మిషపెట్టి దాచక, వినయవిధేయతలును పశ్చాత్తాపమునుగల హృదయముతో మనము ఒప్పుకొనవలసినదని, అవి ప్రేరేపించుచున్నవి. మనము దేవునియెదుట మన పాపములు ఎల్లప్పుడును వినయముతో చెప్పుకోవలసియుండినను, ఆయనవల్ల మనము పొందిన గొప్ప ఉపకారములకొరకై ఆయనను స్తుతించుటకును, ఆయన అతి శ్రేష్ఠమైన కీర్తిని ప్రచురపరచుటకును, ఆయన మిక్కిలి పరిశుద్ధవాక్యము వినుటకును, శరీరాత్మలకు అవసరముగా కావలసినవాటిని అడుగుకొనుటకును మనము కూడివచ్చినప్పుడు, మన పాపములను ముఖ్యముగా ఒప్పుకొనవలసినది. కాబట్టి యిక్కడనున్న మీరందరును, శుద్ధహృదయముతోను, దీనస్వరముతోను, పరలోక కృపాసింహాసనము నొద్దకు వచ్చి, నావెంట చెప్పవలసినదేమనిన:



[లేదా యిది.

ప్రియులారా, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా మన కృతజ్ఞతాస్తోత్రములను దేవునికి చెల్లించి ఆయనను ఆరాధించుటకును, మన పాపములను ఒప్పుకొనుటకును, మనమేకాక యితరులుకూడ దేవుని ప్రేమాతిశయమును మరి యెక్కువగా గ్రహించి ఆయన కృపా ఫలములను బ్రతుకునందు కనుపరచులాగున ప్రార్థించుటకును, మనుష్యులందరి క్షేమముకొరకు కావలసినవాటిని అడుగుకొనుటకును, సర్వశక్తిగల దేవుని సమ్ముఖమందును పరలోకపు సర్వసమూహము ఎదుటను కూడివచ్చియున్నాము.

కాబట్టి, దేవుడు మనతో ఇప్పుడున్నాడని జ్ఞాపకము చేసికొని, మన మందరము మోకాళ్లూని, మౌనముగా నుందము.

¶ లేదా, సేవకుడు పై హెచ్చరికలను విడిచిపెట్టి యిట్లు చెప్పవచ్చును:

సర్వశక్తిగల దేవునియెదుట మన పాపములను వినయముతో ఒప్పుకొందము.

¶ అంతట అందరు మోకరించి కొంతసేపు నిశ్శబ్దముగా నుండవలెను.]

¶ అందరును మోకాళ్లూనియుండగా సేవకునివెంట సంఘమంతయు చెప్పవలసిన సాధారణమైన ఒప్పుకోలు:

సర్వశక్తియు మిక్కిలి కనికరమునుగల తండ్రీ, తప్పిపోయిన గొర్రెలవలె మేము నీ మార్గములు తప్పి తిరిగితిమి. మా హృదయముల ఆలోచనలను ఆశలను మిక్కిలి అనుసరించితిమి. నీ పరిశుద్ధమైన ఆజ్ఞలను మీరితిమి. మేము చేయవలసినవి చేయక చేయరానివి చేసితిమి. మాలో క్షేమము ఏమియు లేదు. అయినను మా ప్రభువైన క్రీస్తుయేసుద్వారా, నీవు మనుష్యులకు తెలియజేసిన వాగ్దానముల ప్రకారము, ఓ ప్రభువా, పాపపీడితులమైన మమ్మును కరుణింపుము. ఓ దేవా, తమ తప్పిదములు ఒప్పుకొనువారిని కాయుము. పశ్చాత్తాపపడువారిని తిరిగి చేర్చుకొనుము. మరియు మిక్కిలి కనికరముగల తండ్రీ, నీ పరిశుద్ధ నామమునకు మహిమ కలుగులాగున మేమిక భక్తి, నీతి, సుబుద్ధులతో జీవించునట్లు, ఆయన నిమిత్తము దయచేయుము. ఆమేన్.

లేదా యిది.

దేవా, మా పరమతండ్రీ, నీ బిడ్డలమైన మేము, తలంపునందును మాటయందును క్రియయందును, నీకు విరోధముగా పాపముచేసితిమి. మా పూర్ణహృదయములతో నిన్ను ప్రేమింపక పోతిమి. మమ్మును మేము ప్రేమించుకొనునట్లు, మా పొరుగువారిని ప్రేమింపకయుంటిమి. ప్రభువా, మమ్మును కని

కరించుము. మా పాపములనుండి మమ్మును పవిత్రపరచుము; మా లోపములను దిద్దుకొనుటకు మాకు సహాయముచేయుము; వీటిని మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ జనులు ఇంకను మోకాళ్లూనియుండగా ప్రీస్టు ఒకడే నిలుచుండి ఆయనమాత్రమే ప్రకటింపవలసిన పాపవిమోచనము:

**మ**న ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రియగు సర్వశక్తిగల దేవుడు, పాపాత్ముడు చావక, వాని దుర్మార్గమునుండి మళ్లుకొని బ్రదుకవలసినదని కోరి, పశ్చాత్తాపపడిన తన జనులకు, పాపవిమోచనమును పాపపరిహారమును తెలిపి ప్రకటించుటకు, తన సేవకులకు అధికారమును ఆజ్ఞయు నిచ్చియున్నాడు. నిజముగా పశ్చాత్తాపపడి, తన పరిశుద్ధ సువార్తను నిష్కపటముగా నమ్మువారందరిని, ఆయన క్షమించి విమోచించుచున్నాడు. కాబట్టి, తుదకు మనము ఆయన నిత్యానందము పొందులాగున, మనమిప్పుడు చేయునవి ఆయనను సంతోషపరచునట్లును, మనము మన ఆయుశ్శేషము నిర్దోషముగాను పరిశుద్ధముగాను గడుపునట్లును, మనకు నిజమైన పశ్చాత్తాపమును తన పరిశుద్ధాత్మను దయచేయుమని, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా ఆయనను వేడుకొందము. ఆమేన్.

లేదా యిది.

సర్వశక్తియు కనికరమునుగల దేవుడు మీ సమస్త పాపములను క్షమించి, వాటినుండి మిమ్మును విడుదలచేసి, మీ నడతను దిద్దుకొనుటకు తగిన సమయము దయచేసి, పరిశుద్ధాత్మయొక్క కృపయు ఆదరణయును మీకు అనుగ్రహించునుగాక. ఆమేన్.

¶ అంతట సేవకుడు మోకాళ్లూని ప్రభువుప్రార్థన వినబడునట్లుగా చెప్పవలెను. మోకాళ్లూనియున్న జనులుకూడ, ఇప్పుడును దైవారాధనలో దానిని వాడునప్పుడెల్లను ఆయనతో కలిసి పలుకవలెను.

**ప**రలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములు చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియై యున్నవి. ఆమేన్.



¶ సేవకుడు మోకాళ్లూని ఇట్లు చెప్పవలెను:

**ప్ర**భువా, మా పెదవులు తెరువుము.

ఉత్తరము.—అప్పుడు మా నోరు నీ స్తుతిని ప్రచురపరచును.

సేవ.—దేవా, శీఘ్రముగా మమ్మును రక్షింపుము.

ఉ.—ప్రభువా, మాకు సహాయముచేయుటకు త్వరపడుము.

¶ ఇక్కడ అందరును లేచి నిలుచుండియుండగా సేవకుడు చెప్పవలెను:

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

సేవ.—ప్రభువును స్తుతింపుడి.

ఉ.—ప్రభువు నామము స్తుతింపబడునుగాక.

¶ అంతట ఈ దిగువవచ్చెడు కీర్తనను చెప్పవలెను, లేదా పాడవలెను. కాని పునరుత్థాన దినమునకును తరువాతి ఏడు దినములకును మరియొక స్తుతిగానము నిర్ణయింపబడియున్నది గనుక అప్పుడు ఇది వాడకూడదు. మరియు ప్రతిమాసముయొక్క పదునేడవ దినమందు కీర్తనల వరుసలో 95-వ కీర్తనను చదివినప్పుడు ఇచ్చట దీనిని చదువరాదు.

¶ ఆదివారములయందును ఇతర పరిశుద్ధ దినములయందును తప్ప తక్కిన దినములలో దీనిని విడిచిపెట్టవచ్చును.

కీర్తన 95.

**ర**ండి, ప్రభువునుగూర్చి ఉత్సాహధ్వని చేయుదము : మన రక్షణ దుర్గమునుబట్టి సంతోషగానము చేయుదము.

2. కృతజ్ఞతాస్తుతులతో ఆయన సన్నిధికి వచ్చెదము : కీర్తనలు పాడుచు, ఆయన పేరట సంతోషగానము చేయుదము.

3. ప్రభువు మహా దేవుడు : దేవతలందరికి పైన మాహాత్మ్యముగల మహారాజు.

4. భూమ్యగాధస్థలములు ఆయన చేతిలోనున్నవి : పర్వతశిఖరములు ఆయనవే.

5. సముద్రము ఆయనది, ఆయన దానిని కలుగజేసెను : ఆయన హస్తములు భూమిని నిర్మించెను.

6. ఆయన మన దేవుడు : మనము ఆయన పాలించు ప్రజలము, ఆయన మేపు గొఱ్ఱెలము.

7. రండి, నమస్కారముచేసి సాగిలపడుదము : మనలను సృజించిన ప్రభువు సన్నిధిని మోకరించుదము.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉత్తరము.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

¶ తరువాత, ఏర్పర్చబడియున్న క్రమముచొప్పున కీర్తనలు రావలెను.

¶ అంతట ఆ దినమునకు విశేషపాఠములు ఏర్పర్చబడియుండకపోయినయెడల పంచాంగములో నిర్ణయించినప్రకారము పాతనిబంధననుండి తీసిన మొదటిపాఠము వినబడునట్లు స్పష్టముగా చదువవలెను. అక్కడ నున్నవారందరికిని మిక్కిలి బాగుగా వినబడునట్లు ఆ చదివెడియాయన నిలుచుండి వారి కభిముఖుడై చదువవలెను. తరువాత.—దేవా నిన్ను స్తుతించుచున్నాము అను స్తుతిగానము సంవత్సరముపొడుగున ప్రతిదినమును చెప్పవలెను, లేదా పాడవలెను.

¶ ప్రతి పాఠమునకు ముందుగా సేవకుడు చెప్పవలసినదేమనిన, ఆయా గ్రంథములో ఇన్నవ అధ్యాయము, లేదా ఇన్నవ అధ్యాయముయొక్క ఇన్నవ వచనము, ఆరంభమగుచున్నదనియు; ప్రతిపాఠమైనతరువాత మొదటి పాఠము, లేదా రెండవ పాఠము ఇక్కడికి సరియనియు చెప్పవలెను.

## దేవా నిన్ను స్తుతించుచున్నాము

దేవా, నిన్ను స్తుతించుచున్నాము : నీవు ప్రభుడవని ఒప్పుకొనుచున్నాము.

2. నిత్యుడవైన తండ్రీ : లోకమంతయు నిన్ను ఆరాధించుచున్నది.

3. దేవదూతలందరును పరలోకమును అందులోని అధికారులందరును : బిగ్గరగా నిన్ను కొనియాడుచున్నారు.

4. పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, పరిశుద్ధుడా : సైన్యముల ప్రభుడవైన దేవా,

5. ఇహపరలోకములు : నీ మహిమయొక్క మాహాత్మ్యముతో నిండియున్నవి.

6. కెరూబులు సెరాపులు : ఎడతెగక నిన్ను కొనియాడుచున్నారు.

అపొస్తలుల మహిమగల సమూహము : నిన్ను స్తుతించుచున్నది.

8. ప్రవక్తల ఉత్తమ సంఘము : నిన్ను స్తుతించుచున్నది.

9. హతసాక్షుల వీర సైన్యము : నిన్ను స్తుతించుచున్నది.



10. అపరిమిత మాహాత్మ్యముగల : తండ్రివైన నిన్నును

11. పూజ్యుడగు : నీ నిజ అద్వితీయ కుమారుని

12. ఆదరణ కర్తయైన పరిశుద్ధాత్మను : లోకమంతటనుండు పరిశుద్ధసభ ఒప్పుకొనుచున్నది.

క్రీస్తూ : నీవే మహిమగల రాజవు.

14. నీవే తండ్రికి : నిత్యకుమారుడవు.

15. నీవు మనుష్యులను రక్షింప బూనుకొన్నప్పుడు : కన్యాగర్భము అసహ్యించుకొనలేదు.

16. నీవు మరణవేదన జయించినప్పుడు : విశ్వాసులకందరికిని పరలోకరాజ్యము తెరచితివి.

17. నీవు తండ్రి మహిమయందు : దేవుని కుడిచేతివైపున కూర్చుండియున్నావు.

18. నీవు మాకు న్యాయాధిపతివై : వత్తువని నమ్ముచున్నాము.

19. కాబట్టి నీవు నీ యమూల్య రక్తమిచ్చి విడిపించిన నీ సేవకులకు : సహాయము చేయుమని నిన్ను ప్రార్థించుచున్నాము.

20. నిత్యమహిమయందు : నీ పరిశుద్ధులతో వారిని ఎంచుము.

ప్రభువా, నీ జనమును రక్షించి : నీ స్వాస్థ్యమును దీవింపుము.

22. వారిని ఎప్పుడును ఏలి : లేవనెత్తుము.

23. మేము దినదినమును : నిన్ను మహిమపరచుచున్నాము.

24. ఎల్లప్పుడు యుగయుగములయందును : నీ నామమును స్మరించుచున్నాము.

25. ప్రభువా, దయచేసి నేడు పాపముచేయకుండ : మమ్మును కాపాడుము.

26. ప్రభువా, మమ్మును కనికరింపుము : మమ్మును కనికరింపుము.

27. ప్రభువా, మేము నిన్ను నమ్ముచున్నాము : నీ కరుణ మామీద నుండనిమ్ము.

28. ప్రభువా, నిన్ను నమ్మితిని : ఎప్పుడును నన్ను సిగ్గుపడనియ్యకుము.

¶ లేదా ఈ స్తుతిగానము పాడవలెను:

## ప్రభువుయొక్క యావత్కార్యములారా

¶ 'ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి' అను మాటలను 1, 2, 17, 18, 26, 32 వచనములకు తరువాత తప్ప తక్కినవాటిలో విడిచిపెట్టవచ్చును.

¶ 'దేవా, నిన్ను స్తుతించుచున్నాము' అను స్తుతిగానమునకు ప్రతిగా 'ప్రభువుయొక్క యావత్కార్యములారా, అను స్తుతిగానమును వార దినములయందు వాడినయెడల ఈ స్తుతిగానముయొక్క మొదటి, చివరి భాగములనుమాత్రము చెప్పినను, లేదా పాడినను చాలును.

ప్రభువుయొక్క యావత్కార్యములారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

2. ప్రభు దూతలారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

మిన్నులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

4. ఆకాశముమీదనున్న జలములారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

5. ప్రభువుయొక్క సమస్త శక్తులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

6. సూర్య చంద్రులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

7. ఆకాశ నక్షత్రములారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

8. వాన మంచులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

9. దేవుని వాయువులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

10. నిప్పు వేండ్రములారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.



11. శీతోష్ణకాలములారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

12. మంచులారా, పేరిన మంచులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

13. పేరిన మంచూ, శీతలమా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

14. మంచుగడ్డా, హిమమా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

15. దివారాత్రులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

16. చీకటి వెలుగులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

17. మెరుపులారా, మేఘములారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

భూమి ప్రభువును స్తుతించునుగాక : అవును, ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచునుగాక.

19. కొండ గుట్టలారా, ప్రభువును స్తుతించుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

20. భూమిమీది చెట్టు చేమలారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

21. ఊటలారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

22. ప్రవాహ సముద్రములారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

23. తిమింగిలాది జలచరములారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

24. సమస్తాకాశ పక్షులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

25. సమస్త మృగపశువులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

26. నరపుత్రులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

ఇశ్రాయేలు ప్రభువును స్తుతించునుగాక : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచునుగాక.

28. ప్రభు యాజకులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

29. ప్రభు సేవకులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

30. నీతిమంతుల ఆత్మలారా, ప్రాణములారా ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

31. పరిశుద్ధులారా, వినయహృదయులారా, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

32. అననీయా, అజరీయా, మిషాయేలూ, ప్రభువును స్తుతింపుడి : ఆయనను స్తుతించి ఎల్లప్పుడును మహిమపరచుడి.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

¶ లేదా, 51 వ. కీర్తనగాని, 40 వ. కీర్తనగాని ఇచ్చట చదువవలెను.

## కీర్తన 51.

దేవా, నీ కృపచొప్పున నన్ను కరుణింపుము : నీ వాత్సల్య బాహుళ్యముచొప్పున నా అతిక్రమములను తుడిచివేయుము.

2. నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము : నా పాపము పోవునట్లు నన్ను పవిత్రపరచుము.

3. నా అతిక్రమములు నాకు తెలిసేయున్నవి : నా పాపమెల్లప్పుడు నాయెదుట నున్నది.



4. నీకు, కేవలము నీకే విరోధముగా నేను పాపము చేసియున్నాను, నీ దృష్టియెదుట నేను చెడుతనము చేసియున్నాను : కావున, ఆజ్ఞ ఇచ్చునప్పుడు నీవు నీతిమంతుడవుగా అగపడుదువు, తీర్పు తీర్చునప్పుడు నిర్మలుడవుగా అగపడుదువు.

5. నేను పాపములో పుట్టినవాడను : పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను.

6. నీవు అంతరంగమున సత్యము కోరుచున్నావు : ఆంతర్యములో నాకు జ్ఞానము తెలియజేయుదువు.

7. నేను పవిత్రుడనగునట్లు హిస్సోపుతో నా పాపము పరిహరింపుము : హిమముకంటెను నేను తెల్లగా ఉండునట్లు నీవు నన్ను కడుగుము.

8. ఉత్సాహ సంతోషములు నాకు వినిపింపుము : అప్పుడు నీవు విరిచిన యెముకలు హర్షించును.

9. నా పాపములకు విముఖుడవు కమ్ము : నా దోషములన్నిటిని తుడిచివేయుము.

10. దేవా, నాయందు శుద్ధహృదయము కలుగజేయుము : నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము.

11. నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము : నీ పరిశుద్ధాత్మను నా యొద్దనుండి తీసివేయకుము.

12. నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము : సమ్మతిగల మనస్సు కలుగజేసి నన్ను దృఢపరచుము.

13. అప్పుడు అతిక్రమము చేయువారికి నీ త్రోవలను బోధించెదను : పాపులును నీ తట్టు తిరుగుదురు.

14. దేవా, నా రక్షణకర్తయగు దేవా, రక్తాపరాధమునుండి నన్ను విడిపింపుము : అప్పుడు నా నాలుక నీ నీతినిగూర్చి ఉత్సాహగానము చేయును.

15. ప్రభువా, నా నోరు నీ స్తుతిని ప్రచురపరచునట్లు : నా పెదవులను తెరువుము.

16. నీవు బలిని కోరువాడవుకావు, కోరినయెడల నేను అర్పించుదును : దహనబలి నీకిష్టమైనది కాదు.

17. విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు : దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు.

18. నీ కటాక్షముచొప్పున సీయోనుకు మేలుచేయుము : యెరూషలేము యొక్క గోడలను కట్టించుము.

19. అప్పుడు నీతియుక్తములైన బలులును దహనబలులును సర్వాంగహోమములును నీకు అంగీకృతములగును : అప్పుడు జనులు నీ బలిపీఠము మీద కోడెలను అర్పించెదరు.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును మహిమ కలుగును గాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగును గాక. ఆమేన్.

¶ అంతట క్రొత్తనిబంధననుండి తీసిన రెండవ పాఠము మొదటిదానివలె చదువవలెను. అటు తరువాత ఈ దిగువవచ్చెడి స్తుతిగానము పాడవలెను:

## జకరీయా గీతము

ప. లూకా 1: 68.

ఇశ్రాయేలీయుల దేవుడైన ప్రభువు స్తుతింపబడును గాక : ఆయన తన ప్రజలకు దర్శనమిచ్చి వారికి విమోచన కలుగజేసెను.

2. తన సేవకుడైన దావీదు వంశమునందు : మనకొరకు రక్షణ శృంగమును, అనగా—

3. మన శత్రువులనుండియు మనలను ద్వేషించువారందరి చేతులనుండియు తప్పించి : రక్షణను కలుగజేసెను.

4. దీనిగూర్చి ఆయన ఆదినుండి: తన పరిశుద్ధప్రవక్తల నోట పలికించెను.

5. ఆయన మన పితరులను కరుణించుటకును : తన పరిశుద్ధ నిబంధనను, అనగా—

6. మన తండ్రియైన అబ్రాహాముతో తాను చేసిన ప్రమాణమును : జ్ఞాపకము చేసికొనుటకును—

7. మనము మన శత్రువుల చేతినుండి విడిపింపబడి : మన జీవితకాలమంతయు నిర్భయులమై—



8. ఆయన సన్నిధిని పరిశుద్ధముగాను నీతిగాను ఆయనను సేవింప మనను గ్రహించుటకును : ఈ రక్షణ కలుగజేసెను.

9. మరియు ఓ శిశువా : నీవు సర్వోన్నతుని ప్రవక్తవనబడుదువు.

10. మన దేవుని మహా వాత్సల్యమునుబట్టి : వారి పాపములను క్షమించుటవలన తన ప్రజలకు రక్షణజ్ఞానమును ఆయన అనుగ్రహించునట్లు—

11. ఆయన మార్గములను సిద్ధపరచుటకై : నీవు ప్రభువునకు ముందుగా నడుతువు.

12. మన పాదములను సమాధాన మార్గములోకి నడిపించునట్లు : చీకటిలోను మరణచ్ఛాయలోను కూర్చుండువారికి వెలుగిచ్చుటకై—

13. ఆ మహా వాత్సల్యమునుబట్టి : పైనుండి ఆయన మనకు అరుణోదయదర్శనమును గ్రహించెను.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును : మహిమ కలుగును గాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగును గాక. ఆమేన్.

¶ లేదా, ఈ కీర్తన పాడవలెను:

## సమస్త దేశములారా

కీర్తన 100.

సమస్త దేశములారా : ప్రభువునకు ఉత్సాహధ్వని చేయుడి.

2. సంతోషముతో ప్రభువును సేవించుడి : ఉత్సాహగానము చేయుచు ఆయన సన్నిధికి రండి.

3. ప్రభువే దేవుడని తెలిసికొనుడి : ఆయనే మనలను పుట్టించెను. మనము ఆయన వారము, మనము ఆయన ప్రజలము, ఆయన మేపు గొఱ్ఱెలము.

4. కృతజ్ఞతార్పణలు చెల్లించుచు ఆయన గుమ్మములలో ప్రవేశించుడి : కీర్తనలు పాడుచు, ఆయన ఆవరణములలో ప్రవేశించుడి, ఆయనను స్తుతించుడి, ఆయన నామము ఘనపరచుడి.

5. ప్రభువు దయాళుడు, ఆయన కృప నిత్యముండును : ఆయన సత్యము తరతరములుండును.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును : మహిమ కలుగును గాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

¶ అంతట సేవకుడును జనులును నిలుచుండి అపొస్తలుల విశ్వాససూత్రము పాడవలెను, లేదా చెప్పవలెను. అయినను పరిశుద్ధ అథనాసి విశ్వాస సూత్రము చదువ నిర్ణయించిన దినములయందు దీనిని విడిచిపెట్టి ఆ విశ్వాససూత్రమునైనను దాని భాగమునైనను వాడవచ్చును.

పరలోక భూలోకముల సృష్టికర్తయగు సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన అద్వితీయకుమారుడును, మన ప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన కన్యయగు మరియ గర్భమున ధరింపబడి, ఆమెకు పుట్టెను. పొంతి పిలాతు అధికారముక్రింద బాధపడి, సిలువవేయబడి, చనిపోయి, పాతిపెట్టబడి, అదృశ్యలోకములోనికి దిగెను. మూడవ దినమున చనిపోయినవారిలోనుండి తిరిగి లేచి, పరలోకమునకెక్కి, సర్వశక్తిగల తండ్రియైన దేవుని కుడిచేతివైపున కూర్చుండియున్నాడు. సజీవులకును మృతులకును తీర్పుచేయుటకు అక్కడనుండి ఆయన వచ్చునని నమ్ముచున్నాను.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ సార్వత్రిక సంఘమును పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణను, శరీర పునరుత్థానమును, నిత్యజీవమును నమ్ముచున్నాను. ఆమేన్.

¶ అటుతరువాత అందరును భక్తితో మోకాళ్లూని యుండగా ఈ దిగువవచ్చెడి ప్రార్థనలు చెప్పవలెను. అంతకుముందు సేవకుడు బిగ్గరగా చెప్పవలసినదేమనిన:

ప్రభువు మీకు తోడై యుండునుగాక.

ఉ.—నీ ఆత్మకును తోడై యుండునుగాక.

సేవకుడు.—ప్రార్థించుదము.

ప్రభువా మమ్మును కనికరింపుము.

క్రీస్తూ మమ్మును కనికరింపుము.

ప్రభువా మమ్మును కనికరింపుము.

¶ అంతట సేవకుడును, గురువులును, జనులును బిగ్గరగా ప్రభువుప్రార్థన చెప్పవలెను.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయ



చేయుము. మాయెడల అపరాధములుచేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. ఆమేన్.

¶ అంతట సేవకుడు లేచి నిలుచుండి చెప్పవలెను:

ప్రభువా, నీ కృప మాకు కనుపరచుము.

ఉ.—నీ రక్షణ మాకు దయచేయుము.

సే.—ప్రభువా, చక్రవర్తిని రక్షింపుము.

ఉ.—మేము నిన్ను ప్రార్థించునప్పుడు కరుణతో ఆలకింపుము.

సే.—నీ సేవకులకు నీతిని ధరింపచేయుము.

ఉ.—నీవు ఏర్పరచుకొన్న జనులను సంతోషపరచుము.

సే.—ప్రభువా, నీ జనులను రక్షింపుము.

ఉ.—నీ స్వాస్థ్యమును దీవింపుము.

సే.—ప్రభువా, మా కాలమందు సమాధానము దయచేయుము.

ఉ.—దేవా, నీవే తప్ప భూలోకమును ఏలువాడు మరి ఎవడును లేడు.

సే.—దేవా, మా హృదయములను పవిత్రపరచుము.

ఉ.—నీ పరిశుద్ధాత్మను మాలోనుండి తీసికొనకుము.

¶ అంతట జనులు మోకాళ్లూనియుండగా మూడు సంగ్రహప్రార్థనలు చదువవలెను. మొదటిది సమభాక్తక్రమమందు ఆ దినమునకు ఏర్పర్చబడిన సంగ్రహప్రార్థన; రెండవది, సమాధానము కొరకైనది; మూడవది కృపకొరకైనది. ఈ చివరి రెండు సంగ్రహప్రార్థనలు సంవత్సరము పొడుగునను ప్రతిదినము ఉదయప్రార్థన సమయమందు తప్పక రావలెను. గాని ఆ దినసంగ్రహప్రార్థనకు తరువాత, ఏర్పర్చబడిన ఇతర ప్రార్థనలు సమయోచితముగా చదువవచ్చును.

## సమాధానముకొరకైన సంగ్రహప్రార్థన

సమాధాన కర్తవును ఐకమత్యప్రియుడవునైన ఓ దేవా, నిన్ను ఎరుగుటే మాకు నిత్యజీవము. నిన్ను సేవించుటే పూర్ణస్వాతంత్ర్యము. నిజముగా నీ శరణుజొచ్చియున్న వినయ సేవకులమైన మేము ఏ విరోధుల బలమునకును భయపడకుండునట్లు, మా శత్రువుల ప్రయత్నములన్నిటినుండి మమ్మును తప్పించి, యేసుక్రీస్తు బలమువల్ల కాపాడుము. ఆమేన్.

## కృపకొరకైన సంగ్రహప్రార్థన

ప్రభువా, మా పరలోకపు తండ్రీ, ఈ దినారంభమువరకు మమ్ము క్షేమముగా తెచ్చిన సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నేడు నీ మహాశక్తిచేత మమ్మును కాపాడి, మేము ఏ పాపములో పడకుండను, ఏ విధమైన ఉపద్రవములోను చిక్కుకొనకుండను, నీ దృష్టికి యుక్తమైనది ఎల్లప్పుడు చేయులాగున, మా పనులన్నియు నీ పరిపాలనచేత జరుపబడునట్లు మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దయచేయుము. ఆమేన్.

¶ గాయకులున్న దేవాలయములలోను, పాడెడి యితరస్థలములలోను ఇక్కడ ఒక గానము వచ్చును.

¶ మూడవ సంగ్రహప్రార్థనకు తరువాత సేవకుడు తనకు తోచినట్టు ఆయా సమయములయందు వాడతగిన ప్రార్థనలలోను కృతజ్ఞతాస్తుతులలోను ఒకటిగాని ఎక్కువగాని చెప్పవచ్చును. మరియు బిషపువల్ల నియమింపబడిన ఇతర ప్రార్థనలను ఇక్కడ చెప్పవచ్చును. ఎట్లయినను, కృసస్తము ప్రార్థనయు, కృపావచనమును చెప్పి ముగించవలెను.

## పరిశుద్ధుడైన కృసస్తముయొక్క ప్రార్థన

సర్వశక్తిగల దేవా, ఈ సమయమందు మేము ఏకమనస్సుతో నిన్ను గురించి మా సామాన్య ప్రార్థనలుచేయుటకు మాకు కృప దయచేసినావు గనుకను, ఇద్దరు ముగ్గురు నాపేరట కూడినప్పుడు వారి విన్నపముల ప్రకారము దయచేయుదునని మాట యిచ్చినావు గనుకను, ఓ ప్రభువా, నీ సేవకులమైన మా కోరికలను విన్నపములను మాకు తగినట్టు ఇప్పుడు నెరవేర్చి, ఇహమందు నీ సత్యము తెలిసికొను జ్ఞానమును పరమందు నిత్యజీవమును మాకు దయచేయుము. ఆమేన్.

2 కొరింథీ 13.

మన ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మనకందరికిని ఎల్లప్పుడును తోడైయుండును గాక. ఆమేన్.

THE ORDER FOR
# EVENING PRAYER

# సాయంప్రార్థనాక్రమము

## పీఠిక

¶ సేవకుడు ఈ దిగువవచ్చెడు లేఖన వాక్యములలో నొకటి రెండు బిగ్గరగా చదువవలెను.

పశ్చాత్తాపము

నేను లేచి, నా తండ్రియొద్దకు వెళ్లి—తండ్రీ, నేను పరలోకమునకు విరోధముగాను, నీ యెదుటను పాపము చేసితిని; ఇకమీదట నీ కుమారుడ ననిపించుకొనుటకు యోగ్యుడను కాను అని ఆయనతో చెప్పుదును. (ప. లూకా 15: 18, 19).

మనము పాపములేనివారమని చెప్పుకొనినయెడల, మనలను మనమే మోసపుచ్చుకొందుము; మరియు, మనలో సత్యముండదు. మన పాపములను మనము ఒప్పుకొనినయెడల, ఆయన నమ్మతగినవాడును, నీతిమంతుడును గనుక, ఆయన మన పాపములను క్షమించి, సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును. (1 యోహాను 1: 8, 9).

మనము మన దేవుడైన ప్రభువునకు విరోధముగా తిరుగుబాటు చేసితిమి; అయితే ఆయన కృపాక్షమాపణలుగల దేవుడైయున్నాడు. ఆయన మనకు ఆజ్ఞ ఇచ్చిన వాటిని అనుసరించి నడుచుకొనవలెనని సెలవిచ్చెను గాని, మనము మన దేవుడైన ప్రభువు మాట వినకపోతిమి. (దానియేలు 9: 9, 10).

నీ సేవకునితో వ్యాజ్యెమాడకుము, సజీవులలో ఒకడును నీ సన్నిధిని నీతిమంతుడుగా ఎంచబడడు. (కీర్తన 143: 2).

ఆరాధన

దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను. (ప. యోహాను 4: 24).

పరిశుద్ధాలంకారములు ధరించుకొని, ప్రభువునకు నమస్కారము చేయుడి. సర్వభూజనులారా, ఆయన సన్నిధిని వణకుడి. (కీర్తన **96: 9**).

*రాకదినములు*

పరలోకరాజ్యము సమీపించియున్నది; మారుమనస్సు పొందుడి. (ప. మత్తయి **3: 2**).

రాత్రి చాల గడిచి, పగలు సమీపముగా ఉన్నది గనుక, మనము అంధకారక్రియలను విసర్జించి, తేజస్సంబంధమైన యుద్ధోపకరణములు ధరించుకొందము. (రోమా **13: 12**).

*క్రిస్మస్*

**ఇ**దిగో ప్రజలందరికి కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను; దావీదు పట్టణమందు రక్షకుడు మీకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు. (ప. లూకా 2: 10, 11).

మనము ఆయనద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను; దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను. (1 యోహాను 4: 9).

*ఎపిఫని*

**తూ**ర్పుదిశ మొదలుకొని పడమటిదిశవరకు, అన్యజనులలో నా నామము ఘనముగా ఎంచబడును, సకల స్థలములలో ధూపమును పవిత్రమైన యర్పణలును అర్పింపబడును, అన్యజనులలో నా నామము ఘనముగా ఎంచబడునని సైన్యములకు అధిపతియగు ప్రభువు సెలవిచ్చుచున్నాడు. (మలాకీ 1: 11).

ప్రభువు తన రక్షణను వెల్లడిచేసియున్నాడు. అన్యజనుల యెదుట తన నీతిని బయలుపరచియున్నాడు. (కీర్తన 98: 2).

*లెంటు*

**మీ** దేవుడైన ప్రభువు కరుణావాత్సల్యతలుగలవాడును, శాంతమూర్తియు, అత్యంతకృపగలవాడునై యుండి, తాను చేయనుద్దేశించిన కీడుచేయక పశ్చాత్తాపపడును గనుక, మీ వస్త్రములను కాక, మీ హృదయములను చింపుకొని ఆయనతట్టు తిరుగుడి. (యోవేలు **2: 13**).

విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు; దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యముచేయవు. (కీర్తన 51: 17).



*శ్రమలు*

ప్రయాణస్థులారా, ఈలాగు జరుగుట చూడగా మీకు చింతలేదా? నాకు కలుగజేసిన శ్రమవంటి శ్రమ మరి ఎవరికైనను కలిగినదో లేదో మీరు నిదానించి చూడుడి. (విలాపవాక్యములు 1: 12).

*మంచి శుక్రవారము*

**దే**వుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింక పాపులమైయుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. (రోమా 5: 8).

*పునరుత్థానమునకు తొలి దినము*

**ప్ర**భువు యెదుట మౌనముగానుండి ఆయన కొరకు కనిపెట్టుకొనుము; ఆయన నీ హృదయవాంఛలను తీర్చును. (కీర్తన **37: 7, 4**).

*పునరుత్థాన దినము*

**మన ప్రభువగు** యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడునుగాక. మృతులలోనుండి యేసుక్రీస్తు తిరిగి లేచుటవలన, జీవముతోకూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు ఆయన తన విశేష కనికరముచొప్పున, మనలను మరల జన్మింపజేసెను. (1 ప. పేతురు 1: **3**).

*ఆరోహణ దినము*

**ఆ**కాశమండలముగుండ వెళ్లిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధానయాజకుడు మనకు కలిగియున్నాడు గనుక, మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము. (హెబ్రీ 4: 14, 16).

*పరిశుద్ధాత్మదినము*

**మ**నకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది. (రోమా 5: 5).

*త్రిత్వపు ఆదివారము*

**దే**వుడు ప్రేమస్వరూపియై యున్నాడు. ప్రేమయందు నిలిచియుండువాడు దేవునియందు నిలిచియున్నాడు. దేవుడు వానియందు నిలిచియున్నాడు. (1 యోహాను 4: 16).

*సమస్త పరిశుద్ధుల దినము*

**ఇం**త గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించియున్నందున, మనముకూడ, ప్రతి భారమును, సులువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దాని కొనసాగించువాడునైన యేసుక్రీస్తువైపు

చూచుచు, మనయెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. (హెబ్రీ 12: 1, 2).

*పరిశుద్ధుల దినములు*

**నీ**తిమంతులు నిత్యము జ్ఞాపకములో నుందురు. నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరమగును. (కీర్తన 112: 6; సామెతలు 10: 7).

*సంవత్సరాది*

**ప్ర**భువుకొరకు ఎదురుచూచువారు నూతనబలము పొందుదురు, వారు పక్షిరాజులవలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు, అలయక పరుగెత్తుదురు, సొమ్మసిల్లక నడిచిపోవుదురు. (యెషయా 40: 31).

*కోత కాలము*

**భూ**మియు దాని సంపూర్ణతయు ప్రభువునవే. (కీర్తన 24: 1).

*ఆపత్కాలము*

**దే**వుడు మనకు ఆశ్రయమును దుర్గమునైయున్నాడు. ఆపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు. (కీర్తన 46: 1).

*జాతీయ ఉత్సవము*

**న్యా**యమునుబట్టి నీవు జనములకు తీర్పు తీర్చుదువు, భూమిమీదనున్న జనములను ఏలెదవు. జనములు సంతోషించుచు ఉత్సాహధ్వని చేయుదురుగాక. (కీర్తన 67: 3).

¶ సేవకుడు జనులవైపు తిరిగి, క్రింది హెచ్చరిక చెప్పవలెను.

మిక్కిలి ప్రియ సహోదరులారా, మన నానాపాపములను దుర్మార్గమును ఒప్పుకొనవలసినదని, పరిశుద్ధలేఖనములు ఆయా భాగములయందు మనలను ప్రేరేపించుచున్నవి. మరియు, మన పరలోకపు తండ్రియైన సర్వశక్తిగల దేవుని మితిలేని దయా దాక్షిణ్యములవల్ల, పాపక్షమ దొరకునట్లు, ఆయన సమ్ముఖమందు మన పాపములు మిషపెట్టి దాచక, వినయ విధేయతలును పశ్చాత్తాపమునుగల మనస్సుతో మనము ఒప్పుకొనవలసినదని, అవి ప్రేరేపించుచున్నవి. మనము దేవునియెదుట మన పాపములు ఎల్లప్పుడును వినయముతో ఒప్పుకొనవలసియుండినను, ఆయనవల్ల మనము పొందిన గొప్ప ఉపకారముల కొరకై ఆయనను స్తుతించుటకును, ఆయన అతి శ్రేష్ఠమైన కీర్తిని ప్రచురపరచుటకును, ఆయన మిక్కిలి పరిశుద్ధవాక్యము వినుటకును, శరీరాత్మలకు అవసర



ముగా కావలసినవాటిని అడుగుకొనుటకును మనము కూడివచ్చినప్పుడు, మన పాపములను ముఖ్యముగా ఒప్పుకొనవలసినది. కాబట్టి యిక్కడనున్న మీరందరును, శుద్ధహృదయముతోను, దీనస్వరముతోను, పరలోక కృపా సింహాసనమునొద్దకు వచ్చి, నావెంట చెప్పవలసినదేమనిన:

[లేదా యిది.

ప్రియులారా, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా మన కృతజ్ఞతా స్తోత్రములను దేవునికి చెల్లించి ఆయనను ఆరాధించుటకును, మన పాపములను ఒప్పుకొనుటకును, మనమేకాక యితరులుకూడ దేవుని ప్రేమాతిశయమును మరి యెక్కువగా గ్రహించి ఆయన కృపాఫలములను బ్రతుకునందు కనుపరచులాగున ప్రార్థించుటకును, మనుష్యులందరి క్షేమముకొరకు కావలసిన వాటిని అడుగుకొనుటకును, సర్వశక్తిగల దేవుని సమ్ముఖమందును పరలోకపు సర్వసమూహము ఎదుటను కూడి వచ్చియున్నాము.

కాబట్టి, దేవుడు మనతో ఇప్పుడున్నాడని జ్ఞాపకము చేసికొని, మనమందరము మోకాళ్లూని, మౌనముగా నుందము.

¶ లేదా, సేవకుడు పై హెచ్చరికలను విడిచిపెట్టి యిట్లు చెప్పవచ్చును:

సర్వశక్తిగల దేవునియెదుట మన పాపములను వినయముతో ఒప్పుకొందము.

¶ అంతట అందరును మోకరించి కొంతసేపు నిశ్శబ్దముగా నుండవలెను.]

¶ అందరును మోకాళ్లూనియుండగా సేవకునివెంట సంఘమంతయు చెప్పవలసిన సాధారణమైన ఒప్పుకోలు:

**స**ర్వశక్తియు మిక్కిలి కనికరముగల తండ్రీ, తప్పిపోయిన గొర్రెలవలె మేము నీ మార్గములు తప్పి తిరిగితిమి. మా హృదయముల ఆలోచనలను ఆశలను మిక్కిలి అనుసరించితిమి. నీ పరిశుద్ధమైన ఆజ్ఞలను మీరితిమి. మేము చేయవలసినవి చేయక చేయరానివి చేసితిమి. మాలో క్షేమము ఏమియు లేదు. అయినను మా ప్రభువైన క్రీస్తుయేసుద్వారా, నీవు మనుష్యులకు తెలియజేసిన వాగ్దానముల ప్రకారము, ఓ ప్రభువా, పాపపీడితులమైన మమ్మును కరుణింపుము. ఓ దేవా, తమ తప్పిదములను ఒప్పుకొనువారిని కాయుము. పశ్చాత్తాపపడువారిని తిరిగి చేర్చుకొనుము. మరియు మిక్కిలి కనికరముగల తండ్రీ,

నీ పరిశుద్ధ నామమునకు మహిమ కలుగులాగున మేమిక భక్తి, నీతి, సుబుద్ధులతో జీవించునట్లు, ఆయన నిమిత్తము దయచేయుము. ఆమేన్.

లేదా యిది.

దేవా, మా పరమతండ్రీ, నీ బిడ్డలమైన మేము, తలంపునందును మాటయందును, క్రియయందును, నీకు విరోధముగా పాపముచేసితిమి. మా పూర్ణహృదయములతో నిన్ను ప్రేమింపకపోతిమి. మమ్మును మేము ప్రేమించుకొనునట్లు, మా పొరుగువారిని ప్రేమింపకయుంటిమి. ప్రభువా, మమ్మును కనికరించుము. మా పాపములనుండి మమ్మును పవిత్రపరచుము; మా లోపములను దిద్దుకొనుటకు మాకు సహాయముచేయుము; మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ జనులు ఇంకను మోకాళ్లూనియుండగా క్రీస్తు నిలుచుండి ఆయనమాత్రమే ప్రకటింపవలసిన పాపవిమోచనము:

మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రియగు సర్వశక్తిగల దేవుడు, పాపాత్ముడు చావక వాని దుర్మార్గమునుండి మళ్లుకొని బ్రతుకవలసినదని కోరి, పశ్చాత్తాపపడిన తన జనులకు పాపవిమోచనమును పాపపరిహారమును తెలిపి ప్రకటించుటకు, తన సేవకులకు అధికారమును ఆజ్ఞయు నిచ్చియున్నాడు. నిజముగా పశ్చాత్తాపపడి, తన పరిశుద్ధ సువార్తను నిష్కపటముగా నమ్మువారందరిని ఆయన క్షమించి విమోచించుచున్నాడు. కాబట్టి, తుదకు మనము ఆయన నిత్యానందము పొందులాగున, మనమిప్పుడు చేయునవి ఆయనను సంతోషపరచునట్లును, మనము మన ఆయుశ్శేషము నిర్దోషముగాను పరిశుద్ధముగాను గడుపునట్లును, మనకు నిజమైన పశ్చాత్తాపమును తన పరిశుద్ధాత్మను దయచేయుమని మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా ఆయనను వేడుకొందము. ఆమేన్.

లేదా యిది.

సర్వశక్తియు కనికరమునుగల దేవుడు మీ సమస్త పాపములను క్షమించి, వాటినుండి మిమ్మును విడుదలచేసి, మీ నడతను దిద్దుకొనుటకు తగిన సమయము దయచేసి, పరిశుద్ధాత్మయొక్క కృపయు ఆదరణయును మీకు అనుగ్రహించునుగాక. ఆమేన్.

¶ అంతట సేవకుడు మోకాళ్లూని ప్రభుని ప్రార్థన వినబడునట్లుగా చెప్పవలెను. మోకాళ్లూనియున్న జనులుకూడ, ఇప్పుడును దైవారాధనలో దానిని వాడునప్పుడెల్లను ఆయనతో కలిసి పలుకవలెను.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు



భూలోకమందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములు చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి. ఆమేన్.

¶ సేవకుడు మోకాళ్లూని ఇట్లు చెప్పవలెను:

ప్రభువా, మా పెదవులు తెరువుము.

ఉత్తరము.—అప్పుడు మా నోరు నీ స్తుతిని ప్రచురపరచును.

సేవ.—దేవా, శీఘ్రముగా మమ్మును రక్షింపుము.

ఉ.—ప్రభువా, మాకు సహాయముచేయుటకు త్వరపడుము.

¶ ఇక్కడ అందరును లేచి నిలుచుండియుండగా సేవకుడు చెప్పవలెను.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

సేవ.—ప్రభువును స్తుతింపుడి.

ఉ.—ప్రభువును నామము స్తుతింపబడునుగాక.

¶ అంతట ఆయా దినములకు ఏర్పడియున్న క్రమముచొప్పున కీర్తనలు చదువవలెను, లేదా పాడవలెను. అప్పుడు నిర్ణయించిన ప్రకారము పాతనిబంధననుండి తీసిన యొక పాఠము చదువవలెను. అటుతరువాత ధన్యురాలగు కన్య మరియ పాట వచ్చును.

## కన్య మరియ గీతము

ప. లూకా 1: 46.

నా ప్రాణము ప్రభువును : ఘనపరచుచున్నది.

2. ఆయన తన దాసురాలి దీనస్థితిని కటాక్షించెను : నా యాత్మ నా రక్షకుడైన దేవునియందు ఆనందించెను.

3. సర్వశక్తిమంతుడు : నాకు గొప్ప కార్యములు చేసెను.

4. గనుక ఇది మొదలుకొని అన్ని తరములవారు నన్ను ధన్యురాలని యందురు : ఆయన నామము పరిశుద్ధము.

5. ఆయనకు భయపడువారిమీద: ఆయన కనికరము తరతరములకుండును.

6. ఆయన తన బాహువుతో పరాక్రమము చూపెను : వారి హృదయముల ఆలోచన విషయమై గర్విష్ఠులను చెదరగొట్టెను.

7. సింహాసనములనుండి బలవంతులను పడద్రోసి : దీనుల నెక్కించెను.

8. ఆకలిగొనినవారిని మంచి పదార్థములతో సంతృప్తిపరచి : ధనవంతులను వట్టిచేతులతో పంపివేసెను.

9. అబ్రాహామునకును అతని సంతానమునకును యుగాంతమువరకు తన కనికరము చూప జ్ఞాపకము చేసికొందునని : మన పితరులతో సెలవిచ్చినట్టు ఆయన తన సేవకుడైన ఇశ్రాయేలుకు సహాయము చేసెను.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

లేదా, 98-వ కీర్తన పాడవచ్చును.

### 98. కీర్తన

**ప్రభువు** ఆశ్చర్యకార్యములు చేసియున్నాడు, ఆయననుగూర్చి క్రొత్త కీర్తన పాడుడి : ఆయన దక్షిణహస్తము, ఆయన పరిశుద్ధ బాహువు ఆయనకు విజయము కలుగజేసియున్నది.

2. **ప్రభువు** తన రక్షణను వెల్లడిచేసి యున్నాడు : అన్యజనుల యెదుట తన నీతిని బయలుపరచియున్నాడు.

3. ఇశ్రాయేలు సంతతికి తాను చూపిన కృపావిశ్వాస్యతలను ఆయన జ్ఞాపకము చేసికొనియున్నాడు : భూదిగంత నివాసులందరు మన దేవుడు కలుగజేసిన రక్షణను చూచిరి.

4. సర్వభూజనులారా, **ప్రభువు**నుబట్టి ఉత్సహించుడి : ఆర్భాటముతో సంతోషగానము చేయుడి, కీర్తనలు పాడుడి.

5. సితారాస్వరముతో **ప్రభువు**నకు స్తోత్రగీతములు పాడుడి : సితారా తీసికొని సంగీత స్వరముతో గానముచేయుడి.

6. బూరలతోను కొమ్ముల నాదముతోను : రాజైన **ప్రభువు** సన్నిధిని సంతోషధ్వని చేయుడి.

7. సముద్రమును దాని సంపూర్ణతయు ఘోషించుగాక : లోకమును దాని నివాసులును కేకలువేయుదురు గాక.



8. ఆయన సన్నిధిని నదులు చప్పట్లు కొట్టు గాక : కొండలు కూడి ఉత్సాహధ్వని చేయు గాక.

9. భూమికి తీర్పు తీర్చుటకై, నీతినిబట్టి లోకమునకు తీర్పు తీర్చుటకై : న్యాయమునుబట్టి జనములకు తీర్పు తీర్చుటకై **ప్రభువు** వేంచేయుచున్నాడు.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

¶ అంతట ఏర్పర్చబడియున్నట్టు క్రొత్తనిబంధననుండి తీసిన యొక పాఠను రావలెను. అటుతరువాత సుమెయోను గీతము వచ్చును.

## సుమెయోను గీతము

ప. లూకా 2: 29.

నాథా, ఇప్పుడు నీ మాటచొప్పున : సమాధానముతో నీ దాసుని పోనిచ్చుచున్నావు.

2. అన్యజనులకు నిన్ను బయలుపరచుటకు వెలుగుగాను : నీ ప్రజలైన ఇశ్రాయేలుకు మహిమగాను—

3. నీవు సకల ప్రజలయెదుట సిద్ధపరచిన నీ రక్షణ : నేను కన్నులార చూచితిని.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

లేదా, 67-వ కీర్తన పాడవచ్చును.

### కీర్తన 67.

**భూ**మిమీద నీ మార్గము తెలియబడునట్లును : అన్యజనులందరిలో నీ రక్షణ తెలియబడునట్లును,

2. దేవుడు మమ్మును కరుణించి మమ్మును ఆశీర్వదించును గాక : ఆయన తన ముఖకాంతి మామీద ప్రకాశింప జేయును గాక.

3. దేవా, ప్రజలు నిన్ను స్తుతించుదురు గాక, ప్రజలందరు నిన్ను స్తుతించుదురు గాక : న్యాయమునుబట్టి నీవు జనములకు తీర్పు తీర్చుదువు, భూమిమీదనున్న జనములను ఏలెదవు.

4. జనములు సంతోషించుచు : ఉత్సాహధ్వని చేయుదురు గాక.

5. దేవా, ప్రజలు నిన్ను స్తుతించుదురు గాక : ప్రజలందరు నిన్ను స్తుతించుదురు గాక.

6. అప్పుడు భూమి దాని ఫలములిచ్చును : దేవుడు, మా దేవుడు మమ్మును ఆశీర్వదించును.

7. దేవుడు మమ్మును దీవించును : భూదిగంత నివాసులందరును ఆయన యందు భయభక్తులు నిలుపుదురు.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

¶ అంతట సేవకుడును జనులును నిలుచుండి అపొస్తలుల విశ్వాససూత్రము పాడవలెను, లేదా చెప్పవలెను. అయినను, పరిశుద్ధ అథనాసి విశ్వాస సూత్రము చదువ నిర్ణయించిన దినములయందు దీనిని విడిచిపెట్టి ఆ విశ్వాససూత్రమునైనను దాని భాగమునైనను వాడవచ్చును.

పరలోక భూలోకముల సృష్టికర్తయగు సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన అద్వితీయ కుమారుడును, మన ప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన కన్యయగు మరియ గర్భమున ధరింపబడి ఆమెకు పుట్టెను. పొంతి పిలాతు అధికారముక్రింద బాధపడి, సిలువవేయబడి, చనిపోయి, పాతిపెట్టబడి, అదృశ్యలోకములోనికి దిగెను. మూడవ దినమున చనిపోయినవారిలోనుండి తిరిగి లేచి, పరలోకమునకెక్కి, సర్వశక్తిగల తండ్రియైన దేవుని కుడిచేతివైపున కూర్చుండియున్నాడు. సజీవులకును మృతులకును తీర్పుచేయుటకు అక్కడనుండి ఆయన వచ్చునని నమ్ముచున్నాను.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ సార్వత్రిక సంఘమును పరిశుద్ధుల సహవాసమును, పాపక్షమాపణను, శరీర పునరుత్థానమును, నిత్యజీవమును నమ్ముచున్నాను. ఆమేన్.

¶ అటుతరువాత అందరును భక్తితో మోకాళ్లూని యుండగా ఈ దిగువవచ్చెడి ప్రార్థనలు చెప్పవలెను. అంతకుముందు సేవకుడు బిగ్గరగా చెప్పవలసినదేమనిన:

ప్రభువు మీకు తోడై యుండునుగాక.

ఉ.—నీ ఆత్మకును తోడై యుండునుగాక.



సేవకుడు.—ప్రార్థించుదము.

ప్రభువా మమ్మును కనికరింపుము.

క్రీస్తూ మమ్మును కనికరింపుము.

ప్రభువా మమ్మును కనికరింపుము.

¶ అంతట సేవకుడును, గురువులును, జనులును బిగ్గరగా ప్రభుప్రార్థన చెప్పవలెను.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములు చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. ఆమేన్.

¶ అంతట సేవకుడు లేచి నిలుచుండి చెప్పవలెను.

ప్రభువా, నీ కృప మాకు కనుపరచుము.

ఉ.—నీ రక్షణ మాకు దయచేయుము.

సే.—ప్రభువా, చక్రవర్తిని రక్షింపుము.

ఉ.—మేము నిన్ను ప్రార్థించునప్పుడు కరుణతో ఆలకింపుము.

సే.—నీ సేవకులకు నీతిని ధరింపచేయుము.

ఉ.—నీవు ఏర్పరచుకొన్న జనులను సంతోషపరచుము.

సే.—ప్రభువా, నీ జనులను రక్షింపుము.

ఉ.—నీ స్వాస్థ్యమును దీవింపుము.

సే.—ప్రభువా, మా కాలమందు సమాధానము దయచేయుము.

ఉ.—దేవా, నీవే తప్ప భూలోకమును ఏలువాడు మరి ఎవడును లేడు.

సే.—దేవా, మా హృదయములను పవిత్రపరచుము.

ఉ.—నీ పరిశుద్ధాత్మను మాలోనుండి తీసికొనకుము.

¶ అంతట ఈ దిగువవచ్చెడి క్రమముచొప్పున మూడు సంగ్రహప్రార్థనలు చదువవలెను. మొదటిది సమభోక్తృక్రమమందు ఆ దినమునకు ఏర్పర్చబడిన సంగ్రహ ప్రార్థన; రెండవది, సమాధానముకొరకైనది; మూడవది, కాపుదలకొరకైనది. ఈ చివరి రెండు సంగ్రహప్రార్థనలు ప్రతిదినమును సాయంప్రార్థనలో తప్పకుండా రావలెను. గాని ఆ దినసంగ్రహప్రార్థనకు తరువాత, ఏర్పర్చబడిన ఇతర ప్రార్థనలు సమయోచితముగా చదువవచ్చును.

## సమాధానముకొరకైన సంగ్రహప్రార్థన

దేవా, పరిశుద్ధమైన కోరికలన్నియు మంచి ఆలోచనలన్నియు సత్క్రియలన్నియు నీవల్ల కలుగునుగదా. మేము నీ ఆజ్ఞలకు లోబడుటకు సిద్ధమనస్సు గలవారమై, శత్రుభయము లేకుండ నీచేత కాపాడబడి, నెమ్మదిగాను నిర్భయముగాను జీవించునట్లు, మా రక్షకుడైన యేసుక్రీస్తు పుణ్యమునుబట్టి, లోకము ఇయ్యజాలని సమాధానము నీ సేవకులమైన మాకు దయచేయుము. ఆమేన్.

## కాపుదలకొరకైన సంగ్రహప్రార్థన

ప్రభువా, మా చీకటి తొలగునట్లు వెలుగిచ్చి, నేటిరాత్రి మాకు ఏ ఉపద్రవములును ఆపదలును సంభవించకుండ నీ మహా కరుణచేత మమ్మును కాపాడుమని, నీ అద్వితీయ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తు ప్రేమనుబట్టి నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ గాయకులున్న దేవాలయములలోను పాడెడి యితర స్థలములలోను ఇక్కడ ఒక గానము వచ్చును.

¶ మూడవ సంగ్రహ ప్రార్థనకు తరువాత సేవకుడు తనకు తోచినట్టు ఆయా సమయములందు వాడతగిన ప్రార్థనలలోను కృతజ్ఞతాస్తుతులలోను ఒకటిగాని ఎక్కువగాని చెప్పవచ్చును. మరియు బిషపువల్ల నియమింపబడిన ఇతర ప్రార్థనలను ఇక్కడ చెప్పవచ్చును. ఎట్లయినను కృసస్తము ప్రార్థనయు కృపావచనమును చెప్పి ముగించవలెను.

## పరిశుద్ధుడైన కృసస్తముయొక్క ప్రార్థన

సర్వశక్తిగల దేవా, ఈ సమయమందు మేము ఏకమనస్సుతో నిన్ను గురించి మా సామాన్య ప్రార్థనలుచేయుటకు మాకు కృప దయచేసినావు గనుకను, ఇద్దరు ముగ్గురు నాపేరట కూడినప్పుడు వారి విన్నపముల ప్రకారము దయచేయుదునని మాట యిచ్చినావు గనుకను, ఓ ప్రభువా, నీ సేవకులమైన మా కోరికలను విన్నపములను మాకు తగినట్టు ఇప్పుడు నెరవేర్చి, ఇహమందు నీ సత్యము తెలిసికొను జ్ఞానమును పరమందు నిత్యజీవమును మాకు దయచేయుము. ఆమేన్.

2 కొరింథీ 13.

మన ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మనకందరికిని ఎల్లప్పుడును తోడైయుండును గాక. ఆమేన్.

# THE ATHANASIAN CREED

# అథనాసి విశ్వాససూత్రము

¶ త్రిత్వపు ఆదివారమునను, క్రిస్మస్ తరువాత మొదటి ఆదివారమునను, కన్యమరియకు శుభవర్తమానము వచ్చిన దినమునను ఈ విశ్వాససూత్రము పాడవచ్చును, లేదా చెప్పవచ్చును. లేదా, త్రిత్వపు ఆదివారమున 3-వ వచనమునుండి 28-వ వచనమువరకు పాడి, లేక చెప్పి, త్రిత్వస్తుతితో ముగించవచ్చును. మరియు, క్రిస్మస్ తరువాత ఆదివారమునను శుభవర్తమాన దినమునను, 30-వ వచనమునుండి 41-వ వచనమువరకు పాడి, లేక చెప్పి, త్రిత్వస్తుతితో ముగించవచ్చును. మరియు, క్రీస్తు జననదినము, ప్రత్యక్షతదినము, పరి. మత్తీయదినము, పునరుత్థానదినము, ఆరోహణదినము, పరిశుద్ధాత్మ దినము, పరి. యోహాను బాప్తిస్టు, పరి. యాకోబు, పరి. బర్తలొమయి, పరి. మత్తయి, పరి. సీమోను యూదాలు, పరి. అంద్రెయదినములయందు ఈ విశ్వాససూత్రము పాడవచ్చును, లేక చెప్పవచ్చును. పై దినములయం దెప్పుడైనను సేవకుడుమాత్రమే దీనిని చదువవచ్చును. మరియు దీనిని వాడునప్పుడెల్ల 2-వ, 42-వ వచనములను విడిచివేయవచ్చును.

రక్షణ స్థితిలోనుండ గోరువాడు అన్నిటికంటె ముఖ్యముగా సార్వత్రిక ఉపదేశము గైకొనుట అవసరము.

2. ఈ ఉపదేశము పూర్తిగాను నిష్కళంకముగాను గైకొంటేనేగాని వాడు నిత్యనాశనమునకు లోనగును.

సార్వత్రిక ఉపదేశము ఏదనిన : మనము మూర్తులను కలుపక, తత్త్వమును భేదింపక,

4. ఏకదేవుని త్రిత్వముగాను : త్రిత్వమును ఏకత్వముగాను ఆరాధించుట.

5. ఏలాగనిన, తండ్రియను మూర్తి ఒకడు, కుమారుడను మూర్తి ఒకడు : పరిశుద్ధాత్మయను మూర్తి ఒకడు.

6. అయినను తండ్రియొక్క కుమారునియొక్క పరిశుద్ధాత్మయొక్క దేవత్వము ఒకటే : మహిమ సమానము, మాహాత్మ్యము సహనిత్యము.

7. తండ్రి యెట్టివాడో : కుమారుడును పరిశుద్ధాత్మయు అట్టివారే.

8. తండ్రి సృజింపబడనివాడు, కుమారుడు సృజింపబడనివాడు : పరిశుద్ధాత్మ సృజింపబడనివాడు.

9. తండ్రి అమితుడు, కుమారుడు అమితుడు : పరిశుద్ధాత్మ అమితుడు.

10. తండ్రి నిత్యుడు, కుమారుడు నిత్యుడు : పరిశుద్ధాత్మ నిత్యుడు.

11. అయినను, ముగ్గురు నిత్యులు లేరుగాని : నిత్యుడు ఒకడే.

12. ఆ చొప్పుననే, అమితులును, సృజింపబడని వారును ముగ్గురు లేరుగాని : సృజింపబడనివాడును అమితుడును ఒక్కడే.

13. ఆలాగే, తండ్రి సర్వశక్తుడు, కుమారుడు సర్వశక్తుడు : పరిశుద్ధాత్మ సర్వశక్తుడు.

14. అయినను, సర్వశక్తులు ముగ్గురు లేరుగాని : సర్వశక్తుడు ఒకడే.

15. ఆలాగే, తండ్రి దేవుడు, కుమారుడు దేవుడు : పరిశుద్ధాత్మ దేవుడు.

16. అయినను, ముగ్గురు దేవుండ్లు లేరుగాని : దేవుడు ఒకడే.

17. ఆలాగుననే, తండ్రి ప్రభువు, కుమారుడు ప్రభువు : పరిశుద్ధాత్మ ప్రభువు.

18. అయినను, ముగ్గురు ప్రభువులు లేరుగాని : ప్రభువు ఒకడే.

19. ఏలాగనిన, క్రైస్తవ మత సిద్ధాంత ప్రకారము : ఒక్కొక్క మూర్తి ప్రత్యేకముగా దేవుడనియు ప్రభువనియు ఏలాగు ఒప్పుకొనవలసినదో,

20. ఆలాగుననే సార్వత్రిక విశ్వాస ప్రకారము : ముగ్గురు దేవుండ్లయినను, ముగ్గురు ప్రభువులయినను ఉన్నారనుట నిషిద్ధము.

21. తండ్రి సృజింపబడనివాడు, జన్మింపచేయబడనివాడు : యెవనిచేతను చేయబడనివాడు.

22. కుమారుడు చేయబడనివాడు, సృజింపబడనివాడు : తండ్రినుండి కలిగి జన్మించినవాడే.

23. పరిశుద్ధాత్మ చేయబడనివాడు, జన్మింపచేయబడనివాడు : తండ్రినుండియు కుమారునినుండియు కలిగి బయలుదేరువాడే.

24. కాబట్టి, ముగ్గురు తండ్రులులేరు, ఒక్క తండ్రియే. ముగ్గురు కుమారులులేరు, ఒక్క కుమారుడే : ముగ్గురు పరిశుద్ధాత్మలులేరు, ఒక్క పరిశుద్ధాత్మయే.

25. మరియు, ఈ త్రిత్వములో ముందటివాడని వెనుకటివాడని లేదు : హెచ్చుతగ్గులును లేవు.



26. అయినను, ముగ్గురు మూర్తులు ఏకముగా సహ నిత్యులును : సహ సమానులునైయున్నారు.

27. అట్లుండుటవల్ల, పైని చెప్పిన విధములన్నిటిలో ఏకత్వమును త్రిత్వముగాను : త్రిత్వమును ఏకత్వముగాను ఆరాధింపవలెను.

28. కాబట్టి రక్షణస్థితిలో నుండగోరువాడు : త్రిత్వమునుగురించి ఈ చొప్పున తలంచుకొనునుగాక.

మరియు, మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క మనుష్యావతారమును గురించికూడ హృదయపూర్వకముగా నమ్ముట : నిత్యరక్షణకు అవసరమైయున్నది.

30. మనము నమ్మి ఒప్పుకొనవలసిన నిజమైన ఉపదేశ మేమనిన : దేవుని కుమారుడును మన ప్రభువునైన యేసుక్రీస్తు దేవుడును మనుష్యుడునైయున్నాడు.

31. లోకములకన్న ముందు జన్మింపచేయబడి, తండ్రి తత్వములోనుండి కలిగిన దేవుడును : లోకములో పుట్టి, తల్లి తత్వములోనుండి కలిగిన మనుష్యుడునైయున్నాడు.

32. సంపూర్ణ దేవుడును : జ్ఞానాత్మయు మనుష్య శరీరమునుగల సంపూర్ణ మనుష్యుడునైయున్నాడు.

33. దేవత్వవిషయమై తండ్రితో సమానుడు : మనుషత్వవిషయమై తండ్రికంటె తక్కువవాడు.

34. ఆయన దేవుడును మనుష్యుడు నైనప్పటికి : ఇద్దరు కారు, గాని ఒక్క క్రీస్తే.

35. దేవత్వము శరీరముగా మారిపోవుటవల్ల కాక : దేవునిలోనికి మనుషత్వమును స్వీకరించుటవల్లనే ఒక్కడయియున్నాడు.

36. తత్వములు కలిసి పోవుటవల్లకాక : ఏకమూర్తి యగుటవల్లనే కేవలము ఒక్కడైయున్నాడు.

37. ఏలాగనిన, జ్ఞానాత్మయు శరీరమును ఒక్క మనుష్యుడైనట్లు : దేవుడును మనుష్యుడును ఒక్క క్రీస్తయియున్నాడు.

38. ఆయన మన రక్షణకొరకు బాధపడి : అదృశ్యలోకములోనికి దిగి, చనిపోయినవారిలోనుండి మూడవ నాడు తిరిగి లేచెను.

**39.** ఆయన పరలోకమునకెక్కి సర్వశక్తిగల తండ్రియైన దేవుని కుడిచేతి వైపున కూర్చుండియున్నాడు : ఆయన అక్కడనుండి బ్రతికియున్నవారిని చనిపోయినవారిని విమర్శించుటకు వచ్చును.

**40.** ఆయన వచ్చునప్పుడు మనుష్యులందరును తమ తమ శరీరములతో తిరిగి లేచి : తమ క్రియలనుగురించి లెక్క యొప్పగింతురు.

**41.** సత్క్రియలు చేసినవారు నిత్యజీవములోనికి : దుష్క్రియలు చేసినవారు నిత్యాగ్నిలోనికి వెళ్లుదురు.

**సా**ర్వత్రిక ఉపదేశము ఇదే : దీనిని హృదయపూర్వకముగను స్థిరముగను నమ్మితేనేగాని, యెవడును రక్షణస్థితిలో నుండలేడు.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకును కలుగునుగాక. ఆమేన్.

---

# THE LITANY

# లిటని

## (సామాన్య విజ్ఞాపన)

¶ ఆది, బుధ, శుక్రవారములయందును, సేవకునికి ఇష్టమైన మరి యేదినమందైనను ఉదయప్రార్థనకు తరువాత లిటని యను ఈ సామాన్య విజ్ఞాపనను వాడవచ్చును. దీనిని పాడవచ్చును, లేదా చెప్పవచ్చును. రొగేషన్ దినములందును, బిషపు నియమించు ఇతర సమయములందును దీని ఉపయోగింపవలెను. ప్రారంభ వాక్యములకు పిదప సేవకుడు తన యిష్టము చొప్పున తన కనుకూలమని తోచిన కొన్ని విజ్ఞాపన వాక్యములను ప్రతి భాగమునుండియు ఏర్పర్చుకొని చెప్పవచ్చును. ఎట్లయినను, 'దేవుని కుమారుడా ఆలకింపుమని వేడుకొనుచున్నాము'—మొదలైన మాటలతో అన్నిటిని ముగింపవలెను.

**ప**రలోకమందుండు తండ్రివైన దేవా, పాపపీడితులమైన మమ్మును కరుణింపుము.

పరలోకమందుండు తండ్రివైన దేవా, పాపపీడితులమైన మమ్మును కరుణింపుము.

లోకమును విడిపించు కుమారుడవైన దేవా, పాపపీడితులమైన మమ్మును కరుణింపుము.

లోకమును విడిపించు కుమారుడవైన దేవా, పాపపీడితులమైన మమ్మును కరుణింపుము.

తండ్రినుండియు కుమారునినుండియు బయలుదేరెడి పరిశుద్ధాత్మవైన దేవా, పాపపీడితులమైన మమ్మును కరుణింపుము.

తండ్రినుండియు కుమారునినుండియు బయలుదేరెడి పరిశుద్ధాత్మవైన దేవా, పాపపీడితులమైన మమ్మును కరుణింపుము.

స్తోత్రార్హుడవును మహిమ పూర్ణుడవునైన పరిశుద్ధ త్రిత్వమా, ముగ్గురైయుండు ఏకదేవా, పాపపీడితులమైన మమ్మును కరుణింపుము.

స్తోత్రార్హుడవును మహిమ పూర్ణుడవునైన పరిశుద్ధ త్రిత్వమా, ముగ్గురైయుండు ఏకదేవా, పాపపీడితులమైన మమ్మును కరుణింపుము.

**ప్ర**భువా, మా యపరాధములేమి మా పూర్వుల యపరాధములేమి జ్ఞాపకము చేసికొనకుము. మా పాపములకు ప్రతీకారము చేయకుము. కృపగల

ప్రభువా, నీ యమూల్య రక్తమిచ్చి నీవు విడిపించిన నీ జనులను కాయుము. మామీద ఎల్లప్పుడును కోపముంచక మమ్మును కాయుము.

కృపగల ప్రభువా, మమ్మును కాయుము.

కీడు, మోసములన్నిటినుండియు; పాపమునుండియు; సాతానుయొక్క ప్రయత్నములనుండియు; నీ కోపమునుండియు, నిత్యమైన దండననుండియు;

కృపగల ప్రభువా, మమ్మును తప్పింపుము.

సమస్త హృదయాంధత్వమునుండియు; గర్వము, డంబము, కపటము వీటినుండియు; ఓర్వలేనితనము, ద్వేషము, అసూయ వీటినుండియు; ప్రేమలేని గుణము లన్నిటినుండియు;

కృపగల ప్రభువా, మమ్మును తప్పింపుము.

జారత్వము మొదలగు మరణకరమైన పాపములనుండియు; లోకమువల్లను శరీరమువల్లను సాతానువల్లను కలుగు మోసము లన్నిటినుండియు;

కృపగల ప్రభువా, మమ్మును తప్పింపుము.

గాలివాన మెరపులనుండియు; ఈతిబాధ, తెగులు, కరువు వీటినుండియు; యుద్ధమునుండియు హత్యలనుండియు, ఆకస్మిక మరణమునుండియు;

కృపగల ప్రభువా, మమ్మును తప్పింపుము.

సకల ద్రోహకూటములు, కుట్రాలోచనలు, తిరుగుబాటులు వీటినుండియు; తప్పుబోధ, విమతము, పక్షభేదము వీటినుండియు; హృదయ కాఠిన్యమునుండియు, నీ వాక్యవిధులయందలి అలక్ష్యమునుండియు;

కృపగల ప్రభువా, మమ్మును తప్పింపుము.

నీ పరిశుద్ధ అవతార మర్మమునుబట్టియు, నీ పరిశుద్ధ జననమునుబట్టియు, సున్నతినిబట్టియు, నీ బాప్తిస్మము ఉపవాసము శోధనలనుబట్టియు;

కృపగల ప్రభువా, మమ్మును తప్పింపుము.

నీ వేదననుబట్టియు, రక్తపుచెమటనుబట్టియు, నీ సిలువ శ్రమలనుబట్టియు, నీ అమూల్య మరణ భూస్థాపనలనుబట్టియు, మహిమగల నీ పునరుత్థానమునుబట్టియు, ఆరోహణమునుబట్టియు, పరిశుద్ధాత్మ రాకనుబట్టియు;

కృపగల ప్రభువా, మమ్మును తప్పింపుము.

సుఖదుఃఖములయందెల్లను, మరణకాలమందును, న్యాయవిమర్శ దినమందును;

కృపగల ప్రభువా, మమ్మును తప్పింపుము.



ప్రభువైన దేవా, పాపులమైన మా ప్రార్థన ఆలకింపుమని నిన్ను వేడుకొనుచున్నాము. మరియు, సార్వత్రికమైన నీ పరిశుద్ధ సంఘమును ఏలి సన్మార్గములో నడిపింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

మహా దయగల అధికారియు నీ సేవకుడునైన జార్జియను మా చక్రవర్తిని నీయందలి నిజమైన భక్తిలోను, న్యాయపరిశుద్ధ ప్రవర్తనయందును కాపాడి బలపరచ దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

నీ యందలి విశ్వాసమందును భయప్రేమలయందును ఆయన హృదయమును నడిపించి, ఆయన యెల్లప్పుడు నిన్ను నమ్మి, అన్నిటిలో నీ కీర్తి మహిమలను ఆలోచించునట్లు దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

ఆయనకు నీవు రక్షకుడవును ప్రాపకుడవునై యుండి, సర్వశత్రువులను ఆయన జయింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

ఎలిజబెతు అను దయగల మా రాణిని, మేరీయను రాజమాతను, ఎలిజబెతు అను రాజకుమారిని, రాజకుటుంబమంతను దీవించి సంరక్షింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

బిషపులను ప్రీస్టులను డీకనులను వీరినందరిని నీ వాక్యమునుగూర్చిన నిజమైన జ్ఞానముతోను తెలివితోను ప్రకాశింపజేసి, వారు తమ బోధవల్లను నడతవల్లను ఆ వాక్యమును దృష్టాంతపరచి ప్రకటించునట్లు దయచేయుము.

మా ప్రార్థన అలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

ఎంబరు వారములలోను, పట్టాభిషేక దినమందును చెప్పవలెను.

[ఇప్పుడు డీకను (లేక, ప్రీస్టు) తరగతిలో చేర్చబడు (చేర్చబడబోవు) నీ సేవకులను దీవించి, వారు నీ సంఘక్షేమాభివృద్ధి కొరకును నీ పరిశుద్ధ నామ మహిమకొరకును తమ ఉద్యోగధర్మమును జరుపునట్లు నీ కృప వారిమీద కుమ్మరింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.]

నీ కోతకు పనివారిని పంపి, నీ సంఘపు పని భూలోకమందంతట వ్యాపింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

హిందూదేశ రాజప్రతినిధిని, ఆయా గవర్నరులను, వారి కౌన్సిలుల సభ్యులను ఆశీర్వదించి, వారు నీ రాజ్యాభివృద్ధికిని నీ నామ మహిమకును సమస్త కార్యములను జరిగించునట్లు కృప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

హిందూదేశమందలి సేనాధిపతిని, న్యాయాధిపతులను, స్వదేశ సంస్థానములలోని రెసిడెంట్లను, అధికారమందున్న వారినందరిని ఆశీర్వదించి, నీ దయాలోచనలతో వారిని నడిపింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

స్వదేశ సంస్థానముల నేలు అధిపతులను, వారి క్రింద అధికారము వహించియున్న వారినందరిని నీ సత్యముతో నడిపించి, నీ జ్ఞానముతో వారి మనస్సులను వెలిగింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

సముద్రముమీదను, నేలమీదను, వాయువునందును ఉన్న రాజ్య సేనలన్నిటిని దీవించి, సమస్త అపాయములలోను, కష్టములలోను, వాటిని కాపాడ దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

నీ జనులందరిని దీవించి కాపాడ దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

అన్ని దేశములవారికి, ఐక్యమును సమాధానమును అన్యోన్యతను దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

నీయెడల భయభక్తులు గలిగి, నీ ఆజ్ఞలప్రకారము జాగ్రత్తగా ప్రవర్తించుటకు మనస్సు మాకు దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

నీ జనులందరును నీ వాక్యము వినయముతో విని, శుద్ధ మనస్సుతో అంగీకరించి, ఆత్మ ఫలములు ఇచ్చునట్లు వారికి నీ కృపాభివృద్ధి దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

త్రోవ తప్పి మోసపోయినవారినెల్లను సత్యమార్గమునకు మళ్లింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.



నిలిచియుండువారిని బలపరచి, ధైర్యము లేనివారిని ఆదరించి వారికి సహాయముచేసి, పడిపోయినవారిని లేవనెత్తి, తుదకు సాతానును మా కాళ్ల క్రింద చితుకద్రొక్కునట్లు దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

అపాయము, ఇబ్బంది, శ్రమయు గలవారికెల్లను, రక్షణ సహాయము ఆదరణయు దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

మెట్టనుగాని, నీళ్లలోగాని, వాయువునందుగాని ప్రయాణముచేయువారిని, ప్రసవించు స్త్రీలను, రోగులను, పసిబిడ్డలను కాపాడి, ఖైదులోను చెరలోనుండు అందరిమీద నీ జాలి కనుపరచ దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

తల్లిదండ్రులులేని పిల్లలను, విధవలను, దిక్కులేనివారిని, నిర్బంధములోనున్న వారిని కాపాడి సంరక్షింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

మనుష్యులందరిని కరుణింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

మా శత్రువులను, హింసకులను, మామీద చాడీచెప్పెడివారిని క్షమించి, వారి హృదయములు మళ్లింప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

భూఫలములను ఆయాకాలములందు మేము అనుభవించునట్లు మా యుపయోగమునకై కాపాడ దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

మాకు నిజమైన పశ్చాత్తాపము కలుగజేసి, మా పాపములు అశ్రద్ధలు బుద్ధిహీనతలు అన్నియు క్షమించి, నీ పరిశుద్ధ వాక్యముచొప్పున మా నడత దిద్దుకొనుటకు నీ పరిశుద్ధాత్మయొక్క కృప దయచేయుము.

మా ప్రార్థన ఆలకింపుమని, కృపగల ప్రభువా, నిన్ను వేడుకొనుచున్నాము.

దేవుని కుమారుడా, ఆలకింపుమని నిన్ను వేడుకొనుచున్నాము.

దేవుని కుమారుడా, ఆలకింపుమని నిన్ను వేడుకొనుచున్నాము.

లోకపాపములు మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్లా,

నీ సమాధానము మాకు దయచేయుము.

లోకపాపములు మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లా,

మమ్మును కరుణింపుము.

క్రీస్తూ, ఆలకింపుము.

క్రీస్తూ, ఆలకింపుము.

ప్రభువా, మమ్మును కరుణింపుము.

ప్రభువా, మమ్మును కరుణింపుము.

క్రీస్తూ, మమ్మును కరుణింపుము.

క్రీస్తూ, మమ్మును కరుణింపుము.

ప్రభువా, మమ్మును కరుణింపుము.

ప్రభువా, మమ్మును కరుణింపుము.

¶ పరిశుద్ధ సమభాక్త్వము వెంటనే ఆచరింపవలసియున్నయెడల ఈ దిగువ వచ్చుదానినంతటిని విడిచిపెట్టవచ్చును.

¶ ఇతర సమయములందు సేవకునితో జనులు కలిసి ప్రభుప్రార్థన చెప్పవలెను.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధములు చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. ఆమేన్.

¶ అంతట దిగువవచ్చు విన్నపములను చెప్పవచ్చును; లేదా ఆయా సమయములకు తగిన విజ్ఞాపన ప్రార్థనలలోను కృతజ్ఞతాస్తుతులలోను కొన్నిటిని చెప్పవచ్చును. అటుపిమ్మట కృసస్తము ప్రార్థనయు కృపావచనమును చెప్పి ముగించవలెను.

## విన్నపము.

¶ దీనిని లిటనిలోని ప్రభుప్రార్థనకు తరువాతను, రోగేషన్ దినములలోను, పశ్చాత్తాప సమయములలోను, శ్రమల కాలమందును వాడవచ్చును.

సే.—ప్రభువా, మా పాపములచొప్పున మాయెడల జరిగింపకుము.

ఉ.—మా దోషములచొప్పున మాకు ప్రతీకారము చేయకుము.

## ప్రార్థించుదము.

**న**లిగిన మనస్సుయొక్క నిట్టూర్పును, దుఃఖితుల కోరికను ఉపేక్షింపని దేవా, కనికరముగల తండ్రీ, తొందరలును ఆపదలును మమ్మును బాధించునప్పు



డెల్ల నిన్నుగురించి మేము చేయు ప్రార్థనలు కనికరముతో అంగీకరింపుము. మరియు, నీ సేవకులమైన మేము ఏ హింసలచేతను పీడింపబడక, నీ పరిశుద్ధ సంఘములో ఎల్లప్పుడును నిన్ను స్తుతించులాగున, సాతానుగాని మనుష్యులుగాని కపటోపాయములవల్ల మాయెడల జరిగించు కీడులు వ్యర్థమై, నీ దయా సంకల్పముచేత నివారణమగునట్లు మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దయచేయుము.

**సేవకుడును జనులును కలిసి**: ప్రభువా, నీ నామముకొరకు నీవు లేచి, సహాయముచేసి మమ్మును రక్షింపుము.

**సే.**—దేవా, మా పూర్వులు తమ దినములయందేమి అంతకుమునుపేమి నీవు చేసిన వింతపనులు మాకు తెలియచెప్పగా చెవులార విన్నాము.

**సేవకుడును జనులును కలిసి**: ప్రభువా, నీ మహిమకొరకు నీవు లేచి, సహాయముచేసి మమ్మును రక్షింపుము.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును: మహిమ కలుగునుగాక.

ఆదియందును ఇప్పుడును ఎల్లప్పుడు నుండునట్లు: యుగయుగములకును కలుగునుగాక. ఆమేన్.

**సేవకుడును జనులును కలిసి**: ప్రభువా, నీ నామముకొరకు నీవు లేచి, సహాయముచేసి మమ్మును రక్షింపుము.

క్రీస్తుప్రభువా, మేము మా శత్రువులచేతులలో పడకుండ మమ్మును కాపాడుము.

మా కష్టములు దయతో చూడుము.

మా మనోవ్యసనములు జాలితో చిత్తగింపుము.

నీ జనుల పాపములు కరుణతో క్షమింపుము.

మా మనవులు చిత్తగించి కనికరముతో ఆలకింపుము.

దావీదు కుమారుడా, మమ్మును కనికరింపుము.

క్రీస్తు ప్రభువా, ఇప్పుడును ఎల్లప్పుడును దయతో మా మనవులు ఆలకింపుము.

క్రీస్తు ప్రభువా, దయతో ఆలకింపుము : ప్రభువైన క్రీస్తూ, దయతో ఆలకింపుము.

సే.—ప్రభువా, నీ కనికరము మాకు చూపుము.

**ఉ.**—మేము నిన్ను నమ్ముచున్నాము.

ప్రార్థించుదము.

తండ్రీ, మా బలహీనతలు చిత్తగించి, మేము న్యాయముగా పొందవలసిన కీడులన్నిటిని నీ నామమునకు మహిమ కలుగునట్లు తొలగింపుము. మరియు మా తొందరలన్నిటిలో మేము నీ కనికరము కేవలము నమ్మి, నీకు కీర్తి మహిమలు కలుగుటకు పరిశుద్ధ ప్రవర్తనగలవారమై ఎల్లప్పుడును నిన్ను సేవించునట్లు దయ చేయుమని, మా ఏక మధ్యవర్తియు పక్షవాదియునగు మా ప్రభువైన యేసు క్రీస్తుద్వారా వినయపూర్వకముగా వేడుకొనుచున్నాము. ఆమేన్.

## పరిశుద్ధుడైన క్రిసస్తముయొక్క ప్రార్థన

సర్వశక్తిగల దేవా, ఈ సమయమందు మేము ఏకమనస్సుతో నిన్ను గురించి మా సామాన్య ప్రార్థనలు చేయుటకు మాకు కృప దయచేసినావు గనుకను, ఇద్దరు ముగ్గురు నాపేరట కూడినప్పుడు వారి విన్నపముల ప్రకారము దయచేయుదునని మాట యిచ్చినావు గనుకను, ఓ ప్రభువా, నీ సేవకులమైన మా కోరికలను విన్నపములను మాకు తగినట్టు ఇప్పుడు నెరవేర్చి, ఇహమందు నీ సత్యము తెలిసికొను జ్ఞానమును పరమందు నిత్యజీవమును మాకు దయచేయుము. ఆమేన్.

2 కొరింథీ 13.

మన ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మనకందరికిని ఎల్లప్పుడును తోడైయుండునుగాక. ఆమేన్.

---

# OCCASIONAL PRAYERS AND THANKSGIVINGS

---

ఆయా సమయములయందు

వాడతగిన

# విజ్ఞాపన ప్రార్థనలు, కృతజ్ఞతాస్తుతులు

## విజ్ఞాపన ప్రార్థనలు

¶ సేవకునికి తోచినట్లు, ముఖ్యముగా మూడవ సంగ్రహప్రార్థన తర్వాతగాని, లిటనీ అంతమందుగాని, సమభాక్తవిందు ఆరాధనలో చెప్పబడినట్లుగాని, ఆయా కాలములయందు వాడతగిన ప్రార్థనలు.

¶ మొదటనున్న వచనములతోనైనను అవి లేకుండనైనను ప్రార్థనలను చెప్పవచ్చును. ఆయా విషయములకొరకు ప్రార్థింతము అని చెప్పినపిమ్మట నిశ్శబ్ద ప్రార్థన చేయవచ్చును.

1. చక్రవర్తికొరకును, ఆయన క్రిందనున్న అధికారులందరికొరకును
2. స్వదేశ సంస్థానాధిపతులకొరకు
3. గురువులకొరకును, జనులకొరకును
4. గురుపట్టము పొందబోవువారికొరకు
5. క్రైస్తవసేవకుల సంఖ్య వృద్ధికొరకు
6. సువార్త వ్యాపకముకొరకు
7. క్రైస్తవులందరి ఐక్యముకొరకు
8. అధ్యక్షమండలముగాని, పాస్ట్రేటుగాని ఖాళీగానున్నప్పుడు
9. ఆదివారమును పరిశుద్ధముగా నాచరించుటకొరకు
10. నిర్ధారణకు సిద్ధపడుచున్నవారికొరకు
11. సంఘాలోచన సభలకొరకు
12. పాఠశాలలకొరకు

13. ఆదివారపు బడులకొరకు
14. విశ్వ విద్యాలయములకొరకును ఇతర విద్యాశాలలకొరకును
15. ఎన్నికల సమయములయందు
16. లోకములో సమాధానముకొరకు
17. సముద్రముమీద ప్రయాణము చేయుచున్న వారికొరకు
18. పారిశ్రామిక సమాధానముకొరకు
19. రొగేషన్ దినములందు
20. అనుకూలమైన కాలమానముకొరకు
21. యుద్ధ సమయములందు
22. ప్రియముగాను, కరవుగాను ఉండు కాలములయందు
23. ఈతిబాధగాని, విషవ్యాధిగాని సంభవించినపుడు
24. రోగులకొరకును, బాధపడువారికొరకును
25. వైద్యశాలలకొరకు
26. ఆయా స్థితులలోనుండెడి మనుష్యులకొరకు
27. ఈ జీవము చాలించిన విశ్వాసుల జ్ఞాపకార్థము.

### 1. *For the King-Emperor and all in authority under him*

చక్రవర్తికొరకును, ఆయన క్రిందనున్న అధికారులందరికొరకును

**సే.**—నీ పరిశుద్ధ స్థలమునుండి వారికి సహాయముచేయుము.

**ఉ.**—వారిని యెప్పుడును కాపాడి బలపరచుము.

మహోన్నతుడవును మహా శక్తిమంతుడవును అధిపతుల కేకాధిపతివియు నైన ప్రభువా, మా పరలోకపు తండ్రీ, నీ సింహాసనమునుండి భూనివాసులందరిని చూచుచున్నావుగదా. మిక్కిలి దయగల అధిపుడగు జార్జియను మా దేశపు చక్రవర్తిమీదను, దయగల రాణియగు ఎలిజబెతు అను మా దేశపు చక్రవర్తినిమీదను, రాజమాతయగు మేరీమీదను, రాజకుమారిమీదను రాజకుటుంబమంతటిమీదను నీ కటాక్షము చూపుమని నిన్ను వేడుకొనుచున్నాము. [ముఖ్యముగా ఇప్పుడు కూడియున్న పార్లమెంటు మహాసభకొరకును వినయముతో నిన్ను వేడుకొనుచున్నాము.] ఇక్కడ మా హిందూదేశములో గవర్నరుజనరలు అను రాజప్రతినిధియును, గవర్నరులును, శాసనసభలును,



హైకోర్టు న్యాయాధిపతులును, మా చక్రవర్తిక్రింద అధికారము పొందియున్న వారందరును, నీ పరిశుద్ధ నామముయొక్క మహిమకును, నీ సంఘక్షేమమునకును, తమ సమస్త కార్యములను జ్ఞానముతోను నీతితోను కనికరముతోను జరిపించులాగున వారికి కృప దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

మేలు లన్నిటికి కర్తవైన సర్వశక్తిగల దేవా, జార్జి అను మా చక్రవర్తిని, ఆయన రాజ్యములలోని పార్లమెంటులను, శాసనసభలను, ఆయనక్రింద అధికారము పొందియున్న వారినందరిని దీవించుము. వారు, నీ నామ ఘనతకును నీ సంఘక్షేమమునకును నీ ప్రజల మేలుకొరకును, సర్వకార్యములను జ్ఞానముతోను నీతితోను సమాధానముతోను నడుపునట్లు మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దయచేయుమని వినయముతో నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

### 2. *For Indian States and their Rulers*

స్వదేశ సంస్థానాధిపతులకొరకు

**సే.**—దేవా రాజునకు నీ న్యాయవిధులను—

**ఉ.**—రాజకుమారునికి నీ నీతిని తెలియజేయుము.

సర్వశక్తిగల దేవా, రాజులకొరకును అధికారులందరికొరకును ప్రార్థన చేయవలసినదని నీ పరిశుద్ధ వాక్యమునందు మాకు ఆజ్ఞాపించితివి గదా. ఈ దేశములోని స్వదేశసంస్థానముల నేలువారిని, వారి అధికారము క్రిందనున్న ఉద్యోగులందరిని కృపతో జూడుము. వారికి దైవజ్ఞానమును వెలుగును అనుగ్రహించి, వారు జరిగించు రాచకార్యములన్నియు నీకు మహిమకలుగునట్లును, వారి యధీనమందున్న ప్రజలకు క్షేమము కలుగునట్లును జరుపబడులాగున దయచేయుమని, మా యొక్కడే మధ్యవర్తియు పక్షవాదియునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

### 3. *For the Clergy and People*

గురువులకొరకును జనులకొరకును

**సే.**—నీ యాజకులు నీతిని వస్త్రమువలె ధరించుకొందురుగాక.

**ఉ.**—నీ భక్తులు ఉత్సాహగానము చేయుదురుగాక.

గొప్ప వింతలకు ఏక కారకుడవైన సర్వశక్తిగల నిత్యదేవా, మా బిషపుల మీదికిని, సంఘ గురువులమీదికిని, ఇతర సేవకులమీదికిని, వారికి అప్పగించబడిన సంఘములమీదికిని కృపగల నీ క్షేమకరమైన ఆత్మను పంపి, వారు వాస్తవముగా నిన్ను సంతోషపరచులాగున నీ ఆశీర్వాదమను మంచు వారిమీద ఎడతెగక కురిపింపుము. ఓ ప్రభువా, మా పక్షవాదియు, మధ్యవర్తియునైన యేసుక్రీస్తు ఘనతకొరకు దీనిని దయచేయుము. ఆమేన్.

## 4. *For Ember Days*

¶ ఎంబరు వారములలో ప్రతిదినము చెప్పవలెను.

గురుపట్టము పొందబోవు వారికొరకు

సే.—నీ యాజకులు నీతిని వస్త్రమువలె ధరించుకొందురుగాక.

ఉ.—నీ భక్తులు ఉత్సాహగానము చేయుదురుగాక.

సర్వశక్తిగల దేవా, నీ ప్రియకుమారుని అమూల్యమైన రక్తమిచ్చి నీకొరకు సార్వత్రికసంఘమును కొంటివి గదా. దానిని కటాక్షించి, బిషపులు, కాపరులు అను నీ మందయొక్క సేవకులు, తగిన విచారణలేనిది ఎవనిమీదను హస్తనిక్షేపణముచేయక, నీ సంఘముయొక్క పరిశుద్ధ సేవచేయతగినవారిని నమ్మకముతోను వివేకముతోను ఏర్పరచునట్లు ఈ సమయమున వారి మనస్సులను ప్రేరేపించి ఏలుము. పరిశుద్ధమైన ఏ ఉద్యోగమునకైనను నియమింపబడువారు తమ నడతవల్లను, ఉపదేశమువల్లను, నీ మహిమను కనుపరచి, మనుష్యులందరికి రక్షణ కలుగచేయునట్లు నీ కృపయు దివ్యమైన దీవెనయు వారికి దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

సర్వశక్తిగల దేవా, మంచి వరములన్నిటికిని దాతా, నీ దివ్య సంకల్పమువల్ల నీ సంఘములో వెవ్వేరు గురుతరగతులను ఏర్పరచితివి గదా. అందులో ఏ యుద్యోగమునకైనను పిలువబడినవారికందరికిని నీ కృప దయచేయుము. మరియు, నీ ఘనమైన నామమునకు మహిమయు, నీ పరిశుద్ధ సంఘమునకు మేలును కలుగునట్లు, వారు నీ యెదుట నమ్మకముగా సేవించుటకు నీ సత్యోపదేశముతో వారిని నింపి, వారు నిర్దోషప్రవర్తనగలవారగునట్లు దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

షరా:—ఎంబరు వారములలో ఆ దినపు సంగ్రహప్రార్థన తరువాత వీనిలో ఏదైనను చదువవచ్చును. రెండవదానిని పట్టాభిషేకదినమందు వాడవచ్చును.



## 5. *For the increase of the Sacred Ministry*

క్రైస్తవసేవకుల సంఖ్య వృద్ధికొరకు

సే.—కోతకు పనివారిని పంపుమని—

ఉ.—కోత యజమానుని వేడుకొనుడి.

సర్వశక్తిగల దేవా, నీ ప్రియకుమారుని రక్తముచేత నీవు విమోచించిన లోకమును కనికరముతో చూచి, నీ సంఘముయొక్క పరిశుద్ధ సేవకు తమ్మును తాము సమర్పించుకొనుటకు అనేకుల హృదయములను ప్రేరేపింపుము. వారి ప్రయాసమువల్ల నీ వెలుగు చీకటిలో ప్రకాశించునట్లును, నీవు ఏర్పరచుకొన్నవారు పరిపూర్ణులగుటవల్ల నీ రాజ్యము త్వరగా వచ్చునట్లును అనుగ్రహింపుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారానే నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## 6. *For the spread of the Gospel*

¶ ప్రతి ఆదివారము ఈ ప్రార్థనలో ఒకటి వాడుట యుక్తము.

సువార్త వ్యాపకముకొరకు

సే.—అన్యజనులలో ఆయన మహిమను ప్రచురించుడి.

ఉ.—సమస్త జనములలో ఆయన ఆశ్చర్యకార్యములను ప్రచురించుడి.

భూలోకమందలి సమస్త జనములకు దేవా, అన్యజనుల సమూహములను జ్ఞాపకము చేసికొనుము. వారు నీ స్వరూపమందు సృజింపబడియుండినను నీ ప్రేమను ఎరుగకయున్నారు. నీ కుమారుడైన యేసుక్రీస్తు ప్రాయశ్చిత్తమునుబట్టి, నీ పరిశుద్ధ సంఘముయొక్క ప్రార్థనలవల్లను ప్రయాసములవల్లను వారు సమస్త మూఢభక్తి అవిశ్వాసములను విడిచి, నిన్ను పూజించుటకు నడిపింపబడునట్లు అనుగ్రహింపుము. వీటిని దయచేయుమని మా రక్షణకు కర్తయును, విశ్వాసులందరికి పునరుత్థానమును జీవమునైయున్న నీ కుమారుడును మా ప్రభువునైన ఆ యేసుక్రీస్తుద్వారానే వేడుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

సే.—సువార్త ప్రకటించుచు సమాధానము చాటించువారి పాదములు—

ఉ.—ఎంతో సుందరములై యున్నవి.

దేవా, పరలోకపు తండ్రీ, నీ జనితైక కుమారుని ఈ లోకమునకు పంపి, ఆయనద్వారా అందరును జీవించునట్లు నీ ప్రేమను ప్రత్యక్షపరచితివి గదా.

సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడని ఆయన ఇచ్చిన ఆజ్ఞను నీ సంఘము నెరవేర్చునట్లు దానిమీద నీ యాత్మను కుమ్మరింపుము. నీ కోతకు పనివారిని పంపించుము. సకల ఆపదలనుండియు శోధనలనుండియు వారిని కాపాడుము. అన్యజనులందరు నీ రాజ్యములో చేర్చబడు తరుణమును, నీ జనులైన ఇశ్రాయేలీయులందరు రక్షింపబడు కాలమును త్వరగా రప్పింపుమని, నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

సే.—నన్ను అడుగుము, జనములను నీకు స్వాస్థ్యముగా నిచ్చెదను.

ఉ.—భూమిని దిగంతములవరకు సొత్తుగా నిచ్చెదను.

దేవా, భూమిమీద నివసించుటకు సమస్త మానవజాతులను ఏకరక్తముతో సృజియించి, దూరముననున్న వారికిని సమీపముననున్న వారికిని సమాధానమును ప్రకటించుటకై శ్రీమంతుడగు నీ కుమారుని పంపితివిగదా. ఇండియా, బర్మా, సింహళములోని ప్రజలందరు నిన్ను వెదకి తెలిసికొనులాగు ననుగ్రహించి, సమస్త మానవులమీద నా ఆత్మను కుమ్మరింతునని నీవు చేసిన వాగ్దానమును శీఘ్రముగా నెరవేర్చుమని, పరలోకమందుండు మా తండ్రీ, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## *7. For Unity*

క్రైస్తవులందరి ఐక్యముకొరకు

సే.—సహోదరులు ఐక్యము కలిగియుండుట—

ఉ.—ఎంత మేలు, ఎంత మనోహరము.

ప్రభువైన యేసుక్రీస్తూ, సమాధానము మీకు అనుగ్రహించి వెళ్లుచున్నాను, నా సమాధానమే మీకు అనుగ్రహించుచున్నాను అని, నీ అపొస్తలులకు వాగ్దానము చేసితివిగదా. మా పాపములను చూడక, నీ సంఘముయొక్క విశ్వాసమునుమాత్రమే చూచి, నీ చిత్తమునకు అనుగుణ్యమైన సమాధానమును ఐక్యమును దానికి అనుగ్రహింపుమని, తండ్రితోను పరిశుద్ధాత్మతోను ఏకదేవుడవుగా యుగయుగములకు జీవించి ఏలుచుండెడి నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

ఏక రక్షకుడును సమాధానకర్తయునగు మా ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రివైన దేవా, మా పక్షభేదములవల్ల కలుగు కష్టనష్టములనుగూర్చి జాగ్రత్తగా



తలపోసికొనుటకు మాకు కృప దయచేయుము. సకల ద్వేషమును పక్షపాతబుద్ధిని, భక్తిసహితమైన ఐకమత్యమునకును సమాధానమునకును ఆటంకముగానున్న సమస్తమును, మాలోనుండి తీసివేయుము. ఏక శరీరమును, ఏక ఆత్మయు, మా పిలుపు విషయమై ఏక నిరీక్షణయు, ఏక ప్రభువును, ఏక విశ్వాసమును, ఏక బాప్తిస్మమును, మాకందరికి తండ్రియైన ఏక దేవుడునుగల మేము, ఇకమీదట ఏక మనస్సును ఏకాత్మయుగలవారమై, సత్యము నెమ్మది విశ్వాసము ప్రేమయను పరిశుద్ధమైన ఏకానుబంధముచేత ఐక్యపరచబడినవారమై, ఏక మనస్కులమై, ఏక కంఠముతో నిన్ను మహిమపరచులాగున మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా అనుగ్రహింపుము. ఆమేన్.

## *8. During a Vacancy*

అధ్యక్షమండలముగాని పాస్టరేటుగాని ఖాళీగానున్నప్పుడు

సే.—నీ సేవకులకు నీతిని ధరింపజేయుము.

ఉ.—నీవు ఏర్పరచుకొన్న జనులను సంతోషపరచుము.

సర్వశక్తిగల దేవా, మంచి వరములన్నిటికిని దాతా, నీ సంఘమును కరుణతో దృష్టించి, ఈ అధ్యక్షఖండమునకు (లేక పాస్టరేటునకు) బిషపును (లేక పాస్టరును) ఏర్పరచువారిని నీ దివ్య జ్ఞానముతో నడిపించుమని నిన్ను వేడుకొనుచున్నాము. నీ చిత్తానుసారముగా మందను పోషించి, నీకు అంగీకృతమైన జనులను సిద్ధపరచగల నమ్మకమైన కాపరిని మాకు దయచేయుమని, నీ ఏక కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

## *9. For the Observance of Sunday*

ఆదివారము పరిశుద్ధముగా నాచరించుటకొరకు

సే.—ఇది ప్రభువు ఏర్పాటుచేసిన దినము.

ఉ.—దీనియందు మనము ఉత్సహించి సంతోషించెదము.

సర్వశక్తిగల దేవా, నీ ప్రజలకు విశ్రాంతిదినమును దయచేసి, నీ కుమారుని పునరుత్థానమునకు నిత్యజ్ఞాపకార్థముగానుండునట్లు ఆదివారమును ప్రతిష్ఠించుటకు నీ యాత్మద్వారా నీ సంఘమును ప్రేరేపించితివిగదా. శరీరాత్మలయందు మేము బలపడి, మా జీవితకాలమంతయు నిన్ను నమ్మకముగా సేవించునట్లు నీవిచ్చిన ఈది నమను నీ యీవిని వాడననుగ్రహింపుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారానే నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## 10. *For Candidates for Confirmation*

నిర్ధారణకు సిద్ధపడువారికొరకు

సే.—దయగల నీ యాత్మ వారిని నడిపించుగాక.

ఉ.—నీతి మార్గములలో వర్ధిల్లుదురుగాక.

దేవా, ఆదరణకర్తయైన పరిశుద్ధాత్మ రాకకొరకు నీ కుమారుడైన యేసుక్రీస్తు బోధవలన శిష్యులను సిద్ధపరచితివిగదా. హస్తనిక్షేపణముద్వారా పరిశుద్ధాత్మ వరమును ఇప్పుడు వెదకుచున్నవారి హృదయములను మనస్సులను సిద్ధపరచి, వారు పశ్చాత్తాపమును విశ్వాసమునుగల హృదయములతో సమీపించి, పరిశుద్ధాత్మ శక్తితో నింపబడునట్లు అనుగ్రహించుమని, మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారానే నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## 11. *For Councils of the Church*

సంఘ ఆలోచన సభలకొరకు

సే.—నీ సన్నిధి కాంతి నీ సేవకులమీద ప్రకాశింపజేయుము.

ఉ.—నీ కట్టడలను వారికి నేర్పుము.

ప్రభువా, జ్యోతిర్మయుడవగు తండ్రీ, సమస్త జ్ఞానమునకు మూలమైన దేవా, అపొస్తలుల కాలమందు యెరూషలేములో కూడిన నీ సంఘముయొక్క మొదటి ఆలోచన సభను నడిపించుటకు నీ పరిశుద్ధాత్మను పంపితివిగదా. మమ్మును కనికరముతో చూచి, ఇప్పుడు ఆలోచన సభలో కూడియున్న బిషపులను గురువులను దీవించి, వారి ఆలోచనలవలన నీ సంఘము నిజమైన విశ్వాసమందును, దైవభక్తి సహితమైన శిక్షయందును, కాపాడబడునట్లు దయచేయుమని మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తుద్వారా బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

సర్వశక్తికలిగి సదా జీవించు దేవా, జ్ఞానవివేకములు నీవల్ల కలుగునుగదా. నీ పరిశుద్ధ సంఘముయొక్క పోషణను గురించియు క్షేమాభివృద్ధిని గురించియు ఆలోచించుటకు కూడియున్న [కూడబోవు] నీ సేవకులకు తోడైయుండుమని, నిన్ను వినయముగా వేడుకొనుచున్నాము. వారు నీ ఘనతా మహిమలనే వెదకుచు, తమ యాలోచనలవల్ల యతిశ్రేష్ఠమైన మార్గమును కనుగొని, దానినే అనుసరించునట్లు వారికి కృపయు శక్తియు దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.



## 12. *For Schools*

పాఠశాలలకొరకు

సే.—ప్రభువునందు భయభక్తులు కలిగియుండుట జ్ఞానమునకు మూలము.

ఉ.—ఆలాగు నడుచుకొనువారందరు మంచి బుద్ధి కలిగియుందురు.

పరలోకపు తండ్రీ, శ్రీమంతుడగు నీ కుమారుడు, చిన్న పిల్లలను నా యొద్దకు రానియ్యుడని చెప్పెనుగదా. ఉపాధ్యాయులను విద్యార్థులను నీ దీవెనతో వర్ధిల్లచేయుము. నీ బిడ్డలయొక్క మనస్సులు విద్యవల్ల వెలిగింపబడుచున్నట్లు, నిన్నును నీ కుమారుడైన యేసుక్రీస్తును ప్రేమించుటకు వారి హృదయములుకూడ నీ పరిశుద్ధాత్మవలన దినదినమును ఆకర్షింపబడునట్లు దయచేయుమని బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

## 13. *For Sunday Schools*

ఆదివారపు బడులకొరకు

సే.—నేడు నేను నీ కాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో నుండవలెను.

ఉ.—నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపచేయవలెను.

సర్వశక్తిగల దేవా, మా పరలోకపు తండ్రీ, నీ బిడ్డలను పెంచి సంరక్షించెడి బాధ్యతను నీ పరిశుద్ధ సంఘమునకు అప్పగించితివి గదా. ఆదివారపు బడులలో నేర్చుకొనువారిని నేర్పువారిని నీ జ్ఞానముతో వెలిగింపుము. వారు నీ సత్యమునుగూర్చిన జ్ఞానమందు ఆనందించుచు తమ జీవితకాలమంతయు నిన్ను ఆరాధించి సేవించునట్లు దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## 14. *For Universities and Colleges*

విశ్వవిద్యాలయములకొరకును, ఇతర విద్యాశాలలకొరకును

సే.—ప్రభువునందలి భయము జ్ఞానమునకు మూలము.

ఉ.—దుష్టత్వమును విడుచుటయే వివేకము.

ప్రభువా, విశ్వవిద్యాలయములలోను, కళాశాలలలోను, పాఠశాలలలోను జరుగుచున్న పనిని నీ దీవెనతో వర్ధిల్లజేయుము. అందులోని విద్యార్థులను

ఉపాధ్యాయులును నీ పరిశుద్ధచిత్తము ననుసరించి నీ సత్యమునుగూర్చిన జ్ఞానము లోకి నడిపింపబడునట్లు దయచేయుము. వారి విద్యవలన సంఘమును దేశ మును క్షేమాభివృద్ధి నొందునట్లును, వారు నీ దివ్యచిత్తమునందు నడిపింపబడి నిత్య జీవమునకు పాత్రులగునట్లును అనుగ్రహించుమని, మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

## 15. *For use at the time of an Election*

ఎన్నికల సమయములందు

సే.—నీ మార్గములన్నిటిలో ఆయన అధికారమును ఒప్పుకొనుము.

ఉ.—ఆయన నీ త్రోవలను సరాళముచేయును.

సమస్త జ్ఞానమునకును మూలమైన సర్వశక్తిగల దేవా, . . . . . . . . . సేవకు తగినవారిని ఎన్నుకొనుటకు పిలువబడినవారిని నడిపించి, వారు నీ మహిమను నీ జనుల క్షేమమును వెదకునట్లు చేయుము. మరియు, ఎన్నుకొనబడువారికి కావలసిన జ్ఞానమును నిజమైన దైవభక్తియు నీ కనికరమువల్ల దయచేయుమని మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు పేరట నిన్ను బ్రతిమాలుకొను చున్నాము. ఆమేన్.

## 16. *For the Peace of the World*

లోకములో సమాధానముకొరకు

సే.—ప్రభువు నిత్యము రాజుగా ఆసీనుడై యున్నాడు.

ఉ.—ప్రభువు తన ప్రజలకు సమాధానము ననుగ్రహించును.

సర్వశక్తిగల దేవా, సత్యమును సమాధానమును నీయొద్దనుండియే బయలు దేరుచున్నవి గదా. సమాధానమును నిజముగా ఆశించెడి బుద్ధిని మనుష్యు లందరిలోను ప్రజ్వలింపజేయుము. భూలోకమందలి ఆయా జనాంగముల ఆలోచనకర్తలకు నిర్మలమైన సమాధానబుద్ధిని అనుగ్రహించుము. భూలోక మంతయు నీ ప్రేమనుగూర్చిన జ్ఞానముతో నింపబడువరకు నీ రాజ్యమును నెమ్మదితో వర్ధిల్లజేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడు కొనుచున్నాము. ఆమేన్.



## 17. *For all Seafarers*

సముద్రముమీద ప్రయాణము చేయుచున్నవారికొరకు

సే.—ఓడలెక్కి సముద్రప్రయాణము చేయువారు—

ఉ.—సముద్రములో ఆయన చేయు అద్భుతములను చూతురు.

నిత్యుడవైన దేవా, మా ప్రభువా, ఆకాశమును విశాలపరచి సముద్రపు పొంగు నణచువాడవు నీవే గదా. ఓడలెక్కి సముద్రప్రయాణము చేయు వారిని, మహా జలములమీద సంచరించుచు వ్యాపారముచేయువారినందరిని దయతో కాపాడుము. వారిని శరీరాత్మలయందు సంరక్షించి, వారి యత్నము లను సఫలపరచుము. ఆపత్కాలమందు వారికి అండవైయుండి, వారు కోరిన రేవునకు వారిని క్షేమముగాచేర్చుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## 18. *For Industrial Peace*

పారిశ్రామిక సమాధానముకొరకు

సే.—ఒకనినొకడు ప్రేమించుట విషయములో తప్ప మరేమియు ఎవని కిని అచ్చియుండవద్దు.

ఉ.—ఎదుటివాని ప్రేమించువాడే ధర్మశాస్త్రము నెరవేర్చినవాడు.

మనుష్యులందరికిని తండ్రివైన దేవా, మా పరస్పర వ్యవహారములన్నిటిలో మేము సోదరభావమును అగుపరచునట్లు, ప్రేమ నీతి సత్యములతో మమ్మును ఆవేశింపచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొను చున్నాము. ఆమేన్.

లేదా యిది.

మనుష్యులందరు సోదరభావముతో మెలగుచు పనిచేయవలెనని యేర్పరచి యున్న దేవా, ఇప్పుడు కలహించుచున్న పారిశ్రామికులలో వేరుపడినవారి నుండి సమస్త కలహ స్వభావమును ద్వేషగుణమును తొలగించుము. వారు న్యాయమును సమభావమును వెదకి, తమ క్షేమము నిమిత్తమును దేశక్షేమము నిమిత్తమును సహోదర ఐక్యమునందు ఎప్పటికి బ్రతికి వర్ధిల్లునట్లు దయచేయు మని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వినయముతో వేడుకొను చున్నాము. ఆమేన్.

## 19. *On the Rogation Days*

### భూఫలాదులకొరకును మనుష్యుల పనిపాటలకొరకును

**సే.**—ప్రభువా, సమస్తమును నీ దయకొరకు కనిపెట్టుచున్నవి.

**ఉ.**—తగిన కాలమున నీవు వాటికి ఆహారమిచ్చెదవు.

సర్వశక్తిగల దేవా, భూమి ఫలవంతమై, మనుష్యుని జీవనమునకు కావలసినవన్నియు సమృద్ధిగా ఫలింపవలెనని భూమిని ఆశీర్వదించితివి గదా. వ్యవసాయకుల ప్రయాసములను దీవించి, మేము భూఫలాదులు సమకూర్చుకొని, నీ పరిశుద్ధనామ మహిమార్థమై ఎల్లప్పుడును నీ కనికరమునందు సంతోషించునట్లు అనుకూలమైన కాలమానమును దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

సర్వశక్తిగల తండ్రీ, మానవజాతియొక్క క్షేమముకొరకు నీ కుమారుడైన యేసుక్రీస్తుద్వారా చేతిపనిని పరిశుద్ధపరచితివిగదా. ఈ దేశముయొక్క పారిశ్రామికవృత్తులను, వాటిని పూనుకొనువారిని వర్ధిల్లజేయుము. శోధనలనుండియు ఆపదలనుండియు వారు కాపాడబడి, తమ ప్రయాసములకు తగిన ప్రతిఫలముపొంది, నీ చిత్తానుసారముగా జీవించుటవల్ల నిన్ను స్తుతించునట్లు అనుగ్రహించునుని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## 20. *For Seasonable Weather*

### అనుకూలమైన కాలమానముకొరకు

**సే.**—తనయందు భయభక్తులుగలవారి కోరిక ప్రభువు నెరవేర్చును.

**ఉ.**—వారి మొరలాలకించి వారిని రక్షించును.

దేవా, పరలోకపు తండ్రీ, నీ రాజ్యమును దాని నీతిని వెదకువారందరికిని శరీరపోషణకు కావలసినవన్నిటిని అనుగ్రహింతునని నీ కుమారుడైన యేసుక్రీస్తుద్వారా మాట ఇచ్చితివిగదా. మా ఆదరణకును నీ ఘనతకును భూఫలములు మేము అనుభవించునట్లు, అనుకూలమైన కాలమానము దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.



## 21. *In the Time of War*

### యుద్ధసమయములందు

మా దేవా, మా చక్రవర్తిగారిని, ఆయనక్రింద అధికారము వహించియున్నవారిని దీవించి కాపాడుమని నిన్ను వేడుకొనుచున్నాము. అపాయకరమైన సందర్భములలో సమయోచితమైన తీర్మానములను చేయుటకు వారికి జ్ఞానము అనుగ్రహించుము. దుర్నీతి కృత్యములనుచేయకుండ వారిని తప్పించుము. నీతితోకూడినట్టియు స్థిరమైనట్టియునైన సమాధానమును స్థాపించుటకు వారి హస్తములను బలపరచుము. దీనిని మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

## 22. *In the time of Dearth and Famine*

### ప్రియముగాను, కరవుగాను ఉండు కాలములయందు

**సే.**—నీ భారము ప్రభువుమీద మోపుము—

**ఉ.**—ఆయనే నిన్ను ఆదుకొనును.

దేవా, పరలోకపు తండ్రీ, మా అనుదినాహారమునిమిత్తము నిన్ను అడుగుమని శ్రీమంతుడగు నీ కుమారునిద్వారా మాకు నేర్పితివిగదా. నీ జనుల కష్టములను చూచి, మా అవసరమునకు తగిన సహాయము పొందులాగున అనుకూలమైన కాలమానమును పంపుము. నీ దివ్యమైన దీవెనవల్ల భూఫలములను వృద్ధిపొందింపుము. విశేషమైన నీ ఔదార్యము పొందిన మేము నీ మహిమకొరకును, ఇబ్బందిపడువారి సహాయముకొరకును, మా స్వకీయ ఆదరణకొరకును వాటిని వాడుకొనులాగు మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా అనుగ్రహింపుము. ఆమేన్.

## 23. *In times of any Epidemic*

### ఈతిబాధగాని, విషవ్యాధిగాని సంభవించినప్పుడు

**సే.**—ఆయన నీ దోషములన్నిటిని క్షమించువాడు.

**ఉ.**—నీ సంకటములన్నిటిని కుదుర్చువాడు.

కృపగల ప్రభువా, ఘోరమైన వ్యాధి మరణములవలన దర్శింపబడిన మాకు విడుదలను సహాయమును దయచేయుమని వేడుకొనుచున్నాము. ఈ దురవస్థను మాకు కృపాసాధనముగా చేయుము. మనుష్యులను వ్యాధిబాధ

నుండి కాపాడగల సదుపాయములనిమిత్తమై ప్రయాసపడుచున్నవారిని యెడ తెగని నీ దీవెనతో వర్ధిల్లచేయుము. రోగములను తొలగించి బాధను పరి శుద్ధపరచిన నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుపేరట వీటిని వేడు కొనుచున్నాము. ఆమేన్.

### *24. For the Sick and Suffering*

రోగులకొరకును, బాధపడువారికొరకును

**సే.**—నలిగిన మనస్సుగలవారిని ఆయన స్వస్థపరచును.

**ఉ.**—వారి రోగములను కుదుర్చుటకు ఔషధము నిచ్చువాడును ఆయనే.

సర్వశక్తిగల తండ్రీ, జీవారోగ్యముల దాతా, రోగులను బాధపడుచున్న వారినందరిని, ముఖ్యముగా మా ప్రార్థనలు కోరుచున్నవారిని, కృపతో దృష్టించుము. వారిని, వారి కుపచారముచేయువారిని దీవించి, నీ దివ్యచిత్తమైనయెడల వారు దేహమందును మనస్సునందును స్వస్థతనొంది, నీ పరిశుద్ధసంఘములో నీకు తమ కృతజ్ఞతాస్తుతులను చెల్లించునట్లు దయచేయుమని, మా ప్రభువైన యేసు క్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

### *25. For Hospitals*

వైద్యశాలలకొరకు

**సే.**—ఆయనే మన బలహీనతలను వహించుకొనెను.

**ఉ.**—మన రోగములను భరించెను.

సర్వశక్తిగల దేవా, శ్రీమంతుడును నీ కుమారుడునైన యేసుక్రీస్తు సమస్త విధములైన రోగములను సంకటములను స్వస్థపరచుచు మేలుచేయుచు సంచ రించెనుగదా. ఆయన చేసిన ఈ కృపాకార్యము మా మధ్యను, ముఖ్యముగా మా దేశములోనున్న వైద్యశాలలలోను, కొనసాగించుమని నిన్ను బ్రతిమాలు కొనుచున్నాము. రోగులకు ధైర్యమును స్వస్థతను దయచేసి, వారిని పరిశుద్ధ పరచుము. ఔషధములిచ్చువారికిని, శస్త్రవైద్యులకును, రోగులకు ఇతర ఉప చారములు చేయువారికిని, తెలివిని నేర్పును సానుభూతిని ఓపికను దయ చేయుము. రోగము రాకుండ చేయుటకు ప్రయాసపడుచున్న వారందరి మీదను నీ దీవెన కుమ్మరించి, వారు నీ ప్రేమగల ఉద్దేశములను కొనసాగించు నట్లు దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొను చున్నాము. ఆమేన్.



### *26. For all conditions of men*

ఆయా స్థితులలో నుండెడి మనుష్యులకొరకు

**సే.**—ప్రభువు అందరికిని ఉపకారి.

**ఉ.**—ఆయన కనికరములు ఆయన సమస్త కార్యములమీద నున్నవి.

మనుష్యులందరికి సృష్టికర్తవును పాలకుడవునైన దేవా, ఆయా స్థితిగతు లలోనుండు మనుష్యులకొరకు నిన్ను బతిమాలుకొనుచున్నాము. సర్వ దేశ ములవారికి నీ రక్షణ క్షేమమును, సకల జాతులవారికి నీ మార్గములను తెలియ జేయుము. ముఖ్యముగా, సార్వత్రిక సంఘ క్షేమముకొరకు నిన్ను వేడుకొను చున్నాము. తాము క్రైస్తవులమని ఒప్పుకొనువారందరును సత్యమార్గములోకి తేబడి, ఆత్మయొక్క ఐక్యమందును, సమాధాన బంధమందును, నీతి ప్రవర్తనయం దును విశ్వాసమును కాపాడుకొనులాగున ఆ సంఘమును నీ దయగల ఆత్మచేత నడిపించి యేలుము. తుదకు, మనస్సునందేమి, శరీరమందేమి, ఆస్తియందేమి ఏ విధముగానైనను పాట్లుపడి శ్రమపడువారందరిని,

[*ముఖ్యముగా మా ప్రార్థనలు కోరుచున్నవారిని]

* ఎవరైన సభవారి ప్రార్థనలు కోరుకొంటే ఇది చెప్పవలసినది.

ఓ తండ్రీ, నీ దయకు అప్పగించుచున్నాము. వారివారి అక్కరల ప్రకారము వారికి సహాయముచేసి వారిని ఆదరింపవలెననియు, వారి బాధలయందు ఓర్పును, వారి ప్రయాసములలోనుండి సంతోషకరమైన విడుదలను, దయచేయవలె ననియు యేసుక్రీస్తునిమిత్తమై వేడుకొనుచున్నాము. ఆమేన్.

### *27. A Commemoration of the Faithful Departed*

ఈ జీవము చాలించిన విశ్వాసుల జ్ఞాపకార్థము

**సే.**—నీతిమంతులు నిత్యము జీవించుచున్నారు.

**ఉ.**—వారి బహుమానము ప్రభువునొద్దనున్నది.

సమస్త శరీరాత్మలకు దేవా, నీయందు విశ్వాసమును భయమును గలవారై యుండి, తమ పరుగు తుదముట్టించిన నీ సేవకులందరి నిమిత్తము, ధన్యురాలగు కన్య మరియ నిమిత్తము, పరిశుద్ధులైన పితామహులు, ప్రవక్తలు, అపొస్తలులు, హతసాక్షులు, నీతిగల నీ యితర సేవకులందరినిమిత్తమును, నీ పరిశుద్ధనామమును కొనియాడుచు మహిమపరచుచున్నాము. వారి దృష్టాంతములవలన మేమును

ప్రోత్సాహపరచబడి, వారి సహవాసమువలన బలపరచబడి, తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారమగునట్లు దయచేయుమని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

సే.—నీతిమంతుల ఆత్మలు దేవునిచేతిలో నున్నవి.

ఉ.—ఏ యాతనలును వారిని ముట్టవు.

నిత్యుడవును ప్రభుడవునగు దేవా, సమస్త ఆత్మలను జీవింపజేయువాడా, ప్రకాశమైన నీ వెలుగు కిరణములచేతను, పరమాదరణచేతను పరదైసులోను భూమిమీదను ఉన్న నీ సంఘమంతటిని అలంకరించుమని నిన్ను బతిమాలుకొనుచున్నాము. ఈ లోకములో నిన్ను ప్రేమించి సేవించి యిప్పుడు విశ్రాంతిలోనున్నవారి మంచి దృష్టాంతమును మేము అనుసరించి, తుదకు వారితోకూడ పరిపూర్ణమైన నిత్యానందములో ప్రవేశించునట్లు మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా అనుగ్రహింపుము. ఆమేన్.

లేదా యిది.

సే.—ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు.

ఉ.—నిజమే, వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురని ఆత్మ చెప్పుచున్నాడు.

సమస్త శరీరాత్మలకు దేవుడవైన సర్వశక్తిగల దేవా, యేసుక్రీస్తునందు విశ్రమించుచున్నవారిలో నీవు ఆరంభించిన సత్క్రియను ఆయన ఆగమనమువరకు కొనసాగించునట్లు వారియెడల నీ ప్రేమను ఐశ్వర్యమును విస్తరింపచేయుము. పరలోకపు తండ్రీ, భూమిమీద యిప్పుడు నిన్ను సేవించుచున్న మేమును, తుదకు వారితోకూడ నీ కనికరముచేత తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారమగుటకు పాత్రులముగా అగుపడునట్లు, మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తుద్వారా అనుగ్రహింపుము. ఆమేన్.

వేరు అక్కరలకొరకు ప్రార్థన కోరినప్పుడు ఈలాగు చెప్పిన చాలును:

.........కొరకు ప్రార్థించుదము.

కొంతసేపు నిశ్శబ్దముగానున్న పిమ్మట ఇట్లు చెప్పవలెను:



సే.—ప్రభువా, మా ప్రార్థన ఆలకింపుము.

ఉ.—మా మొర నీయొద్దకు చేరనిమ్ము.

¶ ముందటి ప్రార్థనలలో దేనితర్వాతనైనను వాడతగినవి.

దేవా, ఎల్లప్పుడును కనికరించుటయు క్షమించుటయు నీ స్వభావలక్షణములై యున్నవి గనుక, మేము మా పాపములనెడి సంకెళ్లతో కట్టబడియుండినను, మా వినయ విన్నపములు అంగీకరించి, నీ గొప్ప దయాదాక్షిణ్యములవల్ల మమ్మును విడిపించుమని, మా మధ్యవర్తియు పక్షవాదియునగు యేసుక్రీస్తు ఘనతకొరకు వేడుకొనుచున్నాము. ఆమేన్.

ప్రభువా, మా యోగ్యతనుబట్టికాక నీవు మాలో జరిగించిన క్రియనుబట్టి మమ్మును జ్ఞాపకముచేసికొనుము. నీ సేవకొరకు మమ్మును పిలిచియున్నావు గనుక నీవే మా పిలుపునకు మమ్ము పాత్రులనుగా చేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

---

## కృతజ్ఞతా స్తుతులు

¶ సేవకుడేగాని, సేవకుడును జనులునుగాని చెప్పతగిన సామాన్య కృతజ్ఞతా స్తుతి.

సర్వశక్తిగల దేవా, సర్వోపకారివైన తండ్రీ, నీ అయోగ్యసేవకులమైన మాకును మనుష్యులందరికిని,

[*ముఖ్యముగా, ఈ లోగడ నీవు దయచేసిన ఉపకారములనిమిత్తమై కృతజ్ఞతా స్తుతులను ఇప్పుడు చెల్లింప కోరెడి వారికిని]

నీవు చూపిన సమస్త దయాదాక్షిణ్యములకు బహు వినయముగాను మనస్ఫూర్తిగాను నిన్ను స్తుతించుచున్నాము. మమ్మును సృష్టించి పాలించినందుకును, ఇహసుఖములన్నిటికొరకును, అన్నిటికంటె ముఖ్యముగా, మా ప్రభువైనయేసు క్రీస్తువల్ల లోకమును విమోచించి నీవు చూపిన అమూల్య ప్రేమకొరకును, కృపా

* వెనుక ఎవరికొరకు ప్రార్థన చేయబడెనో వారు కృతజ్ఞతాస్తుతి సమర్పింప కోరితే ఇది చెప్పవలెను.

సాధనములకొరకును, మహిమా నిరీక్షణకొరకును, నిన్ను స్తుతించుచున్నాము. మరియు, మేము నిష్కపటముగా మేలెరిగిన మనస్సుగలవారమై, మమ్మును నీ సేవకు సమర్పించుకొని, మా జీవితకాలమంతయు నీ దృష్టికి పరిశుద్ధులముగాను నీతిపరులముగాను నడుచుకొనుచు, మాటతోనేకాక మా నడతవల్లను నీ స్తుతి బయలుపరచునట్లు, నీ యుపకారములన్నియు తగునట్లుగా గ్రహించెడి బుద్ధి మాకు దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆయనకును నీకును పరిశుద్ధాత్మకును సమస్త ఘనతామహిమలు యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

### అనుకూలమైన కాలమానముకొరకు

ప్రభువైన దేవా, నీ కనికరముచేత సమయోచితముగ కాలమానమును మార్చి, నీ సేవకుల శ్రమ నివారణచేసి ఆదరించితివి గనుక, ఈ నీ యుపకారమునుగూర్చి నీకు హృదయపూర్వకమైన వందనములు చెల్లించుచున్నాము. మేము నీ యీవులనన్నిటిని నీ పరిశుద్ధనామముయొక్క ఘనతామహిమల నిమిత్తము వాడుకొనుటకు మాకు కృప దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

### మంచి పంటకొరకు

అందరికి సృష్టికర్తవును, తండ్రివియునైన సర్వశక్తిగల ప్రభువైన దేవా, మనుష్యజాతికొరకు విత్తుకాలమును కోతకాలమును నియమించి, భూఫలములను వాటికాలమందు నీ బిడ్డలమైన మాకు ఇప్పుడనుగ్రహించినావు గనుక, నీకు హృదయపూర్వకమైన వందనములు అర్పించుచున్నాము. వీటికొరకును నీ యుపకారములన్నిటికొరకును నీ ఘనమైన నామమును మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా కొనియాడుచు మహిమపరచుచున్నాము. ఆమేన్.

### సమృద్ధి కలిగినందుకు

మిక్కిలి కరుణగల తండ్రీ, నీ కృపాతిశయమువల్ల నీ సంఘముయొక్క భక్తిగల ప్రార్థనలు ఆలకించి, మాకు కలిగిన కరవు పోగొట్టి, సమృద్ధిని దయచేసినావు గనుక ఈ నీ విశేషోపకారమునకై నిన్ను వినయముగా స్తుతించుచున్నాము. నీకు మహిమయు మాకు ఆదరణయు కలుగునట్లు మా దేశమును సమృద్ధిగా ఫలింపజేసి, నీ దాక్షిణ్యము ఇంకను మా మీద ఉంచుచుండవలెనని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.



### ఈతిబాధగాని, విషవ్యాధిగాని తొలగించినందుకు

ప్రభువైన దేవా, నీవు నరపుత్రులను బుద్ధిపూర్వకముగా బాధపెట్టువాడవుకావు గనుక, నీ కృపచేత మమ్ములను వ్యాధిబాధలనుండి తొలగించినందుకు హృదయపూర్వకమైన కృతజ్ఞతా స్తుతులు అర్పించుచున్నాము. తండ్రీ, మా శరీరాత్మలను సజీవయాగముగా నీకు సమర్పించుకొనుచున్నాము. నీ సంఘములో నీ యుపకారములకై మేము ఎప్పుడును నిన్ను స్తుతించునట్లును, నీ కృపను కొనియాడునట్లును దయచేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఇతర కృపలకొరకు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపగోరినయెడల ఈలాగు చెప్పితే చాలును.

. . . . . . . . . .కొరకు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదము.

కొంతసేపు నిశ్శబ్దముగానున్న తర్వాత ఈలాగు చెప్పవలెను:

**సే.**—ప్రభువు దయాళుడు, ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి.

**ఉ.**—ఆయన కృప నిరంతరముండును.

## ముగింపు

ప్రార్థనలను కృతజ్ఞతాస్తుతులను ఈ క్రిందివాటిలో ఏదైన నొకదానితో ముగింపవలెను. అవి సాయంప్రార్థనలో మూడవ సంగ్రహ ప్రార్థనయైనపిమ్మటకూడ వీటిని వాడవచ్చును.

**సే.**—ప్రభువు మీకు తోడైయుండునుగాక.

**ఉ.**—నీ యాత్మకును తోడైయుండునుగాక.

**సే.**—ప్రభువును స్తుతించుదము.

**ఉ.**—దేవునికి కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుదము.

### II

మనలను ప్రేమించి, తన ప్రియునియందు మనలను ఏర్పరచుకొనిన తండ్రియైన దేవునికి,

మనలను ప్రేమించి, తన స్వరక్తముద్వారా మన పాపములనుండి మనలను విడిపించిన కుమారుడైన దేవునికి,

మన హృదయములలో దేవుని ప్రేమను కుమ్మరించెడి పరిశుద్ధాత్మయైన దేవునికి—

ఏకదేవుడును, సత్యుడునైన త్రియేకదేవునికి, సమస్త ప్రేమ సమస్త మహిమ ఇప్పుడును ఎప్పుడును కలుగునుగాక. ఆమేన్.

### III

సర్వశక్తియు కనికరమునుగల దేవుడు మనలను ఆశీర్వదించి, ఈ రాత్రియందును ఎల్లప్పుడును మనలను కాపాడునుగాక. ఆమేన్.

### IV

పరిశుద్ధుడైన కృసస్తముయొక్క ప్రార్థన

సర్వశక్తిగల దేవా, ఈ సమయమందు మేము ఏకమనస్సుతో నిన్ను గురించి మా సామాన్య ప్రార్థనలుచేయుటకు మాకు కృప దయచేసినావు గనుకను, ఇద్దరు ముగ్గురు నాపేరట కూడినప్పుడు వారి విన్నపముల ప్రకారము దయచేయుదునని మాటయిచ్చినావు గనుకను, ఓ ప్రభువా, నీ సేవకులమైన మా కోరికలను విన్నపములను మాకు తగినట్టు ఇప్పుడు నెరవేర్చి, ఇహమందు నీ సత్యము తెలిసికొను జ్ఞానమును పరమందు నిత్యజీవమును మాకు దయచేయుము. ఆమేన్.

2 కొరింథీ 13.

మన ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మనకందరికిని ఎల్లప్పుడును తోడైయుండునుగాక. ఆమేన్.

---

# GENERAL RUBRICS
## OF THE
# ADMINISTRATION OF THE LORD'S SUPPER
## OR
# HOLY COMMUNION

---

## పరిశుద్ధ సమభాక్త్వమునకు చెందు సామాన్యవిధులు

¶ ఎవడైనను సంఘము నొచ్చుకొనులాగున బహిరంగముగను ప్రసిద్ధముగను దుర్మార్గుడై యున్నట్టుగాని మాటవల్లనైనను క్రియవల్లనైనను తన పొరుగువానికి ఏదైన అన్యాయముచేసి యున్నట్టుగాని సంఘగురువు తెలిసికొనినయెడల అతని పిలిపించి—యిదివరలో నీవలన నొచ్చుకొనిన సంఘము వారు సమాధానపడునట్లు నీవు బహిరంగముగా వచ్చి వాస్తవముగా పశ్చాత్తాపపడి నీ పూర్వపు దుష్ప్రవర్తనను దిద్దుకొంటివనియు నీవు అన్యాయము చేసినవారికి సరిపుచ్చితివనిగాని నీ చేతనైనంత శీఘ్రముగా ఆలాగు చేయుటకు దృఢిగా నిర్ణయించు కొంటివనిగాని నీవు ఎరుక చేయువరకు ప్రభువు బల్లయొద్దకు ఏ మాత్రము రాతెగించకూడదని అతనిని హెచ్చరింపవలెను.

¶ ఒకనిమీద ఒకనికి అసూయయు ద్వేషమును కలవని సంఘగురువు తెలిసికొనినయెడల పైన చెప్పిన రీతిగానే వారిని హెచ్చరించి వారు సమాధానపడిరని తాను తెలిసికొనువరకు వారిని ప్రభువు బల్లయొద్దకు రానియ్యకూడదు. అయినను, ఈలాగు విరోధముగా ఉన్నవారిలో ఒకడు తన విరోధి తనయెడల చేసిన అపరాధమంతయు మనఃపూర్వకముగా క్షమించుటకును తాను చేసిన తప్పునుగురించి సరిపుచ్చుటకును సమ్మతింపగా రెండవవాడు భక్తి సహితమైన ఐకమత్యమునకు సమ్మతింపక మూర్ఖుడై అసూయ కలిగియున్న పక్షమందు సేవకుడు మూర్ఖుని విడిచిపెట్టి పశ్చాత్తప్తుని పరిశుద్ధ సమభాక్త్వమునకు రానియ్యవలెను.

¶ అయినను ఈ రూబ్రిక్కుయొక్క ఈ భాగమందుగాని వెనుకటి భాగమందుగాని ఉదాహరించిన ప్రకారము సేవకుడు ఎవరినైనను నిరోధించినయెడల ఆ సంగతి తక్షణమే బిషపునకు తెలియజేసి బిషపు ఏమి ఆజ్ఞాపించుచున్నాడో దాని చొప్పున నడుచుకొనవలెను.

¶ దిగువవచ్చు ఆరాధన అంతను స్పష్టముగను వినబడునట్లుగను చదువవలెను.

¶ తనతో సమభాక్త్వము పుచ్చుకొనుటకు ఎవరైనను ఉంటేనే తప్ప క్రీస్తు సమభాక్త్వము ఆచరింప కూడదు.

¶ క్రీస్తులును డీకనులును అనేకులుండు స్థలములందలి దేవాలయములలో వారందరు తగిన హేతువు లేనిది కనీసము ప్రతి ఆదివారమందును పరిశుద్ధ సమభాక్త్వము పుచ్చుకొనవలెను.

¶ రొట్టెను ద్రాక్షారసమును గురించి ఆక్షేపణకైనను మూఢభక్తికైనను అవకాశమేమియు లేకుండు నట్లు, వాడుకగా తిను రొట్టె ఉంటేచాలును. అయినను, వీలైనంతమట్టుకు అది మంచి అచ్చ గోధుమ రొట్టెయైగాని లేక వేఫరైగాని ఉండవలెను.

¶ ప్రతిష్ఠింపబడిన దానిలో ఏమైనను మిగిలితే దేవాలయములోనుండి బైటికి తీసికొని వెళ్లకూడదు ఆశీర్వచనము కాగానే క్రీస్తును సమభాక్త్వము పొందినవారిలో తాను పిలిచినవారును వాటిని వినయముగా తిని త్రాగవలెను.

¶ సమభాక్త్వముకొరకు కావలసిన పదార్థములను సంఘ గురువుగాని దేవాలయ పాలకులుగాని ఆయా సభలయొక్క ద్రవ్యముపెట్టి కొనియుంచవలెను.

---

# ORDER FOR THE ADMINISTRATION OF THE LORD'S SUPPER

OR

# HOLY COMMUNION

---

## ప్రభువు భోజనము, అనగా,

# పరిశుద్ధ సమభాక్త్వము

## ఆచరించెడి క్రమము

¶ జనులు మోకాళ్లూనియుండగా క్రీస్తు బల్లయొద్ద నిలుచుండి ప్రభువు ప్రార్థనయు ఆ తరువాత వచ్చు సంగ్రహప్రార్థనయు చెప్పవలెను.

## I. పీఠిక.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడును గాక. నీ రాజ్యము వచ్చును గాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక. మా అనుదినాహారము నేడు మాకు దయ చేయుము. మాయెడల అపరాధములు చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమింపుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. ఆమేన్.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, హృదయములన్నియు నీకు బట్టబయలై కోరికలన్నియు తెలిసియేయున్నవి. ఏ రహస్యములును నీకు దాగియుండవు. మేము నిన్ను సంపూర్ణముగా ప్రేమించి నీ పరిశుద్ధ నామమును యుక్తముగా మహిమపరచు నట్లు నీ పరిశుద్ధాత్మావేశముచేత మా హృదయముల తలంపులను మా ప్రభువైన క్రీస్తుద్వారా పవిత్రపరచుము. ఆమేన్.

¶ ఆ తరువాత ప్రీస్టు జనులవైపు తిరిగి పది యాజ్ఞలన్నియు స్పష్టముగా వినిపింపవలెను; జనులు ఇంకను మోకాళ్లూనియుండి ఒక్కొక్క ఆజ్ఞ వినినతరువాత తాము గతకాలమున దాని యందలి ప్రతి కర్తవ్యమును (అక్షరార్థమందుగాని లేక దాని ఆత్మీయార్థమందుగాని) అతిక్రమించినందుకు కనికరమును, ముందుకు దానిని గైకొనుటకు కృపను దయచేయుమని యీ దిగువ వచ్చునట్లు దేవుని వేడుకొనవలెను.

**ప్రీస్టు.**—దేవుడు పలికి సెలవిచ్చిన ఆజ్ఞలు ఏవనిన:—

నీ దేవుడైన ప్రభువును నేనే, నేను తప్ప వేరొక దేవుడు నీకుండ కూడదు.

**జనులు.**—ప్రభువా, మమ్మును కనికరించి, ఈ ఆజ్ఞ గైకొనుటకు మా హృదయములను ప్రేరేపింపుము.

**ప్రీస్టు.**—పైన ఆకాశమందేగాని, క్రింద భూమియందేగాని, భూమి క్రింద నీళ్లయందేగాని యుండు దేని రూపమునైనను విగ్రహమునైనను నీవు చేసి కొనకూడదు. వాటికి సాగిలపడకూడదు. వాటిని పూజింపకూడదు.

**జనులు.**—ప్రభువా, మమ్మును కనికరించి, ఈ ఆజ్ఞ గైకొనుటకు మా హృదయములను ప్రేరేపింపుము.

**ప్రీస్టు.**—నీ దేవుడైన ప్రభువు నామమును నీవు వ్యర్థముగా నుచ్చరింప కూడదు.

**జనులు.**—ప్రభువా, మమ్మును కనికరించి, ఈ ఆజ్ఞ గైకొనుటకు మా హృదయములను ప్రేరేపింపుము.

**ప్రీస్టు.**—విశ్రాంతి దినమును పరిశుద్ధ దినముగా నాచరించుటకు జ్ఞాపక ముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పనియంతయు చేయవలెను. ఏడవదినము నీ దేవుడైన ప్రభువునకు విశ్రాంతిదినము.

**జనులు.**—ప్రభువా, మమ్మును కనికరించి, ఈ ఆజ్ఞ గైకొనుటకు మా హృదయములను ప్రేరేపింపుము.

**ప్రీస్టు.**—నీవు నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము.

**జనులు.**—ప్రభువా, మమ్మును కనికరించి, ఈ ఆజ్ఞ గైకొనుటకు మా హృదయములను ప్రేరేపింపుము.

**ప్రీస్టు.**—నీవు నరహత్య చేయకూడదు.

**జనులు.**—ప్రభువా, మమ్మును కనికరించి, ఈ ఆజ్ఞ గైకొనుటకు మా హృదయములను ప్రేరేపింపుము.



**ప్రీస్టు.**—నీవు వ్యభిచరింపకూడదు.

**జనులు.**—ప్రభువా, మమ్మును కనికరించి, ఈ ఆజ్ఞ గైకొనుటకు మా హృదయములను ప్రేరేపింపుము.

**ప్రీస్టు.**—నీవు దొంగిలకూడదు.

**జనులు.**—ప్రభువా, మమ్మును కనికరించి, ఈ ఆజ్ఞ గైకొనుటకు మా హృదయములను ప్రేరేపింపుము.

**ప్రీస్టు.**—నీవు అబద్ధసాక్ష్యము పలుకకూడదు.

**జనులు.**—ప్రభువా, మమ్మును కనికరించి, ఈ ఆజ్ఞ గైకొనుటకు మా హృదయములను ప్రేరేపింపుము.

**ప్రీస్టు.**—నీవు నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు.

**జనులు.**—ప్రభువా, మమ్మును కనికరించి, ఈ నీ ఆజ్ఞలన్నియు మా హృదయములలో వ్రాయుమని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము.

¶ నెలలో కనీసము ఒక ఆదివారమందైనను పది ఆజ్ఞలు వినిపింపవలెను. ఇతర సమయము లందు వాటిని వదలిపెట్టవచ్చును. ఆలాగు వదలివేసినప్పుడు వాటికి బదులుగా ఈ దిగు వనున్న మన ప్రభువు చెప్పిన ధర్మశాస్త్రసంగ్రహమును చెప్పవలెను.

మన ప్రభువైన యేసుక్రీస్తు చెప్పినదేమనగా: ఇశ్రాయేలూ, వినుము. మన దేవుడగు ప్రభువు అద్వితీయుడగు ప్రభువు. నీవు నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణమనస్సుతోను, నీ పూర్ణబలముతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను. ఇది మొదటి ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ యాజ్ఞయు దానివంటిదే. వీటికంటె ముఖ్యమైన ఆజ్ఞ మరేదియులేదు. ఈ రెండు ఆజ్ఞలును ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమైయున్నవి.

**జనులు.**—ప్రభువా మమ్మును కనికరించి, ఈ ఆజ్ఞ గైకొనుటకు మా హృదయములను ప్రేరేపింపుము.

¶ పది ఆజ్ఞలనుగాని వాటి సంగ్రహమునుగాని ఆదివారములయందు చెప్పవలెను. ఇతర సమయములయందు వాటికి బదులు ఈ క్రింది మాటలు పాడవచ్చును, లేదా చెప్పవచ్చును.

ప్రభువా కనికరించుము.

క్రీస్తూ కనికరించుము.

ప్రభువా కనికరించుము.

¶ తరువాత ప్రీస్టు మునుపటివలెనే నిలుచుండి యిట్లు చెప్పవలెను.

**ప్రీస్టు.**—ప్రభువు మీకు తోడై యుండునుగాక.

**ఉ.**—నీ ఆత్మకును తోడై యుండునుగాక.

**ప్రీస్టు.**—ప్రార్థించుదము.

¶ పరిశుద్ధ బల్లవైపు ఆయన తిరిగి ఆ దినపు సంగ్రహప్రార్థన చెప్పవలెను. ఈ పుస్తకములోనున్న యితర సంగ్రహ ప్రార్థనలుగాని, లేక బిషపువలన నియమింపబడిన ప్రార్థనలుగాని రావచ్చును.

## II. వాక్య పరిచర్య.

¶ అది కాగానే ఉత్తరము చదువువాడు ఉత్తరము (లేక పాఠము) ఆయా గ్రంథము ఇన్నవ అధ్యాయము ఇన్నవ వచనము మొదలుకొని వ్రాసియున్నదని చెప్పి ఉత్తరము చదువవలెను. ఉత్తరముకాగానే ఈ మట్టునకు ఉత్తరము (లేక పాఠము) సరియని చెప్పవలెను.

¶ అటుతరువాత జనులందరును లేచి నిలిచియుండగా సువార్త చదివెడి డీకనుగాని ప్రీస్టుగాని పరిశుద్ధ సువార్త ఆయా సువార్త ఇన్నవ అధ్యాయము ఇన్నవ వచనము మొదలుకొని వ్రాసియున్నదని చెప్పవలెను.

**ఉత్తరము.**—ప్రభువా నీకు మహిమ కలుగునుగాక.

అప్పుడు సువార్తను చదువవలెను.

ఉత్తరముగాని సువార్తగాని బాగుగ వినబడునట్లు, చదివెడివాడు జనులవైపు తిరుగవలెను.

సువార్త ముగించగానే యీలాగు చెప్పవచ్చును.

క్రీస్తూ నీకు స్తోత్రము కలుగునుగాక.

¶ జనులు మునుపటివలెనే యింకను నిలిచియుండగా ఈ క్రింది విశ్వాససూత్రము చెప్పవలెను, లేక పాడవలెను. కాని ఆదివారమునందు లేక పరిశుద్ధదినమందు తప్ప మరి యే దినమందైనను సేవకుడు తనకు యుక్తమని తోచినట్లు దీనిని వదిలిపెట్టవచ్చును.

పరలోక భూలోకములకును, దృశ్యాదృశ్యములైన యన్నిటికిని సృష్టికర్త యగు సర్వశక్తిగల తండ్రియైన ఒక్కడే దేవుని నమ్ముచున్నాను.

దేవుని ఏకకుమారుడును, ఒక్కడే ప్రభువునయిన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఆయన అన్నిలోకములకన్న ముందు తన తండ్రినుండి జన్మించినవాడును, దేవునినుండి దేవుడును, వెలుగునుండి వెలుగును, నిజమైన దేవుని నుండి నిజమైన దేవుడును, సృజింపబడక జన్మించినవాడును, తండ్రితో ఏకత్వము గలవాడునైయున్నాడు, సమస్తమును ఆయన మూలముగా కలిగెను. ఆయన మనుష్యులమయిన మనకొరకును, మన రక్షణకొరకును, పరలోకమునుండి దిగి



వచ్చి, పరిశుద్ధాత్మచేత, కన్య మరియయందు అవతారమెత్తి, మనుష్యుడాయెను; ఆయన మనకొరకు పొంతిపిలాతు అధికారముక్రింద సిలువవేయబడెను; ఆయన బాధపడి పాతిపెట్టబడెను. లేఖనముల ప్రకారము మూడవనాడు తిరిగి లేచి, పరలోకమునకెక్కి, తండ్రి కుడిచేతివైపున కూర్చుండియున్నాడు. ఆయన బ్రతికియున్నవారిని చనిపోయినవారిని విమర్శించుటకు మహిమతో తిరిగి వచ్చును. ఆయన రాజ్యమునకు అంతములేదు.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. ఆయన ప్రభువును, జీవమిచ్చువాడును తండ్రినుండియు కుమారునినుండియు బయలుదేరువాడును, తండ్రితోను కుమారునితోను కూడ ఆరాధింపబడి మహిమ పొందువాడును, ప్రవక్తలద్వారా పలికినవాడునై యున్నాడు.

మరియు సార్వత్రికమును అపొస్తలికమునైన ఒక్కటే పరిశుద్ధ సంఘమును నమ్ముచున్నాను. పాపవిమోచనముకొరకైన ఒక్కటే బాప్తిస్మమును ఒప్పుకొనుచున్నాను. చనిపోయినవారి పునరుత్థానముకొరకును, పరమందలి జీవముకొరకును ఎదురుచూచుచున్నాను. ఆమేన్.

¶ అంతట సంఘగురువు ఆ వారములో ఆచరింపవలసిన ఆయా పరిశుద్ధదినములను ఉపవాసదినములను జనులకు తెలియచేయవలెను. తరువాత సమభాక్త్వముగాని మరి యితర ఆరాధనలుగాని జరుపవలసియుంటే ప్రచురపరచవలెను. పెండ్లిప్రకటనలు వెలివేతలు మొదలగు ప్రకటనలను ప్రచురపరచవలెను. ఆయా విశేష విషయములకొరకు ప్రార్థించవలసియుంటే వానిని తెలుపవచ్చును. దేవాలయములో దైవారాధనకాలమున సేవకుడే తప్ప మరి యెవరును ఏదియు ప్రకటించి తెలియజేయకూడదు. అయనయైనను ఈ పుస్తకపు చట్టములలో విధించియున్నదియు ఆ ఖండపు బిషపువల్ల నియోగింపబడినదియు సెలవు పొందినదియు తప్ప మరి ఏదియు ప్రకటింపకూడదు.

¶ అంతట ప్రసంగము రావచ్చును.

## III. అర్పణ వాక్యములు.

¶ ఆ తరువాత ప్రీస్టు ప్రభువు బల్లయొద్ద నిలిచి ఈ దిగువను వచ్చు వచనములలో తనకు యుక్తమని తోచినట్లు ఒకటియైనను అధికమైనను చదువుచు అర్పణ నారంభింపవలెను.

మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు, వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి. (పరి. మత్తయి 5: 16).

భూమిమీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు. ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును, దొంగలు కన్నమువేసి దొంగిలెదరు. పరలోకమందు మీకొరకు ధనము కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను తుప్పైనను దాని తినివేయదు. దొంగలు కన్నమువేసి దొంగిలరు. (పరి. మత్తయి 6: 19).

మనుష్యులు మీకేమేమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునై యున్నది. (పరి. మత్తయి 7: 12).

ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడు పరలోకరాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును. (పరి. మత్తయి 7: 21).

పుచ్చుకొనుటకంటె ఇచ్చుట ధన్యత అని ప్రభువైన యేసుచెప్పిన మాటలు జ్ఞాపకముచేసికొనుడి. (అపొ. కార్య. 20: 35).

సంతుష్టిసహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమై యున్నది. మనమీ లోకములోని కేమియు తేలేదు, దీనిలోనుండి యేమియు తీసికొనిపోలేము. (1 తిమొథె 6: 6).

నీ శక్తికొలది ధర్మముచేయుము. నీకు సమృద్ధిగా ఉంటే అధికముగా ఇమ్ము. నీకు కొంచెముగా ఉంటే ఆ కొంచెములోనే సంతోషముతో ధర్మము చేయుము. ఆలాగు చేయుటవల్ల అక్కర దినమునకు మంచి ఆదాయమును నిక్షేపించుచున్నావు. (తోబీతు 4: 8).

సమస్తమును నీవలననే కలిగెనుగదా. నీ దానిలోనుంచి మేము నీకిచ్చియున్నాము. (1 దినవృత్తాంతములు 29: 14).

మీకొరకు ఆత్మసంబంధమైనవి మేము విత్తియుండగా, మీవలన శరీరసంబంధమైన ఫలములు కోసికొనుట గొప్పకార్యమా? (1 కొరింథీ 9: 11).

ఆలయకృత్యములు జరిగించువారు ఆలయమువలన జీవనము చేయుచున్నారనియు, బలిపీఠమునొద్ద కనిపెట్టుకొనియుండువారు బలిపీఠముతో పాలివారైయున్నారనియు మీరెరుగరా? ఆలాగున సువార్త ప్రచురించువారు సువార్తవలన జీవింపవలెనని ప్రభువు నియమించియున్నాడు. (1 కొరింథీ 9: 13).

కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంట కోయును. సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును. సణుగుకొనకను బలవంతముగా కాకను ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనినప్రకారము ఇయ్యవలయును; దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును. (2 కొరింథీ 9: 6).



వాక్యోపదేశము పొందువాడు ఉపదేశించువానికి మంచి పదార్థములన్నిటిలో భాగమియ్యవలెను. మోసపోకుడి; దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడేమి విత్తునో ఆ పంటనే కోయును. (గలతీ 6: 6).

మనకు సమయము దొరకినకొలది అందరియెడలను, విశేషముగా విశ్వాసగృహమునకు చేరినవారియెడలను మేలుచేయుదము. (గలతీ 6: 10).

మీరు చేసిన కార్యమును, మీరు పరిశుద్ధులకు ఉపచారముచేసి యింకను ఉపచారముచేయుచుండుటచేత తన నామమునుబట్టి చూపిన ప్రేమను మరచుటకు దేవుడు అన్యాయస్థుడు కాడు. (హెబ్రీ 6: 10).

మీ కన్నులెత్తి పొలములను చూడుడి; అవి ఇప్పుడే తెల్లబారి కోతకు వచ్చియున్నవి. (పరి. యోహాను 4: 35).

ఇహమందు ధనవంతులైనవారు వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము, రాబోవు కాలమునకు మంచి పునాది తమకొరకు వేసికొనుచు, ఔదార్యముగలవారును, తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారునై యుండవలెనని వారి కాజ్ఞాపింపుము. (1 తిమొథె 6: 17—19).

ఈ లోకపు జీవనోపాధిగలవాడైయుండి, తన సహోదరునికి లేమి కలుగుట చూచియు అతనియెడల ఎంతమాత్రమును కనికరము చూపనివానియందు దేవునిప్రేమ యేలాగు నిలుచును? (1 యోహాను 3: 17).

బీదలను కటాక్షించువాడు ధన్యుడు. ఆపత్కాలమందు ప్రభువు వాని తప్పించును. (కీర్తన 41: 1).

ఉపకారమును ధర్మమును చేయ మరచిపోకుడి. అట్టి యాగములు దేవుని కిష్టమైనవి. (హెబ్రీ 13: 16).

దేవునికి స్తుతి యాగము చేయుము. మహోన్నతునికి నీ మ్రొక్కుబడులు చెల్లించుము. (కీర్తన 50: 14).

ఆయన గుడారములో నేను ఉత్సాహధ్వని చేయుచు బలుల నర్పించెదను. నేను పాడెదను, ప్రభువునుగూర్చి స్తుతి గానము చేసెదను. (కీర్తన 27: 6).

షాలేమురాజైన మెల్కీసెదెకు ఆహారమును ద్రాక్షారసమును తీసికొని వచ్చెను. అతడు సర్వోన్నతుడగు దేవుని యాజకుడు. (ఆది. 14: 18).

¶ పై వచనములను చదువుచుండగా డీకనులైనను దేవాలయ పాలకులైనను ఆ పనికి ఏర్పరచబడిన ఇతరులైనను బీదలకొరకు కానుకలను జనులయొక్క యితర దానములను పుచ్చుకొని క్రీస్తునొద్దకు మర్యాదగా తేవలెను. అతడు అందుకు సిద్ధముచేసిన మంచి పళ్లెములో వాటిని పుచ్చుకొని వినయముతో అర్పించి పరిశుద్ధమైన బల్లమీద నుంచవలెను.

¶ క్రీస్తు ఈలాగు చెప్పవచ్చును.

## ప్రార్థన.

**మా** దేవుడవైన ప్రభువా, నిరంతరము నీవు స్తోత్రార్హుడవు. ప్రభువా, భూమ్యాకాశములయందుండు సమస్తమును నీవి; మహాత్మ్యమును, పరాక్రమమును, ప్రభావమును, తేజస్సును ఘనతయు నీకే చెందుచున్నవి. ప్రభువా, రాజ్యము నీది. నీవు అందరిమీద అధిపతిగానున్నావు. ఐశ్వర్యమును గొప్పతనమును నీవలన కలుగును, నీదానిలోనుండి మేము నీకిచ్చుచున్నాము. ఆమేన్.

దీనిని జనులు ప్రీస్టుతోకలసి చెప్పవచ్చును.

¶ సమభాక్త్వము ఆచరించునపుడు ప్రీస్టు చాలునని తనకు తోచినంత రొట్టెను ద్రాక్షారసమును బల్లమీద ఉంచవలెను.

¶ ద్రాక్షారసములో కొంచెము నీటిని కలుపుట సంఘముయొక్క ప్రాచీన ఆచారము.

¶ ఇచ్చట ప్రీస్టు విశేష విజ్ఞాపనలు స్తోత్రాంశములు చెప్పవచ్చును.

¶ తరువాత విజ్ఞాపన ప్రార్థన ఆరంభించవలెను.

## IV. విజ్ఞాపనము.

### ఈ లోకమునందు పోరాడుచున్న క్రీస్తుసంఘముయొక్క నానా స్థితులకొరకు ప్రార్థించుదము.

సర్వశక్తిగలిగి సదా జీవించుచుండు దేవా, మేము మనుష్యులందరికొరకు ప్రార్థనలను విజ్ఞాపనములను కృతజ్ఞతాస్తోత్రములను చెల్లింపవలెనని, నీ పరిశుద్ధ అపొస్తలులవల్ల మాకు నేర్పితివిగదా. నీ దివ్య మాహాత్మ్యమునకు (* మేము చెల్లించెడి కానుకలను అర్పణలను అంగీకరించి), మేము చేయు ఈ మా ప్రార్థనలు మిక్కిలి కనికరముతో చిత్తగింపుమని, వినయముగా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము.

* కానుకలైనను అర్పణలైనను లేనియెడల 'మేము చెల్లించెడి కానుకలను అర్పణలను అంగీకరించి' యను మాటలు చెప్పక విడిచిపెట్టవలెను.

సత్యము ఐకమత్యము సమ్మతియుగల మనస్సుతో సార్వత్రిక సంఘమును ఎల్లప్పుడును ఆవేశింపచేయుమని వేడుకొనుచున్నాము. నీ పరిశుద్ధ నామమును ఒప్పుకొనువారందరును, నీ పరిశుద్ధ వాక్యముయొక్క సత్యోపదేశమునందు ఏకీభవించి, ఐక్యతతోను దివ్యప్రేమతోను జీవించునట్టు దయచేయుము.

సమస్త క్రైస్తవరాజులను ప్రభువులను అధికారులను రక్షించి కాపాడుమని నిన్ను వేడుకొనుచున్నాము. ముఖ్యముగా నీ సేవకుడయిన జార్జి అను మా చక్రవర్తిని కాపాడి, ఆయన మమ్మును దైవభక్తితోను నెమ్మదితోను ఏలునట్టు అనుగ్రహింపుము. ఆయన సభాసదులందరును, ఆయన క్రింద అధికారము పొందియున్నవారందరును యథార్థముగాను నిష్పక్షపాతముగాను న్యాయము జరిగించి, దుష్టులను దుర్మార్గులను దండించి, నీ నిజమైన దైవభక్తిని సన్మార్గమును నిలుపుటకు వారికి కృప దయచేయుము.



పరలోకపు తండ్రీ, బిషపులు, సంఘ గురువులు అందరును తమ నడవడిచేతను ఉపదేశముచేతను సత్యమును జీవమునుగల నీ వాక్యము ప్రసిద్ధిచేసి, పరిశుద్ధ సంస్కారములను క్రమముగాను యథావిధిగాను ఆచరించునట్టు వారికి కృపనిమ్ము.

నీ జనులందరును, ముఖ్యముగా ఇక్కడ కూడియున్న ఈ సభవారును, వినయహృదయముతోను తగిన భక్తితోను నీ పరిశుద్ధ వాక్యమును విని, గైకొని, తాము బ్రతుకు దినములన్నియు పరిశుద్ధతతోను నీతితోను నిన్ను యథార్థముగా సేవించునట్టు వారికి నీ దివ్య కృపనిమ్ము.

మరియు, ఈ అశాశ్వతమైన జీవితకాలమందు శ్రమ, దుఃఖము, ఇబ్బంది, రోగము మొదలైన కష్టములచేత బాధపడుచున్న వారినందరిని, ఓ ప్రభువా, నీ దయవల్ల ఆదరించి, వారికి సహాయము చేయవలెనని నిన్ను మిక్కిలి వినయముతో బ్రతిమాలుకొనుచున్నాము.

నీయందు విశ్వాసమును భయమును గలవారైయుండి, ఈ జీవము చాలించిన నీ సేవకులందరినిమిత్తము మేము నీ పరిశుద్ధ నామమును స్తుతించి, వారితో నీ పరలోక రాజ్యమునందు పాలివారమగునట్లు వారి మంచి దృష్టాంతములను అనుసరించుటకు మాకు కృపనిమ్మని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము.

ఓ తండ్రీ, మా ఒక్కడే మధ్యవర్తియు పక్షవాదియునైన యేసుక్రీస్తు నిమిత్తము దీనిని అనుగ్రహింపుము. ఆమేన్.

## V. సిద్ధము.

¶ అప్పుడు ప్రీస్టు సమభాక్త్వము పొందబోవువారితో ఇట్లు చెప్పవలెను.

మీ పాపములనిమిత్తము వాస్తవముగాను పట్టుదలతోను పశ్చాత్తాపపడి మీ పొరుగువారియెడల ప్రేమయును స్నేహమును కలిగియుండి, యికను దేవుని ఆజ్ఞల ననుసరించి, ఆయన పరిశుద్ధమార్గములయందు నడుచుకొనుచు, క్రొత్త నడవడిగలవారగుటకు నిశ్చయించుకొనుచున్న మీరు విశ్వాసముతో దగ్గరకు వచ్చి, మీ ఆదరణకొరకు ఈ పరిశుద్ధ సంస్కారమును పుచ్చుకొనుడి. వినయముగా మోకాళ్లూని, సర్వశక్తిగల దేవునియెదుట మీ పాపములు దీన మనసుతో ఒప్పుకొనుడి.

¶ అంతట పరిశుద్ధ సమభాక్త్వముపొంద మనస్సుగలవారందరిపేరట ప్రీస్టు అయినను సేవకులలో ఒకడు అయినను ఈ సామాన్య ఒప్పుకోలును చెప్పవలెను. అతడును జనులందరును వినయముగా మోకాళ్లూని చెప్పవలసిన దేమనగా,

సర్వశక్తిగల దేవా, మా ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రీ, సమస్తమును సృష్టించినవాడా, మనుష్యులందరికిని న్యాయాధిపతీ, నీ దివ్య మాహాత్మ్యమునకు విరోధముగా, మేము తలంపుతోను, మాటతోను, క్రియతోను, అడుగడుగునకు బహు ఘోరముగా పాపము చేసి మిక్కిలి న్యాయమైన నీ ఉగ్రతకు పాత్రులమై యున్నాము. మా నానావిధ పాపములను దుర్మార్గములను ఒప్పుకొని విలపించుచున్నాము. మా కాని క్రియలకై పట్టుదలగా పశ్చాత్తాపపడి, మనస్ఫూర్తిగా దుఃఖించుచున్నాము. వాటి జ్ఞాపకము మాకు బాధకరముగా ఉన్నది. వాటి భారము తాళజాలనిదై యున్నది. మిక్కిలి కనికరముగల తండ్రీ, మమ్మును కనికరించుము. మమ్మును కనికరించుము. నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తునిమిత్తము జరిగినదంతయు క్షమింపుము. నీ నామమునకు ఘనతయు మహిమయు కలుగునట్లు, మేమిక క్రొత్తనడవడిగలవారమై, ఎల్లప్పుడును నిన్ను సేవించి సంతోషపరచులాగున మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా అనుగ్రహింపుము. ఆమేన్.

¶ అప్పుడు ప్రీస్టు (బిషపు ఉన్నయెడల ఆయన) లేచి నిలిచి జనులకు అభిముఖుడై యీ పాప విమోచనమును ప్రకటింపవలెను.

మన పరలోకపు తండ్రియైన సర్వశక్తిగల దేవుడు, మనస్ఫూర్తియైన పశ్చాత్తాపముతోను నిజమైన విశ్వాసముతోను తనవైపునకు మళ్లువారందరికిని పాపములను క్షమింతునని తన గొప్ప కనికరమువల్ల మాట యిచ్చియున్నాడు. ఆయన మన ప్రభువైన యేసుక్రీస్తునిమిత్తము మిమ్మును కనికరించి, మీ పాపములన్నిటిని క్షమించి, వాటినుండి విడుదలచేసి, సమస్త సద్గుణములయందు మిమ్మును స్థిరపరచి, బలపరచి, నిత్యజీవమునకు తీసికొని వెళ్లునుగాక. ఆమేన్.

¶ అంతట ప్రీస్టు చెప్పవలెను.

మన రక్షకుడైన క్రీస్తు తనయొద్దకు నిజముగా మళ్లువారందరితో చెప్పెడి ఆదరణకరమైన మాటలు వినుడి.

ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైనవారలారా, నాయొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగచేతును. (మత్త. 11: 28).



దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయన ననుగ్రహించెను. (యోహాను 3: 16).

పరిశుద్ధ పౌలు చెప్పినదికూడ వినుడి.

పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది. (1 తిమొథె 1: 15).

పరిశుద్ధ యోహాను చెప్పినదికూడ వినుడి.

ఎవడైనను పాపముచేసినయెడల, నీతిమంతుడైన యేసుక్రీస్తను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు. ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు. (1 యోహాను 2: 1).

## VI. ప్రతిష్ఠ.

¶ ఆ తరువాత ప్రీస్టు చెప్పవలెను.

మీ హృదయములను లేవనెత్తుకొనుడి.

**ఉత్తరము.**—ప్రభువువైపునకు వాటిని లేవనెత్తుకొనుచున్నాము.

**ప్రీస్టు.**—మన ప్రభువైన దేవునికి కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుదము.

**ఉత్తరము.**—ఆలాగు చేయుట తగినదియు సరియునైయున్నది.

¶ అప్పుడు ప్రీస్టు ప్రభువు బల్లవైపునకు తిరిగి చెప్పవలెను.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునై యున్నది.

కాబట్టి దేవదూతలతోను, ప్రధానదూతలతోను, పరలోకపు సర్వ సమూహముతోను నీ ఘనమైన నామమును కొనియాడుచు మహిమపరచుచు నిన్ను సదా స్తుతించుచున్నాము.

పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, సైన్యముల ప్రభుడవైన దేవా, ఇహపరలోకములు నీ మహిమతో నిండియున్నవి. సర్వోన్నతుడవైన ఓ ప్రభువా, నీకు మహిమ కలుగునుగాక. ఆమేన్.

¶ ఆయా దినములకు విశేష పీఠికలు ఏర్పర్చబడియున్నయెడల అవి ఇక్కడ రావలెను.

## క్రీస్మస్ దినమందును ప్రత్యక్షత దినమువరకును చెప్పనది.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా అన్నికాలములయందును అన్నిస్థలములయందును నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునై యున్నది. ఎందుకనగా, ఇట్టి సమయమందు నీ ఏకకుమారుడైన యేసుక్రీస్తును మాకొరకు జన్మింపననుగ్రహించితివి. ఆయన, సమస్తపాపమునుండి మమ్మును శుద్ధులనుగా జేయు నిమిత్తము పాపపు డాగు లేకుండా పరిశుద్ధాత్మ క్రియచేత తన తల్లియైన కన్య మరియ తత్వములోనుండి నిజమైన మనుష్యుడుగా చేయబడెను. కాబట్టి...

## ప్రత్యక్షత దినమందును తరువాత వచ్చెడు ఏడు దినములయందును చెప్పనది.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును మా ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునైయున్నది. ఎందుకనగా, ఆయన మానవులందరిని చీకటిలోనుండి తన ఆశ్చర్యకరమైన వెలుగులోనికి తీసికొనివచ్చులాగున మా మర్త్యమైన శరీరమందు తన మహిమను ప్రత్యక్షపరిచెను. కాబట్టి...

## పునరుత్థానమునకు పూర్వపు గురువారము చెప్పనది.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును మా ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునైయున్నది. ఎందుకనగా, ఆయన లోకములోనున్న తనవారిని ప్రేమించి, వారిని అంతమువరకు ప్రేమించెను. మరియు ఆయన శ్రమపడుటకు ముందటి రాత్రి, తన శిష్యులతో భోజనమునకు కూర్చుండినప్పుడు ఈ పరిశుద్ధ మర్మములను నియమించి, ఆయన మరణమువల్ల విమోచింపబడి ఆయన పునరుత్థానముద్వారా బ్రతికింపబడిన మేము ఆయన దైవస్వభావములో పాలివారమగునట్లు దయచేసెను. కాబట్టి...



## క్రీస్తు పునరుత్థాన దినమందును ఆరోహణ దినము వరకును చెప్పనది.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు, సరియు, అవశ్యకర్తవ్యమునైయున్నది. ముఖ్యముగా, నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుయొక్క మహిమగల పునరుత్థానముకొరకు నిన్ను స్తుతింప బద్ధులమైయున్నాము. ఎందుకనగా, మాకొరకు సమర్పింపబడి, లోకపాపమును మోసికొనిపోయిన నిజమైన పస్కాగొఱ్ఱెపిల్ల ఆయనయే. ఆయన తన మరణమువల్ల మరణమును నశింపచేసి, జీవముతో తిరిగి లేచుటవల్ల నిత్యజీవము మాకు తిరిగి దయచేసినాడు.

కాబట్టి దేవదూతలతోను, ప్రధానదూతలతోను, పరలోకపు సర్వసమూహముతోను నీ ఘనమైన నామమును కొనియాడుచు మహిమపరచుచు నిన్ను సదా స్తుతించుచున్నాము.

పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, సైన్యముల ప్రభుడవైన దేవా, ఇహపరలోకములు నీ మహిమతో నిండియున్నవి. సర్వోన్నతుడవైన ఓ ప్రభువా, నీకు మహిమకలుగునుగాక. ఆమేన్.

## క్రీస్తు ఆరోహణ దినమందును పరిశుద్ధాత్మ దినము వరకును చెప్పనది.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును మా ప్రభువును నీ మిక్కిలి ప్రియకుమారుడునైన యేసుక్రీస్తు మూలముగా నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుటకు మాకు మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునై యున్నది. ఎందుకనగా, ఆయన మహిమతో తిరిగి లేచినతరువాత తన అపొస్తలులకందరికిని బాహాటముగా కనుపడి, తాను ఉండెడిచోటునకు మేమును ఎక్కి తనతో కూడ మహిమయందు ఏలునట్లు మాకొరకు స్థలము సిద్ధము చేయుటకు వారు చూచుచుండగా పరలోకమునకు ఎక్కెను. కాబట్టి...

## పరిశుద్ధాత్మ దినమందును ఆ తరువాత వచ్చెడు ఆరు దినములయందును చెప్పనది.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును మా ప్రభువైన యేసుక్రీస్తు

మూలముగా నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునైయున్నది. ఎందుకనగా, ఆయన అన్నిలోకములకన్న పైగా ఆరోహించి, మహామహుడవగు నీ కుడిపార్శ్వమందు కూర్చుండి, జీవమిచ్చు నీ పరిశుద్ధాత్మను ఈ సమయమందు నీ సార్వత్రిక సంఘుమీద క్రుమ్మరించెను. అందువల్ల ఆయన మహిమగల శక్తిద్వారా నిత్యసువార్తయొక్క ఆనందము లోకమంతట వ్యాపించుచున్నది. ఆ కారణముచేత అంధకారము నుండియు అజ్ఞానమునుండియు ఆయన మమ్మును తప్పించి నీయొక్కయు నీ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తుయొక్కయు స్వచ్ఛమైన వెలుగు లోనికిని నిజమైన తెలివిలోనికిని తెచ్చెను. కాబట్టి...

## త్రిత్వపు పండుగయందు మాత్రమే చెప్పనది.

ప్రభువా, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునైయున్నది. ఎందుకనగా, నీవు నీ జనితైక కుమారునితోను పరిశుద్ధాత్మతోనుకూడ ముగ్గురు మూర్తులుగాను, తత్వమునందు ఒక్కడవుగను, ఒక్కడవే దేవుడవును ఒక్కడవే ప్రభుడవునైయున్నావు. ఎట్లనగా, ఓ తండ్రీ, నీ మహిమ ఎట్టిదని నమ్ముచున్నామో కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు మహిమకూడ భేదమును హెచ్చు తగ్గులును లేకుండ అట్టిదేయని నమ్ముచున్నాము. కాబట్టి...

దేవదూతలతోను, ప్రధానదూతలతోను, పరలోకపు సర్వసమూహముతోను నీ ఘనమైన నామమును కొనియాడుచు మహిమపరచుచు నిన్ను సదా స్తుతించుచున్నాము.

పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, సైన్యముల ప్రభుడవైన దేవా, ఇహపరలోకములు నీ మహిమతో నిండియున్నవి. సర్వోన్నతుడవైన ఓ ప్రభువా, నీకు మహిమ కలుగునుగాక. ఆమేన్.

## శుచిదినమందును, శుభవర్తమానము వచ్చిన దినమందును చెప్పనవి.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునై యున్నది. ఎందుకనగా, నీ ఏక కుమారుడైన యేసుక్రీస్తును మా రక్షణకొరకు జన్మింప ననుగ్రహించితివి. ఆయన సమస్త పాపమునుండి మమ్మును శుద్ధులనుగా జేయు



నిమిత్తము, పాపపు డాగు లేకుండ, పరిశుద్ధాత్మ క్రియచేత తన తల్లియైన కన్య మరియ తత్వములోనుండి, నిజమైన మనుష్యుడుగా చేయబడెను. కాబట్టి...

## రూపాంతరపు పండుగ దినమందు చెప్పనది.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునై యున్నది. ఎందుకనగా, శరీరధారియైన వాక్యమగు ఆయన దివ్యమహిమ, పరిశుద్ధ పర్వతముమీద ఆయన ఏర్పరచుకొన్న సాక్షులయెదుట ప్రకాశించెను. పరలోకమునుండి వచ్చిన నీ శబ్దముద్వారా—ఈయన నా ప్రియకుమారుడని అప్పుడు ప్రకటించినావు. కాబట్టి...

## ముఖ్యమైన ఏ పండుగకైనను (విశేషపీఠిక నియమింపబడియున్నప్పుడు తప్ప) సమస్త పరిశుద్ధుల దినమందును, అపొస్తలుల, సువార్తికుల పండుగలయందును, పరిశుద్ధ యోహాను బాప్తిస్తు దినమందును చెప్పనది.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్ని స్థలములయందును నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునై యున్నది. ఎందుకనగా, నీ పరిశుద్ధుల సమూహము గొప్ప సాక్షిగా మేఘమువలె మమ్మును ఆవరించియున్నందున, మా యెదుట నుంచబడిన పందెములో మేము ఓపికతో పరుగెత్తునట్లును, వారితోకూడ మేమును వాడబారని మహిమాకిరీటమును పొందునట్లును అనుగ్రహించియున్నావు. నీ పరిశుద్ధుల సత్ప్రవర్తనయందు మా నడతకు దృష్టాంతమును, వారి భాగ్యమునందు మా పిలుపుయొక్క నిరీక్షణకు సూచనయు, మాకు దయచేసియున్నావు. కాబట్టి...

దేవదూతలతోను, ప్రధానదూతలతోను, పరలోకపు సర్వసమూహముతోను నీ ఘనమైన నామమును కొనియాడుచు మహిమపరచుచు నిన్ను సదా స్తుతించుచున్నాము.

పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, సైన్యముల ప్రభుడవైన దేవా ఇహపరలోకములు నీ మహిమతో నిండియున్నవి. సర్వోన్నతుడవైన ఓ ప్రభువా, నీకు మహిమ కలుగునుగాక. ఆమేన్.

## దేవాలయ ప్రతిష్ఠదినమందు ప్రతిష్ఠపండుగ దినమందును చెప్పనది.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునై యున్నది. ఎందుకనగా, ఆకాశములు నిన్ను పట్టజాలకున్నవి. లోకమంతయు నీ మహిమతో నిండియున్నది. అయినను నీవు ఆయా స్థలములను నీ యారాధనకొరకై పరిశుద్ధపరచి, వాటియందు నీ విశ్వాసులమీద నీ కృపావరములను క్రుమ్మరింప ననుగ్రహించువాడవు. కాబట్టి . . .

## సంవత్సరములో విశేష పీఠిక నియమింపబడియుండని యే ఆదివారమందైనను చెప్పదగినది.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, అన్నికాలములయందును అన్నిస్థలములయందును మా ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు, సరియు, మా విధియునైయున్నది. ఎందుకనగా, ఆయన మా పాపముల నుండి మమ్మును కడిగి, మా తండ్రియు దేవుడునైన నీకు మమ్మును ఒక రాజ్యముగాను యాజకులుగాను చేసిన ప్రధానయాజకుడై యున్నాడు.

కాబట్టి దేవదూతలతోను, ప్రధాన దూతలతోను, పరలోకపు సర్వసమూహముతోను నీ ఘనమైన నామమును కొనియాడుచు మహిమపరచుచు నిన్ను సదా స్తుతించుచున్నాము.

పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, పరిశుద్ధుడా, సైన్యముల ప్రభుడవైన దేవా ఇహపరలోకములు నీ మహిమతో నిండియున్నవి. సర్వోన్నతుడవైన ఓ ప్రభువా, నీకు మహిమ కలుగునుగాక. ఆమేన్.

¶ అప్పుడు క్రీస్తు ప్రభువు బల్లయొద్ద మోకాళ్లూని సమభాక్త్వము పుచ్చుకొనెడివారందరి పేరట దిగువవచ్చు ఈ ప్రార్థన చెప్పవలెను.

కనికరముగల ప్రభువా, మేము నానావిధములైన నీ గొప్ప కనికరములు విడిచి, మా స్వనీతిని నమ్ముకొని యీ నీ బల్లయొద్దకు రాతెగించలేదు. నీ బల్ల క్రింద పడియున్న ముక్కలు ఏరుకొనునంత యోగ్యతకలవారము కాము, గాని, నీవు ఎప్పుడును కనికరించు లక్షణముకలిగి మార్పులేని ప్రభుడవై యున్నావు. కాబట్టి కృపగల ప్రభువా, మా పాపపు శరీరములు నీ ప్రియ కుమారుడైన యేసుక్రీస్తు శరీరముచేత శుద్ధిచేయబడునట్లును, మా యాత్మలు ఆయన మిక్కిలి అమూల్యమైన రక్తముచేత కడుగబడునట్లును, మేము ఆయనలోను ఆయన



మాలోను ఎప్పుడును నివసించునట్లును, తగిన రీతిగా ఆయన మాంసము తినుటకును, ఆయన రక్తము త్రాగుటకును మాకు కృప ననుగ్రహింపుము. ఆమేన్.

¶ క్రీస్తు బల్లయెదుట నిలుచుండి రొట్టెను మరింత సులభముగాను అనువుగాను జనులయెదుట త్రుంచి తన చేతులతో గిన్నె యెత్తుకొనులాగున రొట్టెను ద్రాక్షారసమును సరిచి, ఈ దిగువ వచ్చెడి ప్రతిష్ఠాప్రార్థన చెప్పవలెను.

సర్వశక్తిగల దేవా, మా పరలోకపు తండ్రీ, మా విమోచనముకొరకు సిలువ మీద మరణముపొందుటకు, నీ ఒక్కడే కుమారుడైన యేసుక్రీస్తును నీ మహా కరుణచేత ఇచ్చితివిగదా. దానిమీద ఒకమారే ఆయన తన్నుతాను అర్పించిన తన ఒక్కటే అర్పణవల్ల సర్వలోక పాపములనిమిత్తము నిండును, సంపూర్ణమును, చాలినదియునైన బలియు, అర్పణయు, ప్రాయశ్చిత్తమును చేసి, తన విలువలేని ఆ మరణమునుగురించి శాశ్వతస్మరణను చేయుచుండుడని నియమించి, తాను తిరిగివచ్చువరకు దానిని జరుపుచుండవలెనని తన పరిశుద్ధ సువార్తయందు మాకు ఆజ్ఞాపించెను. కనికరముగల తండ్రీ, మా ప్రార్థన ఆలకించి, నీ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తు పరిశుద్ధ నిర్ణయము చొప్పున, ఆయన మరణ శ్రమలకు జ్ఞాపకార్థముగా రొట్టె ద్రాక్షారసములు అను ఈ పదార్థములను మేము పుచ్చుకొని, ఆయన మహా దివ్యశరీరరక్తములలో పాలివారమగునట్లు దయచేయుమని మహా వినయముతో నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆయన అప్పగింపబడిన ఆ రాత్రియందు, రొట్టెను (*) పట్టుకొని, స్తోత్రముచేసి, దాని విరిచి (†), తన శిష్యులకిచ్చి,— తీసికొని తినుడి, (‡) ఇది మీకొరకు ఇయ్యబడుచున్న నా శరీరమై యున్నది; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీని చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన (§) గిన్నెను పట్టుకొని, స్తోత్రముచేసి, దాని వారికిచ్చి, దీనిలోనిది మీరందరును త్రాగుడి; (‖) ఇది పాపపరిహారము కలుగుటకై మీకొరకును అనేకులకొరకును చిందింపబడుచున్న క్రొత్త నిబంధనయొక్క— నా రక్తమై యున్నది; ఇది మీరు త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీని చేయుడని చెప్పెను.

(*) ఇక్కడ క్రీస్తు పళ్లెము తన చేతులతో పట్టుకొనవలెను.

(†) ఇక్కడ రొట్టెను తుంచవలెను.

(‡) ఇక్కడ రొట్టె అంతటిమీద తన చేయి ఉంచవలెను.

(§) ఇక్కడ గిన్నెను తన చేతులతో పట్టుకొనవలెను.

(‖) ఇక్కడ ప్రతిష్ఠ చేయుటకు ద్రాక్షారసము గల గిన్నెయే కాని జాడియే కాని అక్కడ నున్న ప్రతి పాత్రమీదను తన చేయి ఉంచవలెను.

కాబట్టి, ఓ ప్రభువా, పరలోకపు తండ్రీ, స్తుతి కృతజ్ఞతలు అను ఈ మా యాగమును కనికరముతో అంగీకరింపుమని నీ వినయ సేవకులమైన మేము దయగల తండ్రివైన నిన్ను బహుగా వేడుకొనుచున్నాము. నీ కుమారుడైన యేసుక్రీస్తు పుణ్యమువల్లను మరణమువల్లను, ఆయన రక్తమందలి విశ్వాసముద్వారాను, మేమును నీ సంఘమంతయు, ఆయన శ్రమలవల్ల కలిగిన పాపపరిహారమును తక్కిన అన్ని ఫలములను పొందునట్లు దయచేయవలెనని బహు వినయముగా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఓ ప్రభువా, ఇక్కడ మమ్మును, అనగా మా శరీరాత్మలను వివేకమును, పరిశుద్ధతయు జీవమునుగల అర్పణగా నీకు చెల్లించి సమర్పించుకొనుచున్నాము. ఈ పరిశుద్ధ సమభ్యాక్త్వములో పాలు పొందు మమ్ములనందరిని నీ కృపతోను దివ్యమైన దీవెనతోను నిండార నింపుమని వినయముతో నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. మరియు, మా నానా విధములైన పాపములనుబట్టి నీకు ఏ యాగమైనను అర్పించుటకు మేము అయోగ్యులమైనను, మా యోగ్యతాయోగ్యతలను తూచక, మా అపరాధములను క్షమించి, మాకు ఆవశ్యకమైన యీ కర్తవ్యమును సేవను అంగీకరింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఓ సర్వశక్తిగల తండ్రీ, ఆయనతో పరిశుద్ధాత్మ ఐక్యమునందు, నీకు సమస్త ఘనతయు మహిమయును ఆయనద్వారానే యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

¶ అంతట జనులు క్రీస్టువెంట ప్రభువుప్రార్థన చెప్పవలెను, లేదా క్రీస్టు ఇష్టపడినయెడల మన రక్షకుడైన క్రీస్తు చేయుమని ఆజ్ఞాపించి మనకు నేర్పిన ప్రార్థనను ధైర్యముతో చెప్పౢదము అని చెప్పవచ్చును.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పింపుము. రాజ్యము శక్తి మహిమయు నిరంతరము నీవై యున్నవి. ఆమేన్.

## VII. సమభ్యాక్త్వము పుచ్చుకొనుట

¶ అంతట క్రీస్టు సమభ్యాక్త్వముయొక్క ఉభయపదార్థములను తాను మొదట పుచ్చుకొని అక్కడనున్న బిషపులకును క్రీస్టులకును డీకనులకును అటువలెనే యియ్యవలెను. పిమ్మట జనులందరును వినయముగా మోకాళ్లూనియుండగా వారికిని వరుసగా వారివారి చేతులలో ఉంచవలెను. ఆయన యెవరికైనను రొట్టెను ఇచ్చునప్పుడు ఈ మాటలు చెప్పవలెను.



నీకొరకు ఇయ్యబడిన మన ప్రభువైన యేసుక్రీస్తు శరీరము, నీ శరీరమును ఆత్మను నిత్యజీవమునకై సంరక్షించునుగాక. క్రీస్తు నీకొరకు చనిపోయినాడని జ్ఞాపకము చేసికొని దీని తీసికొని తిని, నీ హృదయమందు విశ్వాసముచేత కృతజ్ఞతాస్తుతితో ఆయనను ఆహారముగా చేసికొనుము.

¶ సేవకుడు ఎవనికైనను గిన్నెను ఇచ్చునప్పుడు ఈ మాటలు చెప్పవలెను.

నీకొరకు చిందింపబడిన మన ప్రభువైన యేసుక్రీస్తు రక్తము, నీ శరీరమును ఆత్మను నిత్యజీవమునకై సంరక్షించునుగాక. క్రీస్తు రక్తము నీకొరకు చిందింపబడినదని జ్ఞాపకముచేసికొని దీని త్రాగి కృతజ్ఞత కలిగియుండుము.

¶ ప్రతిష్ఠచేయబడిన రొట్టెయేకాని ద్రాక్షారసమేకాని చాలనియెడల క్రీస్టు వెనుక విధించిన క్రమముచొప్పున రొట్టెను ప్రతిష్ఠించుటకు [మా రక్షకుడైన యేసుక్రీస్తు తాను అప్పగింపబడిన రాత్రియందు] అను మాటలతోను, గిన్నె ప్రతిష్ఠించుటకు [ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట] అను మాటలతోను ఆరంభించి మరికొంత ప్రతిష్ఠచేయవలెను.

¶ అందరును సమభ్యాక్త్వము పుచ్చుకొన్న తరువాత క్రీస్టు ప్రభువు బల్లయొద్దకు తిరిగి వచ్చి, ప్రతిష్ఠింపబడిన పదార్థములలో మిగిలినవి మర్యాదగా దానిమీద ఉంచి, వాటిని నాణెమైన నారబట్టతో కప్పవలెను.

¶ అప్పుడు క్రీస్టు ప్రజలవైపు తిరిగి, ఈ దిగువవచ్చు మాటలను చెప్పి పిమ్మట సమభ్యాక్త్వము పుచ్చుకొన్న వారందరి పేరటను తరువాత వచ్చు స్తుతిప్రార్థనను చేయవలెను.

## VIII. కృతజ్ఞతార్పణము.

క్రీస్తుయొక్క అమూల్యమైన శరీరరక్తములను ఇప్పుడు విశ్వాసముచేత పుచ్చుకొన్న మనము మన ప్రభువైన దేవునికి కృతజ్ఞతాస్తోత్రములను చెల్లించుదము.

సదా జీవించుచుండు సర్వశక్తిగల దేవా, ఈ పరిశుద్ధ మర్మములను తగినట్టుగా పుచ్చుకొన్న మమ్మును నీ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క మిక్కిలి విలువగల శరీర రక్తములు అను ఆత్మీయమైన ఆహారముతో పోషింప ననుగ్రహించుచున్నావు గనుక నీకు కృతజ్ఞతాస్తోత్రములను చెల్లించుచున్నాము. మరియు, నీకు మాయెడల దయాదాక్షిణ్యములుగలవనియు, నీ కుమారుని మర్మశరీరములో నిజమైన అవయవములముగా మేము చేర్చబడియున్నామనియు, ఆయన మరణశ్రమలయొక్క పుణ్యమువల్ల కలుగు నిరీక్షణద్వారా నీ నిత్యరాజ్యమునకు వారసులమై యున్నామనియు ఇందువల్ల మాకు రూఢిపరచుచున్నావు గనుక, మనస్ఫూర్తిగా నిన్ను స్తుతించుచున్నాము. పరలోకపు తండ్రీ, ఆ పరిశుద్ధ సహవాసములో మేము నిలిచియుండి, నీవు

విధించిన మంచి పనులన్నిటిని మేము చేయునట్లు నీ కృపచేత మాకు సహాయము చేయుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా బహు వినయముగా బ్రతిమాలుకొనుచున్నాము. ఆయనకును నీకును పరిశుద్ధాత్మకును సమస్త ఘనతయు మహిమయును యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

¶ అంతట ప్రీస్టును జనులను ఇది పాడవలెను లేదా చెప్పవలెను.

ఉన్నతమైనవాటియందు దేవునికి మహిమయు, భూమిమీద సమాధానమును, మనుష్యులయెడల దయయును కలుగునుగాక. ప్రభువైన దేవా, పరలోకపు రాజా, సర్వశక్తిగల తండ్రివైన దేవా, నిన్ను స్తుతించుచున్నాము, నిన్ను కొనియాడుచున్నాము, నిన్ను ఆరాధించుచున్నాము, నిన్ను మహిమపరచుచున్నాము, నీ మహిమాతిశయమునుగురించి నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము.

అద్వితీయ కుమారుడవగు ప్రభువైన యేసుక్రీస్తూ, ప్రభువైన దేవా, తండ్రియొక్క కుమారుడా, లోకపాపములు మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లా, మమ్మును కనికరింపుము. లోకపాపములు మోసికొనిపోవువాడా, మమ్మును కనికరింపుము. లోకపాపములు మోసికొనిపోవువాడా, మా ప్రార్థన నంగీకరింపుము. తండ్రియైన దేవుని కుడిచేతివైపున కూర్చుండియుండువాడా, మమ్మును కనికరింపుము.

నీవే పరిశుద్ధుడవు, నీవే ప్రభుడవు, క్రీస్తు ప్రభో, నీవే పరిశుద్ధాత్మతో తండ్రియైన దేవుని మహిమయందు సర్వోన్నతుడవై యున్నావు. ఆమేన్.

¶ అంతట ప్రీస్టయినను (బిషపు ఉన్నయెడల ఆయన అయినను) జనులవైపు తిరిగి యీ దీవెన వాక్యము పలికి సెలవియ్యవలెను.

బుద్ధియంతటిని మించిన దేవుని సమాధానము మీకు తోడైయుండి, దేవునిగూర్చినట్టియు ఆయన కుమారుడును మన ప్రభువునైన యేసుక్రీస్తునుగూర్చినట్టియు, తెలివియందును, ప్రేమయందును, మీ హృదయములను మనస్సులను కాపాడునుగాక. తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మయైన సర్వశక్తిగల దేవుని దీవెన మీకు గలిగి, యెల్లప్పుడును మీకు తోడై యుండునుగాక. ఆమేన్.

¶ సమభాక్త్వము ఆచరించని దినములయందు అర్పణయైన తరువాత ఈ దిగువవచ్చు సంగ్రహప్రార్థనలలో ఒకటి రెండు చదువవలెను. మరియు ఉదయ సాయంప్రార్థన సమభాక్త్వము లిటనియను క్రమములలో వచ్చు సంగ్రహప్రార్థనల తరువాత సమయోచితముగా వీటిని సేవకుడు తనకు యుక్తమని తోచినట్టు చెప్పవచ్చును.

ప్రభువా, యీ మా విన్నపములను ప్రార్థనలను ఆలకించి కనికరముతో మాకు సహాయముచేసి, చావునకు లోనైన యీ జీవితకాలమందు కలుగు



మార్పులన్నిటిలోను నీ సేవకులమైన మమ్మును మిక్కిలి దయాపూర్వకమైన నీ తాత్కాలిక సహాయముచేత ఎల్లప్పుడును కాపాడి, మేము నిత్యరక్షణ పొందునట్లు మా మార్గమును ఏర్పరచుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

సర్వశక్తిగల ప్రభువా, నిత్యుడవైన దేవా, నీ మిక్కిలి బలమైన ప్రాపకమువల్ల మేము ఇప్పుడును ఎప్పుడును శరీరాత్మలయందు సంరక్షింపబడునట్లు, నీ న్యాయ పద్ధతులయందును, నీవు చేయుమనిన క్రియలయందును మా హృదయములను శరీరములను నడిపించి పరిశుద్ధపరచి ఏలననుగ్రహించుమని మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

సర్వశక్తిగల దేవా, నేడు మేము మా చెవులతో విన్న మాటలు నీ నామమునకు ఘనతామహిమలు కలుగుటకై మంచి ప్రవర్తన అను ఫలము మాలో కలుగచేయునట్లు, లోపల మా హృదయములందు నీ కృపచేత అవి నాటుకొనులాగున దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ప్రభువా, మేము నీయందు ఆరంభించి, కొనసాగించి, ముగించు మా పనులన్నిటిలో నీ పరిశుద్ధనామమును మహిమపరచి, తుదకు నీ కనికరముచేత నిత్యజీవము పొందులాగున, దయాపూర్వకమైన నీ అనుగ్రహముచేత మా సమస్త క్రియలలో నీవు మాకు ముందు నడిచి నీ యెడతెగని సహాయము మాకు తోడు చేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

సమస్త జ్ఞానమునకు ఊటయైన సర్వశక్తిగల దేవా, మేము అడుగకమునుపే మా అక్కరలును అడుగునెడల మా తెలివితక్కువను నీవెరుగుదువుగదా. మా బలహీనతలను కనికరముతో చిత్తగించి, మా అయోగ్యతవల్ల మేము తెగించి అడుగజాలనివియు, మా గుడ్డితనమువల్ల అడుగలేనివియు, నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు యోగ్యతనుబట్టి మాకు దయచేయుమని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

సర్వశక్తిగల దేవా, నీ కుమారునిపేరట అడుగువారి విన్నపములు ఆలకించుదునని వాగ్దానము చేసితివిగదా. మేమిప్పుడు నీ సముఖమున చేసిన ప్రార్థనలకును విన్నపములకును కనికరముతో నీ చెవినొగ్గి, మా అక్కరలు తీరుటకును నీ మహిమ ప్రచురమవుటకును, నీ చిత్తప్రకారము మేము విశ్వాసముతో అడిగినవి సఫలముగా పొందులాగున మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా అనుగ్రహింపుమని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

# అనుబంధములు

(1)

¶ ఈ లోకమందు పోరాడుచున్న......అనుదానికి ప్రతిగా వాడవచ్చును.

## క్రీస్తు సంఘముయొక్క నానా స్థితులకొరకు ప్రార్థించుటకు

సర్వశక్తిగలిగి సదా జీవించుచుండు దేవా, మేము మనుష్యులందరికొరకు ప్రార్థనలను విజ్ఞాపనములను కృతజ్ఞతా స్తోత్రములను చెల్లింపవలెనని నీ పరిశుద్ధ అపోస్తలులవలన మాకు నేర్పితివిగదా. నీ దివ్య మాహాత్మ్యమునకు (* మేము చెల్లించెడి కానుకలను అర్పణలను అంగీకరించి), మేము చేయు ఈ మా ప్రార్థనలు మిక్కిలి కనికరముగా చిత్తగింపుమని, వినయముగా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము.

* కానుకలైనను అర్పణలైనను లేనియెడల 'మేము చెల్లించెడి కానుకలను అర్పణలను అంగీకరించి' యను మాటలు చెప్పక విడిచిపెట్టవలెను.

సత్యము ఐకమత్యము సమ్మతియుగల మనస్సుతో సార్వత్రిక సంఘమును ఎల్లప్పుడును ఆవేశింపజేయుమని వేడుకొనుచున్నాము. నీ పరిశుద్ధ నామమును ఒప్పుకొనువారందరును, నీ పరిశుద్ధ వాక్యముయొక్క సత్యోపదేశమునందు ఏకీభవించి, ఐక్యతతోను దివ్యప్రేమతోను జీవించునట్లు దయచేయుము.

మరియు, సమస్త జనాంగములను నీతి సమాధానముల మార్గములో నడిపించుమని వేడుకొనుచున్నాము. నీ జనులు భక్తిగలిగి నెమ్మదిగా బ్రతుకునట్లు, రాజులు అధికారులందరును వారిని ఏలనను గ్రహింపుము. అంతియేగాక, నీ సేవకుడయిన జార్జి అను మా చక్రవర్తియు ఆయనక్రింద అధికారము పొందియున్నవారందరును యథార్థముగాను నిష్పక్షపాతముగాను న్యాయము జరిగించి, దుష్టులను దుర్మార్గులను దండించి, నీ నిజమైన దైవభక్తిని సన్మార్గమును నిలుపుటకు వారికి కృప దయచేయుము.

పరలోకపు తండ్రీ, బిషపులు, ముఖ్యముగా నీ సేవకుడైన మా బిషపును, ప్రీస్టులు డీకనులు వీరందరును తమ నడవడిచేతను ఉపదేశముచేతను సత్యమును జీవమునుగల నీ వాక్యమును ప్రసిద్ధిచేసి, పరిశుద్ధ సంస్కారములను క్రమముగాను యథావిధిగాను ఆచరించునట్లు వారికి కృపనిమ్ము.



మరియు, ఆయా జనాంగములమధ్య నీ సువార్తను వ్యాపింపజేయువారినందరిని నడిపించి, వారి సేవను వర్ధిల్లజేయుమని నిన్ను వేడుకొనుచున్నాము. పాఠశాలలు కళాశాలలు మొదలగు విద్యా స్థలములన్నింటిని నీ యాత్మచేత వెలిగించి భూలోకమంతయు నీ సత్యమునుగూర్చిన జ్ఞానముతో నింపబడులాగున అనుగ్రహింపుమని నిన్ను ప్రార్థించుచున్నాము.

ఇదిగాక, నీ జనులందరును, ముఖ్యముగా ఇక్కడ కూడియున్న ఈ సభవారును, వినయ హృదయముతోను తగిన భక్తితోను నీ పరిశుద్ధ వాక్యమును విని, గైకొని, తాము బ్రతుకు దినములన్నియు పరిశుద్ధతతోను నీతితోను నిన్ను యథార్థముగా సేవించునట్లు వారికి నీ దివ్య కృపనిమ్ము.

మరియు, యీ అశాశ్వతమైన జీవితకాలమందు శ్రమ, దుఃఖము, ఇబ్బంది, రోగము మొదలైన కష్టములచేత బాధపడుచున్న వారినందరిని, ఓ ప్రభువా, నీ దయవల్ల ఆదరించి, వారికి సహాయము చేయవలెనని నిన్ను మిక్కిలి వినయముతో బ్రతిమాలుకొనుచున్నాము.

నీయందు విశ్వాసమును భయమును గలవారైయుండి ఈ జీవము చాలించిన నీ సేవకులందరికిని నిత్యవెలుగును విశ్రాంతిని దయచేయుమని ప్రార్థించుచు, దయగల నీ కాపుదలకు వారిని అప్పగించుచున్నాము.

మరియు, నీ పరిశుద్ధులందరి నిమిత్తము నిన్ను స్తుతించుచున్నాము. వారు తమ తమ తరములలో లోకమునకు వెలుగుగాను, నీ కృపకు సాధనములుగాను నుండుటకు వారిని నీ వేర్పర్చుకొన్నందుకు నీకు అత్యధికముగ కృతజ్ఞతా స్తోత్రము లర్పించుచున్నాము. మేమును వారి సహవాసమునందు ఆనందించుచు, వారి మంచి దృష్టాంతము ననుసరించి, వారితో నీ పరలోకరాజ్యమునందు పాలికాపుల మగునట్లు దయచేయుము.

ఓ తండ్రీ, మా ఒక్కడే మధ్యవర్తియు పక్షవాదియునైన యేసుక్రీస్తు నిమిత్తము దీనిని అనుగ్రహింపుమని, నీతోను పరిశుద్ధాత్మతోను ఏక దేవుడుగా యుగయుగములు జీవించి ఏలుచుండెడి మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

(2)

¶ ప్రతిష్ఠాప్రార్థనకు ప్రతిగా దీని వాడవచ్చును.

## ప్రతిష్ఠా ప్రార్థన

సర్వశక్తిగల దేవా, మా పరలోకపు తండ్రీ, నీకే సకల ఘనతామహిమలు ఆరోపించుచున్నాము. నీ ఒక్కడే కుమారుడైన యేసుక్రీస్తును మా విమోచనముకొరకు సిలువమీద మరణము పొందుటకు నీ మహా కరుణచేత ఇచ్చితివి గదా. సిలువమీద ఒక్కమారే ఆయన తన్నుతాను అర్పించిన తన ఒక్కటే అర్పణవల్ల సర్వలోక పాపముల నిమిత్తము నిండును సంపూర్ణమును చాలినదియు నైన బలియు, అర్పణయు ప్రాయశ్చిత్తమును చేసి, తన విలువలేని ఆ మరణమునుగురించి శాశ్వత స్మరణను చేయుచుండుడని నియమించి తాను తిరిగి వచ్చువరకు దానిని జరుపుచుండవలెనని తన పరిశుద్ధ సువార్తయందు మాకు ఆజ్ఞాపించెను.

(*) ఇక్కడ క్రీస్తు పళ్లెము తన చేతులతో పట్టుకొనవలెను.

(†) ఇక్కడ రొట్టెను తుంచవలెను.

(‡) ఇక్కడ రొట్టె అంతటిమీద తన చేయి వుంచవలెను.

(§) ఇక్కడ గిన్నెను తన చేతితో పట్టుకొనవలెను.

(॥) ఇక్కడ, ప్రతిష్ఠచేయుటకు ద్రాక్షారసముగల గిన్నెయేకాని జాడియేకాని అక్కడనున్న ప్రతి పాత్రమీదను తన చేయి ఉంచవలెను.

ఆయన అప్పగింపబడిన ఆ రాత్రియందు రొట్టెను (*) పట్టుకొని, స్తోత్రముచేసి, దాని విరిచి (†), తన శిష్యులకిచ్చి,—తీసికొని తినుడి, (‡) ఇది మీకొరకు ఇయ్యబడుచున్న నా శరీరమైయున్నది; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీని చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన (§) గిన్నెను పట్టుకొని, స్తోత్రము చేసి, దాని వారికిచ్చి, దీనిలోనిది మీరందరును త్రాగుడి; (॥) ఇది పాప పరిహారము కలుగుటకై మీకొరకును అనేకులకొరకును చిందింపబడుచున్న క్రొత్త నిబంధనయొక్క నా రక్తమైయున్నది; ఇది మీరు త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీని చేయుడని చెప్పెను.

కాబట్టి, ఓ ప్రభువా, పరలోకపు తండ్రీ, నీ ప్రియకుమారుని పరిశుద్ధ నిర్ణయముచొప్పున, నీ వినయ సేవకులమైన మేము ఈ నీ పరిశుద్ధ యీవులను నీ దివ్య సన్నిధిలో సమర్పించుచు, ఆయన విలువలేని మరణ శ్రమలను, శక్తిగల



పునరుత్థానమును, మహిమగల ఆరోహణమును స్మరించుచు, ఆయన చిత్తానుసారమైన ఈ జ్ఞాపకార్థపు ఆరాధనను జరుపుచు, ఆయన మాకొరకు సంపాదించిన లెక్కలేని మేళ్లనుబట్టి హృదయపూర్వకముగా నీకు కృతజ్ఞతా స్తోత్రములను అర్పించుచున్నాము.

కనికరముగల తండ్రీ, మా ప్రార్థన నాలకించి, మమ్మును, రొట్టె ద్రాక్షారసమను ఈ నీ యీవులను, జీవమిచ్చు నీ పరిశుద్ధాత్మచేత ఆశీర్వదించి పరిశుద్ధపరచి, అవి మాకు నీ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తు శరీరరక్తములుగా నుండునట్లు దయచేయుము. మేము వాటిని పుచ్చుకొని, శరీరమందును ఆత్మయందును బలపడి సుఖపడునట్లు అనుగ్రహించుమని బహుగా బ్రతిమాలుకొనుచున్నాము.

దయగల తండ్రీ, స్తుతి కృతజ్ఞతలు అను ఈ మా యాగమును కనికరముతో అంగీకరింపుమని నిన్ను ప్రార్థించుచున్నాము. నీ కుమారుడైన యేసుక్రీస్తు పుణ్య మరణములవల్లను, ఆయన రక్తమందలి విశ్వాసముద్వారాను, మేమును నీ సంఘమంతయు ఆయన శ్రమలవల్ల కలిగిన పాపపరిహారమును, తక్కిన అన్ని ఫలములను పొందునట్లు దయచేయవలెనని బహు వినయముగా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము.

ఓ ప్రభువా, ఇక్కడ మమ్మును, అనగా మా శరీరాత్మలను, వివేకమును పరిశుద్ధతయు జీవమునుగల అర్పణగా నీకు చెల్లించి సమర్పించుకొనుచున్నాము. ఈ పరిశుద్ధ సహభాక్త్వములో పాలుపొందు మమ్ములనందరిని నీ కృపతోను దివ్యమైన దీవెనతోను నిండార నింపుమని వినయముతో నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము.

మరియు మా నానావిధములైన పాపములనుబట్టి నీకు ఏ యాగమైన అర్పించుటకు మేము అయోగ్యులమైనను మా యోగ్యతాయోగ్యతలను తూచక మా ప్రభువైన యేసుక్రీస్తునిమిత్తము మా అపరాధములను క్షమించి, మాకు ఆవశ్యకమైన యీ కర్తవ్యమును సేవను అంగీకరింపుమని నిన్ను వేడుకొనుచున్నాము.

ఓ సర్వశక్తిగల తండ్రీ, ఆయనతో పరిశుద్ధాత్మ ఐక్యమునందు నీకు సమస్త ఘనతయు మహిమయును ఆయన ద్వారానే యుగయుగములకు కలుగును గాక. ఆమేన్.

పరలోకమందున్న.........

## రెండవసారి ప్రతిష్ఠచేయు క్రమము

¶ జనులందరు సమభోక్తృత్వము పుచ్చుకొనకపూర్వమే, ప్రతిష్ఠింపబడిన రొట్టెయైనను ద్రాక్షారసమైనను అయిపోయినయెడల దిగువవచ్చు మాటలుచెప్పుచు కావలసినమట్టుకు ప్రతిష్ఠింపవలెను.

¶ రొట్టెనుమాత్రమే ప్రతిష్ఠింపవలసి వచ్చినప్పుడు మొదట అతడు చెప్పవలసిన దేమనగా:

**మా** రక్షకుడైన క్రీస్తు తాను అప్పగింపబడిన రాత్రియందు, రొట్టెను పట్టుకొని స్తోత్రముచేసి, దాని విరిచి, తన శిష్యులకిచ్చి,—తీసికొని తినుడి, ఇది మీకొరకు ఇయ్యబడుచున్న నా శరీరమై యున్నది; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీని చేయుడని చెప్పెను.

¶ లేక, ద్రాక్షారసమునుమాత్రమే ప్రతిష్ఠింపవలసి వచ్చినయెడల అతడు చెప్పవలసిన దేమనగా:

**ఆ** ప్రకారమే భోజనమైన పిమ్మట, మా రక్షకుడైన క్రీస్తు గిన్నెను పట్టుకొని, స్తోత్రముచేసి, దాని వారికిచ్చి,—దీనిలోనిది మీరందరును త్రాగుడి; ఇది పాపపరిహారము కలుగుటకై మీకొరకును అనేకులకొరకును చిందింపబడుచున్న క్రొత్త నిబంధనయొక్క నా రక్తమై యున్నది; ఇది మీరు త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీని చేయుడని చెప్పెను.

¶ తరువాత ప్రతిపారియు దిగువవచ్చు మాటలు చెప్పి ముగించవలెను:

**క**నికరముగల తండ్రీ, మా ప్రార్థన నాలకించి, మమ్మును రొట్టె (ద్రాక్షారసము) అను ఈ నీ యీవిని, జీవమిచ్చు నీ పరిశుద్ధాత్మచేత ఆశీర్వదించి పరిశుద్ధపరచి, అది (అవి) మాకు నీ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తు శరీరము (రక్తము) గా నుండునట్లు దయచేయుము. మేము దానిని పుచ్చుకొని, శరీరమందును ఆత్మయందును బలపడి సుఖపడునట్లు అనుగ్రహించుమని బహు వినయముగా బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

¶ లేక, రొట్టెద్రాక్షారసము రెండింటిని ప్రతిష్ఠింపవలసి వచ్చినయెడల పైన చెప్పబడిన రెంటిని గూర్చిన మాటలును దిగువవచ్చు మాటలతో ముగించవలెను.

**క**నికరముగల తండ్రీ, మా ప్రార్థన నాలకించి, మమ్మును, రొట్టె ద్రాక్షారసము అను నీ యీవులను జీవమిచ్చు నీ పరిశుద్ధాత్మచేత ఆశీర్వదించి పరిశుద్ధపరచి, అవి మాకు నీ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తు శరీర రక్తములుగా నుండునట్లు దయచేయుము. మేము వాటిని పుచ్చుకొని, శరీరమందును ఆత్మయందును బలపడి సుఖపడునట్లు అనుగ్రహించుమని బహు వినయముగా బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

---

# THE COLLECTS, EPISTLES, AND GOSPELS,

### TO BE USED THROUGHOUT THE YEAR.

సంవత్సరపు పొడుగున వాడవలసిన

## సంగ్రహప్రార్థనలు ఉత్తరములు సువార్తలును.

¶ కనిపెట్టునది:—ప్రతి ఆదివారమునకేగాని, జాగరమైనను భోగియైనను కలిగిన పరిశుద్ధ దినమునకేగాని, యేర్పడిన సంగ్రహప్రార్థన తొలినాటి సాయంప్రార్థనలో చెప్పవలెను.

¶ మరియు ఒక ఆదివారమునకు యేర్పరచబడిన సంగ్రహము ఉత్తరము సువార్త ఆ వారమందంతట ఉపయోగింపవలెను. ఈ పుస్తకములో మరియొక యేర్పాటు చేసియున్నను, బిషపు మరియొకటి సెలవిచ్చియున్నను అట్టిదానిని వాడుకొనవచ్చును.

---

క్రీస్తు రాకదినములలో

### మొదటి ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ కుమారుడైన యేసుక్రీస్తు చావుతోగూడిన యీ జీవితకాలమున అతివినయముతో మాకు దర్శనమియ్య వచ్చెను గదా. ఆయన సజీవులకును మృతులకును న్యాయము తీర్చుటకు అంత్యదినమున మహిమాప్రభావముతో తిరిగి వచ్చునప్పుడు, మేము చావులేని జీవమునకై లేచునట్లు, మేము ఇప్పుడు చీకటిపనులు వదలుకొని వెలుగు కవచమును ధరించుకొనులాగున మాకు కృప దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను ఇప్పుడును ఎప్పుడును జీవించి యేలుచుండెడి ఆయన ద్వారానే నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ క్రీస్తు జననదినము రేపు కద్దనగా నేటి సాయంకాలమువరకు రాకదినములందలి యితర సంగ్రహప్రార్థనలతో అనుదినమును ఈ పైప్రార్థన వాడవలెను.

ఉత్తరము: రోమా 13: 8–14.

సువార్త: పరి. మత్తయి 21: 1–13.

క్రీస్తు రాకదినములలో

## రెండవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

శ్రీమంతుడవైన ప్రభువా, మా బోధకొరకు పరిశుద్ధ లేఖనములన్నియు వ్రాయించినావు గనుక, మేము వాటిని విని, చదువుకొని, గుర్తుపట్టి, నేర్చుకొని, లోలోపల ధ్యానించుకొని, నీ పరిశుద్ధ వాక్యమువల్లనైన ఆదరణసహనములు గలవారమై మా రక్షకుడైన యేసుక్రీస్తునందు నీవు మాకు దయచేసిన నిత్యజీవము యొక్క శుభనిరీక్షణ అంగీకరించి యెప్పుడును విడువకుండ ఉండునట్లు దయచేయుము. ఆమేన్.

ఉత్తరము: రోమా 15: 4–13.

సువార్త: పరి. లూకా 21: 25–33.

---

క్రీస్తు రాకదినములలో

## మూడవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువైన యేసుక్రీస్తూ, నీవు మొదటిసారి వచ్చినప్పుడు నీ మార్గము సిద్ధపరచుటకు నీకుముందు నీ దూతను పంపితివిగదా. ఆలాగుననే నీవు లోకమునకు న్యాయము తీర్చుటకు రెండవసారి వచ్చునప్పుడు, మేము నీ దృష్టికి అంగీకృతజనమై యుండునట్లు, ఇప్పుడు నీ మర్మముల సేవకులును ఉగ్రాణపువారును లోబడనివారి హృదయములను నీతిమంతుల జ్ఞానమునకు తిప్పి, నీ మార్గము చక్కపరచి సిద్ధముచేయులాగున అనుగ్రహింపుమని తండ్రితోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడవుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 కొరింథీ 4: 1–5.

సువార్త: పరి. మత్తయి 11: 2–10

---



క్రీస్తు రాకదినములలో

## నాలుగవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ శక్తిని పురికొలిపి, మా మధ్యకు వచ్చి మహాబలముతో మాకు తోడైయుండుము. మా ఎదుట నుంచబడిన పరుగు పరుగెత్తకుండునట్లు మా పాప దుర్మార్గతలవల్ల మిక్కిలి అడ్డగింపబడుచున్న మాకు నీ పూర్ణ కృపాకనికరములవల్ల త్వరగా సహాయముచేసి, మమ్మును తప్పించుమని మా ప్రభువగు నీ కుమారుని ప్రాయశ్చిత్తమునుబట్టి నిన్ను ప్రార్థించుచున్నాము. ఆయనకును నీకును పరిశుద్ధాత్మకును ఘనతామహిమలు యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

ఉత్తరము: ఫిలిప్పీ 4: 4–7.

సువార్త: పరి. యోహాను 1: 19–28.

---

## క్రీస్తు జననదినము.

డిసెంబరు 25-వ తేది.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ జనితైక కుమారుడు మా స్వభావమెత్తి, ఇట్టి సమయమందు శుద్ధురాలైన కన్యకు జన్మించునట్లు దయచేసితివిగదా. పునర్జన్మముపొందినత్తతవల్లను కృపవల్లను నీకు కుమారులమైన మేము నీ పరిశుద్ధాత్మచేత దినదినమును నూతనపరచబడునట్లు, దయచేయుమని నీతోను ఆ పరిశుద్ధాత్మతోను ఎల్లప్పుడును ఏకదేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి మా ప్రభువైన ఆ యేసుక్రీస్తుద్వారానే వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: హెబ్రీ 1: 1–12.

సువార్త: పరి. యోహాను 1: 1–14.

¶ క్రిస్మసు దినపు సంగ్రహము ఉత్తరము సువార్తయు సున్నతి దినమువరకు వాడవలెను. ఈ పుస్తకములో మరియొక యేర్పాటు చేసియున్నను, బిషపు మరియొక సెలవిచ్చియున్నను అట్టిదానిని వాడుకొనవలెను.

---

## పరిశుద్ధుడైన స్తెఫను దినము.

డిసెంబరు 26-వ తేది.

సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ సత్యమునకు సాక్ష్యము పలికినందువలన ఈ లోకమందు శ్రమపడునప్పుడెల్ల మేము పరలోకముతట్టు నిదానించుచు, వెల్లడి కాబోవు మహిమను విశ్వాసముతో చూచునట్లు దయచేయుము. మరియు, నీ నిమిత్తము శ్రమపడువారందరికి సహాయము చేయుటకు దేవుని కుడిచేతివైపున నిలుచుచుండు మా ఏకమధ్యవర్తివియు పక్షవాదివియునగు శ్రీమంతుడవైన యేసు ప్రభువా, తన్ను చంపినవారికొరకు నిన్ను ప్రార్థించిన నీ ప్రథమ హతసాక్షియైన పరిశుద్ధ స్తెఫను దృష్టాంతమునుబట్టి మేమును పరిశుద్ధాత్మతో నింపబడి మమ్మును హింసించువారిని ప్రేమించి ఆశీర్వదించుటకు నేర్చుకొనులాగున దయచేయుము. ఆమేన్.

¶ తరువాత క్రీస్తు జననదినముయొక్క సంగ్రహప్రార్థన రావలెను. ఆ ప్రార్థన సంవత్సరాది భోగివరకు విడువకుండ వాడవలెను.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 7: 55–60.

సువార్త: పరి. మత్తయి 23: 34–39.

---

## సువార్తికుడైన పరిశుద్ధ యోహాను దినము.

డిసెంబరు 27-వ తేది.

సంగ్రహప్రార్థన.

కనికరముగల ప్రభువా, శ్రీమంతుడగు నీ అపొస్తలుడును సువార్తికుడునైన పరిశుద్ధ యోహాను బోధచేత నీ సంఘము వెలిగింపబడి, నీ సత్యమను వెలుగులో నడచి, తుదకు నిత్యజీవమను వెలుగులో చేరునట్లు, దానిమీద నీ తేజస్సుయొక్క కిరణములు ప్రసరింపజేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 యోహాను 1: 1–10.

సువార్త: పరి. యోహాను 21: 19–25.

---



## నిరపరాధుల దినము.

డిసెంబరు 28-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, బాలురయొక్కయు చంటిపిల్లలయొక్కయు నోళ్లద్వారా నీవు బలమేర్పరచి, శిశువులు తమ మరణమువల్ల నిన్ను మహిమపరచునట్లు అనుగ్రహించితివిగదా. మాలోని సమస్త దుర్గుణములను చంపి, మేము నిర్దోష ప్రవర్తనవల్లను, మరణమువరకు నిలిచెడి స్థిరవిశ్వాసమువల్లను నీ పరిశుద్ధ నామము మహిమపరచునట్లు, నీ కృపవల్ల మమ్ములను బలపరచుమని మా ప్రభువైన యేసు క్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: ప్రకటన 14: 1–5.

సువార్త: పరి. మత్తయి 2: 13–18.

---

## క్రిస్మస్ దినము తరువాత వచ్చు ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ జనితైక కుమారుడు మా స్వభావము ఎత్తి ఇట్టి సమయమందు శుద్ధురాలైన కన్యకు జన్మించునట్లు దయచేసితివిగదా. పునర్జన్మము పొంది దత్తతవల్లను కృపవల్లను నీకు కుమారులమైన మేము నీ పరిశుద్ధాత్మచేత దిన దినమును నూతనపరచబడునట్లు దయచేయుమని, నీతోను ఆ పరిశుద్ధాత్మతోను ఎల్లప్పుడును ఏకదేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి మా ప్రభువైన ఆ యేసుక్రీస్తుద్వారానే వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: గలతీ 4: 1–7.

సువార్త: పరి. మత్తయి 1: 18–25.

---

## క్రీస్తు సున్నతి.

జనువరి 1-వ తేది.

సంగ్రహప్రార్థనలు.

సర్వశక్తిగల దేవా, శ్రీమంతుడయిన నీ కుమారుడు మనుష్యులకొరకు సున్నతి పొంది ధర్మశాస్త్రమునకు లోబడునట్లు చేసితివిగదా. మా హృదయములయందును అన్ని అవయవములయందును లోకశరీరసంబంధములైన ఆశలను మేము

చంపి అన్ని విషయములలో నీ దివ్యచిత్తమునకు లోబడునట్లు ఆత్మీయమైన సున్నతిని మాకు దయచేయుమని మా ప్రభువును నీ కుమారుడునైన ఆ యేసు క్రీస్తుద్వారానే వేడుకొనుచున్నాము. ఆమేన్.

నిత్యుడవైన దేవా, మరియొక సంవత్సరపు ఆరంభమును నీ దాసులమైన మేము చూడ ననుగ్రహించినందుకై నీకు వినయస్తోత్రములను చెల్లించుచున్నాము. మా గతకాల పాపములను దయతో క్షమించి, మా జీవితకాలమంతను నీ కృపను మాకు తోడైయుండ ననుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఎఫెసీ 2: 11-18.

సువార్త: పరి. లూకా 2: 15-21.

---

## క్రిస్మస్ దినము తరువాత వచ్చు రెండవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, మనుష్యుని నీ స్వరూపమందు ఆశ్చర్యముగా సృష్టించి, అతడు పడిపోయినప్పుడు తిరిగి అత్యాశ్చర్యముగా అతని యథాస్థానమునకు దెచ్చితివిగదా. నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు మానవస్వరూపమందు చేయబడినట్టే మేము ఆ దివ్యస్వభావమందు పాలిభాగస్థులముగా చేయబడునట్లు దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను యేకదేవుడుగా యుగయుగములు జీవించి యేలుచున్న ఆ నీ కుమారునిద్వారానే నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 2 కొరింథీ 8: 9.

సువార్త: పరి. యోహాను 1: 14-18.

¶ సున్నతి దినము తర్వాత దినములలో ప్రతిదినమందు ఎపిఫనివరకు పై సంగ్రహము ఉత్తరము సువార్త వాడవలెను.

---

## ఎపిఫని, అనగా క్రీస్తు అన్యజనులకు ప్రత్యక్షమగుట.

జనువరి 6-వ తేది.

### సంగ్రహప్రార్థన.

దేవా, నీవు ఒక నక్షత్రమువల్ల త్రోవచూపి, నీ జనితైక కుమారుని అన్యజనులకు ప్రత్యక్షపరచితివిగదా. ఇప్పుడు విశ్వాసమువల్ల నిన్ను ఎరిగియున్న



మేము, ఈ బ్రతుకైనపిమ్మట నీ మహిమగల దేవత్వము అనుభవించులాగున దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఎఫెసీ 3: 1-12.

సువార్త: పరి. మత్తయి 2: 1-12.

¶ ప్రత్యక్షత దినపు సంగ్రహము ఉత్తరము సువార్తయు మరి యేడు దినములవరకు వాడవలెను. ఈ పుస్తకములో మరియొక యేర్పాటుచేసియున్నను, దినపు మరియొకటి సెలవిచ్చియున్నను దానిని వాడుకొనవలెను. ఆలాగు వాడుకొనినప్పుడు ఈ సంగ్రహప్రార్థనను ఆ దినపు సంగ్రహప్రార్థనతో చేర్చికొనవలెను.

---

## ప్రత్యక్షత తరువాత వచ్చెడి మొదటి ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, నిన్ను వేడుకొను నీ జనుల ప్రార్థనలను కనికరముతో అంగీకరించి, వారు చేయవలసినవి తెలిసికొని, గ్రహించి, వాటిని నమ్మకముగా నెరవేర్చుటకు వారికి కృపయు శక్తియు దయచేయుమని మా ప్రభువైన యేసు క్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: రోమా 12: 1-5.

సువార్త: పరి. లూకా 2: 41-52.

---

## ప్రత్యక్షత తరువాత వచ్చెడి రెండవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ఇహపరలోకములయందు సమస్తమును ఏలెడి సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ జనుల విన్నపములు కరుణతో ఆలకించి, మా బ్రతుకు దినములన్నియు నీ సమాధానము మాకు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: రోమా 12: 6-16.

సువార్త: పరి. యోహాను 2: 1-11.

---

## ప్రత్యక్షత తరువాత వచ్చెడి మూడవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, మా బలహీనతలు కరుణతో చిత్తగించి, మాకు ఆపదలును అక్కరలును కలుగునప్పుడెల్ల నీ కుడిచేయి చాపి, మాకు సహాయముచేసి మమ్మును కాపాడుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: రోమా 12: 16-21.
సువార్త: పరి. మత్తయి 8: 1-13.

---

## ప్రత్యక్షత తరువాత వచ్చెడి నాలుగవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

దేవా, ఎన్నో గొప్ప ఉపద్రవములతో ఆవరింపబడియున్న మేము స్వభావ బలహీనతవల్ల ఎల్లప్పుడును నిలువజాలమని నీకు తెలుసునుగదా. ఉపద్రవములన్నిటిలో మాకు ఆధారమై యుండుటకును, శోధనలన్నిటిలోనుండి మమ్మును కడతేర్చుటకును మాకు కావలసినంత బలమును కాపుదలను అనుగ్రహించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: రోమా 13: 1-7.
సువార్త: పరి. మత్తయి 8: 23-34.

---

## ప్రత్యక్షత తరువాత వచ్చెడి అయిదవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ కుటుంబమును సంఘమును నీ నిజమైన భక్తిలో నిరంతరము నిలుపుము. నీ పరమ కృపను కేవలము ఆధారము చేసికొనెడువారు నీ మహాశక్తివల్ల ఎప్పటికిని సంరక్షింపబడునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: కొలొస్స 3: 12-17.
సువార్త: పరి. మత్తయి 13: 24-30.

---



## ప్రత్యక్షత తరువాత వచ్చెడి ఆరవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

దేవా, సాతాను క్రియలు నశింపజేసి మమ్మును దేవుని కుమారులనుగాను నిత్యజీవమునకు బాధ్యులనుగాను చేయుటకు శ్రీమంతుడగు నీ కుమారుడు ప్రత్యక్షమాయెనుగదా. మేము ఈ నిరీక్షణ కలిగి ఆయన పరిశుద్ధుడై యున్నట్లుగా మమ్మును పవిత్రులనుగా చేసికొని, బలముతోను మహా మహిమతోను ఆయన తిరిగి ప్రత్యక్షమగునప్పుడు ఆయన మహిమగల నిత్యరాజ్యమునందు ఆయనను పోలినవారుగా నుండునట్లు దయచేయుమని, తండ్రీ, నీతోను, పరిశుద్ధాత్మా, నీతోను ఎప్పుడును ఏకదేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి ఆయనద్వారానే నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 వ. యోహాను 3: 1-8.
సువార్త: పరి. మత్తయి 24: 23-31.

---

## సప్తజెసిమ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ జనుల ప్రార్థనలు దయతో ఆలకించి, మా తప్పిదముల నిమిత్తము న్యాయముగా శిక్షింపబడు మేము, నీ నామమునకు మహిమ కలుగుటకుగాను నీ కృపవల్ల విడుదల పొందునట్లు అనుగ్రహించుమని నీతోను పరిశుద్ధాత్మతోను ఎల్లప్పుడును ఏకదేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి మా రక్షకుడైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 కొరింథీ 9: 24-27.
సువార్త: పరి. మత్తయి 20: 1-16.

---

## సెక్సజెసిమ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువైన దేవా, మేము చేసెడి దేనియందైనను నమ్మకము ఉంచుకొనువారము కామని నీవు చూచుచున్నావుగదా. ఆపదల అన్నిటినుండి నీ శక్తి

వల్ల మమ్మును తప్పించి కాపాడ ననుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 2 కొరింథీ 11: 19–31.

సువార్త: పరి. లూకా 8: 4–15.

---

## క్విన్‌క్వజెసిమ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

ప్రభువా, ప్రేమ లేనిది మా కార్యములన్నియు ఎందుకును పనికిరావని మాకు నేర్పితివిగదా. ప్రేమ లేనిది యెవడును బ్రతికియుండినను చచ్చినవాడుగా ఎంచబడును గనుక, నీ పరిశుద్ధాత్మను మాకు దయచేసి, సమాధానమునకును సమస్త సద్గుణములకును కేవలము అనుబంధమగు ప్రేమ అనెడి అతిశ్రేష్ఠమైన ఆ వరమును మా హృదయములలో క్రుమ్మరించుమని నీ అద్వితీయకుమారుడైన యేసుక్రీస్తునిమిత్తము బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 కొరింథీ 13: 1–13.

సువార్త: పరి. లూకా 18: 31–43.

---

## భస్మ బుధవారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీవు కలుగచేసినవాటిలో దేనినైనను ద్వేషింపక పశ్చాత్తాప్తుల పాపములు క్షమించెడివాడవుగదా. మేము మా పాపములనుగురించి తగునట్లుగా దుఃఖించి, మా దుర్దశను ఒప్పుకొని, నిండు కనికరముగల దేవుడవైన నీచేత పూర్ణమైన పాపపరిహారమును పాపక్షమయు పొందులాగున మాలో నలిగినట్టి నూతన హృదయములను సృష్టించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ లెంటుయొక్క ఆయా దినమునకు ఏర్పరచబడిన సంగ్రహప్రార్థనకు తరువాత ఈ పై ప్రార్థనను పునరుత్థానమునకు పూర్వపు గురువారము వరకు చదువవలెను.

ఉత్తరమునకు ప్రతి: యోవేలు 2: 12–17.

సువార్త: పరి. మత్తయి 6: 16–21.

---



## లెంటులోని మొదటి ఆదివారము.

సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీవు మా నిమిత్తము రేయింపగలు నలుబది దినములు ఉపవాసము చేసితివిగదా. శరీరము ఆత్మకు అణిగియుండి, మేము నీతితోను నిజమైన పరిశుద్ధతతోను నీ దివ్య ప్రేరణలకు ఎల్లప్పుడును లోబడునట్లు తగిన ఉపవాసము చేయుటకు మాకు కృపనిమ్ము. తండ్రితోను పరిశుద్ధాత్మతోను ఏక దేవుడవుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి నీకు ఘనతామహిమలు కలుగునుగాక. ఆమేన్.

ఉత్తరము: 2 కొరింథీ 6: 1–10.

సువార్త: పరి. మత్తయి 4: 1–11.

---

## లెంటులోని రెండవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, మమ్మును మేమే కాపాడుకొనుటకు ఎంతమాత్రమును శక్తిమంతులము కామని చూచుచున్నావుగదా. శరీరమునకు చెందగల ఆపదలన్నిటినుండియు, ఆత్మను పైబడి పీడించు చెడ్డ తలంపులన్నిటినుండియు మమ్మును తప్పించి, వెలపట మా శరీరములను లోపట మా ఆత్మలను కాపాడుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 థెస్స 4: 1–8.

సువార్త: పరి. మత్తయి 15: 21–28.

---

## లెంటులోని మూడవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ వినయసేవకులయొక్క మనస్పూర్తియైన కోరికలు చిత్తగించి, మా శత్రువులందరికిని అడ్డముగా నీ మహాత్మ్యముగల కుడిచేయి చాపి మమ్మును కాపాడుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఎఫెసీ 5: 1–14.

సువార్త: పరి. లూకా 11: 14–28.

---

## లెంటులోని నాలుగవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, మా దుష్క్రియలనుబట్టి శిక్షకు పాత్రులమైయున్న మమ్మును నీ కృపాదరణవల్ల ఓదార్చి విడిపింపుమని మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: హెబ్రీ 12: 22–24.
సువార్త: పరి. యోహాను 6: 1–14.

---

## లెంటులోని అయిదవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ జనులను కటాక్షించి, శరీరాత్మలయందు నీ గొప్ప దయచేత వారిని ఎల్లప్పుడును ఏలి రక్షింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: హెబ్రీ 9: 11–15.
సువార్త: పరి. యోహాను 8: 46–59.

---

మట్టల ఆదివారమని సాధారణముగా పిలువబడు

## పునరుత్థానమునకు పూర్వపు ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీవు మానవకోటిమీద మిక్కిలి వాత్సల్యముగలిగి, నీ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తుయొక్క అత్యంత వినయమును అందరును దృష్టాంతముగా అనుసరించునట్లు ఆయన మా శరీరము తాల్చి సిలువమీద మరణము పొందుటకు ఆయనను పంపితివిగదా. మేము ఆయన ఓర్పును దృష్టాంతముగా అనుసరించి, ఆయన పునరుత్థానములోకూడ పాలివారమగునట్లు మా ప్రభువైన ఆ యేసుక్రీస్తుద్వారానే దయచేయుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.



¶ పరి. మత్తయి 26: 1–27: 61 లోని శ్రమల చరిత్రను ఈ దినపు సమస్యాక్ష్య ఆరాధనలో సువార్తకు ముందు చదువవచ్చును. అలాగున చదివినయెడల;

ఉత్తరము: ఫిలిప్పీ 2: 5–11.
సువార్త: పరి. మత్తయి 27: 62–66.
లేదా, పరి. మత్తయి 21: 2–13.

¶ మరియు ఈ దినమునకు యేర్పరచబడియున్న రెండవపాఠమునకు ప్రతిగా ఈ దిగువ వచ్చునాటిని వాడవచ్చును.

ఉదయము: పరి. లూకా 19: 29–48.
సాయం: పరి. లూకా 20: 9–20.
లేదా, పరి. యోహాను 12: 1–19.

---

## పునరుత్థానమునకు పూర్వపు సోమవారము.

ఉత్తరమునకు ప్రతి: యెషయా 63: 1–19.
సువార్త: పరి. మార్కు 14: 1–72.

---

## పునరుత్థానమునకు పూర్వపు మంగళవారము.

ఉత్తరమునకు ప్రతి: యెషయా 50: 5–11.
సువార్త: పరి. మార్కు 15: 1–39.

---

## పునరుత్థానమునకు పూర్వపు బుధవారము.

ఉత్తరము: హెబ్రీ 9: 19–28.
సువార్త: పరి. లూకా 22: 1–71.

---

## పునరుత్థానమునకు పూర్వపు గురువారము.

ఉత్తరము: 1 కొరింథీ 11: 17–34.
సువార్త: పరి. లూకా 23: 1–49.

---

## మంచి శుక్రవారము.

### సంగ్రహప్రార్థనలు.

సర్వశక్తిగల దేవా, మా ప్రభువైన యేసుక్రీస్తు ఈ నీ కుటుంబము నిమిత్తము దుష్టుల చేతులకు అప్పగింపబడి సిలువమీద మరణము పొందుటకు సమ్మతించెను గనుక, అట్టి యీ నీ కుటుంబమును కటాక్షింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను జీవించి యేలుచుండెడి ఆయన ద్వారానే నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, సంఘమను శరీరమంతయు నీ ఆత్మచేత ఏలబడి పరిశుద్ధపరచబడుచున్నది గనుక, అందులోని ప్రతి అవయవమును తనతన ఉద్యోగములోను సేవలోను నమ్మకముగాను భక్తిగాను నిన్ను సేవించునట్లు నీ పరిశుద్ధ సంఘములోని అన్ని స్థితులుగలవారికొరకు నీ యెదుట మేము చేయు విన్నపములను ప్రార్థనలను చిత్తగింపుమని మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తుద్వారా బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

కనికరముగల దేవా, నీవు మనుష్యులనందరిని సృష్టించి, నీవు సృష్టించిన దేనినైనను ద్వేషింపక, పాపాత్ముడు చావక మళ్లుకొని బ్రతుకవలెనని కోరువాడవు గదా. నీ పురాతనజనులైన యూదులను, నిన్ను ఎరుగని జనాంగములను, సిలువ వేయబడిన క్రీస్తు విశ్వాసమును దిక్కరించువారందరిని కనికరింపుము. సమస్తమైన అజ్ఞానమును హృదయ కాఠిన్యమును నీ వాక్య తిరస్కారమును వారిలోనుండి తీసివేయుము. మరియు, శ్రీమంతుడవైన ప్రభువా, వారు నిజమైన ఇశ్రాయేలీయుల శేషముతోకూడ రక్షింపబడి, గొర్రెల ఒకే కాపరి క్రింద ఏక మందగా ఉండునట్లు వారిని నీ మందలోనికి తెచ్చి చేర్చుమని నీతోను పరిశుద్ధాత్మతోను యుగయుగములకు ఏకదేవుడుగా జీవించి యేలుచుండెడి మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: హెబ్రీ, 10: 1–25.

సువార్త: పరి. యోహాను 19: 1–37.

¶ పరి. యోహాను 18: 1–19: 37 లోని శ్రమల చరిత్రను ఈ దినపు సమర్పణ ఆరాధనలో సువార్తకు ముందు చదువవచ్చును. ఆలాగు చదివినయెడల;

ఉత్తరము: హెబ్రీ, 10: 1–25.

సువార్త: పరి. యోహాను 19: 38–42.

¶ మరియు ఉదయ ప్రార్థనలోని రెండవ పాఠమునకు ప్రతిగా పరి. యోహాను 12: 20–33 వాడవచ్చును.

---



## పునరుత్థానమునకు తొలిదినము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, శ్రీమంతుడైన నీ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క మరణములోనికి ఏలాగున బాప్తిస్మము పొందితిమో, ఆలాగుననే మా దురిచ్ఛలను నిత్యమును చంపుటవల్ల ఆయనతోకూడ పాతిపెట్టబడి, సమాధిని మరణద్వారమును దాటి, సంతోషకరమయిన మా పునరుత్థానమును పొందులాగున, మాకొరకు చనిపోయి పాతిపెట్టబడి తిరిగి లేచిన నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు పుణ్యమునుబట్టి దయచేయుము. ఆమేన్.

ఉత్తరము: 1 వ. పేతురు 3: 17–22.

సువార్త: పరి. మత్తయి 27: 57–66.

¶ ఈ దినపు సాయంప్రార్థనలో పై సంగ్రహ ప్రార్థనమాత్రమే వాడవలెను.

---

## పునరుత్థానదినము.

¶ పునరుత్థాన దినములలోను, తరువాతి యేడు దినములలోను ఉదయ ప్రార్థనయందు 'రండి ప్రభువునుగూర్చి' అను కీర్తనకు ప్రతిగా ఈ దిగువచ్చు గానములు పాడవలెను, లేదా చదువవలెను.

క్రీస్తను మన పస్కాపశువు మనకొరకు వధింపబడెను గనుక : పండుగనాచరింతము.

పాతదైన పులిపిండితోనైనను, దుర్మార్గతయు దుష్టత్వమునను పులిపిండితోనైనను కాకుండ : నిష్కాపట్యమును సత్యమునను పులియని రొట్టెతో పండుగనాచరింతము. (1 కొరింథీ 5: 7).

మృతులలోనుండి లేచిన క్రీస్తు ఇకను చనిపోడు : మరణమున కికను ఆయనమీద ప్రభుత్వము లేదు.

ఏలననగా, ఆయన చనిపోవుట చూడగా, పాపవిషయమై ఒక్కమారే చనిపోయెనుకాని : ఆయన జీవించుట చూడగా, దేవునివిషయమై జీవించుచున్నాడు.

అటువలె మీరును పాపమువిషయమై మృతులుగాను : దేవునివిషయమై క్రీస్తుయేసునందు జీవితులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి. (రోమే 6: 9—13).

నిద్రించినవారిలో ప్రథమ ఫలముగా : క్రీస్తు మృతులలోనుండి లేపబడి యున్నాడు.

మనుష్యునిద్వారా మరణము వచ్చెను గనుక : మనుష్యునిద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను.

ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో : ఆలాగుననే క్రీస్తునందు అందరును బ్రతికింపబడుదురు. (1 కొరింథీ 15: 20—23).

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడును ఉండునట్లు : యుగయుగములకును కలుగునుగాక. ఆమేన్.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తువల్ల మరణమును జయించి నిత్యజీవద్వారము మాకు తెరిచితివిగదా. నీ విశేషమైన కృపా ప్రవేశమువల్ల మా మనస్సులయందు మంచి కోరికలు పుట్టించుచున్నట్టు, నీ నిత్యసహాయమువల్ల వాటిని మేము సఫలమగునట్లు చేసికొనులాగున దయచేయు మని నీతోను పరిశుద్ధాత్మతోను ఎప్పుడును ఏకదేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వినయముగా వేడుకొనుచున్నాము. ఆమేన్.

దేవా, మా విమోచనము నిమిత్తము నీ అద్వితీయ కుమారుని సిలువమరణ మునకు అప్పగించి, ఆయన మహిమగల పునరుత్థానమువల్ల మా శత్రువుయొక్క బలమునుండి మమ్మును విడిపించితివిగదా. ఆయన పునరుత్థాన సంతోషములో మేము ఎప్పుడును ఆయనతో జీవించునట్లు పాపమునకు దినదినమును చనిపోవు లాగున మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారానే దయచేయుము. ఆమేన్.

ఉత్తరము: కొలొస్సై 3: 1–7.

సువార్త: పరి. యోహాను 20: 1–10.

---



## పునరుత్థానదినము తరువాత వచ్చెడి సోమవారము.

ఉత్తరమునకు ప్రతి: అపో. కార్య. 10: 34–43.

సువార్త: పరి. లూకా 24: 13–35.

---

## పునరుత్థానదినము తరువాత వచ్చెడి మంగళవారము.

ఉత్తరమునకు ప్రతి: అపో. కార్య. 13: 26–41.

సువార్త: పరి. లూకా 24: 36–48.

---

## పునరుత్థానము తరువాత వచ్చెడి మొదటి ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల తండ్రీ, మా యపరాధములనిమిత్తము చనిపోవుటకును మేము నీతిమంతులముగా తీర్చబడునిమిత్తము తిరిగి లేచుటకును నీ అద్వితీయకుమారుని ఇచ్చితివిగదా. మేము దుర్మార్గతయు దుష్టత్వమును అను పులిపిండిని రోసివేసి, శుద్ధప్రవర్తనతోను సత్యముతోను నిన్ను ఎప్పుడును సేవించునట్లు దయచేయు మని మా ప్రభువును నీ కుమారుడునైన యేసుక్రీస్తు పుణ్యమునుబట్టి వేడుకొను చున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 ప. యోహాను 5: 4–12.

సువార్త: పరి. యోహాను 20: 19–23.

---

## పునరుత్థానము తరువాత వచ్చెడి రెండవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, పాపములకొరకు బలిగాను నీతి ప్రవర్తనకు దృష్టాంతము గాను నీ అద్వితీయ కుమారుని అనుగ్రహించితివిగదా. మేము ఎప్పుడును ఆయన చేసిన యెంచజాలని యీ ఉపకారమును అతి కృతజ్ఞతతో అంగీకరించి, మిక్కిలి పరిశుద్ధమైన ఆయన అడుగు జాడలనుబట్టి నడుచుకొనుటకు అనుదిన

మును ప్రయత్నముచేయులాగున మాకు కృప దయచేయుమని మా ప్రభువైన ఆ యేసుక్రీస్తుద్వారానే వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 ప. పేతురు 2: 19–25.
సువార్త: పరి. యోహాను 10: 11–16.

---

## పునరుత్థానము తరువాత వచ్చెడి మూడవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, త్రోవతప్పినవారు నీతిమార్గములోకి తిరుగునట్లు వారికి నీ సత్యమను వెలుగు కనపరుచువాడవు నీవేగదా. క్రీస్తుమత సాంగత్యములో చేర్చబడినవారందరు తాము పూనుకొన్నవాటికి ప్రతికూలమైనవి విసర్జించి, అనుకూలమైనవన్నియు అనుసరించునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 ప. పేతురు 2: 11–17.
సువార్త: పరి. యోహాను 16: 16–22.

---

## పునరుత్థానము తరువాత వచ్చెడి నాలుగవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, పాపుల మూర్ఖ భావములను ఆశలను చక్కపరచగలవాడవు నీవేగదా. నీ జనులమైన మేము నీవు ఆజ్ఞాపించినవి ప్రేమించి నీవు వాగ్దానము చేసినవి అపేక్షించుటవల్ల, లోకమందు నానావిధములైన మార్పులు కలుగుచుండగా, నిజమైన సంతోషము ఎక్కడ కలుగునో అక్కడనే మా హృదయములు నిలకడగా ఉండునట్లు అనుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ప. యాకోబు 1: 17–21.
సువార్త: పరి. యోహాను 16: 5–15.

---



## పునరుత్థానము తరువాత వచ్చెడి అయిదవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

అన్ని మేలులకు కారకుడవైన ప్రభువా, మేము నీ పరిశుద్ధమైన ఆవేశమువల్ల మంచివాటిని ఉద్దేశించి, నీ దయగల సహాయమువల్ల వాటిని కొనసాగించునట్లు నీ వినయ సేవకులమైన మాకు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ప. యాకోబు 1: 22–27.
సువార్త: పరి. యోహాను 16: 23–33.

---

## ఆరోహణ దినము.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ జనితైక కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు పరలోకమునకు ఎక్కిపోయినాడని మేము నమ్ముచున్నట్లు, హృదయముతోను మనస్సుతోను మేమును అక్కడికి ఎక్కి, నీతోను పరిశుద్ధాత్మతోను ఏకదేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి ఆయనతోకూడ నిరంతరమును నివసించునట్లు దయచేయుమని అతి వినయముతో వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 1: 1–11.
సువార్త: పరి. లూకా 24: 44–53.

¶ ఆరోహణ దినపు సంగ్రహము ఉత్తరము సువార్తయు మరి యేడుదినములవరకు వాడవలెను గాని ఈ పుస్తకములో మరియొక యేర్పాటుయున్నను, బిషపు మరియొకటి సెలవిచ్చియున్నను అట్టిదానిని వాడవలెను.

---

## ఆరోహణ దినము తరువాత వచ్చెడి ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

మహిమాధిపతియగు దేవా, నీ అద్వితీయకుమారుడైన యేసుక్రీస్తును పరలోకమందుండు నీ రాజ్యమునకు మహా జయముతో హెచ్చించితివిగదా. మమ్మును అనాథులనుగా విడువక మమ్మును ఆదరించుటకును, మా రక్షకుడైన క్రీస్తు ముందుగా వెళ్లిన ఆ స్థలమునకు మమ్మును హెచ్చించుటకును నీ పరి

శుద్ధాత్మను మాయొద్దకు పంపుమని నీతోను పరిశుద్ధాత్మతోను ఏకదేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి ఆయనద్వారానే నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 ప. పేతురు 4: 7–11.

సువార్త: పరి. యోహాను 15: 26–16: 4.

---

## పరిశుద్ధాత్మ దినము.

### సంగ్రహప్రార్థన.

దేవా, నీ పరిశుద్ధాత్మయొక్క వెలుగును ఇట్టి కాలమందు పంపి, నీ విశ్వాసుల హృదయములకు బోధించితివిగదా. మేము ఆ యాత్మవల్లనే అన్ని విషయములలో మంచి వివేకము కలిగి, ఆయన పరిశుద్ధమైన ఆదరణవల్ల ఎల్లప్పుడును సంతోషించునట్లు దయచేయుమని నీతో ఆ యాత్మయొక్క ఏకత్వమందు ఏకదేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి మా రక్షకుడైన యేసుక్రీస్తు పుణ్యమునుబట్టి నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 2: 1–11.

సువార్త: పరి. యోహాను 14: 15–31.

---

## పరిశుద్ధాత్మదినము తరువాత వచ్చెడి సోమవారము.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 10: 34–48.

సువార్త: పరి. యోహాను 3: 16–21.

---

## పరిశుద్ధాత్మదినము తరువాత వచ్చెడి మంగళవారము.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 8: 14–17.

సువార్త: పరి. యోహాను 10: 1–10.

---

## త్రిత్వపు ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ సేవకులమైన మేము నిజమైన విశ్వాసమును ఒప్పుకొనుటవల్ల నిత్య త్రిత్వపు మహిమను అంగీకరించునట్లును, నీదివ్య



మాహాత్మ్యముయొక్క శక్తితో ఏకదేవుడైన నిన్ను పూజించునట్లును మాకు కృప నిచ్చితివిగదా. ఈ విశ్వాసమందు మమ్మును స్థిరపరచి, దానికి విరుద్ధమైన అన్నిటినుండి మమ్మును తప్పించి యెప్పుడును కాపాడుమని యేకదేవుడవుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: ప్రకటన 4: 1–11.

సువార్త: పరి. యోహాను 3: 1–15.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి మొదటి ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

నిన్ను నమ్మినవారందరికిని బలమైయుండు దేవా, మా ప్రార్థనలు కరుణతో చిత్తగించుము. మరియు, మా మర్త్య స్వభావ బలహీనతనుబట్టి నీవు లేనిది మంచిది యేదియు చేయజాలము గనుక, మేము నీ ఆజ్ఞలు గైకొని చిత్తవృత్తిచేతను క్రియచేతను నిన్ను సంతోషపరచులాగున నీ కృపాసహాయము మాకు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 ప. యోహాను 4: 7–21.

సువార్త: పరి. లూకా 16: 19–31.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి రెండవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీయందు స్థిరమైన భయమందును ప్రేమయందును నీవు పెంచువారికి ఎడతెగక సహాయముచేసి వారిని ఏలుచున్నావుగదా. నీ దయాసంకల్పమువల్ల మమ్మును కాపాడి, నీ పరిశుద్ధ నామమునందు మేము నిరంతరమును భయమును ప్రేమయును గలిగియుండునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 ప. యోహాను 3: 13–24.

సువార్త: పరి. లూకా 14: 16–24.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి మూడవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, కరుణతో మా మొర ఆలకింపుము. ప్రార్థించుటకు మన స్ఫూర్తియైన కోరిక మాకు దయచేసినావు గనుక, మేము నీ అధికమైన సహాయమువల్ల ఉపద్రవములన్నిటిలోను ఇరుకులన్నిటిలోను కాపాడబడి ఆదరింపబడునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 ప. పేతురు 5: 5–11.

సువార్త: పరి. లూకా 15: 1–10.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి నాలుగవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

నిన్ను నమ్మినవారందరికిని ప్రాపకుడవైన దేవా, నీవు లేనిది బలమైనది పరిశుద్ధమైనది యేదియు కానేరదు గదా. నీవు మమ్మును ఏలి నడిపించువాడవైనందున, మేము ఈ జీవన యాత్రయందు అశాశ్వతమైనవాటిని తగురీతిగా అనుభవించి, తుదకు శాశ్వతమైనవాటిని పోగొట్టుకొనకుండునట్లు, మా మీద నీ కనికరము విస్తరింపచేయుము. ఓ పరలోకపు తండ్రీ, ఇది మా ప్రభువైన యేసుక్రీస్తునిమిత్తము అనుగ్రహింపుము. ఆమేన్.

ఉత్తరము: రోమా 8: 18–23.

సువార్త: పరి. లూకా 6: 36–42.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి అయిదవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ సంఘము భక్తిసహితమైన నెమ్మదితో నిన్ను సంతోషముగా సేవించులాగున ఈ లోకచర్య నీ పరిపాలనచేత సమాధానముగా జరుపబడునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 ప. పేతురు 3: 8–15.

సువార్త: పరి. లూకా 5: 1–11.

---



## త్రిత్వము తరువాత వచ్చెడి ఆరవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

దేవా, నిన్ను ప్రేమించువారికొరకు మనుష్య బుద్ధికి మించిన మంచివాటిని సిద్ధపరిచితివిగదా. మేము నిన్ను అన్నిటికంటె ఎక్కువగా ప్రేమించి, కోరగల సమస్తమునకు మించిన నీ వాగ్దానములు పొందులాగున మా హృదయములలో నీయందు తగిన ప్రేమను పోయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: రోమా 6: 3–11.

సువార్త: పరి. మత్తయి 5: 20–26.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి యేడవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

సర్వాధికారమును సర్వశక్తియుగల ప్రభువా, అన్ని మేలులకు కారకుడవును దాతవునైన దేవా, నీ నామమందలి ప్రేమను మా హృదయములలో నాటుము. మాలో నిజమైన దైవభక్తి వృద్ధిచేయుము. నీతితో మమ్మును పెంచి, అందులోనే నీ గొప్ప కనికరముచేత మమ్మును నిలుపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: రోమా 6: 19–23.

సువార్త: పరి. మార్కు 8: 1–9.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి యెనిమిదవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

దేవా, ఎన్నటికిని తప్పని నీ సంకల్పమువల్ల పరలోక భూలోకములయందు సమస్తమును జరుగుచున్నది గనుక, హానికరమైనవాటినన్నిటిని మాయొద్దనుండి తొలగించి, మాకు ఉపయోగకరమైనవన్నియు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వినయముతో వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: రోమా 8: 12–17.

సువార్త: పరి. మత్తయి 7: 15–21.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి తొమ్మిదవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీవు లేనిది మంచిదేదియు చేయజాలని మేము నీ చిత్తప్రకారము నీవల్లనే ప్రవర్తింపగలవారమగునట్లు ఎప్పుడును యుక్తమైనవి తలంచుటకును చేయుటకును తగిన మనస్సు మాకు కలుగచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 కొరింథీ 10: 1–13.
సువార్త: పరి. లూకా 15: 11–32.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి పదియవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ వినయ సేవకులు చేయు ప్రార్థనలకు కనికరముగా నీ చెవి నొగ్గి, వారు తమ మనవులు అంగీకరింపబడులాగున నీకు ఇష్టమైనవాటిని గురించి వేడుకొనునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 కొరింథీ 12: 1–11.
సువార్త: పరి. లూకా 19: 41–47.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి పదునొకొండవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

దేవా, నీవు దయాదాక్షిణ్యములను చూపుటవల్లనే ముఖ్యముగా నీ సర్వశక్తిని అగుపరచువాడవుగదా. మేము నీ యాజ్ఞల మార్గమందు పరుగెత్తి, నీ దయగల వాగ్దానములను చేకొనుటకును, నీ దివ్య నిధిలో పాలు పొందుటకును తగిన కృపను అనుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 కొరింథీ 15: 1–11.
సువార్త: పరి. లూకా 18: 9–14.

---



## త్రిత్వము తరువాత వచ్చెడి పండ్రెండవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, ప్రార్థించుటకు మేము సిద్ధముగా ఉండునంతకంటె ఆలకించుటకు నీవు ఎల్లప్పుడు మిక్కిలి సిద్ధముగా ఉన్నావు గనుకను, మేము కోరునంతకంటెను పొందుటకు యోగ్యులమై యున్నంతకంటెను అధికముగా దయచేయువాడవు గనుకను, నీ కరుణాసమృద్ధి మా మీద కుమ్మరించి, వేటినిగూర్చి మా మనస్సాక్షి భయపడుచున్నదో వాటిని క్షమించుము. మరియు మా ప్రభువును నీ కుమారుడునైన యేసుక్రీస్తు పుణ్యము వలనను మధ్యవర్తనము వలనను తప్ప మరిదేనివలననైనను అడుగుటకు యోగ్యులము కామో అట్టి మంచివాటిని మాకు దయచేయుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 2 కొరింథీ 3: 4–9.
సువార్త: పరి. మార్కు 7: 31–37.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి పదుమూడవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తియు కనికరమునుగల దేవా, నీ విశ్వాసులు నీకు మెచ్చదగిన యథార్థమైన సేవచేయుట నీ యీవివల్లనే కలుగుచున్నది గదా. తుదకు మేము నీ పరమ వాగ్దానములను తప్పకుండా పొందులాగున, ఇహమందు నిన్ను నమ్మకముగా సేవించునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తు పుణ్యమును బట్టి నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: హెబ్రీ 13: 1–6.
సువార్త: పరి. లూకా 10: 23–37.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి పదునాలుగవ ఆదివారము.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, విశ్వాసము నిరీక్షణ ప్రేమయు మాలో వృద్ధిచేసి, నీవు వాగ్దానముచేసినది మేము పొందులాగున నీవు ఆజ్ఞాపించునది మేము ప్రేమించునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: గలతీ 5: 16–24.
సువార్త: పరి. లూకా 17: 11–19.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి పదునైదవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ యెడతెగని కనికరముతో నీ సంఘమును కాపాడుము. మానవుడు బలహీనుడైయున్నందున నీవు లేనిది నిలువజాలడు గనుక, హానికరమైన అన్నిటినుండి మమ్మును తప్పించి నీ సహాయమువల్ల ఎప్పుడును కాపాడి, మా రక్షణకు ఉపయోగమైన వాటినన్నిటిని మేము పొందునట్లు మమ్మును నడిపించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: గలతీ 6: 11-18.

సువార్త: పరి. మత్తయి 6: 24-34.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి పదునారవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ సంఘముమీద ఎడతెగని జాలికలిగి దాని శుద్ధిచేసి కాపాడుము. మరియు అది నీ తోడులేనిది సురక్షితముగా నిలువనేరదు గనుక, నీ దయా సహాయములచేత ఎల్లప్పుడును దాని సంరక్షింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఎఫెసీ 3: 13-21.

సువార్త: పరి. లూకా 7: 11-17.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి పదునేడవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ కృప యెల్లప్పుడు మాకు ముందు వెనుకలను నడిచి, సత్క్రియలన్నిటియందు మేము ఎడతెగక ఆసక్తులమగునట్లు దయచేయవలెనని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను ప్రార్థించుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఎఫెసీ 4: 1-6.

సువార్త: పరి. లూకా 14: 1-11.

---



## త్రిత్వము తరువాత వచ్చెడి పదునెనిమిదవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, లోకమువల్లను శరీరమువల్లను సాతానువల్లను కలిగెడి శోధనలను ఎదిరించుటకును, శుద్ధ హృదయములతోను శుద్ధ మనస్సులతోను ఏకదేవుడవైన నిన్ను వెంబడించుటకును నీ జనులకు కృపనిమ్మని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 కొరింథీ 1: 4-8.

సువార్త: పరి. మత్తయి 22: 34-46.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి పందొమ్మిదవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

దేవా, నీవు లేనిది మేము నిన్ను సంతోషపరచజాలము గనుక నీ పరిశుద్ధాత్మ అన్నివిషయములలో మా హృదయములను నడిపించి యేల ననుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఎఫెసీ 4: 17-32.

సువార్త: పరి. మత్తయి 9: 1-8.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి యిరువదవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తియు మిక్కిలి కనికరమునుగల దేవా, మేము శరీరాత్మలయందు సిద్ధముగానుండి చేయవలసినదని నీవు కోరినది సంతోషముతో నెరవేర్చునట్లు హానికరమైన యన్నిటినుండి మమ్మును తప్పించి, నీ విశేషదయవల్ల కాపాడుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఎఫెసీ 5: 15-21.

సువార్త: పరి. మత్తయి 22: 1-14.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి యిరువదియొకటవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

కనికరముగల ప్రభువా, నీ విశ్వాసులు తమ పాపములన్నిటినుండి పవిత్రపరచబడి నెమ్మదిగల మనస్సుతో నిన్ను సేవించునట్లు వారికి పాపక్షమయు సమాధానమును దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఎఫెసీ 6: 10–20.

సువార్త: పరి. యోహాను 4: 46–54.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి యిరువదిరెండవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, సంఘమను నీ కుటుంబము నిరంతరమును భక్తిగలదై యుండునట్లు చేయుము. అది నీ కాపువల్ల అన్ని అపాయములనుండి తప్పించుకొని నీ నామ మహిమార్థమై సత్క్రియలతో నిన్ను సేవించుటకు ఆసక్తిగలదగునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఫిలిప్పీ 1: 3–11.

సువార్త: పరి. మత్తయి 18: 21–35.

---

## త్రిత్వము తరువాత వచ్చెడి యిరువదిమూడవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

మాకు దిక్కును బలమునైన ఓ దేవా, సమస్త దైవభక్తికి కర్తా, నీ సంఘము యొక్క భక్తిగల ప్రార్థనలు ఆలకించుటకు సిద్ధముగానుండి, మేము విశ్వాసముతో వేడుకొనునవి సఫలముగా పొందునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఫిలిప్పీ 3: 17–21.

సువార్త: పరి. మత్తయి 22: 15–22.

---



## త్రిత్వము తరువాత వచ్చెడి యిరువదినాలుగవ ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, పరలోకపు తండ్రీ, నీ జనులను వారి యపరాధములనుండి విమోచింపుము. మా బలహీనతవల్ల మేమందరము చేసిన పాపబంధములనుండి నీ విశేషదయచేత మమ్మును విడిపింపుమని శ్రీమంతుడగు మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తునిమిత్తము నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: కొలొస్సై 1: 3–12.

సువార్త: పరి. మత్తయి 9: 18–26.

---

## రాక ఆదివారమునకు వెనుకటి ఆదివారము.

### సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ విశ్వాసులు సత్క్రియలను ఫలములు విస్తారముగా ఫలించి నీచేత సమృద్ధిగా బహుమానకరింపబడునట్లు, వారి చిత్తవృత్తులను పురికొలుపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: యిర్మీయా 23: 5–8.

సువార్త: పరి. యోహాను 6: 5–14.

¶ రాక ఆదివారము తటస్థింపక పూర్వము ఇంకా ఆదివారములు మిగిలితే; ఇక్కడ ఎన్ని సంగ్రహప్రార్థనలు ఉత్తరములు సువార్తలు తక్కువగునో అన్నింటిని ఎపిఫని తరువాత వచ్చిన ఆదివారములలో అప్పుడు చదువక విడిచిపెట్టినవాటిలోనుండి తీసి, వాడుకొని, లెక్క సంపూర్తిచేయవలెను. త్రిత్వపు ఆదివారములు తక్కువైతే అక్కరలేని సంగ్రహప్రార్థనలు మొదలగునవి విడిచిపెట్టవచ్చునుగాని, యీ చివర సంగ్రహప్రార్థనయు ఉత్తరమును సువార్తయు రాకకు తొలి ఆదివారమున తప్పకుండ వాడవలెను.

---

## పరిశుద్ధ అంద్రెయ దినము.

నవంబరు 30-వ తేది.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ పరిశుద్ధ అపొస్తలుడైన అంద్రెయను నీ కుమారుడైన యేసుక్రీస్తు పిలువగానే అతడు సిద్ధమనస్సుతో విని జాగుచేయకుండా ఆయనను వెంబడించుటకు కృప దయచేసినావు గనుక, నీ పరిశుద్ధ వాక్యమువల్ల పిలువబడిన మేమందరమును వినయముగా నీ పరిశుద్ధాజ్ఞలను నెరవేర్చుటకు వెంటనే నీకు లోబడునట్లు కృప ననుగ్రహించుమని ఆ మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారానే వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: రోమా 10: 9–21.

సువార్త: పరి. మత్తయి 4: 18–22.

---

## అపొస్తలుడైన పరిశుద్ధ తోమా దినము.

డిసెంబరు 21-వ తేది.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగలిగి సదా జీవించుచుండు దేవా, క్రీస్తునందలి విశ్వాసమును మరింత యెక్కువ స్థిరపరచుటకై నీ కుమారుని పునరుత్థానమునుగురించి నీ పరిశుద్ధ అపొస్తలుడైన తోమాను సందేహపడ నవకాశమిచ్చితివిగదా. మా విశ్వాసమునుబట్టి నీ దృష్టిలో మేము ఎన్నడును గద్దింపబడకుండునట్లు నీ కుమారుడైన యేసుక్రీస్తును సంపూర్ణముగాను నిస్సందేహముగాను విశ్వసించులాగున దయచేయుము. ఓ ప్రభువా, ఆ యేసుక్రీస్తుద్వారానే మా ప్రార్థనలు ఆలకించుము. ఆయనకును నీకును పరిశుద్ధాత్మకును సమస్త ఘనతయు మహిమయు ఇప్పుడును ఎప్పుడును కలుగునుగాక. ఆమేన్.

ఉత్తరము: ఎఫెసి 2: 19–22.

సువార్త: పరి. యోహాను 20: 24–31.

---



## పరిశుద్ధ పౌలు మారుమనస్సు పొందిన దినము.

జనువరి 25-వ తేది.

### సంగ్రహప్రార్థన.

దేవా, ధన్యుడగు నీ అపొస్తలుడైన పరిశుద్ధ పౌలు ప్రసంగించుటచేత సువార్తవెలుగు లోకమందంతటను ప్రకాశింపజేసితివిగదా. అతడు వింతగా మారుమనస్సు పొందిన సంగతి మేము జ్ఞాపకము చేసికొని, అందునిమిత్తమై నీయెడల మా కృతజ్ఞతను అతడు నేర్పిన పరిశుద్ధోపదేశమును అనుసరించుటవల్ల మేము కనుపరచునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 9: 1–22.

సువార్త: పరి. మత్తయి 19: 27–30.

---

## క్రీస్తు దేవాలయములో సమర్పింపబడిన దినము.

దీనికి సాధారణమయిన పేరు:

## పరిశుద్ధురాలగు కన్య మరియ శుచిదినము.

ఫిబ్రవరి 2-వ తేది.

### సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగలిగి సదా జీవించుచుండు దేవా, నీ జనితైకకుమారుడు మా శరీరతత్త్వముగలవాడై దేవాలయములో నేడు సమర్పింపబడిన ప్రకారము, మేముకూడ మా ప్రభువును నీ కుమారుడునైన ఆ యేసుక్రీస్తువల్లనే శుద్ధ హృదయులమై మమ్మును మేము నీకు సమర్పించుకొనులాగున అనుగ్రహింపుమని మహాత్ముడవైన నిన్ను వినయముగా బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: మలాకీ 3: 1–5.

సువార్త: పరి. లూకా 2: 22–40.

---

## పరిశుద్ధ మత్తీయ దినము.

ఫిబ్రవరి 24-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, ద్రోహియైన యూదాకు ప్రతిగా పన్నెండుగురు అపొస్తలులలో ఒకడై యుండుటకు విశ్వాసముగల నీ సేవకుడైన మత్తీయను ఏర్పరచుకొంటివిగదా. నీ సంఘము అబద్ధికులైన అపొస్తలులు లేకుండా యెల్లప్పుడును కాపాడబడునట్లును, విశ్వాసులును యథార్థపరులునైన కాపరుల చేత పరిపాలింపబడి నడుపబడునట్లును దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 1: 15–26.

సువార్త: పరి. మత్తయి 11: 25–30.

---

## ధన్యురాలగు కన్య మరియకు శుభవర్తమానము వచ్చిన దినము.

మార్చి 25-వ తేది.

సంగ్రహప్రార్థన.

ప్రభువా, నీ కుమారుడైన యేసుక్రీస్తు నరావతారమును ఒక దేవదూత తెచ్చిన వర్తమానమువల్ల మేము తెలిసికొనినప్రకారము, ఆయన పునరుత్థాన మహిమకు ఆయన సిలువ శ్రమలవల్ల మేము నడిపింపబడులాగున మా హృదయములలో నీ కృపను క్రుమ్మరింపుమని మా ప్రభువైన ఆ యేసుక్రీస్తుద్వారానే నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: యెషయా 7: 10–14.

సువార్త: పరి. లూకా 1: 26–38

---



## పరిశుద్ధ మార్కు దినము.

ఏప్రిల్ 25-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ సువార్తికుడైన పరిశుద్ధ మార్కుయొక్క దివ్యోపదేశమువల్ల నీ పరిశుద్ధసంఘమునకు బోధించితివిగదా. వ్యర్థమైన ప్రతి ఉపదేశమనే గాలిచేత మేము పిల్లలవలె ఇటు అటు కొట్టుకొనిపోకుండ, నీ పరిశుద్ధ సువార్త సత్యమునందు స్థిరపడులాగున మాకు కృపనిమ్మని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: ఎఫెసీ 4: 7–16.

సువార్త: పరి. యోహాను 15: 1–11.

---

## పరిశుద్ధ ఫిలిప్పు పరిశుద్ధ యాకోబు అనువారి దినము.

మే 1-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నిన్ను నిజముగా ఎరుగుటే నిత్యజీవము గదా. నీ కుమారుడైన యేసుక్రీస్తు, మార్గము సత్యము జీవమునై యున్నాడని మేము సంపూర్ణముగా ఎరిగి, నీ పరిశుద్ధ అపొస్తలులైన ఫిలిప్పు, యాకోబు అనువారి అడుగుజాడలనుబట్టి నిత్యజీవమునకు పోవుమార్గమున స్థిరముగా నడుచునట్లు కృపనిమ్మని మా ప్రభువును నీ కుమారుడునైన ఆ యేసుక్రీస్తుద్వారానే వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: పరి. యాకోబు 1: 2–12.

సువార్త: పరి. యోహాను 14: 1–14.

---

## అపొస్తలుడైన పరిశుద్ధ బర్నబా దినము.

జూన్ 11-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల ప్రభువైన దేవా, నీ పరిశుద్ధ అపొస్తలుడైన బర్నబాకు నీ పరిశుద్ధాత్మయొక్క విశేషవరములు దయచేసితివిగదా. నీ నానావిధ వరములు లేనివారముగనైనను, మేము వాటిని నీ ఘనతా మహిమలకొరకు ఎల్లప్పుడును వాడుకొను కృపలేనివారముగనైనను మమ్మును విడువకుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 11: 22–30.

సువార్త: పరి. యోహాను 15: 12–16.

---

## పరిశుద్ధ యోహాను బాప్తిస్తు దినము.

జూన్ 24-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ సంకల్పమువల్ల బాప్తిస్మమిచ్చు యోహాను అను నీ సేవకుడు అద్భుతముగా పుట్టి పశ్చాత్తాపమును గురించి బోధించుటవల్ల మా రక్షకుడైన నీ కుమారుని మార్గము సిద్ధపరచుటకు పంపబడెనుగదా. మేము అతని బోధను ఉపదేశమును పరిశుద్ధ ప్రవర్తనను అనుసరించునట్లు నిజముగా పశ్చాత్తాపపడునట్లును, అతని దృష్టాంతముచొప్పున విడువకుండ సత్యము పలికి దుర్మార్గమును ధైర్యముతో గద్దించి, సత్యమునిమిత్తము ఓపికతో శ్రమను సహించునట్లును, దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: యెషయా 40: 1–11.

సువార్త: పరి. లూకా 1: 57–80.



## పరిశుద్ధ పేతురు దినము.

జూన్ 29-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ కుమారుడైన యేసుక్రీస్తువల్ల నీ అపొస్తలుడైన పరిశుద్ధ పేతురునకు అనేక శ్రేష్ఠవరములను దయచేసి, నా మందను మేపుమని గట్టిగా ఆజ్ఞాపించితివి గదా. నిత్య మహిమ యను కిరీటమును పొందులాగున బిషపులు, కాపరులు, అందరును నీ పరిశుద్ధ వాక్యమును శ్రద్ధగా ప్రకటించునట్లును, జనులు దానిని విధేయతతో అనుసరించునట్లును దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 12: 1–11.

సువార్త: పరి. మత్తయి 16: 13–19.

---

## మగ్దలేనే మరియ దినము.

జూలై 22-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, ధన్యుడైన నీ కుమారుడు తన పునరుత్థానమునకు సాక్షిగా ఉండుటకై మగ్దలేనే మరియను పిలిచి ప్రతిష్ఠపరచెనుగదా. నీ కృపవల్ల మేము మా బలహీనతలన్నిటినుండి స్వస్థపరచబడి, నాశనములేని జీవమునకున్న శక్తితో ఎల్లప్పుడు నిన్ను సేవించునట్లు కరుణతో అనుగ్రహించుమని, నీతోను పరిశుద్ధాత్మతోను ఏకదేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి ఆయనద్వారానే నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 2 కొరింథీ 5: 14–17.

సువార్త: పరి. యోహాను 20: 11–18.

## అపొస్తలుడైన పరిశుద్ధ యాకోబు దినము.

జూలై 25-వ తేది.

సంగ్రహప్రార్థన.

కనికరముగల దేవా, నీ అపొస్తలుడైన పరిశుద్ధ యాకోబు నీ కుమారుడైన యేసుక్రీస్తు పిలువగానే జాగుచేయక ఆయన పిలుపునకు లోబడి తన తండ్రిని తనకు కలిగినదంతటిని వదలిపెట్టి ఆయనను వెంబడించినట్లు, మేమును లోకాశలను శరీరేచ్ఛలన్నిటిని వదలిపెట్టి, నీ పరిశుద్ధాజ్ఞలను అనుసరించుటకు ఎల్లప్పుడును సిద్ధముగానుండులాగున కృపనిమ్మని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 11: 27–12: 3.

సువార్త: పరి. మత్తయి 20: 20–28.

---

## రూపాంతరముపొందిన దినము.

ఆగస్టు 6-వ తేది.

సంగ్రహప్రార్థన.

దేవా, నీ అద్వితీయకుమారుడు తన శ్రమలకుముందు పరిశుద్ధ పర్వతముమీద తన మహిమను ప్రత్యక్షపరచెనుగదా. నీ సేవకులమైన మేము ఆయన ముఖకాంతిని విశ్వాసముద్వారా చూచుచు, సిలువను భరించుటకు బలము పొంది, ఆయనతో సమరూపముగలవారమై మహిమనుండి అధిక మహిమకు మార్చబడునట్లు అనుగ్రహింపుమని ఆ మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారానే నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 యోహాను 3: 1–3.

సువార్త: పరి. మార్కు 9: 2–7.

---



## అపొస్తలుడైన పరిశుద్ధ బర్తొలొమయి దినము.

ఆగస్టు 24-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ వాక్యము నిజముగా నమ్మి ప్రకటించుటకు నీ అపొస్తలుడైన బర్తొలొమయికి కృప దయచేసితివిగదా. అతడు నమ్మిన వాక్యమును నీ సంఘము ప్రేమించి చేకొని ప్రకటించులాగున దానికి కృప దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 5: 12–16.

సువార్త: పరి. లూకా 22: 24–30.

---

## అపొస్తలుడైన పరిశుద్ధ మత్తయి దినము.

సెప్టెంబరు 21-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, శ్రీమంతుడైన నీ కుమారునిచేత మత్తయిని అపొస్తలుడును సువార్తికుడును అగుటకు సుంకపు మెట్టునొద్దనుండి పిలిచితివిగదా. మేమును సమస్త ధనాపేక్షయు లోభత్వమును వదలిపెట్టి, ఆ నీ కుమారుడైన యేసుక్రీస్తును వెంబడించులాగున, మాకు కృప దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను ఏక దేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండెడి ఆయనద్వారానే వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 2 కొరింథీ 4: 1–6.

సువార్త: పరి. మత్తయి 9: 9–13.

---

## పరిశుద్ధ మిఖాయేలుయొక్కయు సమస్త దేవదూతల యొక్కయు దినము.

సెప్టెంబరు 29-వ తేది.

సంగ్రహప్రార్థన.

నిత్యుడవైన దేవా, దేవదూతలును మనుష్యులును చేయు సేవలను వింతైన క్రమముచొప్పున నిర్ణయించితివి గదా. నీ పరిశుద్ధ దేవదూతలు పరలోకమందు ఎప్పుడును నీకు సేవచేయుచున్నట్లు నీ నిర్ణయముచొప్పున వారు భూలోకమందుండు మాకును సహాయులై మమ్మును కాపాడులాగున అనుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: ప్రకటన 12: 7–12.

సువార్త: పరి. మత్తయి 18: 1–10.

---

## సువార్తికుడైన పరిశుద్ధ లూకా దినము.

అక్టోబరు 18-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, సువార్తవిషయము ప్రసిద్ధికెక్కిన వైద్యుడగు లూకా, సువార్తికుడును ఆత్మ వైద్యుడును అగుటకు నీవు అతని పిలిచితివిగదా. అతడు వ్రాసియిచ్చిన ఉపదేశమను సిద్ధౌషధమువల్ల మా ఆత్మ వ్యాధులన్నియు స్వస్థపడులాగున దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు పుణ్యమునుబట్టి వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 2 తిమొథె 4: 5–15.

సువార్త: పరి. లూకా 7: 36–50.

---



## అపొస్తలులైన పరిశుద్ధ సీమోను, పరిశుద్ధ యూదా అనువారి దినము.

అక్టోబరు 28-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, యేసుక్రీస్తు తానే సంఘమునకు ముఖ్యమైన మూల రాయియైయుండగా అపొస్తలులు ప్రవక్తలువేసిన పునాదిమీద దానిని కట్టునట్లు అనుగ్రహించితివి గదా. మేము నీకు అంగీకృతమైన పరిశుద్ధాలయముగా కట్టబడుటకై, వారి యుపదేశముచేత ఆత్మయొక్క ఐక్యతగలవారమై అతుకబడియుండునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: ప్రకటన 21: 9–14.

సువార్త: పరి. యోహాను 15: 17–27.

---

## సమస్త పరిశుద్ధుల దినము.

నవంబరు 1-వ తేది.

సంగ్రహప్రార్థన.

సర్వశక్తిగల దేవా, నీ కుమారుడును మా ప్రభువునైన క్రీస్తు మర్మశరీరములో అన్యోన్య సహవాసులుగ నుండునట్లు నీవు ఏర్పరచుకొన్నవారిని సమకూర్చితివిగదా. నిన్ను నిష్కపటముగా ప్రేమించువారికొరకు నీవు సిద్ధపరచిన చెప్పజాలని సంతోషములను మేము పొందుటకై, ధన్యులైన పరిశుద్ధులయొక్క సమస్త భక్తి సత్ప్రవర్తనలను మేము అనుసరించునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దయచేయుము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: ప్రకటన 7: 2–12.

సువార్త: పరి. మత్తయి 5: 1–12.

---

## పరిశుద్ధ సిలువ దినము.

సెప్టెంబరు 14-వ తేది.

సంగ్రహప్రార్థన.

దేవా, శ్రీమంతుడైన నీ కుమారుని అవమానకరమైన మరణమును మాకు జీవమును సమాధానమును కలుగజేయు సాధనముగా జేసితివిగదా. క్రీస్తు యొక్క సిలువయందు మేము అతిశయించుటకును, అందువల్ల సంతోషముతో అవమానమును నష్టమును భరించుటకును మాకు మనస్సు దయచేయుమని, నీ కుమారుడును మా ప్రభువునైన ఆయన నిమిత్తమే వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 కొరింథీ 1: 17-25.

సువార్త: పరి. యోహాను 12: 27-33.

---

## సమస్త ఆత్మల జ్ఞాపకార్థము.

నవంబరు 2-వ తేది.

ప్రభువా, సమస్త విశ్వాసులను సృజించి విమోచించినవాడా, ఈ జీవము చాలించిన విశ్వాసులు నీ కుమారుడు ప్రత్యక్షమగు దినమందు నీ నిజమైన బిడ్డలుగా అగుపడునట్లు ఆయన శ్రమలవలన కలుగు ఎంచజాలని మేలులను వారి కనుగ్రహింపుమని ఆ నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

¶ లేక ఆయాకాలములయందు వాడవలసిన ప్రార్థనలో ఈ జీవము చాలించిన విశ్వాసులకొరకైన ప్రార్థనలు వాడవచ్చును.

ఉత్తరమునకు ప్రతి: ప్రకటన 20: 11-15.

సువార్త: పరి. యోహాను 11. 21-27.

---



## క్రీస్తు జననదినమునకు తొలిదినము.

డిసెంబరు 24-వ తేది.

సంగ్రహప్రార్థన.

దేవా, నీ యేకపుత్రుడైన యేసుక్రీస్తుయొక్క జననమును ఏటేట మేము జ్ఞాపకము చేసికొని ఆనందించునట్లు చేయుచున్నావు గదా. మేము ఆయనను మా విమోచకునిగా సంతోషముతో అంగీకరించునట్టే, ఆయన మాకు న్యాయాధిపతిగా వచ్చునప్పుడు మేమాయనను దృఢవిశ్వాసముతో చూడగలుగునట్లు అనుగ్రహించుమని, నీతోను పరిశుద్ధాత్మతోను ఏకదేవుడుగా యుగయుగములకు జీవించి యేలుచుండు ఆయనద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరమునకు ప్రతి: మీకా 5: 2-5.

సువార్త: పరి. లూకా 2: 1-14.

---

## కోతపండుగ.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ దివ్య కృపచొప్పున భూఫలములను వాటి కాలమందు మాకు దయచేసితివిగదా. ఈ నీ ఉపకారములకొరకు మేము వినయముగల కృతజ్ఞతాస్తుతులను నీకు సమర్పించుచున్నాము. వీటిని నీ మహిమకొరకును, అవసరములోనున్నవారి సహాయముకొరకును మేము యుక్తముగా వాడుకొనుటకు కృపనిమ్మని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: గలతీ 6: 6-10.

సువార్త: పరి. యోహాను 4: 31-36.

---

## ఎంబరు దినములు.

సంగ్రహప్రార్థన.

39-వ పుటలోని రెండింటిలో నొకదాని వాడుకొనవచ్చును.

ఉత్తరమునకు ప్రతి: అపొ. కార్య. 13: 44-49. లేదా,
అపొ. కార్య. 20: 28-35. లేదా,
ఎఫెసీ 4: 7-16.

సువార్త: పరి. మత్తయి 9: 35-38. లేదా,
పరి. లూకా 4: 16-21. లేదా,
పరి. యోహాను 10. 1-16.

---

## పరిశుద్ధాత్మ ఆలోచనకొరకు.

సంగ్రహప్రార్థన.

౧౨౮-వ పుటలోని పరిశుద్ధాత్మ దినపు సంగ్రహప్రార్థన వాడుకొనవచ్చును.

"ఈ కాలమందు" అను మాటకు ప్రతి "పూర్వకాలమందు" అను మాట చెప్పవలెను.

ఉత్తరము: 1 కొరింథీ 12: 4–13.

సువార్త: పరి. యోహాను 14: 23–26.

---

## దేవాలయ ప్రతిష్ఠ పండుగ.

సంగ్రహప్రార్థన.

దేవా, నీ సంకల్పమువల్లనే ఈ ఆలయ ప్రతిష్ఠ దినమును తిరిగి ఆచరించుటకు దయచేసితివిగదా. నీ దివ్యాశీర్వచనమును మామీద కుమ్మరింపుమని నిన్ను వేడుకొనుచున్నాము. పరిశుద్ధతయే నిత్యము నీ ఆలయమునకు తగిన లక్షణమై యున్నది గనుక, మేము నీకు పరిశుద్ధమును అంగీకృతమునైన జీవాలయముగా ఉండునట్లు చేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

ఉత్తరము: 1 కొరింథీ 3: 9–17. లేదా,
1 పేతురు 2: 1–5.

సువార్త: పరి. మత్తయి 21: 12–16. లేదా,
పరి. యోహాను 10: 22–29.

---

# GENERAL RUBRICS
## OF THE MINISTRATION OF
# PUBLIC BAPTISM OF INFANTS

# పిల్లల బాహాటపు బాప్తిస్మమును ఆచరించు క్రమమునకుచెందు సామాన్య విధులు

¶ పిల్లలు పుట్టిన తరువాత వారిని వీలైనంత త్వరలో బాప్తిస్మమునకు తల్లిదండ్రులు తేవలెనని ప్రతి సంఘ గురువు తల్లిదండ్రులను హెచ్చరించుచుండవలెను. న్యాయమైన గొప్ప ఆటంకము లేనియెడల పిల్లలు పుట్టిన పిదప నాలుగవ, మించితే అయిదవ ఆదివారమునకు బిడ్డలను బాప్తిస్మమునకు తేవలెను.

¶ ఆదివారములయందును తక్కిన పరిశుద్ధ దినములయందును చాలమంది కూడియుందురు గనుక సాధ్యమైనయెడల ఆ దినములయందే బాప్తిస్మము జరుపుట యుక్తము. ఎందుకనగా క్రొత్తగా బాప్తిస్మము పొందినవారు క్రీస్తు సంఘ సంఖ్యతో చేర్చబడిరని అక్కడ కూడియున్న సంఘస్థులు సాక్ష్యమియ్యగలరు; మరియు పిల్లలు బాప్తిస్మము పొందుచుండగా అక్కడనున్న ప్రతివాడును తన బాప్తిస్మమునందు దేవునితో చేసిన ఒప్పందమును జ్ఞాపకము చేసికొనవచ్చును. ఈ హేతువుచేత బాప్తిస్మము దేశభాషయందే ఆచరించుట యుక్తము. అయినను అవశ్యమైనయెడల పిల్లలు మరి ఏ దినమందైనను బాప్తిస్మము పొందవచ్చును.

¶ బాప్తిస్మము పొందబోవు ప్రతి పిల్లవానికి ఇద్దరు దేవతండ్రులును ఒక దేవతల్లియు ప్రతి పిల్లకు ఒక దేవ తండ్రియు ఇద్దరు దేవతల్లులును ఉండవలెను. ముగ్గురు లేనియెడల కనీసము ఒక దేవ తండ్రియు ఒక దేవతల్లియు ఉండిన చాలును. తల్లి దండ్రులే దేవతల్లిదండ్రులుగా ఉండవచ్చును. కాని వారితోకూడ దేవతండ్రిగానైనను దేవతల్లిగానైనను వేరొకరు ఉండవలెను. బాప్తిస్మము పొందినవారే తప్ప మరి ఎవరును దేవ తల్లిదండ్రులుగా నుండరాదు.

¶ క్రీస్తు లేని సమయమందు డీకను పిల్లలకు బాప్తిస్మ మియ్యవచ్చును.

¶ బాప్తిస్మము పొందవలసిన పిల్లలున్నయెడల తల్లిదండ్రులు సంఘ గురువునకు తగినంత ముందుగా తెలియజేయవలెను. సంఘ గురువు బాప్తిస్మమునకు సమయము నియమించును. ఉదయ సాయంప్రార్థనలయందు చివరి పాఠము కాగానేయైనను, మూడవ సంగ్రహ ప్రార్థనకు తరువాతనైనను, లేక గురువునకు యుక్తమనితోచిన ఇతర సమయమందైనను దేవతండ్రులును దేవతల్లులును పిల్లలను తీసికొని వచ్చిన జనులును బాప్తిస్మపు తొట్టియొద్ద సిద్ధముగా నుండవలెను.

¶ బాప్తిస్మముపొందిన పిల్లలు కర్మపాపము చేయకమునుపు చనిపోతే నిస్సందేహముగా రక్షింపబడుదురనునది దేవుని వాక్యమువల్ల నిశ్చయమై యున్నది.

¶ బాప్తిస్మ క్రమమునందు సిలువ సంజ్ఞను వాడుటనుగురించిన సంశయమంతయు విడగొట్టుటకు దాని వాస్తవార్థమును దాని నుండనిచ్చుటకు తగిన హేతువులను 1604-వ సంవత్సరమున మొదట ప్రచురముచేసిన కానోను చట్టము 30 వ సూత్రములో చూడవలెను.

# THE MINISTRATION OF PUBLIC BAPTISM OF INFANTS

# పిల్లల బాహాటపు బాప్తిస్మము

¶ స్వచ్ఛమైన ఉదకముతో నింపబడియున్న తొట్టియొద్దకు ప్రీస్టువచ్చి, నిలుచుండి చెప్పవలసినదేమనగా:

ఈ బిడ్డ యిదివరకు బాప్తిస్మము పొందినదా, లేదా?

¶ వారు లేదంటే ప్రీస్టు ఈలాగు చెప్పవలెను.

క్రీస్తుయేసునందు ప్రియులారా, మనుష్యులందరును పుట్టుకనుండి పాపమునకు లోనైయున్నారు గాని దేవుడు ప్రేమస్వరూపి గనుక, మనుష్యులందరును రక్షింపబడవలెనని కోరుచున్నాడు. మరియు నీటివల్లను పరిశుద్ధాత్మవల్లను తిరిగి పుట్టితేనేగాని యెవడును దేవునిరాజ్యములో ప్రవేశింపలేడని మన రక్షకుడైన క్రీస్తు చెప్పుచున్నాడు, గనుక ఈ బిడ్డ స్వభావముచేత పొందలేనిది ఇతనికి (ఈమెకు) కలుగునట్లు, అనగా ఇతడు (ఈమె) నీటివల్లను పరిశుద్ధాత్మవల్లను బాప్తిస్మము పొంది, క్రీస్తుయొక్క పరిశుద్ధ సంఘములో చేర్చబడి, అంగులో జీవముగల అవయవముగా చేయబడునట్లు, తండ్రియైన దేవుడు తన అత్యంత కరుణవల్ల ఇతనికి (ఈమెకు) అనుగ్రహించులాగున, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా ఆయనను ప్రార్థింపవలెనని మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను.

¶ ఆటుతరువాత ప్రీస్టు ఈలాగు చెప్పవలెను:

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ మిక్కిలి ప్రియకుమారుడైన యేసుక్రీస్తు యొర్దాను నదిలో బాప్తిస్మము పొందినందువల్ల పాపమును మర్మముగా కడిగివేయునట్లు జలమును పరిశుద్ధపరచితివిగదా. ఈ పిల్లవాని (పిల్లను) కటాక్షించుము. క్రీస్తు సంఘము అను ఓడలో ఇతడు (ఈమె) చేర్చబడునట్లు నీ పరిశుద్ధాత్మచేత ఇతని (ఈమెను) కడిగి పరిశుద్ధపరచుము. మరియు ఇతడు (ఈమె) విశ్వాసమందు స్థిరపడి, నిరీక్షణవల్ల సంతోషించి, ప్రేమయందు వేరు



పారి, ఈ లోకమను దుఃఖసాగర కెరటములను దాటి, తుదకు నిత్యజీవ తీరమున చేరి, అక్కడ నీతో ఎల్లప్పుడును ఏలునట్లు అనుగ్రహించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

సర్వశక్తిగల నిత్యదేవా, అవసరముగలవారందరికి గతియు, ఆశ్రయము నిమిత్తము నీయొద్దకు పరుగెత్తివచ్చెడి అందరికిని సహాయుడవును, నమ్మెడువారికి జీవమును, చనిపోయినవారికి పునరుత్థానమును నీవేగదా. నీ పరిశుద్ధ బాప్తిస్మము పొందవచ్చిన యీ బిడ్డ ఆత్మీయమైన పునర్జన్మముచేత పాపపరిహారమును పొందునట్లు ఇతని (ఈమె) కొరకు వేడుకొనుచున్నాము. అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును అని నీ మిక్కిలి ప్రియకుమారునిద్వారా నీవు చేసిన వాగ్దానప్రకారము, ఓ ప్రభువా, ఈ బిడ్డను చేర్చుకొనుము. ఇతడు (ఈమె) పాపము నుండి కడుగబడి, నీ పరమాశీర్వచనము పొంది, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నీవు వాగ్దానముచేసిన నిత్యరాజ్యమునకు చేరునట్లు అడిగెడు మాకు ఇచ్చి, వెదకెడు మాకు దొరకునట్లు చేసి, తట్టెడు మాకు తీయుము. ఆమేన్.

¶ అప్పుడు ప్రీస్టు చెప్పవలసినదేమనగా:

పరిశుద్ధ మార్కు సువార్త పదియవ అధ్యాయము పదుమూడవ వచనము మొదలుకొని వ్రాసియున్న మాటలు వినుడి.

ఉ.—ప్రభువా, నీకు మహిమ కలుగునుగాక.

చిన్న పిల్లలను క్రీస్తు ముట్టవలెనని కొందరు ఆయన యొద్దకు వారిని తీసికొనివచ్చిరి. అయితే శిష్యులు వారిని తీసికొనివచ్చిన వారిని గద్దించిరి. యేసు అది చూచి కోపపడి—చిన్న పిల్లలను నాయొద్దకు రానియ్యుడి, వారిని ఆటంకపరచవద్దు, దేవునిరాజ్యము ఈలాటివారిదే. చిన్నపిల్లవలె దేవునిరాజ్యము నంగీకరింపనివాడు అందులో ప్రవేశింపడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని చెప్పి, ఆ పిల్లలను ఎత్తి, కౌగలించుకొని వారిమీద చేతులుంచి ఆశీర్వదించెను.

ఉ.—క్రీస్తూ, నీకు స్తోత్రము కలుగునుగాక.

¶ అంతట ప్రీస్టు ఆ సువార్త మాటలనుబట్టి యీ క్లుప్తమైన బోధిని చదువవలెను.

ప్రియులారా, పిల్లలను తనయొద్దకు తీసికొనిరావలెనని క్రీస్తు ఆజ్ఞాపించిన సంగతి ఈ సువార్తయందుండు మన రక్షకుని మాటలవల్ల మీరు విని

యున్నారు. ఆయన వారిని తన చేతులలో ఎత్తికొని దీవించినట్లు మీరు గ్రహించియున్నారు. యేసుక్రీస్తు నిన్న నేడు యుగయుగములకును ఒక్కటే రీతిగా ఉండును. కావున ఈ బిడ్డనుకూడ ఆయన ప్రేమించి, ఇతనిని (ఈమెను) పరిశుద్ధ బాప్తిస్మమునకు తెచ్చుటయను మన పనిని దయతో అంగీకరించి, తన కనికరమను చేతులతో ఇతనిని (ఈమెను) కౌగలించుకొని, ఇతనికి (ఈమెకు) నిత్యజీవమనెడు వరము దయచేయునని సందేహింపక రూఢిగా నమ్ముడి. కాబట్టి మన పరలోకపు తండ్రి తన కుమారుడైన యేసుక్రీస్తువల్ల తెలియచేసినట్లు ఈ బిడ్డయెడల అనుగ్రహము కలిగియున్నాడని మనము ఇందువల్ల రూఢిచేసికొని, భక్తివిశ్వాసములతో ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించి చెప్పవలసిన దేమనగా:—

¶ అంతట ప్రీస్టును జనులును చెప్పవలసిన దేమనిన:

సర్వశక్తిగల నిత్యదేవా, పరలోకపు తండ్రీ, నీ కృప తెలిసికొనుటకును నిన్ను నమ్ముటకును మమ్మును పిలిచితివి గనుక నీకు వినయముగల కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. ఎల్లప్పుడును మాలో ఈ తెలివి వృద్ధిచేసి, ఈ నమ్మకము బలపరచుము. ఈ బిడ్డ తిరిగి పుట్టి, నిత్యరక్షణకు బాధ్యుడగునట్లు (బాధ్యురాలగునట్లు), ఇతనికి (ఈమెకు) నీ పరిశుద్ధాత్మను ఇమ్మని నీతోను పరిశుద్ధాత్మతోను ఇప్పుడును ఎప్పుడును జీవించి యేలుచుండెడి మా ప్రభువైన యేసు క్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## వాగ్దానములు.

¶ అంతట ప్రీస్టు దేవతండ్రులతోను దేవతల్లులతోను ఈ చొప్పున చెప్పవలెను.

మిక్కిలి ప్రియులారా, బాప్తిస్మము పొందుటకు మీరు ఈ బిడ్డను ఇక్కడికి తెచ్చియున్నారు. మన ప్రభువైన యేసుక్రీస్తు ఇతని (ఈమెను) చేర్చుకొని, పవిత్రపరచి, పరిశుద్ధపరచవలెనని మీరు ప్రార్థించియున్నారు. మీరు ప్రార్థించిన ఇవి యన్నియు ఇచ్చెదనని మన ప్రభువు తన సువార్త యందు వాగ్దానముచేసియున్నాడు. ఆయన ఆ వాగ్దానము తనమట్టుకు తాను మిక్కిలి నిశ్చయముగా నెరవేర్చును.

కాబట్టి మీమట్టుకు మీరును ఈ బిడ్డపేరట మూడు సంగతులు, అనగా, మొదటిది, సాతానును వాని క్రియలనన్నిటిని ఇతడు (ఈమె) రోసివేయుననియు; రెండవది, దేవుని పరిశుద్ధ వాక్యమును విడువకుండ ఇతడు (ఈమె) నమ్ముననియు; మూడవది, దేవుని ఆజ్ఞలను ఇతడు (ఈమె) విధేయతగా గైకొనుననియు మీరు వాగ్దానముచేసి పూనుకొనవలెను.



కాబట్టి నేను అడుగునదేమనగా:—

సాతానును వాని క్రియలనన్నిటిని, లోకముయొక్క వృథాడంబమును ఘనమును, లోకసంబంధమైన దురాశలనన్నిటిని, శరీరపు పాపేచ్ఛలను వెంబడింపక, వాటివల్ల నడిపింపబడక, నీవు వాటిని ఈ బిడ్డపేరట రోసివేయుచున్నావా?

**ఉత్తరము.**—రోసివేయుచున్నాను.

క్రైస్తవ విశ్వాసమును ఈ బిడ్డపేరట ఒప్పుకొనుచున్నావా?

**ఉత్తరము.**—ఒప్పుకొనుచున్నాను.

¶ అంతట ప్రీస్టును దేవతలిదండ్రులును ఈ క్రింది అపొస్తలుల విశ్వాససూత్రము చెప్పవలెను.

పరలోక భూలోకముల సృష్టికర్తయగు సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన అద్వితీయ కుమారుడును మన ప్రభువైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన కన్యయగు మరియ గర్భమున ధరింపబడి ఆమెకు పుట్టెను. పొంతిపిలాతు అధికారముక్రింద బాధపడి, సిలువవేయబడి, చనిపోయి, పాతిపెట్టబడి, అదృశ్యలోకములోనికి దిగెను. మూడవ దినమున చనిపోయినవారిలోనుండి తిరిగి లేచి, పరలోకమునకెక్కి, సర్వశక్తిగల తండ్రియైన దేవుని కుడిచేతివైపున కూర్చుండియున్నాడు. సజీవులకును మృతులకును తీర్పుచేయుటకు అక్కడనుండి ఆయన వచ్చునని నమ్ముచున్నాను.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ సార్వత్రికసంఘమును, పరిశుద్ధుల సహవాసమును, పాపక్షమాపణను, శరీరపునరుత్థానమును, నిత్యజీవమును నమ్ముచున్నాను. ఆమేన్.

దేవుని పరిశుద్ధ చిత్తమునకును ఆజ్ఞలకును విధేయతగా లోబడుదునని నీవు ఈ బిడ్డపేరట వాగ్దానముచేయుచున్నావా?

**ఉత్తరము.**—చేయుచున్నాను.

బాప్తిస్మము కావలెనని ఈ బిడ్డ పేరట నీవు అడుగుచున్నావా?

**ఉత్తరము.**—అడుగుచున్నాను.

¶ అప్పుడు ప్రీస్టు చెప్పవలసిన దేమనగా

కనికరముగల దేవా, ఈ బిడ్డలోనుండు పాత ఆదాము పాతిపెట్టబడి, ఇతనిలో (ఈమెలో) క్రొత్త మనిషి లేపబడునట్లు అనుగ్రహింపుము. ఆమేన్.

ఇతనిలో (ఈమెలో) శరీర దురాశలన్నియు చచ్చి, ఆత్మ సంబంధమైన దంతయు బ్రతికి వృద్ధిపొందునట్లు అనుగ్రహింపుము. ఆమేన్.

ఇతడు (ఈమె) లోకమును శరీరమును సాతానును జయించుటకు, ఇతనికి (ఈమెకు) సామర్థ్యమును బలమును అనుగ్రహింపుము. ఆమేన్.

జీవించుచు సర్వము సదా పరిపాలించు శ్రీమంతుడవును ప్రభుడవునైన ఓ దేవా, ఇక్కడ మా ఉద్యోగమువల్లను సేవవల్లను నీకు సమర్పింపబడువారెవరో వారు నీ కనికరమువల్ల పరమగుణములతో అలంకరింపబడి, నిత్యఫలము పొందునట్లు అనుగ్రహింపుము. ఆమేన్.

## జలమును ప్రతిష్ఠించుట.

¶ అంతట ప్రీస్టు ఈలాగు చెప్పవలెను:

ప్రభువు మీకు తోడైయుండును గాక.

**ఉత్తరము.**—నీ ఆత్మకును తోడైయుండును గాక.

**ప్రీస్టు.**—మీ హృదయములను లేవనెత్తుకొనుడి.

**ఉత్తరము.**—ప్రభువువైపునకు వాటిని లేవనెత్తుకొనుచున్నాము.

**ప్రీస్టు.**—మన ప్రభువైన దేవునికి కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుదము.

**ఉత్తరము.**—ఆలాగు చేయుట తగినదియు సరియునైయున్నది.

**ప్రీస్టు.**—ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, నీ మిక్కిలి ప్రియకుమారుడైన యేసుక్రీస్తు మా పాపక్షమకొరకు తన విలువలేని ప్రక్కనుండి రక్తమును నీళ్లను ధారపోసి, మీరు వెళ్లి సమస్తజనులను శిష్యులగా చేసి, తండ్రియొక్క కుమారునియొక్క పరిశుద్ధాత్మయొక్క నామములోనికి వారికి బాప్తిస్మము ఇయ్యుడని తన శిష్యులకు ఆజ్ఞాపించెను గనుక నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మాకు మిక్కిలి తగినదియు సరియు మా విధియునై యున్నది. నీ జనుల ప్రార్థనలు ఆలకించి, పాపమును మర్మముగా కడిగివేయుటకు ఈ నీటిని పరిశుద్ధపరచి, దీనిలో ఇప్పుడు బాప్తిస్మము పొందబోవు ఈ బిడ్డ నీ పూర్ణ కృపపొంది, నీవు ఏర్పరచుకొనిన విశ్వాసుల సమూహములో నిలకడగా ఉండునట్లు మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా అనుగ్రహించుము. ఆయనకు నీతో పరిశుద్ధాత్మ ఐక్యమునందు సమస్త ఘనతయు మహిమయు ఇప్పుడును ఎప్పుడును కలుగునుగాక. ఆమేన్.



## బాప్తిస్మము.

¶ అంతట ప్రీస్టు బిడ్డను తన చేతులలోనికి తీసికొని, లేక చేయిపట్టుకొని దేవతండ్రులతోను దేవతల్లులతోను ఈలాగు చెప్పవలెను:

ఈ బిడ్డకు పేరు పెట్టుడి.

¶ అప్పుడు ఆయన వారు చెప్పిన పేరుపెట్టి, బిడ్డను నీళ్లలో ముంచుచు, లేదా బిడ్డమీద నీళ్లు పోయుచు చెప్పవలసినదేమనగా:

____________ తండ్రియొక్క, కుమారునియొక్క, పరిశుద్ధాత్మయొక్క పేరట నీకు బాప్తిస్మము ఇచ్చుచున్నాను. ఆమేన్.

¶ అంతట ప్రీస్టు చెప్పవలసిన దేమనగా:

క్రీస్తు సంఘము అను మందలోనికి ఈ బిడ్డను చేర్చి, ఇతనికి (ఈమెకు) సిలువ గురుతు వేయుచున్నాము.* ఆమేన్. సిలువవేయబడిన క్రీస్తు విశ్వాసమును ఇతడు (ఈమె) ఇకమీదట సిగ్గుపడక ఒప్పుకొని, ఆయన జండాక్రింద లోకముతోను పాపముతోను సాతానుతోను ధైర్యముగా యుద్ధముచేసి, మరణము మట్టునకు క్రీస్తుయొక్క నమ్మకమైన బంటుగాను సేవకుడు (సేవకురాలు) గాను ఉండవలెనని, ఇట్లు సిలువ గురుతు వేసియున్నాము. ఆమేన్.

* ఇప్పుడు ప్రీస్టు పిల్లవాని (పిల్ల) నొసట సిలువ గురుతు వేయవలెను.

## కృతజ్ఞతాస్తుతి.

¶ అంతట ప్రీస్టు చెప్పవలసిన దేమనగా:

ప్రియ సహోదరులారా, ఈ బిడ్డ తిరిగి పుట్టి, క్రీస్తుసంఘము అను కుటుంబములో చేర్చబడినందున, ఈ ఉపకారముల నిమిత్తము సర్వశక్తిగల దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, ఈ బిడ్డ ఇప్పుడు ఆరంభించిన ప్రకారము తన ఆయుశ్శేషము గడుపునట్లు ఆయనను ఏకమనస్సుతో ప్రార్థించుదము.

¶ అప్పుడు అందరును చెప్పవలసిన దేమనగా:

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. రాజ్యమును శక్తి మహిమయు నిరంతరము నీవైయున్నవి. ఆమేన్.

¶ *అప్పుడు ప్రీస్టు చెప్పవలసిన దేమనగా:*

మిక్కిలి కనికరముగల తండ్రీ, నీ పరిశుద్ధాత్మచేత ఈ బిడ్డను తిరిగి జన్మింపచేసి, దత్తతవల్ల నీ సొంతబిడ్డనుగా చేర్చుకొని, నీ పరిశుద్ధ సంఘములో అవయవముగా చేయుటకు దయచేసినావు గనుక నీకు నిండు మనస్సుతో కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. ఆమేన్.

ప్రభువా, బాప్తిస్మముద్వారా క్రీస్తు మరణమునందు ఆయనతోకూడ పాతిపెట్టబడిన ఇతడు, (ఈమె) ఆయన పునరుత్థానములోకూడ పాలు పొందునట్లును, ఇహమందు నూతనజీవముతో నిన్ను సేవించి, తుదకు నీ పరిశుద్ధ సంఘములోని వారందరితో నీ నిత్యరాజ్యమునకు బాధ్యుడగునట్లును (బాధ్యురాలగునట్లును) అనుగ్రహించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ *ఆ కుటుంబముకొరకు ఈ క్రింది ప్రార్థన చెప్పవచ్చును.*

సర్వశక్తిగల దేవా, మా పరలోకపు తండ్రీ, శ్రీమంతుడైన నీ కుమారుడు నజరేతులోని భూలోకపు ఇంటిబ్రతుకులో పాలుపొందెనుగదా. ఈ బిడ్డయున్న కుటుంబమును ఆశీర్వదించి, ఇతడు (ఈమె) నీ యెడ తెగని భయప్రేమలయందు ఎదుగునట్లు ఇతనిని (ఈమెను) సంరక్షించువారికందరికి జ్ఞానవివేకములను అనుగ్రహించుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

## దేవతండ్రుల దేవతల్లుల విధులు.

¶ *అంతట, దేవతండ్రులకును దేవతల్లులకును తల్లిదండ్రులకును ప్రీస్టు దిగువవచ్చు బోధిని చదివి వినిపించవలెను.*

క్రీస్తు సంఘమను కుటుంబములోనికి బాప్తిస్మము పొందుటకు ఈ బిడ్డను తెచ్చిన మీరు, సంఘముయొక్క ప్రశ్నోత్తర బోధినిలోనున్నట్లు, విశ్వాససూత్రమును ప్రభువు ప్రార్థనను పది యాజ్ఞలను, క్రైస్తవుడు తన ఆత్మక్షేమముకొరకు తెలిసికొని నమ్మవలసిన తక్కిన అంశములన్నిటిని, ఇతడు (ఈమె) నేర్చుకొనునట్లు చూడవలెను.

ఈ బిడ్డ భక్తిగాను, క్రీస్తు మతానుసారముగాను, ప్రవర్తించునట్లు సద్వృత్తిలో పెంచబడులాగునను మీరు జాగ్రత్త పెట్టవలెను.

ఇతడు (ఈమె) నిర్ధారణ పొందులాగున బిషపుయొద్దకు తేబడునట్లును మీరు శ్రద్ధ పుచ్చుకొనవలెను. అందుచేత, పరిశుద్ధాత్మ వరమువల్ల ఇతడు (ఈమె) బలపరచబడి సిద్ధపరచబడినవాడై (సిద్ధపరచబడినదై), క్రీస్తు శరీర రక్తముల పరిశుద్ధ సమభాక్త్వమును పొంది, ఆయన సంఘముయొక్క సహవాసములో ఆయనను నమ్మకముగా సేవింపగలవాడగును (సేవింపగలదగును).



ఇవన్నియు నేర్చుకొనుటకును చేయుటకును మీరు ఇతనికి (ఈమెకు) సహాయము చేయుదురా?

**ఉ.**—ప్రభువు నాకు సహాయకుడైయుండగా ఆలాగు చేయుదును.

బాప్తిస్మము మన క్రైస్తవ బాధ్యతను సూచించుచున్నది. అది ఏదనగా, మన రక్షకుడైన క్రీస్తు మాదిరిని వెంబడించి ఆయనవలెనే యుండుట, అనగా ఆయన మనకొరకు చనిపోయి తిరిగి లేచినట్లు, బాప్తిస్మముపొందిన మనమును పాపమువిషయమై చనిపోయి, నీతివిషయమై తిరిగి లేచి, దురేచ్ఛలను నిత్యము చంపి, సమస్త సద్గుణములయందును, దైవభక్తిగల ప్రవర్తనయందును అనుదినము వృద్ధిపొందుటయై యున్నదని జ్ఞాపకమందుంచుకొనుడి.

¶ *ఉదయ సాయంప్రార్థన సమయములందు కాక మరియొకప్పుడు బాప్తిస్మము ఆచరింపబడినయెడల అక్కడ కూడుకొనినవారిని ప్రీస్టు ఈ క్రింది దీవెనతో పంపివేయవలెను.*

ప్రభువు మిమ్మును ఆశీర్వదించి మిమ్మును కాపాడునుగాక. ప్రభువు మీకు తన సన్నిధిని ప్రకాశింపచేసి మిమ్మును కరుణించుగాక. ప్రభువు మీమీద తన సన్నిధికాంతి ఉదయింపజేసి యిప్పుడును ఎప్పుడును మీకు సమాధానము దయచేయును గాక. ఆమేన్.

# THE MINISTRATION OF
# PRIVATE BAPTISM OF CHILDREN
## IN HOUSES

## పిల్లలకు ఇండ్లలో వాడవలసిన
# బాప్తిస్మము ఆచరించెడు క్రమము

¶ ఏదైన గొప్ప హేతువైనను అవసరమైనను ఉంటేనేతప్ప పిల్లలకు తమ ఇండ్లలో బాప్తిస్మ మిప్పించ కూడదని సంఘ గురువులు తల్లిదండ్రులను హెచ్చరించవలెను. ఆలాగు చేయవలసిన అవసరముంటే దిగువవచ్చు క్రమము చొప్పున బాప్తిస్మము ఆచరింపవలెను.

¶ సంఘ గురువైనను, ఆయన లేనప్పుడు అధికారము పొందిన మరియొక సేవకుడైనను అక్కడ ఉన్న వారితో కలసి మొదట దేవుని ప్రార్థించి బాహాటపు బాప్తిస్మక్రమమందు చెప్ప నిర్ణయించిన సంగ్రహ ప్రార్థనలలో ఆ కాలమునకును అవసరమునకును తగినవి చెప్పవలెను. క్రింద వచ్చు ప్రార్థన పిదప రావలెను.

ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, నీ మిక్కిలి ప్రియకుమారుడైన యేసుక్రీస్తు మా పాపక్షమకొరకు తన విలువలేని ప్రక్కనుండి రక్తమును నీళ్లను ధారపోసి, మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులగా చేసి తండ్రియొక్క కుమారునియొక్క పరిశుద్ధాత్మయొక్క నామములోకి బాప్తిస్మము ఈయుండని తన శిష్యులకు ఆజ్ఞాపించెను గనుక నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మిక్కిలి తగినదియు సరియు మా విధియునై యున్నది. నీ జనుల ప్రార్థనలు ఆలకించి, పాపమును మర్మముగా కడిగివేయుటకు ఈ నీటిని పరిశుద్ధపరచి, దీనిలో ఇప్పుడు బాప్తిస్మము పొందబోవు ఈ బిడ్డ నీ పూర్ణకృప పొంది నీవు ఏర్పరచుకొనిన విశ్వాసుల సమూహములో నిలకడగా ఉండునట్లు మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా అనుగ్రహించుము. ఆమేన్.

¶ అంతట అక్కడ ఉన్నవారిలో ఎవరైన ఆ బిడ్డకు పేరుపెట్టగానే సేవకుడు దిగువ వచ్చెడు మాటలు పలుకుచు దానిమీద జలము పోయవలెను.

__________, తండ్రియొక్క కుమారునియొక్క పరిశుద్ధాత్మయొక్క పేరట నీకు బాప్తిస్మము ఇచ్చుచున్నాను. ఆమేన్.



¶ తరువాత జనులు మోకాళ్లూనియుండగా సేవకుడును జనులును ప్రభువు ప్రార్థనను చెప్పవలెను. తరువాత సేవకుడు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి చెప్పవలసిన దేమనగా:

మిక్కిలి కనికరముగల తండ్రీ, నీ పరిశుద్ధాత్మచేత ఈ బిడ్డను తిరిగి జన్మింపచేసి, దత్తతవల్ల నీ సొంతబిడ్డనుగా చేర్చుకొని నీ పరిశుద్ధ సంఘములో అవయవముగా చేయుటకు దయచేసినావు గనుక నీకు నిండు మనస్సుతో కృతజ్ఞతాస్తుతులను చెల్లించుచున్నాము. మఱియు ఇతడు (ఈమె) ఇప్పుడు నీ కుమారుని మరణములో పాలుపొందినట్లు ఆయన పునరుత్థానములో పాలుపొందునట్లును అందువల్ల తుదకు నీ పరిశుద్ధ సంఘములోని వారందరితో నీ నిత్యరాజ్యమునకు బాధ్యుడగునట్లును (బాధ్యురాలగునట్లును) అనుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వినయముతో బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

¶ క్రీస్తుగాని డీకనుగాని లేనప్పుడును, అత్యవసరము కలిగినప్పుడును, అచ్చటనున్నవారిలో ఒకరు బిడ్డకు పేరుపెట్టి బిడ్డమీద నీళ్లుపోయుచు—

________తండ్రి కుమారుడు పరిశుద్ధాత్మ పేరట నీకు బాప్తిస్మమిచ్చుచున్నాను. ఆమేన్. అని చెప్పవలెను. అప్పుడు అచ్చట నున్నవారు ప్రభువు ప్రార్థన చెప్పవలెను. అది అయినతోడనే ఆ బాప్తిస్మమునుగూర్చి సంఘ గురువునకు తెలియజేయ వలయును.

¶ ఈ ప్రకారము బాప్తిస్మము పొందిన బిడ్డ యథావిధిగాను లోపము లేకుండను బాప్తిస్మము పొందెననియు ఆ బిడ్డకు మరల బాప్తిస్మము ఇయ్యకూడదనియు వారు రూఢిగా నమ్మవలెను.

## బిడ్డను సంఘములోనికి చేర్చుట

¶ అయినను ఈ విధముగ బాప్తిస్మము పొందిన బిడ్డ బ్రతికినయెడల, ఆ బిడ్డ సరియైన క్రమము ప్రకారము బాప్తిస్మము పొందెనని జనులు తెలిసికొనునట్లు ఆ బిడ్డను దేవాలయములోనికి తెచ్చుట యుక్తమై యున్నది.

¶ మరియొకరివల్ల ఆ బిడ్డ బాప్తిస్మము పొందియుండిన పక్షమున, బిడ్డను సంఘములోనికి చేర్చుకొను సేవకుడు ఆ బిడ్డ యథావిధిగా బాప్తిస్మము పొందినదో లేదోనని పరీక్షించి చూడవలయును. అవసరమైనచో ఆ బిడ్డ, తండ్రి కుమారుడు పరిశుద్ధాత్మ పేరట నీళ్లతో బాప్తిస్మము పొందెనో లేదో కనుగొనుటకై, బిడ్డను తెచ్చినవారిని దిగువ చూపిన విధమున పరీక్షింపవలయును.

## ప్రశ్నలు

ఈ బిడ్డకు బాప్తిస్మమిచ్చిన వారెవరు?

ఈ బిడ్డ బాప్తిస్మము పొందినప్పుడు అక్కడ ఉండిన వారెవరు?

అట్టి అవసరకాలమందు భయమువల్లనే కాని తొందరవల్లనే కాని ఈ సంస్కారమునకు అవశ్యమైన కొన్ని విషయములు విడిచిపెట్టియుండవచ్చును గనుక నేను మిమ్మును ఇంక అడుగున దేమనగా:—

ఈ బిడ్డ నీటివల్ల బాప్తిస్మము పొందెనా?

ఈ బిడ్డ, **తండ్రి కుమారుడు పరిశుద్ధాత్మల పేరట** బాప్తిస్మము పొందెనా?

¶ సంఘ గురువు తానే ఆ బిడ్డకు బాప్తిస్మము యిచ్చియుండినయెడలను, లేదా ఆ బిడ్డ, తండ్రి కుమారుడు పరిశుద్ధాత్మపేరట నీటిచేత బాప్తిస్మము పొందియున్నదని బిడ్డను తెచ్చినవారివల్ల తెలిసికొన్నను ఆ బిడ్డకు అతడు బాప్తిస్మము మరల ఇయ్యకూడదు. కాని, బిడ్డను నిజమైన క్రైస్తవుల మందలో ఒకనిగా చేర్చుకొని చెప్పవలసిన దేమనగా:

ఈ బిడ్డయొక్క బాప్తిస్మము విషయమై సమస్తమును సరిగాను యథావిధిగాను జరిగెనని మీకు రూఢిపరచుచున్నాను. ఈ బిడ్డ ఇప్పుడు బాప్తిస్మమందలి పునర్జన్మ స్నానమువల్ల దేవుని పిల్లలయొక్కయు నిత్యజీవమునకు వారసులైనవారియొక్కయు సమూహములో చేర్చబడియున్నాడు (యున్నది.). ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు అట్టి బిడ్డలకు తన కృపను కనికరమును ఇయ్యననక వారిని తనయొద్దకు మిక్కిలి ప్రేమతో పిలుచుకొనుచున్నాడని మన ఆదరణ నిమిత్తము పరిశుద్ధ సువార్త సాక్ష్యము ఇచ్చుచున్నది. అది ఏలాగనగా: —

¶ అప్పుడు మార్కు సువార్త పదియవ అధ్యాయము పదుమూడవ వచనము నుండి పదునారవ వచనమువరకు (135 పుటలో నున్నట్లు) చదువవలెను.

ప్రియులారా, పిల్లలను తనయొద్దకు తీసికొనిరావలెనని క్రీస్తు ఆజ్ఞాపించిన సంగతి ఈ సువార్తయందుండు మన రక్షకుని మాటలవల్ల మీరు వినియున్నారు. ఆయన వారిని తన చేతులలో ఎత్తికొని దీవించినట్టు మీరు గ్రహించియున్నారు. యేసుక్రీస్తు నిన్న నేడు యుగయుగములకును ఒక్కటేరీతిగా ఉండును. కావున ఈ బిడ్డనుకూడా ఆయన ప్రేమించి, ఇతనికి (ఈమెకు) నిత్యజీవమనెడు వరము దయచేయునని సందేహింపక రూఢిగా నమ్ముడి. కాబట్టి మన పరలోకపు తండ్రి తన కుమారుడైన యేసుక్రీస్తువల్ల తెలియచేసినట్లు ఈ బిడ్డయెడల అనుగ్రహము కలిగియున్నాడని మనము ఇందువల్ల రూఢిచేసికొని, భక్తివిశ్వాసములతో ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించి చెప్పవలసిన దేమనగా:-

¶ అంతట క్రీస్తును జనులును ఇంకను నిలిచియుండి చెప్పవలసిన దేమనిన:

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములు చేసియున్నవారిని మేము క్షమించియున్నప్రకారము మా యపరాధములను క్షమింపుము. మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. రాజ్యము శక్తి మహిమయు నిరంతరమును నీవైయున్నవి. ఆమేన్.



సర్వశక్తిగల నిత్యదేవా, పరలోకపు తండ్రీ, నీ కృప తెలిసికొనుటకును నిన్ను నమ్ముటకును మమ్మును పిలిచితివి గనుక నీకు వినయముగల కృతజ్ఞస్తుతులు చెల్లించుచున్నాము. ఎల్లప్పుడును మాలో ఈ తెలివి వృద్ధిచేసి, ఈ నమ్మకము బలపరచుము. తిరిగి పుట్టి, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిత్యరక్షణకు వారసుడుగా (వారసురాలుగా) చేయబడిన ఈ బిడ్డ నీ సేవకుడుగా (సేవకురాలుగా) నిలిచియుండి నీ వాగ్దానము పొందునట్లు నీ పరిశుద్ధాత్మ నిమ్మని నీతోను పరిశుద్ధాత్మతోను ఇప్పుడును ఎప్పుడును జీవించి ఏలుచుండు నీ కుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ అటుతరువాత పిల్లల బాహాటపు బాప్తిస్మ క్రమములో నున్నట్లు వాడవలెను. జలమును ప్రతిష్ఠించుట బాప్తిస్మము యిచ్చుట అనుభాగములను విడిచిపెట్టి—క్రీస్తు సంఘము అను మందలో అను మాటలనుండి చివరవరకు వాడవలెను.

# THE MINISTRATION OF BAPTISM TO SUCH AS ARE OF RIPER YEARS

## AND ABLE TO ANSWER FOR THEMSELVES

---

## యుక్తవయస్సు వచ్చి

### తమకు తామే ప్రత్యుత్తరమియ్యగలవారికి

# బాప్తిస్మము ఆచరించెడి క్రమము

¶ యుక్తవయస్సు వచ్చినవారు ఎవరైనను బాప్తిస్మము పొందవలసియున్నప్పుడు, వారు క్రైస్తవ మతాంశములు సరిగా నేర్చుకొనిరో లేదో అని తగినట్టుగా పరీక్షింపబడునట్లును, ఈ పరిశుద్ధ సంస్కారమును పొందుటకు ప్రార్థనలతోను ఉపవాసముతోను తమ్మును తాము సిద్ధపరచుకొనవలె నని బోధింపబడునట్లును, ఆ స్థానపు సేవకుడేగాని తలిదండ్రులేకాని వివేకులైన ఇతరులేకాని కనీసము ఒక వారము దినములకు పూర్వము వ్యవధియుండగా బిషపునకైనను, ఆయన ఆ పనికి నియమించిన మరియొకనికైనను అట్టి బాప్తిస్మమునుగురించి తెలియచేయవలెను.

¶ వారు యోగ్యులని యెంచబడితే వారిలో ప్రతివారు ముగ్గురిని లేక కనీసము ఇద్దరిని తమకు సాక్షులుగానుండుటకు ఎన్నుకొనవలెను. సేవకుడు యుక్తమని తలంచినప్రకారము ఉదయ ప్రార్థనలోగాని సాయంప్రార్థనలోగాని రెండవ పాఠము చదువగానే యైనను, మూడవ సంగ్రహ ప్రార్థనకు తరువాతనైనను, లేక గురువునకు యుక్తమని తోచిన ఇతర సమయమందైనను బాప్తిస్మపు తొట్టియొద్ద వారిని కనపరచుటకు ఆ సాక్షులు సిద్ధముగా ఉండవలెను.

¶ సాధ్యమైనంతవరకు ఆదివారములయందును పరిశుద్ధదినములందును చాలమంది కూడియుండు ఇతర సమయములందును బాప్తిస్మము ఆచరించుట యుక్తముగా ఉండును.

¶ క్రీస్తు అక్కడ నిలిచి—నాకు కనుపరచిన వీరిలో ఎవరైనను బాప్తిస్మము పొందిరా లేదా అని అడుగవలెను. లేదంటే అప్పుడు ఆయన ఇట్లు చెప్పవలెను:

మిక్కిలి ప్రియులారా, మనుష్యులందరును పుట్టుకనుండి పాపమునకు లోనై, అనేక యతిక్రమములు చేసియున్నారు. మరియు నీటివల్లను, పరిశుద్ధాత్మవల్లను తిరిగి పుట్టితేనేగాని, ఎవడును దేవునిరాజ్యములో ప్రవేశింపలేడని మన రక్షకుడైన క్రీస్తు చెప్పుచున్నాడు. గనుక, వీరు స్వభావముచేత పొంద



లేనిది వీరికి కలుగునట్లు, అనగా వీరు నీటివల్లను, పరిశుద్ధాత్మవల్లను, బాప్తిస్మము పొంది, క్రీస్తుయొక్క పరిశుద్ధసంఘములో చేర్చబడి, అందులో జీవముగల అవయవములుగా చేయబడునట్లు మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా తండ్రియైన దేవుడు తన అత్యంత కరుణవల్ల వీరికి అనుగ్రహించులాగున ఆయనను ప్రార్థింపవలెనని మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను.

¶ అంతట క్రీస్తు ఇట్లు చెప్పవలెను:

ప్రార్థించుదము.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ మిక్కిలి ప్రియకుమారుడైన యేసు క్రీస్తు యొర్దానునదిలో బాప్తిస్మము పొందినందువల్ల, పాపమును మర్మముగా కడిగివేయునట్లు జలమును పరిశుద్ధపరచితివిగదా. ఈ నీ సేవకులను కటాక్షించుము. వీరు నీ కోపమునుండి విడిపింపబడి, క్రీస్తు సంఘము అను ఓడలో చేర్చబడునట్లు నీ పరిశుద్ధాత్మచేత వీరిని కడిగి పరిశుద్ధపరచుము. మరియు వీరు విశ్వాసమందు స్థిరపడి నిరీక్షణవల్ల సంతోషించి ప్రేమయందు వేరుపారి ఈ లోకమను దుఃఖసాగర కెరటములను దాటి తుదకు నిత్యజీవ తీరమున చేరి అక్కడ నీతో ఎల్లప్పుడును ఏలునట్లు అనుగ్రహించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

సర్వశక్తిగల నిత్యదేవా, అవసరముగలవారందరికి గతియు, ఆశ్రయము నిమిత్తము నీయొద్దకు పరుగెత్తి వచ్చెడి యందరికిని సహాయుడవును, నమ్మెడువారికి జీవమును, చనిపోయినవారికి పునరుత్థానమును నీవేగదా. నీ పరిశుద్ధ బాప్తిస్మము పొందవచ్చిన యీ మనుష్యులు, ఆత్మీయమైన పునర్జన్మముచేత పాపపరిహారమును పొందునట్లు వీరికొరకు నిన్ను వేడుకొనుచున్నాము. అడుగుడి, మీకు ఇయ్యబడును; వెదకుడి, మీకు దొరకును; తట్టుడి, మీకు తీయబడును అని నీ మిక్కిలి ప్రియకుమారునిద్వారా నీవు చేసిన వాగ్దానప్రకారము, ఓ ప్రభువా, వీరిని చేర్చుకొనుము. వీరు నీ పరమస్నానమను నిత్యాశీర్వచనముపొంది, మా ప్రభువైన క్రీస్తుద్వారా నీవు వాగ్దానముచేసిన నిత్యరాజ్యమునకు చేరునట్లు, అడిగెడి మాకు ఇచ్చి వెదకెడి మాకు దొరకునట్లుచేసి, తట్టెడు మాకు తీయుము. ఆమేన్.

¶ అంతట జనులు నిలిచియుండగా క్రీస్తు ఇట్లు చెప్పవలెను:

పరిశుద్ధ యోహాను సువార్త మూడవ అధ్యాయము మొదటి వచనము మొదలుకొని వ్రాసియున్న సువార్త మాటలను వినుడి.

ఉ.—ప్రభువా, నీకు మహిమ కలుగునుగాక.

**యూ**దుల అధికారియైన నికొదేమను పరిసయ్యుడొకడుండెను. అతడు రాత్రియందు యేసునొద్దకు వచ్చి—బోధకుడా, నీవు దేవునియొద్దనుండివచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి తోడైయుంటేనే కాని నీవు చేయుచున్న సూచకక్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను. అందుకు యేసు అతనితో—ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు నికొదేము—ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు? రెండవ మారు తల్లి గర్భమందు ప్రవేశించి జన్మింపగలడా అని ఆయనను అడుగగా, యేసు ఇట్లనెను—ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే కాని దేవునిరాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. శరీరమూలముగా జన్మించినది శరీరమును ఆత్మమూలముగా జన్మించినది ఆత్మయునైయున్నది. మీరు క్రొత్తగా జన్మింపవలెనని నేను నీతో చెప్పినందుకు ఆశ్చర్యపడవద్దు. గాలి తన కిష్టమైన చోటను విసురును; నీవు దాని శబ్దము విందువే గాని, అది యెక్కడనుండి వచ్చునో, యెక్కడికి పోవునో, నీకు తెలియదు. ఆత్మమూలముగా జన్మించిన ప్రతివాడును ఆలాగే ఉన్నాడనెను.

ఉ.—క్రీస్తూ, నీకు స్తోత్రము కలుగుగాక.

¶ అంతట ఈ దిగువవచ్చు బోధినిని చదువవలెను:

ప్రియులారా, నీటివల్లను ఆత్మవల్లను జన్మించితేనే కాని దేవునిరాజ్యములో ఎవడును ప్రవేశింపలేడని మన రక్షకుడైన క్రీస్తు తానే చెప్పిన మాటలు ఈ సువార్తవల్ల మీరు వినియున్నారు. వీలు కలిగినప్పుడు ఈ సంస్కారము పొందుట మిక్కిలి ఆవశ్యకమని ఇందువల్ల మీరు గ్రహింపవచ్చును. మరియు పరిశుద్ధ మార్కు వ్రాసిన సువార్త చివరి అధ్యాయమునందు మనము చదువుచున్నట్లు, క్రీస్తు పరలోకమునకు ఎక్కిపోకమునుపు—మీరు సర్వలోకమునకు వెళ్లి, సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడనియు, నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మనివానికి శిక్ష విధింపబడుననియు, తన శిష్యులకు ఆజ్ఞాపించెను. అందువల్ల దీనినిబట్టి మనకు కలుగు గొప్ప మేలు కనబడుచున్నది. ఈ హేతువుచేత అపొస్తలుడైన పరిశుద్ధ పేతురు మొదట సువార్త బోధించినప్పుడు, అనేకులు తమ హృదయములలో పొడువబడినవారై, ఆయనను తక్కిన అపొస్తలులను—సహోదరులారా, మేము ఏమిచేతుము అని అడుగగా, పేతురు వారితో—మీరు మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు బాప్తిస్మముపొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు; ఈ వాగ్దానము మీకును, మీ పిల్లలకును, దూరస్థులందరికిని అనగా ప్రభువైన మన దేవుడు తనయొద్దకు పిలిచిన వారందరికిని చెందునని వారితో చెప్పెను. మరియు ఇంక అనేకవిధములయిన మాటలతో సాక్ష్యమిచ్చి—మీరు వంకరైన ఈ తరమువారికి వేరై రక్షణపొందుడని వారిని హెచ్చరించెను. ఈ అపొస్తలుడే మరియొకచోట—బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది. అదేదనగా శరీరమాలిన్యము తీసివేయుట కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థానమూలముగా దేవుని విషయమై నిర్మలమైన మనస్సాక్షి కలిగియుండుటకు పూనుకొనుటయే అని చెప్పి బోధించెను. నిజముగా పశ్చాత్తాపపడి, నమ్మి, తనయొద్దకువచ్చు ఈ మనుష్యులను ఆయన దయతో అంగీకరించుననియు, వీరికి పాపపరిహారము కలుగజేసి పరిశుద్ధాత్మను దయచేయుననియు, వీరికి నిత్యజీవవరమును ఇచ్చి తన నిత్యరాజ్యమునకు వీరిని వారసులుగా చేయుననియు, సందేహింపక రూఢిగా నమ్ముడి. కాబట్టి, మన పరలోకపు తండ్రి తన కుమారుడైన యేసుక్రీస్తువల్ల తెలియజేసినట్లు, ఆయన ఈ మనుష్యులయెడల అనుగ్రహము కలిగియున్నాడని మనము ఇందువల్ల రూఢిచేసికొని, భక్తి విశ్వాసములతో ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించి చెప్పవలసినదేమనగా:



¶ అప్పుడు క్రీస్తును జనులును చెప్పవలెసిన దేమనగా:

సర్వశక్తిగల నిత్యదేవా, పరలోకపు తండ్రి, నీ కృప తెలిసికొనుటకును, నిన్ను నమ్ముటకును, మమ్ము పిలువ ననుగ్రహించితివి గనుక నీకు వినయముగల కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. ఎల్లప్పుడు మాలో ఈ తెలివి వృద్ధిచేసి, ఈ నమ్మకము బలపరచుము. ఈ మనుష్యులు తిరిగి పుట్టి, నిత్యరక్షణకు వారసులగునట్లు వీరికి నీ పరిశుద్ధాత్మను ఇమ్మని నీతోను పరిశుద్ధాత్మతోను ఇప్పుడును ఎప్పుడును జీవించి యేలుచుండెడు మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## వాగ్దానములు.

¶ అప్పుడు బాప్తిస్మము పొందబోవువారితో క్రీస్తు ఇట్లు చెప్పవలెను.

మిక్కిలి ప్రియులారా, మీరు పరిశుద్ధ బాప్తిస్మముపొందగోరి, యిక్కడికి వచ్చియున్నారు. మన ప్రభువైన యేసుక్రీస్తు మిమ్మును చేర్చుకొని, ఆశీర్వదించి, మీ పాపములనుండి మిమ్ము విడుదలచేసి, మీకు పరలోకరాజ్యమును నిత్యజీవమును అనుగ్రహింపవలెనని ఈ సభ ప్రార్థించినదియు మీరు విని

యున్నారు. మరియు మేము ప్రార్థించిన ఇవియన్నియు ఇచ్చెదనని తన పరిశుద్ధవాక్యమందు మన ప్రభువైన యేసుక్రీస్తు వాగ్దానముచేసినట్టు మీరు వినియున్నారు. ఆయన ఆ వాగ్దానము తనమట్టుకు తానుమిక్కిలి నిశ్చయముగా నెరవేర్చును.

కాబట్టి క్రీస్తు ఈ వాగ్దానము చేసినందువల్ల మీరుకూడ సాతానును, వాని క్రియలన్నిటిని రోసివేతుమనియు, దేవుని పరిశుద్ధవాక్యము విడువకుండ మీరు నమ్ముదుమనియు ఆయన ఆజ్ఞలను విధేయతగా గైకొందుమనియు మీమట్టుకు మీరు ఈ మీ సాక్షులయెదుటను ఈ సభయెదుటను నమ్మకముగా వాగ్దానము చేయవలెను.

¶ అప్పుడు ప్రీస్టు దిగువవచ్చెడి ప్రశ్నలను బాప్తిస్మము పొందబోవువారిలో ఒక్కొక్కరికి వేయవలెను:

ప్రశ్న.—సాతానును వాని క్రియలన్నిటిని, లోకముయొక్క వృథాడంబమును ఘనమును, లోకసంబంధమైన దురాశలన్నిటిని, శరీరపు పాపేచ్ఛలను వెంబడింపక, వాటివల్ల నడిపింపబడక, నీవు వాటిని రోసివేయుచున్నావా?

ఉత్తరము.—వాటినన్నిటిని రోసివేయుచున్నాను.

ప్రశ్న.—నీవు క్రైస్తవ విశ్వాసమును ఒప్పుకొనుచున్నావా?

ఉత్తరము.—ఒప్పుకొనుచున్నాను.

¶ అప్పుడు బాప్తిస్మము పొందబోవువారు ప్రీస్టుతోను సాక్షులతోను కలసి ఇట్లు చెప్పవలెను:

పరలోక భూలోకముల సృష్టికర్తయగు సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన అద్వితీయకుమారుడును మన ప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన కన్యయగు మరియ గర్భమున ధరింపబడి ఆమెకు పుట్టెను. పొంతిపిలాతు అధికారముక్రింద బాధపడి, సిలువవేయబడి, చనిపోయి, పాతిపెట్టబడి అదృశ్యములోనికి దిగెను. మూడవదినమున చనిపోయినవారిలోనుండి తిరిగి లేచి, పరలోకమునకెక్కి, సర్వశక్తిగల తండ్రియైన దేవుని కుడిచేతివైపున కూర్చుండియున్నాడు. సజీవులకును మృతులకును తీర్పుచేయుటకు అక్కడనుండి ఆయన వచ్చునని నమ్ముచున్నాను.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ సార్వత్రిక సంఘమును, పరిశుద్ధుల సహవాసమును, పాపక్షమాపణను, శరీర పునరుత్థానమును, నిత్యజీవమును నమ్ముచున్నాను. ఆమేన్.



ప్రశ్న.—ఈ విశ్వాసమున బాప్తిస్మముపొంద గోరుచున్నావా?

ఉత్తరము.—కోరుచున్నాను.

ప్రశ్న.—ఆలాగైతే, దేవుని పరిశుద్ధచిత్తమునకును ఆజ్ఞలకును విధేయతగా లోబడి, వాటిచొప్పున నీవు బ్రతుకు దినములన్నియు నడుచుకొందువా?

ఉత్తరము.—దేవుడు నాకు సహాయకుడైయుండగా, ఆ చొప్పున నడుచుకొనుటకు ప్రయత్నముచేయుదును.

¶ అప్పుడు ప్రీస్టుచెప్పవలసినదేమనగా:

కనికరముగల దేవా, ఈ మనుష్యులలోనుండు పాత ఆదాము పాతిపెట్టబడి, వీరిలో క్రొత్తమనిషి లేపబడునట్లు అనుగ్రహింపుము. ఆమేన్.

వీరిలో శరీర దురాశలన్నియు చచ్చి, ఆత్మసంబంధమైనదంతయు బ్రతికి వృద్ధిపొందునట్లు అనుగ్రహింపుము. ఆమేన్.

వీరు లోకమును, శరీరమును, సాతానును జయించుటకు, వీరికి సామర్థ్యమును, బలమును అనుగ్రహింపుము. ఆమేన్.

జీవించుచు సర్వము సదా పరిపాలించు శ్రీమంతుడవును ప్రభుడవునైన ఓ దేవా, ఇక్కడ మా ఉద్యోగమువల్లను సేవవల్లను నీకు సమర్పింపబడు వీరు నీ కనికరమువల్ల పరమగుణములతో అలంకరింపబడి, నిత్యఫలములు పొందునట్లు అనుగ్రహింపుము. ఆమేన్.

## జలమును ప్రతిష్ఠించుట.

¶ అంతట ప్రీస్టు ఈలాగు చెప్పవలెను.

ప్రభువు మీకు తోడై యుండును గాక.

ఉత్తరము.—నీ ఆత్మకును తోడై యుండును గాక.

ప్రీస్టు.—మీ హృదయములను లేవనెత్తుకొనుడి.

ఉత్తరము.—ప్రభువైపునకు వాటిని లేవనెత్తుకొనుచున్నాము.

ప్రీస్టు.—మన ప్రభువైన దేవునికి కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుదము.

ఉత్తరము.—ఆలాగు చేయుట తగినదియు సరియునైయున్నది.

ప్రీస్టు.—ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ, సర్వశక్తిమంతుడా, నిత్యుడవైన దేవా, నీ మిక్కిలి ప్రియకుమారుడైన యేసుక్రీస్తు మా పాపక్షమకొరకు తన విలువలేని ప్రక్కనుండి రక్తమును నీళ్లను ధారపోసి, మీరు వెళ్లి,

సమస్త జనులను శిష్యులగా చేసి, తండ్రియొక్క కుమారునియొక్క పరిశుద్ధాత్మయొక్క నామములోకి వారికి బాప్తిస్మము ఈయుండని తన శిష్యులకు ఆజ్ఞాపించెను గనుక, నీకు కృతజ్ఞతాస్తోత్రములు చెల్లించుట మిక్కిలి తగినదియు సరియు మా విధియునై యున్నది. నీ జనుల ప్రార్థనల నాలకించి, పాపమును మర్మముగా కడిగివేయుటకు ఈ నీటిని పరిశుద్ధపరచి, దీనిలో ఇప్పుడు బాప్తిస్మము పొందబోవు ఈ మనుష్యులు నీ పూర్ణకృపను పొంది నీవు ఏర్పరచుకొనిన విశ్వాసుల సమూహములో నిలకడగా ఉండునట్లు, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా అనుగ్రహింపుము. ఆయనకు నీతో పరిశుద్ధాత్మ ఐక్యమునందు సమస్త ఘనతయు మహిమయు, ఇప్పుడును ఎప్పుడును కలుగునుగాక. ఆమేన్.

## బాప్తిస్మము.

¶ అప్పుడు ప్రీస్టు బాప్తిస్మముపొందబోవు ప్రతివాని కుడిచెయ్యి పట్టుకొని తనకు వీలు అని తోచినట్టు, బాప్తిస్మపు తొట్టియొద్ద అతనిని నిలువబెట్టి సాక్షులను పేరడిగి, అతనిని నీటిలో నుంచుచు, లేక అతనిమీద నీళ్లు పోయుచు చెప్పవలసినదేమనగా:

_______ తండ్రియొక్క, కుమారునియొక్క, పరిశుద్ధాత్మయొక్క పేరట నీకు బాప్తిస్మము ఇచ్చుచున్నాను. ఆమేన్.

క్రీస్తు సంఘము అను మందలోనికి యీ మనుష్యుని చేర్చి, ఇతనికి (ఈమెకు) సిలువ గురుతు* వేయుచున్నాము. ఆమేన్. సిలువ వేయబడిన క్రీస్తు విశ్వాసమును ఇతడు (ఈమె) ఇకమీదట సిగ్గుపడక ఒప్పుకొని, ఆయన జండాక్రింద లోకముతోను, పాపముతోను, సాతానుతోను ధైర్యముగా యుద్ధముచేసి, మరణమువఱ్ఱునకు క్రీస్తుయొక్క నమ్మకమైన బంటుగాను, సేవకుడుగాను (సేవకురాలుగాను) ఉండవలెనని ఇట్లు సిలువ గురుతు వేసియున్నాము. ఆమేన్.

* ఇప్పుడు ప్రీస్టు ఆ మనుష్యుని నొసట సిలువగురుతును వేయవలెను.

## కృతజ్ఞతాస్తుతి.

¶ అంతట ప్రీస్టు చెప్పవలెసిన దేమనగా:

ప్రియసహోదరులారా, ఈ మనుష్యులు తిరిగి పుట్టి, క్రీస్తు సంఘము అను కుటుంబములో చేర్చబడినందున, ఈ ఉపకారములనిమిత్తము సర్వశక్తిగల దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, వీరు ఇప్పుడు ఆరంభించిన ప్రకారము శేష ఆయుశ్శేషము గడుపునట్లు ఆయనను ఏకమనస్సుతో ప్రార్థింతము.



¶ అప్పుడు అందరును ప్రభుప్రార్థన చెప్పవలెను.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. రాజ్యము శక్తి మహిమయు నిరంతరమును నీవైయున్నవి. ఆమేన్.

¶ అప్పుడు ప్రీస్టు క్రింది కృతజ్ఞతాస్తుతులలో ఒకదానిని చెప్పవలెను:

పరలోకపు తండ్రీ, నీ కృప తెలిసికొనుటకును, నిన్ను నమ్ముటకును మమ్ము పిలువ ననుగ్రహించితివి గనుక నీకు వినయ కృతజ్ఞతాస్తుతులను చెల్లించుచున్నాము. ఎల్లప్పుడును మాలో ఈ తెలివి వృద్ధిచేసి, ఈ నమ్మకము బలపరచుము. ఇప్పుడు తిరిగి పుట్టి, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిత్యరక్షణకు వారసులుగా చేయబడిన వీరు, ఎల్లప్పుడును నీ సేవకులుగా ఉండి, నీ వాగ్దానములు పొందులాగు వీరికి నీ పరిశుద్ధాత్మను ఇమ్మని నీతోను పరిశుద్ధాత్మతోను ఏకదేవుడుగా ఎప్పుడును జీవించి యేలుచుండెడు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

లేదా యిది.

మిక్కిలి కనికరముగల తండ్రీ, నీ పరిశుద్ధాత్మచేత ఈ మనుష్యులను తిరిగి జన్మింపజేసి, దత్తతవల్ల నీ సొంతబిడ్డలనుగా చేర్చుకొని, నీ పరిశుద్ధసంఘములో అవయవములుగా చేయుటకు దయచేసినావు గనుక, నీకు నిండుమనస్సుతో కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. మరియు పాపమువిషయమై చనిపోయి, నీతివిషయమై జీవించి, క్రీస్తు మరణమందు ఆయనతోకూడ పాతిపెట్టబడిన వీరు, పాతమనుష్యుని సిలువవేసి, పాపశరీరము యావత్తుగా నశింపచేసి, నీ కుమారుని మరణములో పాలుపొందినట్లు ఆయన పునరుత్థానములో పాలుపొందునట్లును, అందువల్ల తుదకు నీ పరిశుద్ధ సంఘములోని వారందరితో నీ నిత్యరాజ్యమునకు బాధ్యులగునట్లును, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా అనుగ్రహింపుమని నిన్ను వినయముతో బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

¶ అంతట దిగువవచ్చు బోధిని క్రీస్తు సాక్షులకు చదివి వినిపింపవలెను.

## సాక్షులయొక్కయు క్రొత్తగా బాప్తిస్మము పొందినవారి యొక్కయు విధులు.

వీరు సాతానును వాని క్రియలన్నిటిని రోసివేసి, దేవుని నమ్మి, ఆయనను సేవింతుమని మీయెదుట వాగ్దానముచేసిరి గనుక, ఈ సభయెదుటను, ముఖ్యముగా తాము ఏర్పరచుకొన్న సాక్షులైన మీయెదుటను వీరు ఇప్పుడు చేసిన గంభీరమైన వ్రతమును వాగ్దానమును ఒప్పందమును వీరికి జ్ఞాపకము చేయుట మీ భారమును విధియునైయున్నదని మీరు జ్ఞాపకమందుంచుకొనవలెను. వీరు కృపలోను మన ప్రభువునైన యేసుక్రీస్తుయొక్క తెలివిలోను అభివృద్ధి పొంది, ఇహమందు భక్తితోను, నీతితోను, సుబుద్ధితోను ప్రవర్తించునట్లు దేవుని పరిశుద్ధవాక్యమును చాల శ్రద్ధతో చక్కగా నేర్చుకొనవలెనని మీరు వీరికి బుద్ధి చెప్పవలెను.

¶ అంతట క్రొత్తగా బాప్తిస్మము పొందినవారితో ఆయన యిట్లు చెప్పవలెను:

బాప్తిస్మమువల్ల ఇప్పుడు క్రీస్తును ధరించిన మీరైతే, యేసుక్రీస్తునందలి విశ్వాసమువల్ల దేవుని పిల్లలుగాను వెలుగు పిల్లలుగాను చేయబడి యున్నారు గనుక క్రైస్తవ పిలుపునకు తగినట్లును, వెలుగు పిల్లలకు తగినట్లును నడుచుకొనుట మీ భారము, మీ విధి. బాప్తిస్మము క్రైస్తవ బాధ్యతను సూచించుచున్నది. అది యేదనగా మన రక్షకుడైన క్రీస్తు మాదిరిని వెంబడించి ఆయనవలెనే యుండుట, అనగా ఆయన మనకొరకు చనిపోయి తిరిగి లేచినట్లు, బాప్తిస్మము పొందిన మనమును పాపమువిషయమై చనిపోయి, నీతివిషయమై తిరిగి లేచి, దురిచ్ఛలను నిత్యము చంపి, సమస్త సద్గుణములయందును దైవభక్తితో కూడిన ప్రవర్తనయందును అనుదినము వృద్ధినొందుటయై యున్నదని జ్ఞాపకమందుంచుకొనుడి.

¶ ఉదయ సాయంప్రార్థన సమయములందుగాక, యితర సమయములందు బాప్తిస్మము ఆచరింపబడినయెడల క్రీస్తు అప్పుడు కూడినవారిని ఈ దీవెనతో పంపివేయవలెను.

ప్రభువు మిమ్మును ఆశీర్వదించి మిమ్మును కాపాడునుగాక. ప్రభువు మీకు తన సన్నిధిని ప్రకాశింపచేసి మిమ్మును కరుణించునుగాక. ప్రభువు మీమీద తన సన్నిధికాంతి ఉదయింపజేసి యిప్పుడును ఎప్పుడును మీకు సమాధానము దయచేయునుగాక. ఆమేన్.



¶ యుక్తవయస్సున బాప్తిస్మముపొందిన ప్రతివాడును పరిశుద్ధ సంస్కారమునకు వచ్చునట్లు బాప్తిస్మము పొందినతరువాత వీలైనంత త్వరలో బిషపువల్ల నిర్ధారణపొందుట యుక్తము.

¶ పసితనమందు బాప్తిస్మము పొందియుండక తమకుతామే ప్రత్యుత్తరమిచ్చుటకు యుక్తవయస్సు రాకమునుపు బాప్తిస్మముపొందుటకు ఎవరైనను తేబడినట్టయితే పిల్లల బాహాటపు బాప్తిస్మమును ఆచరించెడి క్రమమును లేక, మరణావస్థలో నుంటే రహస్యపు బాప్తిస్మము ఆచరించెడి క్రమమును వాడితే చాలును. అయినను బిడ్డ అను మాటకు సమయమునుబట్టి పిల్లవాడు (పిల్ల) అనియైనను, మనిషి అనియైనను చెప్పవలెను.

¶ యుక్తవయస్సు వచ్చినవాడొకడు యథావిధిగా బాప్తిస్మముపొందెనో లేదో అను సందేహమున్న యెడల క్రీస్తు ఇక్కడ నియమింపబడిన క్రమముప్రకారము బాప్తిస్మము ఇచ్చుచు, ఈ క్రింది విధముగా మాటలు వాడవలెను:

________ నీవు ఇదివరకు బాప్తిస్మము పొందనియెడల తండ్రియొక్క కుమారునియొక్క పరిశుద్ధాత్మయొక్క పేరట నీకు బాప్తిస్మము ఇచ్చుచున్నాను. ఆమేన్.

¶ బాప్తిస్మముపొందని యుక్తవయస్సువచ్చినవాడొకడు మరణావస్థలోనున్నను, బలహీనతవలన దేవాలయమునకు వానిని తెచ్చుటకు వీలుపడకనున్నను, వాని పశ్చాత్తాప విశ్వాసములను గూర్చియు, బాప్తిస్మముపొందవలెనను వాని ఆశనుగూర్చియు, సేవకుడు తృప్తిపొందినయెడల, రహస్యపు బాప్తిస్మమిచ్చు క్రమము, బాప్తిస్మము పొందెడివాని వయస్సునకు తగినట్లుగా మార్చి వాడవచ్చును.

# A CATECHISM.

# ప్రశ్నోత్తర బోధిని

అనగా

## బిషపువల్ల నిర్ధారణపొందుటకు తేబడకపూర్వము ప్రతివాడు నేర్చుకొనవలసిన ఉపదేశము.

**ప్రశ్న.**—నీ పేరేమి?

**ఉత్తరము.**—నా పేరు ____________________

**ప్రశ్న.**—నీకు ఈ పేరు ఎవరు పెట్టిరి?

**ఉత్తరము.**—నా బాప్తిస్మమునందు నా దేవతండ్రులును దేవతల్లులును నాకు ఈ పేరు పెట్టిరి. దానియందు నేను క్రీస్తు అవయవముగాను దేవుని బిడ్డగాను పరలోకరాజ్యమునకు వారసునిగాను చేయబడితిని.

**ప్రశ్న.**—నీ దేవతండ్రులును దేవతల్లులును అప్పుడు నీకొరకు ఏమిచేసిరి?

**ఉత్తరము.**—వారు నా పేరట మూడు సంగతులనుగురించి మాటయిచ్చి ప్రతిజ్ఞచేసిరి. అవి యేవనిన—మొదటిది, నేను సాతానును వాని క్రియలన్నిటిని ఈ దుష్టలోకముయొక్క వేడుకలను డంబమును పాపపు శరీరేచ్ఛలన్నిటిని రోసివేయుదుననియు; రెండవది, నేను క్రైస్తవమతాంశములన్ని నమ్ముదుననియు; మూడవది, నేను దేవుని పరిశుద్ధ చిత్తమునకును ఆజ్ఞలకును లోబడి వాటి చొప్పున నా జీవితకాలమంతా నడుచుకొందుననియు ప్రతిజ్ఞచేసిరి.

**ప్రశ్న.**—వారు నీ పేరట మాట యిచ్చినప్రకారము నమ్మి చేయుటకు బద్ధుడవైయున్నట్టు నీకు తోచదా?

**ఉత్తరము.**—ఆలాగే తోచుచున్నది. మరియు దేవుని సహాయమువల్ల ఆ ప్రకారమే చేయుదును. ఇకను మన పరలోకపు తండ్రి మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా ఈ రక్షణస్థితికి నన్ను పిలిచినందుకు ఆయనకు నిండు



మనస్సుతో కృతజ్ఞతాస్తుతులు చెల్లించి మరణము మట్టునకు అందులోనే నేను నిలకడగా నుండునట్టు తన కృపను నాకు దయచేయుమని దేవుని వేడుకొనుచున్నాను.

### బోధకుడు.

నీ విశ్వాసాంశములు వినిపించుము.

### ఉత్తరము.

పరలోక భూలోకముల సృష్టికర్తయగు సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన అద్వితీయ కుమారుడును మన ప్రభువైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన కన్యయగు మరియ గర్భమున ధరింపబడి ఆమెకు పుట్టెను. పొంతిపిలాతు అధికారముక్రింద బాధపడి సిలువవేయబడి చనిపోయి పాతిపెట్టబడి అదృశ్యలోకములోనికి దిగెను. మూడవదినమున చనిపోయినవారిలోనుండి తిరిగి లేచి పరలోకమునకెక్కి సర్వశక్తిగల తండ్రియైన దేవుని కుడిచేతివైపున కూర్చుండియున్నాడు. సజీవులకును మృతులకును తీర్పుచేయుటకు అక్కడనుండి ఆయన వచ్చునని నమ్ముచున్నాను.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ సార్వత్రిక సంఘమును పరిశుద్ధుల ఐకమత్యమును పాపక్షమాపణను శరీర పునరుత్థానమును నిత్యజీవమును నమ్ముచున్నాను. ఆమేన్.

**ప్రశ్న.**—ఈ విశ్వాసాంశములవల్ల నీవు ముఖ్యముగా నేర్చుకొనునదేమి?

**ఉత్తరము.**—మొదటిది, నన్నును లోకమంతను సృష్టించిన తండ్రియైన దేవుని నమ్ముట.

రెండవది.—నన్నును మనుష్యజాతినంతను క్రయమిచ్చి విడిపించిన కుమారుడైన దేవుని నమ్ముట.

మూడవది.—నన్నును దేవుడు ఏర్పరచుకొన్న జనులందరిని పరిశుద్ధపరచు పరిశుద్ధాత్మయైన దేవుని నమ్ముటయను సంగతులను నేర్చుకొనుచున్నాను.

**ప్రశ్న.**—దేవుని ఆజ్ఞలను గైకొందువని నీ దేవతండ్రులును దేవతల్లులును నీ పేరట మాట యిచ్చిరని చెప్పితివిగదా, అవి యెన్నో చెప్పుము.

**ఉత్తరము.**—పది.

ప్రశ్న.—అవి యేవి?

**ఉత్తరము.**

నిర్గమకాండముయొక్క ఇరువదవ అధ్యాయములో దేవుడు చెప్పినవే. ఏవనిన బందీగృహమైన ఐగుప్తుదేశములోనుండి నిన్ను వెలపటికి తెచ్చిన నీ దేవుడను ప్రభువును నేనే.

1. నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదు.

**2.** పైన ఆకాశమందేగాని, క్రింది భూమియందేగాని, భూమిక్రింద నీళ్లయందేగాని యుండు దేని రూపమునైనను విగ్రహమునైనను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిలపడకూడదు వాటిని పూజింపకూడదు. ఏలననగా నీ దేవుడనైన ప్రభువనగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల పర్యంతము, తండ్రుల దోషమును కుమారులమీదికి రప్పించుచు నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొనువారిని వెయ్యితరముల పర్యంతము కరుణించువాడనై యున్నాను.

**3.** నీ దేవుడైన ప్రభువు నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు; ప్రభువు తన నామమును వ్యర్థముగా నుచ్చరించువాని నిర్దోషిగా ఎంచడు.

**4.** విశ్రాంతిదినము పరిశుద్ధదినముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను. ఏడవ దినము నీ దేవుడైన ప్రభువుకు విశ్రాంతిదినము. దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను నీ దాసుడైనను నీ దాసియైనను నీ పశువైనను నీ యిండ్లలోనున్న పరదేశియైనను ఏ పనియు చేయకూడదు. ఆరు దినములలో ప్రభువు ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి యేడవ దినమున విశ్రమించెను; అందుచేతను ప్రభువు విశ్రాంతిదినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధపరచెను.

5. నీ దేవుడైన ప్రభువు నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము.

6. నరహత్య చేయకూడదు.

7. వ్యభిచరింపకూడదు.

8. దొంగిలకూడదు.

9. నీ పొరుగువానిమీద అబద్ధసాక్ష్యము పలుకకూడదు.



10. నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు. నీ పొరుగువాని భార్యనైనను అతని దాసునైనను అతని దాసినైనను అతని యెద్దునైనను అతని గాడిదెనైనను నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు.

ప్రశ్న.—ఈ ఆజ్ఞలవల్ల నీవు ముఖ్యముగా నేర్చుకొనునదేమి?

**ఉత్తరము.**—నేను రెండు సంగతులను నేర్చుకొనుచున్నాను. ఏవనిన—దేవునియెడల నా కర్తవ్యము, పొరుగువానియెడల నా కర్తవ్యము.

ప్రశ్న.—దేవునియెడల నీ కర్తవ్యమేమి?

**ఉత్తరము.**—దేవుని నమ్మి ఆయనకు భయపడి, నా పూర్ణ హృదయముతోను నా పూర్ణ మనస్సుతోను నా పూర్ణాత్మతోను నా పూర్ణబలముతోను ఆయనను ప్రేమించుటయు, ఆయనను ఆరాధించి ఆయనకు కృతజ్ఞతాస్తుతులను చెల్లించి ఆయనయందు సంపూర్ణమైన నమ్మకముంచి ఆయనను వేడుకొని ఆయన పరిశుద్ధ నామమును వాక్యమును ఘనపరచి నా జీవితకాలమంత ఆయనను నిజముగా సేవించుటయు నా కర్తవ్యమై యున్నది.

ప్రశ్న.—నీ పొరుగువానియెడల నీ కర్తవ్యమేమి?

**ఉత్తరము.**—నన్ను నేను ప్రేమించునట్లు నా పొరుగువాని ప్రేమించి, మనుష్యులందరు నాకు ఏమేమి చేయవలెనని కోరుదునో వాటినన్నిటిని వారికి చేయుటయు, నా తల్లిదండ్రులను ప్రేమించి సన్మానించి ఆదరించుటయు, చక్రవర్తిని ఆయనక్రింద అధికారము పొందినవారినందరిని మన్నించి వారికి లోబడుటయు, నా అధికారులు బోధకులు ఆత్మపాలకులు యజమానులు అగు అందరికిని నేను లోబడుటయు, నా అధికులందరియెడల వినయముతోను భయభక్తులతోను నడుచుకొనుటయు, మాటవల్లనేమి క్రియవల్లనేమి ఎవనికిని హానిచేయకుండుటయు, నేను చేయు పనులన్నిటిలో సత్యముగాను న్యాయముగాను ప్రవర్తించుటయు, నా హృదయములో అసూయ పగ ఉంచుకొనకపోవుటయు, పిక్కులక దొంగిలక ఉండునట్లు నా చేతులను, దూషించక అబద్ధమాడక చాడిచెప్పక ఉండునట్లు నా నాలుకను కాచుకొనుటయు, నా శరీరమును మితానుభవముతోను సుబుద్ధితోను ఇంద్రియశుద్ధితోను కాపాడుకొనుటయు, ఇతరుల సొత్తు ఆశింపక స్వజీవనము సంపాదించుకొనుటకు పనినేర్చుకొని బాగుగా కష్టపడి దేవుడు నన్ను ఉంచు స్థితిలోనే యుక్తముగా ప్రవర్తించుటయు నా పొరుగువానియెడల నా కర్తవ్యమై యున్నది.

## బోధకుడు.

నా ప్రియమైన బిడ్డా, దేవుని విశేష కృపలేనిది నీ యంతట నీవే వీటిని చేయుటకుగాని ఆయన ఆజ్ఞల ప్రకారము నడుచుకొనుటకుగాని ఆయనను సేవించుటకుగాని నీచేత కాదని తెలిసికొనుము. ఆ కృపకొరకు అన్నికాలములయందు శ్రద్ధగా ప్రార్థింప నేర్చుకొనవలెను. కాబట్టి నీవు ప్రభువు ప్రార్థన చెప్పగలిగితే వినుపించుము.

## ఉత్తరము.

పరలోకమందున్న మా తండ్రీ నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. ఆమేన్.

**ప్రశ్న.**—నీవు ఈ ప్రార్థనలో దేవుని వేడుకొనునదేమి?

**ఉత్తరము.**—అన్ని మేలులకు దాతయు మన పరలోకపు తండ్రియు ప్రభువునైన దేవుని మనము తగునట్టుగా ఆరాధించి సేవించి ఆయనకు లోబడునట్టు నాకును మనుష్యులందరికిని తన కృప నియ్యవలెనని ఆయనను వేడుకొనుచున్నాను. మరియు మన శరీరాత్మలకు కావలసినదంత దయచేయవలెననియు, మనలను కనికరించి మన పాపములు క్షమింపవలెననియు, శరీరాత్మలకు చెందగల ఆపదలన్నిటినుండి తప్పించి మనలను దయగా సంరక్షింపవలెననియు సమస్త పాపములనుండియు దుర్మార్గమునుండియు మన ఆత్మ విరోధినుండియు నిత్యమరణమునుండియు తప్పింపవలెననియు దేవుని ప్రార్థించుచున్నాను. ఆయన తన దయాదాక్షిణ్యములవల్ల మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దీని దయచేయునని నమ్ముచున్నాను గనుక—ఆమేన్ అనగా, అట్లు అగుగాక అని చెప్పుచున్నాను.

**ప్రశ్న.**—క్రీస్తు తన సంఘములో ఎన్ని సంస్కారములు నిర్ణయించెను?

**ఉత్తరము.**—బాప్తిస్మము ప్రభువు రాత్రిభోజనము అను రెండు మాత్రమే రక్షణకు అగత్యమైనవి అని క్రీస్తు నిర్ణయించెను.



**ప్రశ్న.**—సంస్కారమనెడి మాటకు ఏమి అర్థము చేయుచున్నావు?

**ఉత్తరము.**—మనకు ఇయ్యబడుచున్న ఆత్మీయమైన లోపలి కృపకు కనబడు వెలుపలి గురుతు అనియు, ఇది ఆ కృపను పొందుటకు సాధనముగాను దాని పొందితిమని నిశ్చయము కలుగజేయు ఆనవాలుగాను ఉండుటకు క్రీస్తు తానే నిర్ణయించెననియు అర్థము చేయుచున్నాను.

**ప్రశ్న.**—సంస్కారములో ఎన్ని అంశములు కలవు?

**ఉత్తరము.**—రెండు, అవి ఏవన, కనబడు వెలుపలి గురుతును, ఆత్మీయమైన లోపలి కృప అనునవి.

**ప్రశ్న.**—బాప్తిస్మమందు కనబడు వెలుపలి గురుతు లేక పదార్థము ఏది?

**ఉత్తరము.**—ఉదకము. ఇందులో మనుష్యుడు తండ్రియొక్క కుమారునియొక్క పరిశుద్ధాత్మయొక్క పేరట బాప్తిస్మము పొందుచున్నాడు.

**ప్రశ్న.**—బాప్తిస్మమందు ఆత్మీయమైన లోపలి కృప ఏది?

**ఉత్తరము.**—పాపవిషయమై చనిపోవుటయు నీతివిషయమై క్రొత్తగా పుట్టుటయు. ఏలాగనగా, స్వభావమువల్ల పాపులమై పుట్టి ఉగ్రతపిల్లలమయిన మనము ఇందువల్ల కృప పిల్లలముగా చేయబడితిమి.

**ప్రశ్న.**—బాప్తిస్మము పొందెడివారికి ఏమి అగత్యమైయున్నది?

**ఉత్తరము.**—వారు పాపము విడిచిపెట్టినట్లు చేయు పశ్చాత్తాపమును, ఆ సంస్కారమందు దేవుడు వారికి చేసిన వాగ్దానములు స్థిరముగా నమ్మునట్లు చేయు విశ్వాసమును అగత్యమైయున్నవి.

**ప్రశ్న.**—పసిబిడ్డలు లేతప్రాయమునుబట్టి ఆ రెంటిని నెరవేర్చ శక్తిలేనివారైయుండగా బాప్తిస్మము ఎందుకు పొందుచున్నారు?

**ఉత్తరము.**—వారు ఆ రెంటినిగురించి తమ జామీనుదారులద్వారా వాగ్దానము చేయుచున్నారు గనుక బాప్తిస్మము పొందుచున్నారు. యుక్తవయస్సు రాగానే ఆ వాగ్దానముచొప్పున చేయుటకు బద్ధులైయున్నారు.

**ప్రశ్న.**—ప్రభువు రాత్రిభోజనమనెడి సంస్కారము ఎందుకు నిర్ణయింపబడినది?

**ఉత్తరము.**—యేసుక్రీస్తు మరణమును బలిని, అందువల్ల మనము పొందు మేలులను ఎల్లప్పుడు జ్ఞాపకము ఉంచుకొనుటకు నిర్ణయింపబడినది.

ప్రశ్న.—ప్రభువు రాత్రిభోజనమందు వెలుపలి అంశము, లేక గురుతు ఏది?

**ఉత్తరము.**—పుచ్చుకొనుమని ప్రభువు ఆజ్ఞాపించిన రొట్టెయు ద్రాక్షారసమును.

ప్రశ్న.—లోపలి అంశము, లేక సూచింపబడునది యేది?

**ఉత్తరము.**—ప్రభువు రాత్రిభోజనమందు విశ్వాసులు రూఢిగాను నిజముగాను పుచ్చుకొనెడి క్రీస్తు శరీర రక్తములు.

ప్రశ్న.—మనము వాటివల్ల పొందు మేలులేవి?

**ఉత్తరము.**—రొట్టెవల్లను ద్రాక్షారసమువల్లను మన శరీరములు బలపడి సుఖపడిన ప్రకారము క్రీస్తు శరీర రక్తములవల్ల మన యాత్మలు బలపడి సుఖపడుటయే.

ప్రశ్న. — ప్రభువు రాత్రిభోజనమునకు వచ్చెడివారికి అగత్యమైనది యేది?

**ఉత్తరము.**—తాము చేసిన పాపములనుగురించి నిజముగా వారు పశ్చాత్తాపపడి క్రొత్త నడవడిగలవారగుటకు నిశ్చయించుకొనుచున్నారేమో అనియు, క్రీస్తు మరణమును కృతజ్ఞతతో జ్ఞాపకముచేసికొని ఆయన ద్వారా దేవుడు చూపిన కనికరమునందు తీక్షణమైన విశ్వాసము ఉంచుచున్నారేమో అనియు, మనుష్యులందరియెడల ప్రేమకలిగియున్నారేమో అనియు తమ్మును తాము పరీక్షించుకొనుట.

¶ ప్రతి సంఘగురువును ఆదివారములందును పరిశుద్ధ దినములందును సాయం ప్రార్థనలో రెండవ పాఠము కాగానే ఈ ప్రశ్నోత్తరబోధినిలో ఏదో ఒక భాగమునుబట్టి తనయొద్దకు పంపబడిన పిల్లలలో తనకు వీలైనంతమందికి దేవాలయములో బాహాటముగా శ్రద్ధతో బోధించి వారిని పరీక్షించవలెను.

¶ తల్లిదండ్రులు యజమానులు యజమానురాండ్రు వీరందరును ప్రశ్నోత్తరబోధిని రాని తమ పిల్లలును సేవకులును పని నేర్చుకొనువారును దానిలో నియమింపబడినదంతయు నేర్చుకొనువరకు నిర్ణయకాలమందు దేవాలయమునకు వచ్చి సంఘగురువు బోధను విధేయతగా విని ఆయన ఆజ్ఞకు లోబడునట్లు చేయవలెను.

---

# GENERAL RUBRICS OF THE ORDER OF CONFIRMATION

# నిర్ధారణ క్రమమునకు చెందు సామాన్య విధులు

¶ నిర్ధారణ పొందబోవువారు దానిని మరింత సఫలముగా పొందుటకుగాను విశ్వాససూత్రమును ప్రభువు ప్రార్థనను పదియాజ్ఞలను చెప్పగలిగి, చిన్న ప్రశ్నోత్తర బోధినియందున్న యితర ప్రశ్నలకు ఉత్తరము లియ్యగలవారే తప్ప మరి యెవరును ఇకమీదట నిర్ధారణ పొందగూడదని విధించుట సంఘమునకు యుక్తమని తోచినది. ఈ విధి చొప్పున జరిగించుట మిక్కిలి తగియున్నది. ఏలననగా పిల్లలు ఇప్పుడు యుక్తవయస్సుగలవారై బాప్తిస్మమందు తమకొరకు తమ దేవ తండ్రులును దేవ తల్లులును చేసిన వాగ్దానములు నేర్చుకొని, వాటికి సమ్మతించి తమంతట తామే బాహాటముగా సభయెదుట ఒప్పుకొని, అవి సరియని స్థిరపరచుదురు. అంతియేకాక, తాము ప్రతిజ్ఞాపూర్వకముగ అంగీకరించిన వాటిని, దేవుని కృపచేత నమ్మకముగ ఎప్పుడును నెరవేర్చుటకు ప్రయత్నింతుమని వాగ్దానము చేయుదురు.

¶ పిల్లలు యుక్తవయస్సునకు వచ్చి స్వభాషయందు విశ్వాససూత్రమును ప్రభువు ప్రార్థనను పదియాజ్ఞలను చెప్పగలిగి చిన్న ప్రశ్నోత్తరబోధినిలోని యితర ప్రశ్నలకు ఉత్తరము లియ్యగలుగగనే వారిని బిషపునొద్దకు తేవలెను.

¶ బాప్తిస్మము పొంది యౌవనస్థులుగనే నిర్ధారణ పొందనివారెవ్వరైన తన పాస్త్రేటులో నున్నారేమో యని తెలిసికొనుటకు సంఘగురువు అప్పుడప్పుడు శ్రద్ధగా విచారణచేయవలెను. అట్టివారెవరైన నున్నయెడలను, వారు నిర్ధారణ పొందుటకు తగియున్నయెడలను వారు నిర్ధారణలో దేవుని కృపను పొందుటకు తమ్మును తాము సిద్ధపరచుకొనవలయునని వారిని ఆసక్తితో హెచ్చరింపవలయును.

¶ నిర్ధారణ పొందవలసినవారిని నిర్ధారణ నిమిత్తము తనయొద్దకు తీసికొని రావలయునని బిషపు తెలియజేసినప్పుడెల్లను, ప్రతి సంఘగురువు తన పాస్త్రేటులో నిర్ధారణ పొందుటకు యోగ్యులని తనకు తోచినవారి పేర్లను వయస్సును ఒక జాబితాలో వ్రాసి, సంతకముచేసి దానిని బిషపునొద్దకు తీసికొని పోవలయును; లేదా ముందుగానే పంపవలయును. నిర్ధారణ పొందుటకు యోగ్యులని తనకు తోచినవారికి దిగువ చూపిన విధమున బిషపు నిర్ధారణ జరుపవలయును.

¶ నిర్ధారణ పొందు ఒక్కొక్కరికిని వారు నిర్ధారణ పొందినందుకు సాక్ష్యముగా ఒక దేవ తండ్రిగాని దేవ తల్లిగాని యుండుట యుక్తము.

¶ నిర్ధారణ పొందినవారినే తప్ప, లేదా బిషపు దృష్టిలో నిర్ధారణ పొందగోరి సిద్ధపడియున్నవారినే తప్ప మరెవ్వరినిగాని పరిశుద్ధ సమభోక్తృమునకు రానియ్యకూడదు.

# THE ORDER OF CONFIRMATION

# నిర్ధారణ క్రమము

¶ ఏర్పరచబడిన దినమందు నిర్ధారణ పొందబోవువారందరు బిషపు ఎదుటకు తేబడి వరుసగా నిలిచియుండగా ఆయనయైనను, ఆయన ఏర్పరచిన మరియొక సేవకుడైనను, ఈ దిగువవచ్చెడి పీఠికను చదువవలెను లేదా ఆయన యిష్టముచొప్పున మరియొక ప్రసంగము చేయవచ్చును.

ప్రభువునందు మిక్కిలి ప్రియులారా, మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క అపొస్తలుల దృష్టాంతమును వెంబడించి, క్రీస్తు సంఘము నిర్ధారణ ఆచారమును జరుపుచున్నది. ఎట్లనగా—అపొస్తలుల కార్యములు ఎనిమిదవ అధ్యాయములో మనమిట్లు చదువుచున్నాము—చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు, సంచారముచేసిరి. అప్పుడు ఫిలిప్పు సమరైయ పట్టణమువరకు వెళ్లి క్రీస్తును వారికి ప్రకటించుచుండెను. ఫిలిప్పు దేవుని రాజ్యమునుగూర్చియు యేసుక్రీస్తు నామమునుగూర్చియు సువార్త ప్రకటించుచుండగా, వారతని నమ్మి, పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి. సమరైయవారు దేవుని వాక్యమును అంగీకరించిరని యెరూషలేములోని అపొస్తలులు విని, పేతురును యోహానును వారియొద్దకు పంపిరి. వీరు వచ్చి, వారు పరిశుద్ధాత్మను పొందవలెనని వారికొరకు ప్రార్థన చేసిరి. అంతకుముందు వారిలో ఎవని మీదను ఆయన దిగియుండలేదు. వారు ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము మాత్రము పొందినవారై యుండిరి. అప్పుడు అపొస్తలులు వారి మీద చేతులుంచగా వారు పరిశుద్ధాత్మను పొందిరి.

ప్రార్థనతోకూడిన హస్తనిక్షేపణద్వారా పరిశుద్ధాత్మయొక్క విశేషవరము ఇయ్యబడునట్లు లేఖనము ఇక్కడ మనకు బోధించుచున్నది. మరియు ఈ వరము దేవునినుండిమాత్రమే వచ్చును గనుక, బాప్తిస్మమందు దేవుని బిడ్డలుగా చేయబడినవారిని, నిర్ధారణలో ఆయన తన పరిశుద్ధాత్మవలన బలపరచులాగున ఇక్కడనున్న మనము సర్వశక్తిగల దేవుని ప్రార్థించుదము.

నిర్ధారణ పొందబోయెడి మీరైతే, ఈ వరముయొక్క సహాయముచేత క్రీస్తునందలి విశ్వాసముద్వారా, దేవుని చిత్తమునకును ఆజ్ఞలకును విధేయులై మీ జీవితకాలమంతయు నడుచుకొనుటకు దృఢముగా నిశ్చయించుకొనినట్లు, ఈ



సభయెదుట ప్రకటింపవలెను. మరియు, మీ బాప్తిస్మమునుబట్టి మీరు నెరవేర్చుటకు బద్ధులైయున్న క్రైస్తవ విధులను బాహాటముగా ఒప్పుకొనుటయు అవసరమై యున్నది.

## బాప్తిస్మ ప్రతిజ్ఞలను తిరిగి చేయుట.

¶ అంతట బిషపు ఇట్లు చెప్పవలెను:

బాప్తిస్మమందు మీ పేరట చేయబడిన గంభీరమైన వాగ్దానమును ప్రతిజ్ఞను ఇక్కడ దేవుని సమ్ముఖములోను ఈ సభయెదుటను తిరిగి చేసి, మీ యంతట మీరే వాటిని సరియని స్థిరపరచి, మీ దేవతండ్రులును దేవతల్లులును మీకు ప్రతిగా అప్పుడు పూనుకొన్నవన్నియు నమ్మి నెరవేర్చుటకు బద్ధులమై యున్నామని ఒప్పుకొనుచున్నారా?

¶ అప్పుడు వినబడునట్లుగా ప్రతివాడును ఇయ్యవలసిన ఉత్తరమేమనగా:

## ఒప్పుకొనుచున్నాను.

లేదా బిషపు ఇట్లు చెప్పవలెను:

ఇక్కడ, దేవుని సమ్ముఖములోను ఈ సభ ఎదుటను, సాతానును వాని క్రియలన్నిటిని, ఈ దుష్టలోకముయొక్క వేడుకలను డంబమును పాపపు శరీరేచ్ఛలన్నిటిని వెంబడింపక, వాటివల్ల నడిపింపబడక నీవు వాటిని రోసివేయుచున్నావా?

ఉత్తరము.—రోసివేయుచున్నాను.

అపొస్తలుల విశ్వాస సూత్రములోనున్నట్టు క్రైస్తవ విశ్వాస అంశములన్నిటిని నమ్ముచున్నావా?

ఉత్తరము.—నమ్ముచున్నాను.

దేవుని పరిశుద్ధ చిత్తమునకును ఆజ్ఞలకును లోబడి వాటిచొప్పున నీ జీవితకాలమంతయు నడుచుకొనుటకు ప్రయత్నముచేయుదువా?

ఉత్తరము.—చేయుదును.

## నిర్ధారణ.

¶ అప్పుడు బిషపు నిర్ధారణ ఆరంభించవలెను; దీనికి పిదప కీర్తనగాని ప్రసంగముగాని ఈ భాగమందు ఉండకూడదు.

బి.—ప్రభువు నామమువల్ల మనకు సహాయము కలుగుచున్నది.

ఉ.—భూమ్యాకాశములను సృష్టించినవాడు ఆయనే.

బి.—ప్రభువు నామము స్తుతింపబడునుగాక.

ఉ.—ఇది మొదలుకొని యుగయుగములకు స్తుతింపబడునుగాక.

బి.—ప్రభువా, మా ప్రార్థనలు ఆలకించుము.

ఉ.—మా మొర్ర నీయొద్దకు చేరనిమ్ము.

బి.—ప్రార్థించుదము.

సదా జీవించుచుండు సర్వశక్తిగల దేవా, నీటివల్లను పరిశుద్ధాత్మవల్లను ఈ నీ సేవకులను తిరిగి జన్మింపచేసి, వీరి పాపములన్ని క్షమింప ననుగ్రహించినావు. ప్రభువా, ఆదరణకర్తయైన పరిశుద్ధాత్మవల్ల వీరిని బలపరచుము. నానావిధములైన నీ కృపా వరములను, అనగా జ్ఞానము వివేకమునుగల యాత్మను, ఆలోచన మనోబలమునుగల యాత్మను, తెలివియు నిజమైన భక్తిగల యాత్మను, వీరిలో దిన దినము వృద్ధిచేయుము. ప్రభువా, ఇప్పుడును ఎప్పుడును నీ పరిశుద్ధ భయముగల యాత్మతో వీరిని నింపుమని బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

¶ అప్పుడు బిషపు ఎదుట వారందరును వరుసగా మోకాళ్లూనియున్నప్పుడు ఆయన ఒక్కొక్కని తలమీద ప్రత్యేకముగా తన చెయ్యి ఉంచి చెప్పవలసిన దేమనగా:—

ఓ ప్రభువా ఈ నీ బిడ్డ (ఈ నీ సేవకుడు, నీ సేవకురాలు) ఎప్పుడును నీవాడైయుండి, (నీదైయుండి), నీ నిత్యరాజ్యమునకు వచ్చువరకు, దినదినమును అంతకంతకు నీ పరిశుద్ధాత్మయందు వృద్ధిపొందునట్లు నీ దివ్య కృపతో ఇతని (ఈమెను) కాపాడుము. ఆమేన్.

¶ అంతట బిషపు ఇట్లు చెప్పవలెను:

ప్రభువు మీకు తోడై యుండునుగాక.

ఉత్తరము.—నీయాత్మకును తోడై యుండునుగాక.

ప్రార్థించుదము.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. రాజ్యము శక్తి మహిమయు నిరంతరమును నీవైయున్నవి. ఆమేన్.



¶ అప్పుడు బిషపు ఈ ప్రార్థనలు చెప్పవలెను:

సదా జీవించుచుండు సర్వశక్తిగల దేవా, మహిమగల దేవుడవైన నీకు మంచివియు అనుకూలములై యున్నవాటిని మేము ఆశించుటకును చేయుటకును ప్రేరేపించువాడవు నీవేగదా. వీరిమీద నీకుగల దయాదాక్షిణ్యములను ఈ గురుతువల్ల వీరికి రూఢిపరచుటకుగాను, నీ పరిశుద్ధ అపొస్తలుల వాడుకనుబట్టి, యిప్పుడు ఈ నీ సేవకులమీద మా చేతులు ఉంచితిమి గనుక వీరికొరకు నిన్ను వినయముగా వేడుకొనుచున్నాము. ఓ తండ్రీ, నీ చేయి వీరిమీద నిరంతరము ఉంచుము. నీ పరిశుద్ధాత్మను ఎప్పుడును వీరికి తోడై యుండనిమ్ము. మరియు వీరు తుదకు నీ నిత్యజీవము పొందునట్లు నీ వాక్యమును తెలిసికొని, దానికి లోబడునట్లు వీరిని నడిపింపుము. వీటి ననుగ్రహింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను ఏకదేవుడుగా ఎల్లప్పుడును జీవించి యేలెడి మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

## ముగింపు.

సర్వశక్తిగల ప్రభువా, నిత్యుడవైన దేవా, మిక్కిలి బలమైన నీ ప్రాపకమువల్ల మేము ఇప్పుడును ఎప్పుడును శరీరాత్మలయందు సంరక్షింపబడునట్లు, నీ న్యాయ పద్ధతులయందును నీవు చేయుమనిన క్రియలయందును మా హృదయములను శరీరములను నడిపించి పరిశుద్ధపరచి ఏల ననుగ్రహింపుమని మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

¶ అంతట బిషపు ఈలాగు పలికి వారిని ఆశీర్వదించవలెను.

సమాధానముతో వెళ్లుడి; ధైర్యముగా నుండుడి; మేలైన దానిని చేపట్టుడి; ఎవనికిని కీడుకు ప్రతికీడు చేయకుడి; సొమ్మసిల్లినవారిని బలపరచుడి; బలహీనులను సంరక్షించుడి; శ్రమపడువారికి సహాయము చేయుడి; మనుష్యులందరిని సన్మానించుడి; పరిశుద్ధాత్మ శక్తియందు ఆనందించుచు, ప్రభువును ప్రేమించి, సేవించుడి.

తండ్రి కుమారుడు పరిశుద్ధాత్మయునైన సర్వశక్తిగల దేవుని దీవెన మీకు కలిగి యెల్లప్పుడును మీకు తోడై యుండునుగాక. ఆమేన్.

# THE FORM OF SOLEMNIZATION OF MATRIMONY

## సామాన్య విధులు

¶ వివాహము చేసికొనబోవువారందరికి పెండ్లి ప్రకటనలు వేరు వేరుగా, మూడు ఆదివారములయందైనను పరిశుద్ధదినములయందైనను, చాలమంది కూడి వచ్చినప్పుడు, అనగా పరిశుద్ధ సమర్పణము నియమింపబడిన చోటనైనను, లేక ఉదయ సాయంప్రార్థనలయందు రెండవ పాఠమునకు లేక మూడవ సంగ్రహప్రార్థనకు తరువాతనైనను, దేవాలయములో మొదట ప్రకటింపబడవలెను

__________ఉన్న__________యొక్కయు__________ఉన్న__________ యొక్కయు వివాహపు ప్రకటన చేయుచున్నాను. వీరిద్దరును పరిశుద్ధ వివాహము చేసికొనకూడదని ఏ హేతువైనను న్యాయమైన ఆటంకమైనను మీలో ఎవరైనను తెలిసికొనియున్నయెడల, దానిని వెల్లడిచేయవలెను. ఇది మొదటి (రెండవ లేక మూడవ) ప్రకటన.

¶ వివాహము చేసికొనబోవువారు వేరువేరు పాస్త్రేటులలో నివసించినట్లయితే ఆ రెండు పాస్త్రేటులలోను ప్రకటనలు చేయబడవలెను. వివాహ ప్రకటనలు మూడుసార్లు చేసినట్లు ఒక పాస్త్రేటు గురువు ఆ రెండవ గురువువల్ల నిశ్చయ పత్రిక పొందకపోతే వారికి వివాహము చేయకూడదు.

¶ ప్రకటనలు చదువబడిన పాస్త్రేటులలోనే తప్ప మరెక్కడను వివాహము జరుపబడకూడదు.

¶ వివాహ ప్రకటనలు మొదట ప్రకటింపబడకుండ ఎవరికిని వివాహము చేయకూడదు. కాని అధ్యక్షునివలన అధికారము పొందినవారియొద్దనుండి లైసెన్సు ఉన్నయెడల వివాహము చేయక ముందు ఆ లైసెన్సును సంఘ గురువునకు అప్పగించవలెను.

¶ నూతన దంపతులు తమ వివాహ సమయమందుగాని వివాహమైన తరువాత తటస్థించెడి మొదటి సమయమందుగాని పరిశుద్ధ సమర్పణము పొందుట యుక్తము.

# వివాహమును ఆచరించెడు క్రమము

¶ వివాహము జరుపుటకు ఏర్పరచిన సమయమందు వివాహము చేసికొనబోవువారు స్నేహితులతోను ఇరుగుపొరుగువారితోను దేవాలయ మధ్యమునకు వచ్చి, పురుషుని ఎడమవైపున స్త్రీ నిలిచియుండగా, క్రీస్తు యిట్లు చెప్పవలెను:

మిక్కిలి ప్రియులారా, ఈ స్త్రీ పురుషులను పరిశుద్ధ వివాహములో జతపర్చుటకు దేవుని సముఖమందును, ఈ సభ ఎదుటను మనము కూడియున్నాము. వివాహమనునది దేవుడు తానే నియమించిన ఘనమైన స్థితియై యుండి, క్రీస్తునకును ఆయన సంఘమునకునుగల మర్మమైన ఐక్యమును సూచించుచున్నది. గలిలయ్యలోని కానాలో వివాహమునకు క్రీస్తు వెళ్లియుండుటవల్లను, అక్కడ చేసిన మొదటి అద్భుత క్రియవల్లను ఆ పరిశుద్ధ స్థితిని అలంకరించెను. మరియు ఇది అందరును ఘనముగా ఎంచదగినదని పరిశుద్ధ లేఖనము మెచ్చుకొనుచున్నది. కాబట్టి ఎవరును దీనిని ఆలోచనలేకుండను, చులకనగాను, కామాతురముగాను పూనుకొనగూడదు. కాని వివాహము ఏర్పడిన హేతువులను తగినట్టుగా యోచించి, భక్తి వినయములతోను, వివేకముతోను, సుబుద్ధితోను దైవభయముతోను దీనిని పూనుకొనవలెను. ఆ హేతువులేవనగా:—

మొదటిది, దేవుని చిత్తప్రకారము మనుష్యజాతి వృద్ధిపొందునట్లును, పిల్లలు ప్రభువుయొక్క భయమునందును క్రమ శిక్షయందును, ఆయన పరిశుద్ధ నామమునకు మహిమ కారణముగా పెంచబడునట్లును వివాహము ఏర్పడియున్నది.

రెండవది, దేవునిచే నాటబడిన స్వాభావికమైన కోరికలును అపేక్షలును పరిశుద్ధపరచబడి యుక్తముగా క్రమపరచబడునట్లును, దేవునివలన ఈ పరిశుద్ధ స్థితికి పిలువబడినవారు అందులో పవిత్రులుగా జీవించునట్లును ఇది ఏర్పడియున్నది.

మూడవది, సుఖదుఃఖములలో ఒకరికొకరు తోడుగాను, సహాయముగాను, ఆదరణగాను ఉండునట్టు ఇది ఏర్పడియున్నది.

ఇక్కడనున్న వీరిద్దరు ఈ పరిశుద్ధ స్థితిలో జతపరచబడుటకు వచ్చియున్నారు. కాబట్టి, వీరు యథావిధిగా జతపరచబడకూడదని తగిన హేతువు

ఏదైనను ఎవరైనను కనపరచగలిగినట్టయితే ఇప్పుడే చెప్పవలెను; లేదా యిక మీదట ఎప్పటికిని ఊరుకొనవలెను.

¶ రెండుగాని అంత కెక్కువగాని వివాహములు ఒక్క సమయమందే ఆచరించవలసివచ్చినప్పుడు ఈ క్రింద వచ్చునదంతయు కీర్తనవరకు ఆయా జతలకు ప్రత్యేకముగా చెప్పవలయును.

¶ వివాహము చేసికొనువారితో ప్రీస్టు యిట్లు చెప్పవలెను:

దేవుని వాక్యప్రకారముకాక, మరియొక విధముగా జతపరచబడువారందరు దేవునిచేత జతపరచబడినవారు కారనియు, వారి వివాహము యథావిధిగా నుండదనియు మీరు బాగుగా రూఢిపరచుకొనవలెను. కాబట్టి, హృదయ రహస్యములన్నియు బయలుపరచబడు భయంకరమైన విమర్శదినమందు, మీరు ఉభయులును ఉత్తరమియ్యవలెను గనుక, మీరు యథావిధిగా వివాహమువలన జతపరచబడ కూడదని మీ యిద్దరిలో ఎవరైనను ఆటంకమేదైనను తెలిసికొని యున్నయెడల దానిని యిప్పుడు ఒప్పుకొనవలెనని గట్టిగా ఆజ్ఞాపించుచున్నాను.

¶ దేవుని చట్టము చొప్పుననేగాని సంఘపద్ధతి ప్రకారమేగాని, వీరు వివాహమందు జతపరచబడకూడదని ఎవరైనను ఏ అభ్యంతరమైనను తెలియజేసినట్టయితే, అతడును అతనితోకూడ తగిన జామీను దారులును వివాహము చేసికొనబోవువారు అడిగేవాటికి ఒప్పందపడవలెను; లేదా వివాహము చేసికొనబోవువారికి కలుగగల నష్టద్రవ్యమును కట్టి, తన వాదమును స్థాపించవలెను. అలాగు చేసినయెడల నిజము తెలియువరకు వివాహపుతంతు జరుగకుండ ఆపవలెను.

## వివాహము.

¶ ఏ ఆటంకమును చెప్పబడనియెడల ప్రీస్టు పురుషునితో ఈలాగు చెప్పవలెను:

________ దేవుని నిర్ణయముచొప్పున, పరిశుద్ధ వివాహస్థితిలో కూడియుండుటకు, యీ స్త్రీని నీ పెండ్లి భార్యనుగా చేసికొందువా? ఈమెను ప్రేమించి, ఆదరించి, ఘనపరచి, వ్యాధియందును ఆరోగ్యమందును ఈమెను కాపాడి, యితరులనొల్లక, మీరు ఉభయులు బ్రదుకు కాలమంతయు, ఈమెకే భర్తవై యుందువా?

¶ పురుషుడు ఇయ్యవలసిన ఉత్తరము.

ఉందును.

¶ అప్పుడు ప్రీస్టు స్త్రీతో యిట్లు చెప్పవలెను.

________ దేవుని నిర్ణయముచొప్పున పరిశుద్ధ వివాహస్థితిలో కూడియుండుటకు ఈ పురుషుని నీ పెండ్లి భర్తనుగా చేసికొందువా? ఇతని ప్రేమించి, ఆదరించి, ఘనపరచి, వ్యాధియందును ఆరోగ్యమందును ఇతని కాపాడి, యితరులనొల్లక, మీరు ఉభయులు బ్రదుకు కాలమంతయు, ఇతనికే భార్యవై యుందువా?



¶ స్త్రీ యియ్యవలసిన ఉత్తరము.

ఉందును.

¶ అప్పుడు ప్రీస్టు ఈలాగు చెప్పవలెను.

వివాహము చేసికొనుటకు ఈ స్త్రీని ఈ పురుషునకు ఇచ్చువారెవరు?

¶ అంతట వివాహము చేసికొనువారు ఒకరితో నొకరు దిగువవచ్చు క్రమముచొప్పున ప్రమాణము చేయవలెను.

¶ స్త్రీని ఆమె తండ్రిచేతగాని, స్నేహితునిచేతగాని ప్రీస్టు అంగీకరించి పురుషుని కుడిచేతితో స్త్రీ కుడిచేతిని పట్టించి, తనవెంట చెప్పించవలసినది ఏమనగా:—

________ అను నేను, ________ అను నిన్ను, ఇది మొదలుకొని, చావు మనలను ఎడబాపువరకు, దేవుని పరిశుద్ధ నిర్ణయముచొప్పున, మేలుకైనను కీడుకైనను, కలిమికైనను లేమికైనను, వ్యాధియందును ఆరోగ్యమందును, నిన్ను ప్రేమించి, సంరక్షించుటకై, నా పెండ్లి భార్యనుగా చేసికొనుచున్నాను. ఈ చొప్పున జరిగింతునని ప్రమాణము చేయుచున్నాను.

¶ వారు తమ చేతులు విడిచిపెట్టిన తరువాత స్త్రీ తన కుడి చేతితో పురుషుని కుడి చేతిని పట్టుకొని, ప్రీస్టు వెంట చెప్పవలసినదేమనగా,

________ అను నేను, ________ అను నిన్ను, ఇది మొదలుకొని, చావు మనలను ఎడబాపువరకు, దేవుని పరిశుద్ధ నిర్ణయముచొప్పున, మేలుకైనను కీడుకైనను, కలిమికైనను లేమికైనను, వ్యాధియందును ఆరోగ్యమందును, నిన్ను ప్రేమించి, సంరక్షించుటకై, నా పెండ్లి భర్తనుగా చేసికొనుచున్నాను. ఈ చొప్పున జరిగింతునని ప్రమాణము చేయుచున్నాను.

¶ వారు తిరిగి చేతులు విడిచిపెట్టిన తరువాత పురుషుడు స్త్రీకొరకు ఒక మంగళసూత్రమును (లేదా ఒక ఉంగరమును) పుస్తకముమీద ఉంచవలెను. అంతట ప్రీస్టు మంగళసూత్రమును (లేదా ఉంగరమును) తీసికొని స్త్రీ మెడకు కట్టుటకు (లేదా ఉంగరమును స్త్రీ ఎడమచేతి యొక్క అనామిక వ్రేలున ఉంచుటకు) పురుషునికియ్యవలెను. పురుషుడు మంగళసూత్రమును కట్టి, (లేదా ఉంగరమును ఆ వేలున ఉంచి), దానిని పట్టుకొనుచు ప్రీస్టువెంట చెప్పవలెను.

ఈ మంగళసూత్రముతో (ఈ ఉంగరముతో) నిన్ను వివాహముచేసికొని, నా శరీరముతో నిన్ను ఘనపరచి, నా ఆస్తి అంతటికి నిన్ను పాలిభాగస్థురాలినిగా చేసికొనుచున్నాను. తండ్రియొక్క, కుమారునియొక్క, పరిశుద్ధాత్మయొక్క పేరట ప్రమాణము చేయుచున్నాను. ఆమేన్.

¶ అంతట పురుషుడు మంగళసూత్రము స్త్రీ మెడకు కట్టినపిదప (లేదా స్త్రీ ఎడమచేతియొక్క అనామిక వ్రేలున ఉంగరము ఉండనిచ్చి), ఉభయులును మోకాళ్లూనవలెను. అప్పుడు క్రీస్తు ఈలాగు చెప్పవలెను.

## ప్రార్థించుదము.

మనుష్యులందరికి సృష్టికర్తవును పాలకుడవునైన నిత్యదేవా, ఆత్మీయమైన సమస్త కృపావరములకు దాతా, నిత్యజీవమునకు కారకుడా, నీ పేరట మేము ఆశీర్వదించుచున్న నీ సేవకులగు ఈ స్త్రీ పురుషులమీదికి, నీ ఆశీర్వాదము పంపుము. వీరు ఈ మంగళసూత్రమును (లేక ఈ ఉంగరము)ను ప్రమాణ సూచకముగా ఇచ్చి పుచ్చుకొని, ఒకరికొకరు చేసికొనిన ప్రతిజ్ఞను ఒడంబడికను రూఢిగా నెరవేర్చి, సంపూర్ణప్రేమతోను సమాధానముతోను ఎప్పుడును కలిసి నమ్మకముగానుండి, నీ యాజ్ఞలప్రకారము నడుచుకొనునట్లు అనుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ తరువాత క్రీస్తు వారి కుడిచేతులను కలిపి ఇట్లు చెప్పవలెను:

దేవుడు జతపరచినవారిని ఎవ్వడును ఎడబాపకూడదు.

¶ అంతట క్రీస్తు జనులను చూచి యీలాగు చెప్పవలెను:

__________ను __________ను పరిశుద్ధ వివాహమునకు సమ్మతించి, ఆ సంగతి దేవుని సముఖమందును, ఈ సభ ఎదుటను ప్రచురపరచి, ఒకరికొకరు ప్రమాణముచేసి, మంగళసూత్రమును (లేక ఒక ఉంగరమును) యిచ్చి పుచ్చుకొనుటవల్లను, చేతులు కలుపుటవల్లను దానిని తెలిపినారు గనుక, వీరిద్దరు భార్యాభర్తలని ప్రకటించుచున్నాను. తండ్రియొక్క, కుమారునియొక్క, పరిశుద్ధాత్మయొక్క పేరట. ఆమేన్.

¶ అంతట క్రీస్తు దిగువవచ్చు ఆశీర్వచనము పలుకవలెను:

తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు, పరిశుద్ధాత్మయైన దేవుడు మిమ్మును ఆశీర్వదించి, సంరక్షించి కాపాడునుగాక. ప్రభువు మిమ్మును కటా-



క్షించి, పరమందు మీరు నిత్యజీవము పొందుటకై యిహమందు అనుకూలముగా కాలము గడుపునట్లు, ఆత్మసంబంధమైన ప్రతి దీవెనతోను మిమ్మును నింపునుగాక. ఆమేన్.

## ఆశీర్వాదము.

¶ అంతట క్రీస్తును అతని వెంట దంపతులును ప్రభుని బల్లయొద్దకు వెళ్లుచుండగా దిగువ వచ్చెడి కీర్తనను చదువవలెను లేదా, పాడవలెను.

### 128. కీర్తన

ప్రభువునందు భయభక్తులు కలిగి : ఆయన త్రోవలయందు నడుచువారందరు ధన్యులు.

2. నిశ్చయముగా నీవు నీ చేతుల కష్టార్జితము ననుభవించెదవు : నీవు ధన్యుడవు, నీకు మేలు కలుగును.

3. నీ లోగిట నీ భార్య ఫలించు ద్రాక్షావల్లివలె నుండును : నీ భోజనపు బల్లచుట్టు నీ పిల్లలు ఒలీవమొక్కలవలె నుందురు.

4. ప్రభువునందు భయభక్తులుగలవాడు : ఈలాగు ఆశీర్వదింపబడును.

5. సీయోనులోనుండి ప్రభువు నిన్ను ఆశీర్వదించును : నీ జీవితకాలమంతయు యెరూషలేమునకు క్షేమము కలుగుట చూచెదవు.

6. నీ పిల్లల పిల్లలను నీవు చూచెదవు : ఇశ్రాయేలుమీద సమాధానముండును గాక.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

లేదా ఈ కీర్తన.

### కీర్తన 67.

భూమిమీద నీ మార్గము తెలియబడునట్లును : అన్యజనులందరిలో నీ రక్షణ తెలియబడునట్లును,

2. దేవుడు మమ్మును కరుణించి మమ్మును ఆశీర్వదించునుగాక : ఆయన తన ముఖకాంతి మామీద ప్రకాశింపచేయునుగాక.

3. దేవా, ప్రజలు నిన్ను స్తుతించుదురుగాక : ప్రజలందరు నిన్ను స్తుతించుదురుగాక. న్యాయమునుబట్టి నీవు జనములకు తీర్పు తీర్చుదువు : భూమిమీదనున్న జనములను ఏలెదవు.

4. జనములు సంతోషించుచు : ఉత్సాహధ్వని చేయునుగాక.

5. దేవా, ప్రజలు నిన్ను స్తుతించుదురుగాక : ప్రజలందరు నిన్ను స్తుతించుదురుగాక.

6. అప్పుడు భూమి దాని ఫలములిచ్చును : దేవుడు, మా దేవుడు మమ్మును ఆశీర్వదించును.

7. దేవుడు మమ్మును దీవించును : భూదిగంత నివాసులందరును ఆయన యందు భయభక్తులు నిలుపుదురు.

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

లేదా ఈ కీర్తన.

కీర్తన **37: 3—7.**

ప్రభువునందు నమ్మికయుంచి మేలుచేయుము : దేశమందు నివసించి సత్యము ననుసరించుము.

4. ప్రభువునుబట్టి సంతోషించుము : ఆయన నీ హృదయవాంఛలను తీర్చును.

5. నీ మార్గమును ప్రభువునకు అప్పగించుము : నీవు ఆయనను నమ్ముకొనుము, ఆయన నీ కార్యము నెరవేర్చును.

6. ఆయన వెలుగునువలె నీ నీతిని : మధ్యాహ్నమునువలె నీ నిర్దోషత్వమును వెల్లడిపరచును.

7. ప్రభువు ఎదుట మౌనముగానుండి : ఆయనకొరకు కనిపెట్టుకొనుము.

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

¶ కీర్తన ముగియగనే జనులు మోకాళ్లూనియుండగా, స్త్రీ పురుషులు ప్రభువు బల్లయెదుట మోకాళ్లూనియుండగా, ప్రీస్టు బల్లయొద్ద నిలుచుండి వారికి అభిముఖుడై యిట్లు చెప్పవలెను.



## ప్రార్థించుదము.

ప్రభువా, మమ్మును కనికరింపుము.

ఉ.—క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

ప్ర.—ప్రభువా, మమ్మును కనికరింపుము.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధములు క్షమించుము. మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పింపుము. ఆమేన్.

ప్రీ.—ప్రభువా, నీ సేవకుని నీ సేవకురాలిని రక్షింపుము.

ఉ.—వీరు నిన్ను నమ్ముచున్నారు.

ప్రీ.—ప్రభువా, నీ పరిశుద్ధ స్థలమునుండి వీరికి సహాయము చేయుము.

ఉ.—వీరిని ఎప్పుడును కాపాడుము.

ప్రీ.—వీరి శత్రువు యెదుట—

ఉ.—వీరికి బలమైన కోటగా నుండుము.

ప్రీ.—ప్రభువా, మా ప్రార్థన ఆలకింపుము.

ఉ.—మా మొర్ర నీయొద్దకు చేరనిమ్ము.

### ప్రీస్టు.

దేవా, మా పరలోకపు తండ్రీ, ఈ నీ సేవకులను ఆశీర్వదించి, వీరు నీ పరిశుద్ధవాక్యమునందు సఫలముగా నేర్చుకొనువాటిని క్రియచేత నెరవేర్చులాగున వీరి హృదయములలో నిత్యజీవపు బీజము వేయుము. ఈ నీ సేవకులు నీ చిత్తమునకు లోబడి, యెప్పుడును నీ ప్రాపకమువల్ల సంరక్షింపబడి, మరణము మట్టునకు నీ ప్రేమయందు నిలుచునట్లు వీరిని ఆశీర్వదించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ స్త్రీకి పిల్లలు కనెడి యీడు తప్పియున్నయెడల దిగువవచ్చు ప్రార్థన విడిచి పెట్టవలెను.

కనికరముగల ప్రభువా, పరలోకపు తండ్రీ, నీ దయావరమువల్ల మనుష్య జాతి వృద్ధిపొందుచున్నది గనుక ఈ దంపతులకు పిల్లలను స్వాస్థ్యముగా అనుగ్ర

హించి, నీకు స్తుతి ఘనతలు కలుగులాగున తమ పిల్లలు క్రీస్తు మతానుసారముగాను భక్తిగాను పెరుగుట చూచువరకు, వీరు దివ్యప్రేమతోను, సత్యప్రవర్తనతోను అనుకూలముగా కాలముగడుపునట్లు వీరిని ఆశీర్వదించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

¶ దిగువ ప్రార్థన చెప్పవలెను:

దేవా, వివాహముచేత నీవు ఏకముచేసినవారిని విడదీయుట ఎప్పటికిని విధికి విరుద్ధమని నేర్పితివి. మరియు, క్రీస్తుకును ఆయన సంఘమునకునుగల ఏకత్వమును ఆత్మసంబంధమైన వివాహమును సూచించుటకై వివాహపు స్థితి దివ్యమైన మర్మముగానుండునట్లు పరిశుద్ధపరచితివిగదా. తన శరీరమువలె తన భార్యయైన సంఘమును ప్రేమించి సంరక్షించి దానికొరకు తన్నుతాను అప్పగించుకొనిన క్రీస్తు దానిని ప్రేమించినట్టే, ఈ పురుషుడును నీ వాక్యప్రకారము తన భార్యను ప్రేమించులాగునను, ఈ స్త్రీకూడ పతివ్రతయు తన పెనిమిటిని ప్రేమించునదియు అతనికి ప్రియురాలును నమ్మకస్థురాలునైయుండి, సంపూర్ణ శాంతముతోను సుబుద్ధితోను సమాధానముతోను పరిశుద్ధియు భక్తియుగల ఇల్లాండ్రను వెంబడించులాగునను ఈ నీ సేవకులను కటాక్షింపుము. ప్రభువా, ఈ దంపతులను ఆశీర్వదించి, వీరు నిత్యరాజ్యమునకు వారసులగునట్లు అనుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ అప్పుడు ప్రీస్టు ఈ దీవెన చెప్పవలెను.

మన ప్రభువైన యేసుక్రీస్తు తండ్రియైన సర్వశక్తిగల దేవుడు, శరీరాత్మలయందు మీరు ఆయనను సంతోషపరచి, మీ మరణముమట్టుకు పరిశుద్ధ ప్రేమతో కాలముగడుపునట్లు తన కృపాధనమును మీమీద కుమ్మరించి, మిమ్మును పరిశుద్ధపరచి ఆశీర్వదించునుగాక. ఆమేన్.

¶ సమభోక్తవ్యమున్నయెడల దానిలోని చివరి దీవెనకు ముందు పై ప్రార్థనయు దీవెనయు దంపతుల కింద చెప్పవలెను.

¶ సమభోక్తవ్యముగాని, దంపతుల కర్తవ్యమును తెలిపెడి ప్రసంగముగాని లేనియెడల, వేదవాక్య భాగము ఒకటి చదువవచ్చును, లేదా 1662-వ సం॥పు క్రమములోనున్న హెచ్చరిక ప్రీస్టు చదువవచ్చును. అంతట ప్రీస్టు క్రిందివాటిని చెప్పి సభను పంపివేయవలెను.



ప్రార్థించుదము.

సర్వశక్తిగల ప్రభువా, నిత్యుడవైన దేవా, నీ మిక్కిలి బలమైన ప్రాపకమువల్ల మేము ఇప్పుడును ఎప్పుడును శరీరాత్మలయందు సంరక్షింపబడునట్లు నీ న్యాయపద్ధతులయందును నీవు చేయుమనిన క్రియలయందును మా హృదయములను శరీరములను నడిపించి పరిశుద్ధపరచి ఏలననుగ్రహింపుమని మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

తండ్రి కుమారుడు పరిశుద్ధాత్మయునైన సర్వశక్తిగల దేవుని దీవెన మీకు కలిగి, యెల్లప్పుడు మీకు తోడైయుండునుగాక. ఆమేన్.

1662-వ సం॥పు క్రమములోనున్న హెచ్చరిక.

వివాహము చేసికొన్న మీరందరును, ఈ పరిశుద్ధ స్థితిలో చేరదలచిన మీరందరును, భార్యలయెడల భర్తలకును భర్తలయెడల భార్యలకునుగల కర్తవ్యమునుగురించి పరిశుద్ధ లేఖనమందు చెప్పియున్నది వినుడి.

పరిశుద్ధ పౌలు ఎఫెసీయులకు పంపిన పత్రికలో అయిదవ అధ్యాయమునందు వివాహము చేసికొన్న పురుషులందరికిని ఈ యాజ్ఞ యిచ్చియున్నాడు:— పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి యేదైనను లేక, పరిశుద్ధమైనదిగాను నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దాని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానముచేత దాని పవిత్రపరచి పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను. అటువలెనే పురుషులుకూడ తమ స్వశరీరములనువలె తమ భార్యలను ప్రేమింప బద్ధులైయున్నారు. తన భార్యను ప్రేమించువాడు తన్ను ప్రేమించుకొనుచున్నాడు. తన శరీరమును ద్వేషించినవాడెవడును లేడుగాని ప్రతివాడు దానిని పోషించి సంరక్షించుకొనును. మనము క్రీస్తు శరీరమునకు అవయవములమై యున్నాము గనుక ఆలాగే క్రీస్తుకూడ సంఘమును పోషించి సంరక్షించుచున్నాడు. ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యతో హత్తుకొనును; వారిద్దరును ఒక్క శరీరముగుదురు. ఈ మర్మము గొప్పది; అయితే నేను క్రీస్తునుగూర్చియు సంఘమునుగూర్చియు చెప్పుచున్నాను. మెట్టుకు మీలో ప్రతి పురుషుడును తననువలె తన భార్యను ప్రేమింపవలెను.

మరియు ఆ పరిశుద్ధ పౌలు కొలొస్సయులకు వ్రాయునప్పుడు, భర్తలారా, మీ భార్యలను ప్రేమించుడి, వారిని నిష్ఠురపెట్టకుడి అని వివాహము చేసికొన్న పురుషులందరితో చెప్పుచున్నాడు.

క్రీస్తుయొక్క అపొస్తలుడైన పరిశుద్ధ పేతురు తానును వివాహము చేసికొన్నవాడైయుండి వివాహము చేసికొనినవారితో చెప్పుచున్నదియు వినుడి:— పురుషులారా, జీవమను కృపావరములో మీ భార్యలు మీతో పాలివారైయున్నారని యెరిగి, యెక్కువ బలహీనమైన ఘటమని భార్యను సన్మానించి, మీ ప్రార్థనలకు అభ్యంతరము కలుగకుండునట్లు, జ్ఞానముచొప్పున వారితో కాపురము చేయుడి.

ఇదివరకు భార్యయెడల భర్తకుగల కర్తవ్యమును వినియున్నారు. ఇప్పుడు భార్యలైన మీరును పరిశుద్ధ లేఖనమందు స్పష్టముగా తెలియజేయబడిన ప్రకారము మీ భర్తలయెడల మీకు గల కర్తవ్యమును విని నేర్చుకొనుడి.

ఇదివరకే ఉదాహరించిన ఎఫెసీయుల పత్రికలో పరిశుద్ధ పౌలు మీకు ఈ చొప్పున ఉపదేశించుచున్నాడు:— స్త్రీలారా, ప్రభువునకువలె మీ స్వపురుషులకు లోబడియుండుడి. క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడైయున్నాడు. సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలుకూడ ప్రతివిషయములోను తమ పురుషులకు లోబడవలెను. భార్య తన భర్తయందు భయభక్తులు కలిగియుండునట్లు చూచుకొనవలెననియు అతడు చెప్పుచున్నాడు.

పరిశుద్ధ పౌలు కొలొస్సయులకు పంపిన పత్రికలో: భార్యలారా మీ భర్తలకు విధేయులైయుండుడి ఇది ప్రభువునుబట్టి యుక్తమైయున్నదని కొద్దిలో మీకు ఉపదేశించుచున్నాడు.

పరిశుద్ధ పేతురును మీకు మిక్కిలి బాగుగా బోధించునది యేమనగా:— స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి; అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, భయముతోకూడిన మీ పవిత్ర ప్రవర్తన వారు చూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడువడివలన రాబట్టబడవచ్చును. జడలల్లుకొనుటయు, బంగారు నగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయునను వెలుపటి అలంకారము మీకు అలంకారముగా ఉండక,



సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను; అది దేవుని దృష్టికి మిగుల విలువగలది. అటువలె పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలును తమ స్వపురుషులకు లోబడియుండుటచేత తమ్మును తాము అలంకరించుకొనిరి. ఆ ప్రకారము శారా అబ్రాహామును యజమానుడని పిలుచుచు అతనికి లోబడియుండెను. మీరును యోగ్యముగా నడుచుకొనుచు ఏ భయమునకు బెదరకయున్నయెడల ఆమెకు పిల్లలగుదురు.

## సమభార్తృత్వము.

¶ సమభార్తృత్వమున్నయెడల సంతానాభివృద్ధికొరకైన ప్రార్థనకు ముందుగాని, తరువాతగాని దిగువ సంగ్రహప్రార్థన, ఉత్తరము, సువార్త పాడవచ్చును.

### సంగ్రహప్రార్థన.

**మా** తండ్రివైన దేవా, ప్రేమకలిగి యుండుట ధర్మశాస్త్రము నెరవేర్చుటయేనని మాకు నేర్పితివిగదా. ఈ నీ సేవకులు ఒకరినొకరు ప్రేమించి తమ మరణముమట్టునకు నీ ప్రేమలో నిలుచునట్లు అనుగ్రహింపుమని నీతో పరిశుద్ధాత్మ ఐక్యమునందు సదా ఏకదేవుడుగా జీవించి ఏలుచుండు మా ప్రభువైన యేసు క్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

### ఉత్తరము: ఎఫెసీ 3: 14.

**ఈ** హేతువుచేత పరలోకమునందును, భూమిమీదను ఉన్న ప్రతి కుటుంబము ఏ తండ్రినిబట్టి కుటుంబమని పిలువబడుచున్నదో ఆ తండ్రి యెదుట నేను మోకాళ్లూని, మీరు అంతరంగ పురుషునియందు శక్తిగలిగి ఆయన ఆత్మవలన బలపరచబడునట్లుగాను, క్రీస్తు మీ హృదయములలో విశ్వాసముద్వారా నివసించునట్లుగాను, తన మహిమైశ్వర్యముచొప్పున మీకు దయచేయవలెననియు, మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా, ప్రేమయందు వేరు పారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతో కూడా దాని వెడల్పు పొడుగు లోతు ఎత్తును ఎంతో గ్రహించుకొనుటకును, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తిగలవారు కావలెననియు ప్రార్థించుచున్నాను.

సువార్త: పరి: యోహాను 15: 9.

తండ్రి నన్ను ఏలాగు ప్రేమించెనో నేను మిమ్మును ఆలాగు ప్రేమించితిని, నా ప్రేమయందు నిలిచియుండుడి. నేను నా తండ్రి యాజ్ఞలు గైకొని ఆయన ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలు గైకొనినయెడల నా ప్రేమయందు నిలిచియుందురు. మీయందు నా సంతోషము ఉండవలెననియు, మీ సంతోషము పరిపూర్ణము కావలెననియు, ఈ సంగతులు మీతో చెప్పుచున్నాను. నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము మీరు ఒకనినొకడు ప్రేమింపవలె ననునదియే నా ఆజ్ఞ.

¶ క్రీస్తు పరిశుద్ధ సమభోక్తృత్వక్రమము జరుపుచుండగా, ఆరాధన చివరకు క్రొత్తగా పెండ్లి అయినవారు పరిశుద్ధ బల్లయెదుట ఉండవలెను. వివాహము ఆచరించెడు క్రమములోని చివరి ప్రార్థనయు దీవెనయును సమభోక్తృత్వ క్రమములోని దీవెనకుమందు దంపతులమీద చెప్పవలెను.

---

# THE ORDER FOR THE BURIAL OF THE DEAD

# మృతుల భూస్థాపన క్రమము

¶ బాప్తిస్మము పొందనివారును, వెలివేయబడినవారును, ఆత్మహత్య చేసికొనినవారును, ఘోరమైన నేరము చేయుచుండగా చనిపోయినవారును పాతిపెట్టబడినప్పుడు దిగువవచ్చెడి క్రమము వాడకూడదని జ్ఞాపకముంచుకొనవలెను.

¶ ఎవరి భూస్థాపనకైనను ఈ క్రమము వాడవచ్చునా లేదా యను సందేహమున్నయెడల అసాధ్యమైతేనే తప్ప బిషపును అడిగి తెలిసికొనవలెను. దానిని ఆయన తీర్మానించును.

## పీఠిక.

¶ సేవకులును సహాయగురువులును ప్రాకారద్వారమున శవమును ఎదురుకొని, దానికి ముందుగా దేవాలయములోనికైనను సమాధివైపునకైనను వెళ్లుచు, క్రింది వచనములలో ఒకటిగాని లేక ఎక్కువగాని చదువవలెను, లేదా పాడవలెను. అవసరమైతే పశ్చాత్తాపకీర్తనలు (అనగా 6, 32, 38, 51, 102, 130, 143) లో ఒకటి రెండు చదువవలెను.

నేనే పునరుత్థానమును జీవమునైయున్నాను; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును; బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడు ఎన్నటికిని చనిపోడు. (ప. యోహాను 11: 25, 26).

నా విమోచకుడు సజీవుడనియు, తరువాత ఆయన భూమిమీద నిలుచుననియు నేనెరుగుదును. నామట్టుకు నేనే ఆయనను చూచెదను; మరి యొకరును కాదు నేనే కన్నులార ఆయనను చూచెదను. (యోబు 19: 25, 26, 27).

మనము ఈ లోకములోనికి ఏమియు తేలేదు, దీనిలోనుండి యేమియు తీసికొనిపోలేము. ప్రభువు ఇచ్చెను, ప్రభువు తీసికొని పోయెను, ప్రభువు నామమునకు స్తుతి కలుగును గాక. (1 తిమొథె 6: 7; యోబు 1: 21).

నా బాల్యపాపములను నా అక్రమములను జ్ఞాపకము చేసికొనకుము. ప్రభువా, నీ కృపనుబట్టి నీ దయచొప్పున నన్ను జ్ఞాపకములో ఉంచుకొనుము. (కీర్తన 25: 7).

శాశ్వతుడైన దేవుడు నీకు నివాసస్థలము. నిత్యముగనుండు బాహువులు నీ క్రింద నుండును. (ద్వితీ. 33: 27).

మరణమైనను, జీవమైనను, దేవదూతలైనను, ప్రధానులైనను, ఉన్నవియైనను, రాబోవునవియైనను, అధికారులైనను, ఎత్తయినను, లోతైనను, సృష్టింపబడిన మరి యేదైనను, మన ప్రభువైన క్రీస్తుయేసుద్వారా కనపరచబడియున్న దేవుని ప్రేమనుండి మనలను ఎడబాప నేరవు. (రోమా 8: 38, 39).

మనము బ్రతికినను ప్రభువుకోసరము బ్రదుకుచున్నాము; చనిపోయినను ప్రభువుకోసరమే చనిపోవుచున్నాము. కాబట్టి, మనము బ్రతికినను చనిపోయినను ప్రభువువారమై యున్నాము. తాను మృతులకును సజీవులకును ప్రభువై యుండుటకు ఇందునిమిత్తమే గదా క్రీస్తు చనిపోయి మరల బ్రదికెను. (రోమా. 14: 8, 9).

దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు. (ప. మత్త. 5: 4).

మీ హృదయములను కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి, నా తండ్రి యింట అనేక నివాసములు కలవు. (ప. యోహాను 14: 1, 2).

## దేవాలయములో ఆరాధన.

¶ వారు దేవాలయములోనికి వచ్చినతరువాత దిగువను వచ్చు పాతనిబంధన కీర్తనలలో ఒకటిగాని ఎక్కువగాని చదువవలెను.

¶ మృతుల భూస్థాపనక్రమములో నియమింపబడిన కీర్తనలన్నిటి చివరను త్రిత్వస్తుతి చదువక దానికి బదులుగా క్రింది మాటలు చదువవచ్చును, లేదా పాడవచ్చును.

ప్రభువా, నిత్య విశ్రాంతి వారి కనుగ్రహింపుము : ఎడతెగని వెలుగు వారిమీద ప్రకాశింపనిమ్ము.

¶ ఒక కీర్తన లేక కొన్ని కీర్తనల సముదాయమునకు ముందు వెనుకలను ఈ క్రింది మాటలు చదువవచ్చును లేదా పాడవచ్చును.

జగద్రక్షకా, నీ సిలువనుబట్టియు నీ అమూల్యమైన రక్తమునుబట్టియు మమ్మును విమోచించితివి గదా. ప్రభువా, మమ్మును రక్షించి మాకు సహాయము చేయుమని నిన్ను వినయముతో వేడుకొనుచున్నాము.



## 23. కీర్తన.

ప్రభువు నా కాపరి : నాకు లేమి కలుగదు.

2. పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండజేయుచున్నాడు : శాంతికరమైన జలములయొద్ద నన్ను నడిపించుచున్నాడు.

3. నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు : తన నామమునుబట్టి నీతి మార్గములలో నన్ను నడిపించుచున్నాడు.

4. గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను : నీవు నాకు తోడైయుందువు, నీ దుడ్డుకర్రయు నీ దండమును నన్ను ఆదరించును.

5. నా శత్రువులయెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు : నూనెతో నా తల అంటియున్నావు, నా గిన్నె నిండి పొర్లుచున్నది.

6. నేను బ్రదుకు దినములన్నియు కృపాక్షేమములే నా వెంటవచ్చును : చిరకాలము ప్రభువు మందిరములో నేను నివాసము చేసెదను.

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

## 130. కీర్తన.

ప్రభువా, అగాధస్థలములలోనుండి : నేను నీకు మొరపెట్టుచున్నాను.

2. ప్రభువా, నా ప్రార్థన ఆలకించుము : నీ చెవియొగ్గి నా ఆర్తధ్వని వినుము.

3. ప్రభువా, నీవు దోషములను కనిపెట్టి చూచినయెడల : ప్రభువా, ఎవడు నిలువగలడు?

4. అయినను జనులు నీయందు భయభక్తులు నిలుపునట్లు : నీయొద్ద క్షమాపణ దొరకును.

5. ప్రభువుకొరకు నేను కనిపెట్టుకొనుచున్నాను, నా ప్రాణము ఆయనకొరకు కనిపెట్టుకొనుచున్నది : ఆయన మాటమీద నేను ఆశ పెట్టుకొనియున్నాను.

6. కావలివారు ఉదయముకొరకు కనిపెట్టుటకంటె ఎక్కువగా నా ప్రాణము ప్రభువుకొరకు కనిపెట్టుచున్నది : కావలివారు ఉదయముకొరకు కనిపెట్టుటకంటె ఎక్కువగా నా ప్రాణము కనిపెట్టుచున్నది.

7. ఇశ్రాయేలూ, ప్రభువుమీద ఆశపెట్టుకొనుము, ప్రభువునొద్ద కృప దొరకును : ఆయనయొద్ద సంపూర్ణ విమోచన దొరకును.

8. ఇశ్రాయేలీయుల దోషములన్నిటినుండి : ఆయన వారిని విమోచించును.

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

లేదా, 39-వ, 90-వ కీర్తన చదువవచ్చును.

¶ తరువాత పరిశుద్ధ పౌలు కొరింథీయులకు పంపిన మొదటి యుత్తరము పదునేనవ అధ్యాయములోనుండి తీయబడిన పాఠము చదువవలెను.

**1 కొరింథీయులు 15: 20.**

**ఇ**ప్పుడయితే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఎలాగు మృతిపొందుచున్నారో ఆలాగుననే క్రీస్తునందు అందరును బ్రతికింపబడుదురు. ప్రతివాడును తన తన వరుసలోనే బ్రతికింపబడును. ప్రథమఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయనవారు బ్రతికింపబడుదురు. అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును సమస్తమైన అధికారమును బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును. ఎందుకనగా, తన శత్రువుల నందరిని తన పాదముల క్రింద ఉంచుపర్యంతము, ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను. కడపట నశింపచేయబడు శత్రువు మరణము.

అయితే మృతులేలాగు లేతురు? వారెట్టి శరీరముతో వత్తురని యొకడు అడుగును. ఓ అవివేకీ, నీవు విత్తునది చచ్చితేనేగాని బ్రతికింపబడదు గదా. నీవు విత్తుదానిని చూడగా అది గోధుమగింజయైనను సరే, మరి ఏ గింజయైనను సరే, వట్టి గింజనే విత్తుచున్నావు గాని పుట్టబోవు శరీరమును విత్తుటలేదు. అయితే దేవుడే తన చిత్త ప్రకారము నీవు విత్తినదానికి శరీరము



ఇచ్చును. మరియు ప్రతి విత్తనమునకును దాని దాని శరీరము ఇచ్చుచున్నాడు. మాంసమంతయు ఒక విధమైనది కాదు. మనుష్య మాంసము వేరు, మృగ మాంసము వేరు, పక్షిమాంసము వేరు, చేపమాంసము వేరు. మరియు ఆకాశ వస్తురూపములు కలవు, భూవస్తురూపములు కలవు. ఆకాశవస్తు రూపముల మహిమ వేరు, భూవస్తురూపముల మహిమ వేరు. సూర్యుని మహిమ వేరు, చంద్రుని మహిమ వేరు, నక్షత్రముల మహిమ వేరు. మహిమనుబట్టి యొక నక్షత్రమునకును మరియొక నక్షత్రమునకును భేదము కలదుగదా? మృతుల పునరుత్థానమును ఆలాగే. శరీరము క్షయమైనదిగా విత్తబడి, అక్షయమైనదిగా లేపబడును; ఘనహీనమైనదిగా విత్తబడి మహిమగలదిగా లేపబడును; బలహీనమైనదిగా విత్తబడి బలమైనదిగా లేపబడును; ప్రకృతిసంబంధ శరీరముగా విత్తబడి ఆత్మసంబంధ శరీరముగా లేపబడును. ప్రకృతిసంబంధ శరీరమున్నది గనుక ఆత్మసంబంధ శరీరముకూడ ఉన్నది. ఇందు విషయమై ఆదామను మొదటి మనుష్యుడు జీవించు ప్రాణి ఆయెనని వ్రాయబడియున్నది. కడపటి ఆదాము జీవింపచేయు ఆత్మ ఆయెను. ఆత్మసంబంధమైనది మొదట కలిగినది కాదు ప్రకృతిసంబంధమైనదే మొదట కలిగినది; తరువాత ఆత్మసంబంధమైనది. మొదటి మనుష్యుడు భూసంబంధియై మంటినుండి పుట్టినవాడు, రెండవ మనుష్యుడు పరలోకమునుండి వచ్చినవాడు. మంటినుండి పుట్టినవాడెట్టివాడో మంటినుండి పుట్టినవారును అట్టివారే. పరలోక సంబంధి యెట్టివాడో పరలోక సంబంధులును అట్టివారే. మరియు మనము మంటినుండి పుట్టినవాని పోలికను ధరించిన ప్రకారము పరలోక సంబంధి పోలికయు ధరింతుము. సహోదరులారా, నేను చెప్పున దేమనగా, రక్తమాంసములు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొన నేరవు; క్షయత అక్షయతను స్వతంత్రించుకొనదు. ఇదిగో మీకు ఒక మర్మమును తెలుపుచున్నాను; మనమందరము నిద్రించము గాని నిమిషములో, ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము. బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు. మనము మార్పుపొందుదుము. క్షయమైన యీ శరీరము అక్షయతను ధరించుకొనవలసి యున్నది; మర్త్యమైన యీ శరీరము అమర్త్యతను ధరించుకొనవలసియున్నది. ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు, ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు, విజయము కలుగునట్లుగా మరణము మ్రింగబడెను అని వ్రాయబడిన వాక్యము నెరవేరును. ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ? మరణపుముల్లు పాపము; పాపమునకున్న బలము ధర్మ

శాస్త్రమే. అయినను మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగుగాక. కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి.

లేదా క్రింది పాఠములలో ఒకటి చదువవచ్చును.

2 కొరింథీ 4: 16–5: 10.

ప్రకటన 7: 9–17.

ప్రకటన 21: 1–7.

భూస్థాపన.

¶ వారు సమాధియొద్దకు వచ్చి శవమును భూస్థాపనకు సిద్ధముచేయుచుండగా సేవకుడు చెప్పవలసినది; లేదా సేవకుడును సహాయగురువులును పాడవలెను.

స్త్రీకి పుట్టినవాడు స్వల్పకాలము బ్రతుకువాడును శ్రమతో నిండినవాడునై యున్నాడు. పువ్వువలె పూచినట్లు పెరిగి కోయబడుచున్నాడు. ఏకస్థానమందు నిలువక నీడవలె జరిగిపోవుచున్నాడు.

సజీవులమైయుండగా మనము మరణమునకు లోనైయున్నాము. మా పాపముల నిమిత్తము న్యాయముగా కోపగించెడి ప్రభువా, నీయొద్దకు గాక సహాయముకొరకు ఎవరియొద్దకు వెళ్లుదుము?

అయినను మిక్కిలి పరిశుద్ధుడవగు ప్రభువైన దేవా, సర్వశక్తిగల ప్రభువా, మిక్కిలి కరుణగల పరిశుద్ధ రక్షకుడా, నిత్యమరణము యొక్క ఘోరబాధలకు మమ్మును అప్పగింపకుము.

ప్రభువా, హృదయ రహస్యములను ఎరిగియున్న ప్రభువా, మమ్మును కనికరించి మా ప్రార్థనకు నీ చెవులను మూసికొనకుము. మిక్కిలి పరిశుద్ధుడవైన ప్రభువా, మమ్మును కాయుము. సర్వశక్తిగల దేవా, కనికరముగల ఓ పరిశుద్ధ రక్షకా, నీతిగల నిత్య న్యాయాధిపతీ, అవసానకాలమందు కలిగెడి యే బాధవల్లనైనను మమ్మును నీ యొద్దనుండి తొలగిపోనియ్యకుము. ఆమేన్.

లేదా యిది.

కీర్తన 103: 13—18.

తండ్రి తన కుమారులయెడల జాలిపడునట్లు : ప్రభువు తనయందు భయభక్తులుగలవారియెడల జాలిపడును.



మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది : మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసికొనుచున్నాడు.

నరుని ఆయువు గడ్డివలె నున్నది : అడవి పువ్వు పూయునట్లు వాడు పూయును.

దానిమీద గాలి వీచగా అది లేకపోవును : ఆ మీదట దానిచోటు దాని నెరుగదు.

ఆయన నిబంధనను గైకొనుచు ఆయన కట్టడల ననుసరించి నడుచుకొను వారికి : ప్రభువునందు భయభక్తులుగలవారికి,

ఆయన కృప యుగయుగములు నిలుచును : ఆయన నీతి వారికి పిల్లపిల్ల తరమున నిలుచును.

¶ అంతట దగ్గర నిలుచున్న కొందరు శవముమీద మన్నువేయుచుండగా సేవకుడు ఇట్లు చెప్పవలెను:

సర్వశక్తిగల దేవుడు తన అధిక కృపచేత, గతించిపోయిన మన ప్రియ సహోదరుని (ప్రియసహోదరి) యాత్మను తన యొద్దకు చేర్చుకొనుటకు అనుగ్రహించినాడు గనుక, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా, నిత్యజీవమునకై పునరుత్థానము కలుగునని నిశ్చయమును దృఢమైన నిరీక్షణయును గలవారమై, యితని (యీమె) శరీరమును మట్టికి మట్టిగాను, బూడిదెకు బూడిదెగాను, దుమ్ముకు దుమ్ముగాను, భూమికి అప్పగించుచున్నాము. సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరము తన మహిమగల శరీరమునకు సమరూపముగల దానినిగా మార్చును.

లేదా యిది.

మిక్కిలి కనికరముగల తండ్రీ, గతించిపోయిన యీ మా సహోదరుని (సహోదరి) యాత్మను నీ కృపగల చేతులకు అప్పగించుచున్నాము. ఇతని (ఈమె) శరీరమును మట్టికి మట్టిగాను, బూడిదెకు బూడిదెగాను, దుమ్ముకు దుమ్ముగాను భూమికి అప్పగించుచున్నాము. మేము నీయందు భయభక్తులతో జీవించి, నీ దయయందు చనిపోయి, నీ ప్రియకుమారునికి నీవు అప్పగించిన న్యాయపు తీర్పు వచ్చినప్పుడు, ఈ మా సహోదరుడును (సహోదరియును) మేమును నీ దృష్టికి అంగీకృతులముగా అగుపడునట్లు నీ అత్యంత కృపచేత దయచేయుమని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. కనికరముగల మా తండ్రీ, మా ఏకరక్షకుడును మధ్యవర్తియు పక్షవాదియునగు యేసుక్రీస్తు నిమిత్తము దీనిని అనుగ్రహింపుము. ఆమేన్.

¶ అంతట ఇది చెప్పవలెను లేదా పాడవలెను:

ఇప్పటినుండి ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులని వ్రాయుము అని పరలోకమునుండి యొక స్వరము చెప్పగా వింటిని. నిజమే, వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు అని ఆత్మ చెప్పుచున్నాడు.

¶ సేవకుడు ఈ మాటలుకూడ చెప్పవచ్చును.

సకల యుగములలో రాజైయుండి, అక్షయుడును అదృశ్యుడును అద్వితీయ జ్ఞానవంతుడును అగు దేవునికి ఘనతయు మహిమయు యుగయుగములు కలుగునుగాక. ఆమేన్.

## ప్రార్థనలు.

¶ తరువాత సేవకుడు చెప్పవలసిన దేమనగా:

ప్రభువా, మమ్మును కనికరింపుము.
క్రీస్తూ, మమ్మును కనికరింపుము.
ప్రభువా, మమ్మును కనికరింపుము.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక, దుష్టునినుండి మమ్మును తప్పించుము. ఆమేన్.

¶ అంతట దిగువ ఉత్తర ప్రత్యుత్తరములు సేవకుడును జనులును చెప్పవచ్చును.

సే.—ప్రభువా, నీ సేవకునితో వ్యాజ్యెమాడకుము.
ఉ.—జీవితులలో ఒకడును నీ సన్నిధిని నీతిమంతుడుగా ఎంచబడడు.
సే.—ఇతనికి నిత్యవిశ్రాంతిని దయచేయుము.
ఉ.—ఇతనిమీద శాశ్వతమైన వెలుగు ప్రకాశింపనిమ్ము.
సే.—సజీవులదేశములో—
ఉ.—ప్రభువు కృపను నిశ్చయముగా చూతుమని నమ్ముచున్నాము.
సే.—ప్రభువా, మా ప్రార్థన ఆలకింపుము.
ఉ.—మా మొర్ర నీయొద్దకు చేరనిమ్ము.



¶ అంతట, దిగువ ప్రార్థనలలో ఒకటిగాని, లేక ఎక్కువగాని చెప్పవలెను.

## ప్రార్థింతుమము.

సర్వశక్తిగల దేవా, ప్రభువునందు ఇక్కడనుండి గతించిపోయిన వారి యాత్మలు నీతో జీవించుచున్నవి. విశ్వాసుల యాత్మలును శరీరభారము వదలిపోయినమీదట ఆనందముగాను సౌఖ్యముగాను నీతో ఉంటూ ఉన్నవిగదా. ఈ పాపలోకముయొక్క శ్రమలలోనుండి ఈ మా సహోదరుని (సహోదరిని) తప్పించుటకు అనుగ్రహించినందుకు మనస్ఫూర్తిగా నిన్ను స్తుతించుచున్నాము. మరియు, నీ పరిశుద్ధనామమును నిశ్చయముగా నమ్ముకొని గతించిపోయిన వారందరితో మేమును శరీరాత్మలయందు నీ నిత్యమహిమలో సర్వసంపూర్ణతయు ఆనందమును పొందునట్లు, నీ యుచిత దయచొప్పున నీవు ఏర్పరచినవారి సంఖ్యను శీఘ్రముగా పూర్తిచేసి నీ రాజ్యము త్వరగా రప్పింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

సంగ్రహప్రార్థన.

కృపగల దేవా, పునరుత్థానమును జీవమునైయుండు మా ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రీ, ఆయనను నమ్మువాడు చనిపోయినను జీవించును; జీవించుచు ఆయనను నమ్మువాడు ఎన్నటికిని చనిపోడు. మరియు ఆయన తనయందు నిద్రించువారినిగురించి నిరీక్షణలేనివారివలె దుఃఖపడవద్దని తన పరిశుద్ధ అపొస్తలుడైన పౌలుద్వారా మాకు నేర్పెను. మేము ఈ బ్రతుకు చాలించినపుడు మా సహోదరుడు (సహోదరి) విశ్రమించుచున్నాడని (విశ్రమించుచున్నదని) మేము నమ్ముచున్నప్రకారము మేమును ప్రభువునందు విశ్రమించునట్లును, అంత్యదినమందు కలుగబోవు సాధారణ పునరుత్థానకాలమందు నీ దృష్టికి అంగీకృతులముగా కనబడునట్లును, నీ ప్రియకుమారుడు నీయందు భయభక్తులుగలవారినిచూచి, నా తండ్రిచేత ఆశీర్వదింపబడినవారలారా లోకము పుట్టినదిమొదలుకొని మీకొరకు సిద్ధపర్చబడియున్న రాజ్యమును స్వతంత్రించుకొనుడి అని అప్పుడు పలుకబోవు ఆశీర్వచనము పొందునట్లును, తండ్రీ, పాప మరణములోనుండి మమ్మును నీతి జీవమునకై లేపుమని వినయముతో వేడుకొనుచున్నాము. దయగల తండ్రీ, దీనిని అనుగ్రహింపుమని మా మధ్యవర్తియు విమోచకుడునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

మనుష్యులందరికి తండ్రివైన దేవా, మేము ప్రేమించుచున్నను ఇకను చూడజాలని మా ప్రియులైనవారికొరకు నిన్ను ప్రార్థించుచున్నాము. నీ

సమాధానము వారికి దయచేయుము. నీ నిత్యవెలుగు వారిమీద ప్రకాశింపనిమ్ము. నీ ప్రేమసహితమైన జ్ఞానమునుబట్టియు, సర్వశక్తిగల నీ మాహాత్మ్యమునుబట్టియు వారిలో నీ దివ్యచిత్తము సంపూర్ణముగా కొనసాగించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

సర్వశక్తిగల దేవా, సర్వోపకారివైన తండ్రీ, సమస్తాదరణకు దాతా, ఇప్పుడు దుఃఖపడువారు తమ చింత యావత్తు నీమీద వేసి, నీ ప్రేమగల ఓదార్పును గ్రహించునట్లు వారియెడల నీ కనికరము చూపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

పరలోకపు తండ్రీ, నీ కుమారుడైన యేసుక్రీస్తునందు మాకు నిజమైన విశ్వాసమును దృఢమైన నిరీక్షణను దయచేసితివి గదా. మేము పరిశుద్ధుల సహవాసమును, పాపక్షమను, నిత్యజీవమునకైన పునరుత్థానమును నమ్మి విశ్వసించువారివలె బ్రతుకుటకు మాకు సహాయముచేయుమని నిన్ను వేడుకొనుచున్నాము. మా జీవితకాలమంతయు ఈ విశ్వాసమును నిరీక్షణను బలపరచుమని నీ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తు ప్రేమనుబట్టి నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

¶ ఇక్కడ సమస్త పరిశుద్ధుల దినపు సంగ్రహప్రార్థనయైనను, లేక త్రిత్వము తరువాతి పండ్రెండవ ఆదివారపు సంగ్రహప్రార్థనయైనను; లేక ఆయాకాలములయందు వాడవలసిన ప్రార్థనలైనను రావచ్చును.

అంతట దీనిని చెప్పవలెను:

మన ప్రభువైన యేసుక్రీస్తు కృపయు దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మనకందరికిని ఎల్లప్పుడును తోడైయుండును గాక. ఆమేన్.

¶ భూస్థాపన తప్ప తక్కిన క్రమమంతయు ఆలయములో చెప్పవచ్చును; లేక ఇంకను అవసరమైన యెడల అప్పగింతమాటలు తప్ప మిగిలిన క్రమమంతయు ఆలయములో చెప్పవచ్చును.

¶ దేవాలయమందలి ఆరాధనలో పైచెప్పబడిన పాఠములలో మూడు పాఠములను ఒక్కొక్క కీర్తనకు తరువాత చదువవచ్చును. కాని మూడవ పాఠమునకు ముందు, కీర్తనకు బదులు ఒక గానము పాడవచ్చును.

1 కొరింథీ 15-వ అధ్యాయములోని పాఠము మూడు పాఠములుగా విభజింపవచ్చును.

¶ భూస్థాపనలేనప్పుడు చనిపోయినవాని జ్ఞాపకార్థముగా "దేవాలయములో ఆరాధన", "ప్రార్థనలు" చదువవచ్చును.



¶ భూస్థాపన దినమందు పరిశుద్ధ సమభోక్తృత్వము విశేషముగా ఆచరింపబడిన యెడల ఈ క్రమములో నియమింపబడిన సంగ్రహప్రార్థనగాని పునరుత్థానమునకు తొలిదినపు సంగ్రహప్రార్థనగాని వాడవచ్చును. ఉత్తర సువార్త భాగములు యేమనగా:—

ఉత్తరము: 1 థెస్స. 4: 13—18.
లేదా, 2 కొరింథీ 4: 16—5: 4.

సువార్త: పరి. యోహాను 6: 37—41.
లేదా, పరి. యోహాను 5: 24—29.

¶ భూమి ప్రతిష్ఠింపబడియుండనియెడల క్రీస్తు సమాధియొద్దకు వచ్చినప్పుడు ఈ దిగువ ప్రార్థన చెప్పవచ్చును.

దేవా, మా ప్రభువైన యేసుక్రీస్తు తండ్రీ, నీ సేవకుని శరీరమునకు నెమ్మదిగల విశ్రాంతి స్థలముగా నుండునట్లు ఈ భూమిని ఆశీర్వదింప ననుగ్రహింపుమని పునరుత్థానమును జీవమునైయుండి, నీతోను పరిశుద్ధాత్మతోను యుగయుగములు జీవించి యేలుచుండు శ్రీమంతుడైన నీ కుమారునిద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

# AN ORDER WHICH MAY BE USED FOR THE BURIAL OF A CHILD

# చిన్నబిడ్డ భూస్థాపనకు

వాడదగిన క్రమము.

¶ సేవకుడును సహాయగురువులును ప్రాకారద్వారమున శవమును ఎదురుకొని, దానికి ముందుగా దేవాలయములోనికైనను సమాధికైనను వెళ్లుచు చెప్పవలసినది. లేదా పాడవలసిన దేమనగా:

పీఠిక.

నేనే పునరుత్థానమును జీవమునైయున్నాను. నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడు ఎన్నటికిని చనిపోడు. (ప. యోహాను 11: 25, 26).

నా విమోచకుడు సజీవుడనియు, తరువాత ఆయన భూమిమీద నిలుచుననియు నేనెరుగుదును. నామట్టుకు నేనే ఆయనను చూచెదను. మరి యెవరునుకాదు నేనే కన్నులార ఆయనను చూచెదను. (యోబు 19: 25, 26, 27).

మనము ఈ లోకములోనికి ఏమియు తేలేదు. దీనిలోనుండి ఏమియు తీసికొని పోలేము. ప్రభువు ఇచ్చెను, ప్రభువు తీసికొనిపోయెను, ప్రభువు నామమునకు స్తుతి కలుగుగాక. (1 తిమొథె 6: 7; యోబు 1: 21).

గొఱ్ఱెల కాపరివలె ఆయన తన మందను మేపును : తన బాహువుతో గొఱ్ఱెపిల్లలను కూర్చి రొమ్మున ఆనించుకొని మోయును. (యెషయా 40: 11).

## దేవాలయములో ఆరాధన.

¶ వారు దేవాలయములోనికి వచ్చినతరువాత దిగువవచ్చు కీర్తనను చదువవలెను:

23-వ కీర్తన.

ప్రభువు నా కాపరి: నాకు లేమి కలుగదు.

2. పచ్చికగలచోట్లను ఆయన నన్ను పరుండజేయుచున్నాడు : శాంతికరమైన జలములయొద్ద నన్ను నడిపించుచున్నాడు.



3. నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు : తన నామమునుబట్టి నీతిమార్గములో నన్ను నడిపించుచున్నాడు.

4. గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను : నీవు నాకు తోడైయుందువు, నీ దుడ్డుకర్రయు నీ దండమును నన్ను ఆదరించును.

5. నా శత్రువులయెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు : నూనెతో నా తల అంటియున్నావు, నా గిన్నె నిండి పొర్లుచున్నది.

6. నేను బ్రదుకు దినములన్నియు కృపాక్షేమములే నావెంట వచ్చును: చిరకాలము ప్రభువు మందిరములో నేను నివాసము చేసెదను.

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

¶ అంతట ఈ పాఠము రావలెను.

ప. మార్కు 10: 13.

చిన్నపిల్లలను క్రీస్తు ముట్టవలెనని కొందరు ఆయన యొద్దకు వారిని తీసికొనివచ్చిరి. అయితే శిష్యులు వారిని తీసికొనివచ్చినవారిని గద్దించిరి. యేసు అది చూచి కోపపడి—చిన్న పిల్లలను నాయొద్దకు రానియ్యుడి, వారిని ఆటంకపరచవద్దు; దేవుని రాజ్యము ఈలాటివారిదే. చిన్నపిల్లవలె దేవుని రాజ్యమును అంగీకరింపనివాడు అందులో ప్రవేశింపడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని చెప్పి, ఆ పిల్లలను ఎత్తి, కౌగలించుకొని, వారిమీద చేతులుంచి ఆశీర్వదించెను.

¶ వారు సమాధియొద్దకు వచ్చి శవమును భూస్థాపనకు సిద్ధము చేయుచుండగా సేవకుడు చెప్పవలసినది, లేదా సేవకుడును సహాయగురువులును పాడవలసినది:

స్త్రీకి పుట్టినవాడు స్వల్పకాలము బ్రదుకువాడును శ్రమతో నిండినవాడునై యున్నాడు. పువ్వు పూచినట్లు పెరిగి కోయబడుచున్నాడు. ఏకస్థానమందు నిలువక నీడవలె జరిగిపోవుచున్నాడు.

¶ అంతట దగ్గిర నిలుచున్న కొందరు శవముమీద మన్నువేయుచుండగా సేవకుడు ఇట్లు చెప్పవలెను:

సర్వశక్తిగల దేవుడు తన అధిక కృపచేత గతించిపోయిన యీ చిన్నబిడ్డ యాత్మను తనయొద్దకు చేర్చుకొనుటకు అనుగ్రహించినాడు గనుక, మన ప్రభు

మైన యేసుక్రీస్తుద్వారా నిత్యజీవమునకై పునరుత్థానము కలుగునని నిశ్చయమును దృఢమైన నిరీక్షణయును గలవారమై, ఇతని (ఈమె) శరీరమును మట్టికి మట్టిగాను, బూడిదెను బూడిదెగాను, దుమ్మును దుమ్ముగాను భూమికి అప్పగించుచున్నాము. ఆయన సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తినిబట్టి మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపముగలదానిగా మార్చును.

లేదా యిది:

మిక్కిలి కనికరముగల తండ్రీ, ఈ నీ చిన్నబిడ్డ యాత్మను నీ కృపగల చేతులకు అప్పగించుచున్నాము. ఇతని (ఈమె) శరీరమును మట్టికి మట్టిగాను, బూడిదెను బూడిదెగాను, దుమ్మును దుమ్ముగాను భూమికి అప్పగించుచున్నాము. మేము నీయందు భయభక్తులతో జీవించి, నీ దయయందు చనిపోయి, నీ ప్రియకుమారునికి నీవు అప్పగించిన న్యాయపుతీర్పు వచ్చినప్పుడు ఈ చిన్నబిడ్డయు మేమును నీ దృష్టికి అంగీకృతులముగా అగుపడునట్లు నీ అత్యంత కృపచేత దయచేయుమని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. కనికరముగల మా తండ్రీ, మా ఏకరక్షకుడును మధ్యవర్తియు పక్షవాదియునగు యేసుక్రీస్తునిమిత్తము దీనిని అనుగ్రహింపుము. ఆమేన్.

¶ అంతట దీనిని చెప్పవలెను లేదా పాడవలెను:

వారికి ఇకమీదట ఆకలియైనను దాహమైనను ఉండదు, సూర్యుని యెండయైనను ఏ వడగాలియైనను వారికి తగులదు. ఏలయనగా సింహాసన మధ్యమందుండు గొఱ్ఱెపిల్ల వారికి కాపరియై, జీవజలముల బుగ్గలయొద్దకు వారిని నడిపించును; దేవుడే వారి కన్నులనుండి ప్రతి బాష్పబిందువును తుడిచివేయును.

¶ సేవకుడు ఈ మాటలుకూడ చెప్పవచ్చును:

సకల యుగములలో రాజైయుండి, అక్షయుడును అదృశ్యుడును జ్ఞానవంతుడును అగు అద్వితీయ దేవునికి ఘనతయు మహిమయు యుగయుగములు కలుగునుగాక. ఆమేన్.

¶ తరువాత సేవకుడు చెప్పవలసిన దేమనగా:

ప్రభువా, మమ్మును కనికరింపుము.
క్రీస్తూ, మమ్మును కనికరింపుము.
ప్రభువా, మమ్మును కనికరింపుము.



పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూలోకమందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. ఆమేన్.

¶ అంతట ఈ దిగువ ఉత్తర ప్రత్యుత్తరములు సేవకుడును జనులును చెప్పవచ్చును:

సే.—ఇతనికి నిత్య విశ్రాంతి దయచేయుము.
ఉ.—ఇతనిమీద శాశ్వతమైన వెలుగు ప్రకాశింపనిమ్ము.
సే.—సజీవుల దేశములో—
ఉ.—ప్రభువు కృపను నిశ్చయముగా చూతుమని నమ్ముచున్నాము.
సే.—ప్రభువా, మా ప్రార్థన ఆలకింపుము.
ఉ.—మా మొఱ్ఱ నీయొద్దకు చేరనిమ్ము.

¶ అంతట దిగువ ప్రార్థనలలో ఒకటిగాని, రెండుగాని చెప్పవలెను:

ప్రార్థించుదము.

ప్రభువైన యేసుక్రీస్తూ నీవు చిన్నపిల్లలను నీ చేతులలోనికి యెత్తికొని వారిని ఆశీర్వదించితివి గదా. నీ అత్యంత ప్రేమగల నిత్యహస్తములలో యీ బిడ్డను నీ కృపచేత యెత్తికొనియున్నావని మేము గ్రహించునట్లు మా కన్నులను తెరువుమని తండ్రితోను, పరిశుద్ధాత్మతోను యుగయుగములు జీవించి యేలుచుండు నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

దేవా, నీ మార్గములు అగోచరములు. నీ కార్యములు బహు ఆశ్చర్యముగా ఉన్నవి. నీవు దేనిని నిరర్థకముగా జేయవు. నీవు సృజించినవాటి నన్నిటిని ప్రేమించుచున్నావు గదా. బహుగా గాయపరచబడి వ్యాకులములోనున్న నీ సేవకుల హృదయములను నీవే ఓదార్చుము. వారు ఈ బిడ్డతో కూడ రాబోవు లోకములో నీ వాగ్దానములను సంపూర్ణముగా పొందునట్లు ఈ లోకమందు నిన్ను ప్రేమించి సేవించులాగున దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ అంతట దీనిని చెప్పవలెను:

మన ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మనకందరికిని యెల్లప్పుడును తోడైయుండును గాక. ఆమేన్.

## The Thanksgiving of Women After Child-Birth
## Commonly called
# THE CHURCHING OF WOMEN

ప్రసవించిన స్త్రీలు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట

దీనికి సాధారణమైన పేరు:

# బాలింతల దేవాలయ ప్రవేశము

¶ స్త్రీ ప్రసవించిన తరువాత ఆమెయు, భర్తకు యిష్టమున్నచో అతడును, నియమితకాలమందు దేవాలయములోనికి వచ్చి, యెప్పటి చోటనైనను, లేక బిషపు నిర్ణయించిన చోటనైనను, మోకాళ్లూని యుండగా సేవకుడు ఆమెతో ఇట్లు చెప్పవలెను:

సర్వశక్తిగల దేవుడు తన కృపవల్ల నీకు చల్లనికానుపు దయచేసి, ప్రసవమువల్ల కలుగు గొప్ప ఉపద్రవములోనుండి నిన్ను తప్పించినాడు గనుక నీవు ఆయనకు నిండు మనస్సుతో **కృ**తజ్ఞతాస్తుతులు చెల్లించి చెప్పవలసిన దేమనగా:

¶ అప్పుడు సేవకుడు **116**-వ కీర్తన చెప్పవలెను:

ప్రభువు నా మనవి నా విన్నపములను ఆలకించియున్నాడు : కాగా నేనాయనను ప్రేమించుచున్నాను.

**2.** ఆయన నాకు చెవియొగ్గెను : కావున నా జీవితకాలమంతయు నేనాయనకు మొర్రపెట్టుదును.

**3.** మరణబంధములు నన్ను చుట్టుకొని యుండెను : పాతాళపు వేదనలు నన్ను పట్టుకొని యుండెను : శ్రమయు దుఃఖమును నాకు కలిగెను.

**4.** అప్పుడు—ప్రభువా, దయచేసి నా ప్రాణమును విడిపింపుమని : ప్రభువు నామమునుబట్టి నేను మొరపెట్టితిని.

**5.** ప్రభువు దయాళుడు నీతిమంతుడు : మన దేవుడు వాత్సల్యతగలవాడు.



6. ప్రభువు సాధువులను కాపాడువాడు : నేను క్రుంగియుండగా ఆయన నన్ను రక్షించెను.

7. నా ప్రాణమా, ప్రభువు నీకు క్షేమము విస్తరింపజేసి యున్నాడు : తిరిగి నీ విశ్రాంతిలో ప్రవేశింపుము.

8. మరణమునుండి నా ప్రాణమును : కన్నీళ్లు విడువకుండ నా కన్నులను, జారిపడకుండ నా పాదములను నీవు తప్పించియున్నావు.

9. సజీవులున్న దేశములలో : ప్రభువు సన్నిధిని నేను కాలము గడుపుదును.

12. ప్రభువు నాకు చేసిన యుపకారములన్నిటికి : నేనాయనకు ఏమి చెల్లించుదును?

13. రక్షణపాత్రను చేత పుచ్చుకొని : ప్రభువు నామమున ప్రార్థన చేసెదను.

18. ఆయన ప్రజలందరియెదుటను : ప్రభువు మందిరపు ఆవరణములలోను,

19. యెరూషలేమా, నీ మధ్యను నేను ప్రభువునకు నా మ్రొక్కుబళ్లు చెల్లించెదను : ప్రభువును స్తుతించుకుడి.

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మను : మహిమ కలుగునుగాక.

ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

లేక, 127. కీర్తన.

ప్రభువు ఇల్లు కట్టించనయెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే : ప్రభువు పట్టణమును కాపాడనియెడల దాని కావలికాయువారు మేలుకొని యుండుట వ్యర్థమే.

**2.** మీరు వేకువనే లేచి, చాలా రాత్రియైన తరువాత పండుకొనుచు, కష్టార్జితమైన ఆహారము తినుచునుండుట వ్యర్థమే : తన ప్రియులు నిద్రించుచుండగా ఆయన వారికిచ్చుచున్నాడు.

**3.** కుమారులు ప్రభువు అనుగ్రహించు స్వాస్థ్యము : గర్భఫలము ఆయన యిచ్చు బహుమానమే.

**4.** యౌవనకాలమందు పుట్టిన కుమారులు : బలవంతునిచేతిలోని బాణములవంటివారు.

**5.** వారితో తన అంబులపొది నింపుకొనినవాడు ధన్యుడు : అట్టివారు సిగ్గుపడక గుమ్మములో తమ విరోధులతో వాదించుదురు.

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

¶ అంతట సేవకుడు చెప్పవలసిన దేమనగా:

ప్రార్థించుదము.

ప్రభువా, మమ్మును కనికరింపుము.

క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

ప్రభువా, మమ్మును కనికరింపుము.

**ప**రలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మాయెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక, దుష్టునినుండి మమ్మును తప్పించుము. రాజ్యము శక్తి మహిమయు నిరంతరమును నీవైయున్నవి. ఆమేన్.

సేవకుడు.—ఓ ప్రభువా, ఈ నీ సేవకురాలిని రక్షింపుము.

ఉత్తరము.—ఈమె నిన్ను నమ్ముకొనుచున్నది.

సేవకుడు.—ఈమె శత్రువు ఎదుట—

ఉత్తరము.—ఈమెకు బలమైన కోటగా నుండుము.

సేవకుడు.—ప్రభువా, మా ప్రార్థన ఆలకించుము.

ఉత్తరము.—మా మొర్ర నీయొద్దకు చేరనిమ్ము.

సేవకుడు.—ప్రార్థించుదము.



**స**ర్వశక్తిగల దేవా, ఈ నీ సేవకురాలిని ప్రసవమువల్ల కలిగెడి గొప్ప వేదననుండియు ఉపద్రవమునుండియు తప్పించుటకు అనుగ్రహించినావు గనుక నీకు వినయముగల కృతజ్ఞతాస్తుతులను చెల్లించుచున్నాము. మిక్కిలి కనికరముగల తండ్రీ, నీ సహాయముచేత ఈమె యిహమందు నమ్మకముగా ప్రవర్తించి, నీ చిత్తప్రకారము నడుచుకొనునట్లును, పరమందు నిత్యమహిమలో పాలు పొందునట్లును దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

**దే**వా, పరలోకపు తండ్రీ, ఈ నీ సేవకురాలికి ఒక బిడ్డను అనుగ్రహించినందుకై నీ మహిమగల నామమునకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. మిక్కిలి దయగల తండ్రీ, ఈమెయు, (ఈమె భర్తయు) నీ నామమునకు మహిమగాను, తమకు గొప్ప ఆశీర్వాదముగాను ఉండునట్లు తమ బిడ్డను నీతిమార్గమందు పెంచుటకు కావలసిన వివేకము వీరికి అనుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

¶ ఒకవేళ బిడ్డ చనిపోయియుండినయెడల పై ప్రార్థనకు ప్రతిగా దిగువ ప్రార్థన చదువవలెను.

**దే**వా, నీ మార్గములు అగోచరములు, నీ కార్యములు బహు ఆశ్చర్యముగా ఉన్నవి. నీవు ఏ కార్యమును నిరర్థకముగా జేయవు. నీవు సృజించినవాటినన్నిటిని ప్రేమించుచున్నావు గదా. బహుగా గాయపరచబడి వ్యాకులములోనున్న ఈ నీ సేవకురాలి హృదయమును నీవే ఓదార్చుము. ఈమె రాబోవు లోకములో నీ వాగ్దానములను సంపూర్ణముగా పొందునట్లు నిన్ను ఈ లోకమందు ప్రేమించి సేవించులాగున దయచేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ బాలింత దేవాలయప్రవేశ సమయమున సమభ్యాక్తవము లేనియెడల సేవకుడు స్త్రీని ఇట్లు దీవింపవలెను.

**దే**వుని దయాదాక్షిణ్యములకును ప్రాపునకును మిమ్మును అప్పగించుచున్నాము. ప్రభువు మిమ్మును ఆశీర్వదించి మిమ్మును కాపాడునుగాక. ప్రభువు మీకు తన సన్నిధిని ప్రకాశింపచేసి మిమ్మును కరుణించుగాక. ప్రభువు మీ మీద తన సన్నిధికాంతి ఉదయింపజేసి యిప్పుడును ఎప్పుడును మీకు సమాధానము దయచేయునుగాక. ఆమేన్.

¶ కృతజ్ఞతాస్తుతులను అర్పించుటకు వచ్చెడి స్త్రీ, వాడుక కానుకలను చెల్లింపవలెను. మరియు పరిశుద్ధ సమభ్యాక్తవము ఆచరింపబడినయెడల ఆమె దానిని పొందుట యుక్తము.

# A SERVICE OF EXHORTATION

## (A COMMINATION)

# హెచ్చరిక

## (శిక్షా ప్రకటన)

లెంటులోని మొదటిదినమందును బిషపు నిర్ణయించెడి యితర సమయములయందును కొన్ని ప్రార్థనలతోకూడ దీనిని వాడవలెను.

¶ క్రీస్తు, ప్రార్థన పీఠముమీదనైనను ప్రసంగ పీఠముమీదనైనను నిలిచి చెప్పవలసినదేమనగా:

సహోదరులారా, ప్రాచీన సంఘములో భక్తిసాధకమైన క్రమశిక్ష యొకటి యుండెను. అది యేదనగా, ప్రసిద్ధముగా పాపము చేసిరని నేరస్థులుగా తీర్చబడినవారు తమ యాత్మలు ప్రభువు దినమందు రక్షింపబడుటకును వారి దృష్టాంతమువల్ల ఇతరులు హెచ్చరింపబడి తప్పు చేయకుండ మరింత భయపడుటకును లెంటు ఆరంభమందు బాహాటముగా సిగ్గుపఱచబడి యీ లోకమందు దండింపబడుచుండిరి.

అట్టి క్రమశిక్షను వాడుకలో నుంచనియెడల పాపముపై దేవుడు పంపు తీర్పులు తేలికగా ఎంచబడవచ్చును. గనుక దేవుని పరిశుద్ధ ఆజ్ఞలను మీరువారిని ఆయన నిశ్చయముగా విమర్శించునని ఈ సమయమున మీయందరి యెదుట ప్రకటించుటయు, మీరు ఆయన కనికరముకొరకై వేడుకొనుచు, నీతియుక్తమైన ఆయన శిక్షావిధిని అంగీకరించి దానికి లోబడుచున్నామన్నందుకు గుర్తుగా ఆమేన్ అని చెప్పుటయు యుక్తముగా కనబడుచున్నది. ఇందుకు కారణము ఏమనగా, పాపులమీద కలుగు దేవుని అత్యాగ్రహమునుగురించి మీరు హెచ్చరింపబడి శ్రద్ధగాను నిజముగాను పశ్చాత్తాపపడునట్లు ఎక్కువగా ప్రేరేపింపబడుటయు, నిజభక్తి క్షీణించిపోవు ఇట్టి దినములలో మీరు మరింత జాగ్రత్తగా నడచుకొని ఏయే దురభ్యాసములకు దేవుని తీర్పులు తగినవని మీ నోటితోనే ఒప్పుకొందురో వాటిని వెంబడింపక పోవుటయునై యున్నది.



మన దేవుడైన ప్రభువు ఏక ప్రభువై యున్నాడు. ఇతర దేవుండ్లను కొలుచువారందరిని దేవుడు విమర్శించును.

(అంతట జనులు ఆమేన్. ప్రభువా మమ్మును కనికరించుము అని ప్రత్యుత్తరమియ్యవలెను.)

ఆమేన్, ప్రభువా మమ్మును కనికరించుము.

విగ్రహములను దేవుని సృష్టిని పూజించువారందరిని దేవుడు విమర్శించును.

ఆమేన్, ప్రభువా మమ్మును కనికరించుము.

దేవదూషకులను, దేవుని నామమును వ్యర్థముగా పలుకువారందరిని దేవుడు విమర్శించును.

ఆమేన్, ప్రభువా మమ్మును కనికరించుము.

ప్రభువుదినము పరిశుద్ధమైనది. దానిని అపవిత్రపరచువారందరిని దేవుడు విమర్శించును.

ఆమేన్, ప్రభువా మమ్మును కనికరించుము.

తన తండ్రిని తన తల్లిని సన్మానించనివారిని, అదుపు ఆజ్ఞలు లేక తిరుగువారిని రాజద్రోహులను దేవుడు విమర్శించును.

ఆమేన్, ప్రభువా మమ్మును కనికరించుము.

నరహంతకులను దుర్మార్గులను క్రూరులను దేవుడు విమర్శించును.

ఆమేన్, ప్రభువా మమ్మును కనికరించుము.

వ్యభిచారులను, జారులను, అపవిత్రులందరిని దేవుడు విమర్శించును.

ఆమేన్, ప్రభువా మమ్మును కనికరించుము.

దొంగలను, దోచుకొనువారిని, మోసము చేయువారిని దేవుడు విమర్శించును.

ఆమేన్, ప్రభువా మమ్మును కనికరించుము.

అబద్ధ సాక్షులను కీడుగా మాట్లాడువారిని, అసత్యవాదులను కొండెములాడువారినందరిని దేవుడు విమర్శించును.

ఆమేన్, ప్రభువా మమ్మును కనికరించుము.

అత్యాశాపరులను, హింసకులను పేదలయెడల కఠినత్వము చూపువారిని దేవుడు విమర్శించును.

ఆమేన్, ప్రభువా మమ్మును కనికరించుము. ఈ పాపములను మామీద మోపకుము.

## సేవకుడు

దైవాజ్ఞలను విడిచి తప్పిపోవువారందఱును శిక్షావిధినొందుదురు గనుక, మన తలలమీద వ్రేలాడుచు పడుటకు ఎప్పుడును సిద్ధముగానున్న భయంకరమైన తీర్పును జ్ఞాపకముచేసికొని మన దుష్ప్రవర్తనవిషయమై దుఃఖించి పలవించి మన అపరాధములను ఒప్పుకొని, పశ్చాత్తాపమునకు తగిన ఫలములను ఫలింపగోరి, మన స్తాపముతోను వినయముతోను మన ప్రభువైన దేవుని వైపునకు తిరుగుదము. జీవముగల దేవుని చేతులలో పడుట భయంకరము. ఆయన మూర్ఖులైన పాపులనుచూచి—శపింపబడిన వారలారా, సాతానుకొరకును వాని దూతలకొరకును సిద్ధముచేయబడిన నిత్యాగ్నిలోకి పొండి అని వారితో చెప్పబోవు మిక్కిలి న్యాయమైనతీర్పులు చెప్పుచున్న ఆయన భయంకరస్వరమును వినుటయు ఘోరమైనది. కాబట్టి సహోదరులారా, రక్షణ దినము ఇంక ఉండగనే మనము మెందలాడి జాగ్రత్తపడుదము.

మనము పాపము చేసినను నీతిమంతుడగు యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు. ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు. మన అతిక్రమములనుబట్టి ఆయన గాయపరచబడెను; మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను. కాబట్టి నిజముగా పశ్చాత్తాపపడు పాపులను ఆయన దయతో చేర్చుకొనును గనుక ఆయన యొద్దకు మళ్లుదము రండి. నిజమైన పశ్చాత్తాపముతో ఆయన యొద్దకువచ్చి ఆయనకు లోబడి, యికను ఆయన మార్గములలో నడిచి, వినయముతోను ఓపికతోను ఆయనను వెంబడించుటకు ఆయనయొక్క సుళువైన కాడిని తేలికయైన భారమును మనము ఎత్తికొని, ఆయన పరిశుద్ధాత్మ యేలుబడిచేత నడిపింపబడి, ఆయనకు మహిమ కలుగునట్లు ఎప్పుడును కోరి, మనము ఉండు స్థితియందు కృతజ్ఞతావందనములతో ఆయనను తగినట్లుగా సేవించినయెడల, ఆయన మనలను చేర్చుకొని క్షమించుటకు సిద్ధముగా నున్నాడని నిశ్చయించుకొందము. ఈ ప్రకారము చేసినయెడల ఆజ్ఞాప్రమాణముయొక్క తీర్పునుండియు ఎడమచేతివైపున నిలువబెట్ట బడువారికి తగులబోయెడి ఘోరవిమర్శనుండియు క్రీస్తు మనలను తప్పించి, తన కుడిచేతి వైపున ఉంచి తన మహిమగల రాజ్యమును స్వాధీనము చేసికొనుడని మనకు ఆజ్ఞాపించుచు తన మితిలేని కనికరమువల్ల మనల నందరిని చేర్చుకొనునుగాక. ఆమేన్.



## ప్రార్థనలు

¶ అంతట అందరు మోకాళ్లూనవలెను. ప్రీస్టును సహాయ గురువులును లిటని వాడుకగా చెప్పెడిచోటున మోకాళ్లూని ఈ కీర్తనను చెప్పవలెను.

### 51–వ కీర్తన

దేవా, నీ కృపచొప్పున నన్ను కరుణింపుము : నీ వాత్సల్య బాహుళ్యము చొప్పున నా అతిక్రమములను తుడిచివేయుము.

నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము : నా పాపము పోవునట్లు నన్ను పవిత్రపఱచుము.

నా అతిక్రమములు నాకు తెలిసేయున్నవి : నా పాపమెల్లప్పుడు నా యెదుట నున్నది.

నీకు కేవలము నీకే విరోధముగా నేను పాపముచేసియున్నాను నీ దృష్టి యెదుట నేను చెడుతనము చేసియున్నాను : కావున ఆజ్ఞ నిచ్చునప్పుడు నీవు నీతిమంతుడవుగా నగపడుదువు, తీర్పు తీర్చునప్పుడు నిర్మలుడవుగా నగపడుదువు.

నేను పాపములో పుట్టినవాడను : పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను.

నీవు అంతరంగమున సత్యము కోరుచున్నావు : ఆంతర్యములో నాకు జ్ఞానము తెలియజేయుదువు.

నేను పవిత్రుడనగునట్లు హిస్సోపుతో నా పాపము పరిహరింపుము : హిమముకంటెను నేను తెల్లగా నుండునట్లు నీవు నన్ను కడుగుము.

ఉత్సాహ సంతోషములు నాకు వినిపింపుము : అప్పుడు నీవు విరిచిన యెముకలు హర్షించును.

నా పాపములకు విముఖుడవు కమ్ము : నా దోషములన్నిటిని తుడిచి వేయుము.

దేవా, నాయందు శుద్ధహృదయము కలుగజేయుము : నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము.

నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము : నీ పరిశుద్ధాత్మను నాయొద్ద నుండి తీసివేయకుము.

నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము: సమ్మతిగల మనస్సు కలుగ జేసి నన్ను దృఢపఱచుము.

అప్పుడు అతిక్రమము చేయువారికి నీ త్రోవలను బోధించెదను : పాపులును నీతట్టు తిరుగుదురు.

దేవా, నా రక్షణకర్తయగు దేవా, రక్తాపరాధమునుండి నన్ను విడిపింపుము : అప్పుడు నా నాలుక నీ నీతినిగూర్చి ఉత్సాహగానము చేయును.

ప్రభువా, నా నోరు నీ స్తుతిని ప్రచురపరచునట్లు : నా పెదవులను తెఱువుము.

నీవు బలిని కోరువాడవు కావు, కోరినయెడల నేను అర్పించుదును : దహనబలి నీ కిష్టమైనది కాదు.

విరిగిన మనస్సే దేవుని కిష్టమైన బలులు : దేవా విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు.

నీ కటాక్షముచొప్పున సీయోనుకు మేలుచేయుము : యెరూషలేము యొక్క గోడలను కట్టించుము.

అప్పుడు నీతియుక్తములైన బలులును దహన బలులును సర్వాంగ హోమములును నీకు అంగీకృతములగును : అప్పుడు జనులు నీ బలిపీఠముమీద కోడెల నర్పించెదరు.

తండ్రికి కుమారునికి పరిశుద్ధాత్మకును : మహిమ కలుగునుగాక.

ఉ.—ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు నుండునట్లు : యుగయుగములకు కలుగునుగాక. ఆమేన్.

ప్రభువా, మమ్మును కనికరింపుము.
క్రీస్తూ, మమ్మును కనికరింపుము.
ప్రభువా, మమ్మును కనికరింపుము.

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపఱచబడును గాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయ చేయుము. మా యెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. ఆమేన్.



**సేవకుడు:**—ప్రభువా, నీ సేవకులను రక్షింపుము.

**ఉత్తరము:**—వీరు నిన్ను నమ్ముచున్నారు.

**సేవకుడు:**—పైనుండి వారికి సహాయము పంపుము.

**ఉత్తరము:**—వారిని ఎప్పుడును బలముతో కాపాడుము.

**సేవకుడు:**—మా రక్షకుడవైన దేవా, మాకు సహాయము చేయుము.

**ఉత్తరము:**—నీ నామమునకు మహిమ కలుగులాగున మమ్మును తప్పింపుము. పాపులమైన మమ్మును నీ నామము నిమిత్తము కరుణింపుము.

**సేవకుడు:**—ప్రభువా, మా ప్రార్థన ఆలకింపుము.

**ఉత్తరము:**—మా మొఱ నీ యొద్దకు చేరనిమ్ము.

సేవకుడు

## ప్రార్థించుదము

ప్రభువా, పాపాత్ములని దోషారోపణచేయబడిన మనస్సాక్షిగలవారు నీ కనికరమువల్ల క్షమింపబడి, విమోచన పొందులాగున మా ప్రార్థనలు కనికరముతో ఆలకించి తమ పాపములను నీ యెదుట ఒప్పుకొనెడివారందరిని కాయుమని మా ప్రభువైన క్రీస్తుద్వారా బతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

సర్వశక్తిగల దేవా కనికరముగల తండ్రీ, నీవు కలుగజేసిన దేనినైనను ద్వేషింపక మనుష్యులందరిని కనికరించి పాపాత్ముని చావుకోరక తన పాపమునుండి మళ్లుకొని రక్షింపబడవలెనని కోరుచున్నావుగదా. మా తప్పితములను దయతో క్షమింపుము. పాప భారమువల్ల దుఃఖించి ప్రయాసపడుచున్న మమ్ము చేర్చుకొని ఆదరింపుము. కనికరించుట ఎప్పుడును నీ లక్షణమైయున్నది. పాపములు క్షమించుట నీకే చెల్లుచున్నది. కాబట్టి కృపగల ప్రభువా, మమ్మును కాయుము. నీవు విడిపించిన నీ జనులను కాయుము. నీచులమైన మమ్మును, దిక్కులేని పాపులమైన నీ సేవకులను న్యాయవిచారణలోకి తేకుము. అయినను మేము నీచులమని వినయముతో ఒప్పుకొని, మా తప్పిదములను గురించి నిజముగా పశ్చాత్తాపపడుచున్నాము గనుక మా మీదనుండి నీ కోపము తొలగించి, పరమందు నీతోకూడ ఎప్పుడును మేము జీవించులాగున ఇహమందు మాకు సహాయము చేయుటకు త్వరపడుమని మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

¶ అంతట జనులు ఈ దిగువ వచ్చునది సేవకునివెంట చెప్పవలెను.

కృపగల ప్రభువా। మమ్మును మళ్లింపుము. । అప్పుడు మేము మళ్లుదుము.। ఉపవాస ప్రార్థనలతోను । రోదనతోను । నీ వైపునకు మళ్లుచున్న నీ జనులను । ప్రభువా కటాక్షింపుము. । నీవు కనికరముగల దేవుడవు । కరుణా సంపన్నుడవు । దీర్ఘశాంతుడవు । అధిక దయాళుడవు. । మేము శిక్షకు పాత్రులమై యుండగా । మమ్మును కాయుచున్నావు. । నీకు కోపము వచ్చినప్పుడు సహా । కనికరమును జ్ఞాపకము చేసికొనుచున్నావు. । నీ జనులను కాయుము. । కృపగల ప్రభువా వారిని కాయుము. । నీ స్వాస్థ్యము తారుమారు కానియ్యకుము.। నీ కనికరము గొప్పది. । గనుక ప్రభువా । ఆలకించి । నీ కరుణాతిశయము చొప్పున । మమ్మును కటాక్షింపుము. । శ్రీమంతుడయిన నీ కుమారుడును । మా ప్రభువునైన యేసుక్రీస్తుయొక్క పుణ్యము నిమిత్తమును । మధ్యవర్తనము నిమిత్తమును । వీటినన్నిటిని అనుగ్రహింపుము. ఆమేన్.

అంతట సేవకుడు మాత్రమే చెప్పవలెను.

ప్రభువు మనలను ఆశీర్వదించి కాపాడునుగాక. ప్రభువు మన మీద తన సన్నిధి కాంతి ఉదయింపజేసి యిప్పుడును ఎప్పుడును మనకు సమాధానము దయచేయునుగాక. ఆమేన్.